

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 25-8-2017 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 16



Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

‘ఆధునిక యుగంలో పౌరుల సమాచారాన్ని పరిరక్షించడంపై ప్రభుత్వం పరిశీలించి, విస్తృతమైన, భద్రతతో కూడిన వ్యవస్థను తీసుకురావడంపై దృష్టి సారించాలి. ఇలాంటి వ్యవస్థ రూపకల్పనలో వ్యక్తిగత ప్రయోజనాలకు–ప్రభుత్వం వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు మధ్య సున్నితమైన సమతుల్యత అవసరం.



జాతీయ భద్రతను పరిరక్షించడం, నేరాల్ని నిర్మూలించడం, విజ్ఞానాన్ని విస్తరించడం, సామాజిక సంక్షేమ పథకాల్లో దుర్వినియోగాన్ని అరికట్టడం వంటివన్నీ ప్రభుత్వ న్యాయపరమైన లక్ష్యాల కిందికే వస్తాయి. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను అనధికారికంగా వాడుకోవడమంటే వారి హక్కుల్లో చొరబడడమే.’

ప్రాథమిక హక్కే

వ్యక్తిగత గోప్యతపై తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

- కాకుంటే ఇతర హక్కుల్లా సంపూర్ణమైనది కాదు
- 9 మంది న్యాయమూర్తుల ఏకగ్రీవ అభిప్రాయం
- కేంద్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన రాజ్యాంగ ధర్మాసనం

తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులు



దిల్లీ

వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ హక్కు (రైట్ టు ప్రైవసీ)... రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కేనని స్పష్టీకరించింది. వ్యక్తుల గౌరవప్రద జీవితానికి ఈ హక్కు తప్పనిసరి అని తేల్చిచెప్పింది. తాను ఎలా బతకాలో, ఎలా నడుచుకోవాలో ప్రభుత్వం నిర్దేశించాలని ఏ పౌరుడూ కోరుకోడంటూ ప్రజల మనోభావాలను చాటిచెప్పింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని 125 కోట్ల మందిపై ప్రభావం చూపగల అంశంపై 547 పేజీల సవివర తీర్పులో అనేక విషయాలను ప్రస్తావించింది. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వానికి ఉండే హక్కుల్ని, పరిమితుల్ని గుర్తు చేసింది. డిజిటల్ ప్రపంచంలో సమాచారాన్ని భద్రపరచాల్సిన జాగ్రత్తల్నీ సూచించింది. పిల్లలు చేసే తప్పులను ఎలా చూడాలో కూడా చెప్పింది. ప్రైవసీ... మానవుల హుందాతనానికి రాజ్యాంగపరమైన మౌలిక సూత్రమని పేర్కొంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్ నేతృత్వంలోని తొమ్మండుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం విస్పష్టంగా, ఏకగ్రీవంగా తీర్పును వెలువరించింది. వివిధ సామాజిక లబ్ధి పథకాలను పొందడానికి ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై ఈ తీర్పు వెలువడింది. మూడు వారాల వ్యవధిలో ఆరు రోజుల పాటు ఏకబిగిన వాదోపవాదనలను ఆలకించిన ధర్మాసనం తమ తీర్పును గతంలో వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇతర ప్రాథమిక హక్కుల మాదిరిగా వ్యక్తిగత గోప్యత హక్కు సంపూర్ణమైనదేమీ కాదని ధర్మాసనం తెలిపింది. ఈ హక్కులో చొరబడేందుకు జరిగే ప్రయత్నాలు- ‘అనుమతించదగ్గ ఆంక్షలు’ అనే గీటురాయిని తట్టుకుని నిలబడాల్సిందేనని స్పష్టం చేసింది. రాజ్యాంగం ప్రకారం వ్యక్తిగత గోప్యత హక్కు అనే (మిగతా 2లో)

పిటిషన్లు వేసింది వీరే


శాంతా సిన్హా | జస్టిస్ పుట్టస్వామి

ఇప్పుడేమిటి ఆధారం!

- అన్ని సంక్షేమ పథకాలకూ అనివార్యం చేసిన ప్రభుత్వాలు

ఆధార్‌పై ప్రభావం లేదు.. అది కొనసాగుతుంది: యూఐడీఏఐ

15, 16, 17 పేజీల్లో

సామాన్యుడి చేతికి గోప్యత అస్త్రం

- వ్యక్తిగత సమాచార హక్కుకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే వీలు
- రాజ్య వ్యవస్థల నిర్హేతుక చొరబాటుకు అడ్డుకట్ట

నీళ్లిచ్చే నిలబడతం..

జనవరి ఒకటి నుంచే గ్రామీణులకు భగీరథ నీరు

- రక్షిత జలం అందించాకే ఎన్నికల్లో పోటీ
- పనుల్లో జాప్యాన్ని సహించం
- ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలి
- ఇక క్షేత్ర స్థాయి పర్యటనలు
- ప్రజా పనులపై అధిక జీఎస్‌టీ వద్దు
- సమీక్ష సమావేశంలో కేసీఆర్



‘ప్రజలకు సురక్షిత మంచినీళ్లివ్వటం మన రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశం. ఈ ఏడాది డిసెంబరు లోపుగానే ఇన్‌టేక్ వెల్స్, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు పూర్తికావాలి. 2018 జనవరి 1వ తేదీన నూతన సంవత్సర కానుకగా గ్రామీణ ప్రజలకు తాగునీటిని అందివ్వాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు, వర్క్ ఏజెన్సీలు రేయింబవళ్లు పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలి

భగీరథ పనులను ఇప్పటికే 11 రాష్ట్రాలు వచ్చి చూశాయి. ఇది అతి గొప్ప ఇంజనీరింగ్ ఫీట్. అతి పెద్ద సవాల్‌ను తీసుకొన్నాం. కనుక ఇక నుంచి నేనే స్వయంగా కార్యక్షేత్రాలను సందర్శిస్తా’

- సీఎం కేసీఆర్

ఈనాడు – హైదరాబాద్

భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీళ్లను అందివ్వటం ఇప్పుడు ప్రభుత్వానికి జీవన్మరణ అంశమని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని అన్ని ఆవాసాల్లోని ప్రజలకు సురక్షిత మంచినీటిని అందజేయకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమనే సవాల్‌ను తీసుకొని ప్రస్తుతం భగీరథ పనులను చేస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. దానికి తగినట్టుగా సకాలంలో పనులు పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథపై ప్రగతిభవన్‌లో గురువారం సీఎం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడారు.

‘భగీరథ పనుల్లో ఎక్కడ ఏ చిన్న జాప్యం జరిగినా ప్రభుత్వం దృష్టికి తేవాలి. ఏ సమస్య వచ్చినా జోక్యం చేసుకొని పరిష్కరించటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.43 వేల కోట్లను భగీరథపై వెచ్చిస్తున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని పనులను నిరంతరం సమీక్షించాలి. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉండాలి. వర్క్ ఏజెన్సీలు సమాఖ్యగా ఏర్పడి పనుల్లో వేగానికి పరస్పరం సహకరించుకోవాలి. ప్రభుత్వం ఏమాత్రం పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లిస్తోంది. సకాలంలో పనులు పూర్తి చేసినవారికి 1.5 శాతం ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తోంది. పనుల్లో జాప్యాన్ని మాత్రం సహించం. ఆయా ఏజెన్సీలను పనుల నుంచి తప్పించటానికి కూడా ప్రభుత్వం వెనుకాడదు.

ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు మూడు

రాష్ట్రంలో నిరంతర విద్యుత్, రైతులకు సాగునీరు, సురక్షిత మంచినీరు.. అనే మూడు కార్యక్రమాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. విద్యుత్ సమస్యను విజయవంతంగా అధిగమించగలిగాం. ప్రస్తుతం 45 శాతం వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటలు విద్యుత్ అందిస్తున్నాం. త్వరలోనే నూరు శాతం (మిగతా 2లో)

అరబ్‌షేక్‌ల ఆగడాలకు అడ్డుకట్ట

- వివాహాలకు ప్రత్యేక నిబంధనలు
- న్యాయశాఖ పరిశీలనలో దస్త్రం
- త్వరలో ఆర్డినెన్సు జారీకి అవకాశం

18లో



పాఠకులు,
ప్రకటనకర్తలు,
ఏజెంట్లు,
శ్రేయోభిలాషులకు
‘ఈనాడు’
వినాయక చవితి
శుభాకాంక్షలు

సెలవు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుక్రవారం ‘ఈనాడు’ కార్యాలయానికి సెలవు. శనివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.

- మేనేజింగ్ డైరెక్టర్



నేటి నుంచి చలామణిలోకి రూ.200 నోటు

2లో

- విడుదలకు ఆర్‌బీఐ ముహూర్తం ఖరారు

అందరికీ ‘ఉప వర్గీకరణ’ వెలుగులు

- తెలుగు రాష్ట్రాలపై ప్రభావం
- అన్ని కులాలవారికి విద్యా, ఉద్యోగ అవకాశాలు
- కేంద్ర నిర్ణయంపై బీసీ ప్రతినిధుల సానుకూలత

13లో

నీట్‌తోనే సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ

- కౌన్సెలింగ్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేసిన హైకోర్టు
- తెలుగు రాష్ట్రాలకు నష్టమేనన్న ధర్మాసనం

6లో

అమెరికాలోని రెస్టారెంట్‌లో కాల్పులు

ఒకరికి గాయాలు... బందీలుగా పలువురు

ఛార్లెస్టన్: అమెరికాలోని ప్రముఖ పర్యాటక నగరం ఛార్లెస్టన్‌లో ఓ మాజీ ఉద్యోగి కాల్పులతో కలకలం సృష్టించాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో ఒక రెస్టారెంటులోని వంటగదిలో నుంచి వచ్చిన వృద్ధుడు కాల్పులు జరుపుతూ "నగరంలోకి కొత్త బాస్ వచ్చాడ"ంటూ బిగ్గరగా అరిచాడని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. కాల్పుల్లో ఒక పర్యాటకుడు గాయపడినట్లు తెలిసింది. ఆగంతకుడు పలువురు సందర్శకులను బంధించాడన్న వార్తల నేపథ్యంలో పోలీసులు ఘటనా స్థలం వద్ద మోహరించారు. బాంబు స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు.

వ్యక్తిగత గోప్యత.. ప్రాథమిక హక్కే

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ, లేదా ప్రాథమిక హక్కు లేదన్న కేంద్ర ప్రభుత్వ బలమైన వాదనను తోసిపుచ్చింది. ఏయే అంశాలు గోప్యత కిందికి వస్తాయో ఒక జాబితాగా రూపొందించలేమని చెప్పింది. వ్యక్తుల గౌరవం, మానవుల మధ్య సమానత్వం, స్వేచ్ఛ కోసం తపన అనేవి రాజ్యాంగ మూలస్తంభాలని పేర్కొంది. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను అనధికారికంగా వాడుకోవడమంటే వారి హక్కుల్లో చొరబడడమేనని చెప్పింది. నలుగురు న్యాయమూర్తులు విడివిడిగా తీర్పులు రాసినా అవన్నీ ఒకదానితో ఒకటి ఏకీభవించేవిగానే ఉన్నాయి. తీర్పును వెలువరిస్తున్నప్పుడు న్యాయస్థానం కిక్కిరిసిపోయింది. జీవితం, మానవ ప్రతిష్ఠ, గోప్యత, ఆధునిక యుగంలో దాని పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అనేకాంశాలను ధర్మాసనం స్పృశించింది. దీంతో అందరి దృష్టి ఇప్పుడు ఆధార్ కేసుపై పడింది. ప్రఖ్యాత న్యాయ కోవిదులంతా ఈ తీర్పును ఆహ్వానించారు.

జీవన హక్కులో అవిభాజ్యం

"రాజ్యాంగంలోని మూడో భాగం మొత్తం కింద, 21వ అధికరణం కింద, వ్యక్తిగత గోప్యత హక్కు అనేది 'జీవన హక్కు- వ్యక్తిగత స్వేచ్ఛ'లో అవిభాజ్య భాగం" అని ధర్మాసనం తెలిపింది. గోప్యత హక్కు- ప్రాథమిక హక్కు కిందికి రాదని కేంద్రం వాదించింది. పౌరులు ప్రభుత్వానికి ఇచ్చిన వేలిముద్రల్ని, వ్యక్తిగత వివరాలను వాణిజ్య సంస్థలు వాడుకుంటే అది గోప్యతకు భంగం కలిగించడమే అవుతుందని పిటిషనర్లు వాదించారు. దీనిపై వెలువడిన తీర్పు... 'వ్యక్తిగత గోప్యత హక్కు' వరకే పరిమితం. ఈ హక్కును ఆధార్ ఉల్లంఘిస్తోందా అనే అంశాన్ని అయిదుగురు సభ్యుల ధర్మాసనం 2015 నుంచి విడిగా విచారిస్తోంది. గురువారం నాటి తీర్పులో సీజేఐ జస్టిస్ ఖేహర్ అభిప్రాయంతో మిగిలిన న్యాయమూర్తులు- జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎస్.ఎ. బాబ్డే, జస్టిస్ ఆర్.కె. అగర్వాల్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్, జస్టిస్ ఎ.ఎం.సప్రే, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎస్.కె. కౌల్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌లు పూర్తిగా ఏకీభవించారు. ప్రధాన తీర్పును జస్టిస్ చంద్రచూడ్ రాశారు.

గత తీర్పుల్ని తోసిపుచ్చిన ధర్మాసనం

వ్యక్తిగత గోప్యత హక్కుకు రాజ్యాంగపరమైన రక్షణ లేదని ఇదివరకు సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పుల్ని ఈ ధర్మాసనం ఏకగ్రీవంగా తోసిపుచ్చింది. వీటిలో ఒక తీర్పు 1950లో (ఎం.పి.శర్మ కేసు), రెండో తీర్పు 1960లో (ఖరక్ సింగ్ కేసు) వెలువడ్డాయి. ఖరక్‌సింగ్ కేసులో 8 మంది న్యాయమూర్తులు, శర్మ కేసులో ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారు. తాజా కేసులో తీర్పును జస్టిస్ ఖేహర్ చదివి వినిపిస్తూ- శర్మ, ఖరక్‌సింగ్ కేసుల తర్వాత వెలువడిన ఇతర తీర్పుల్లో కచ్చితమైన చట్ట పరిస్థితిని పేర్కొన్నారని చెప్పారు. తీర్పు వెలువరించే ముందు సీజేఐ మాట్లాడుతూ- తొమ్మండుగురు న్యాయమూర్తుల్లో కొందరు వేర్వేరు తీర్పులను ఇచ్చి ఉన్నారని చెప్పారు. గోప్యతపై ఉభయపక్షాలూ భిన్న వాదనలు వినిపించాయి. సాంకేతిక యుగంలో గోప్యత భావన అసంగతమైనదిగా మారుతోందనీ, అందువల్ల ప్రైవేటు సమాచారాన్ని జనబాహుళ్యం నుంచి రక్షించడానికి పటిష్ఠమైన మార్గదర్శకాలు అవసరమనీ ఒక దశలో సుప్రీంకోర్టు పేర్కొంది. తుదితీర్పులోనూ దానిని ప్రస్తావించింది. అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ప్రముఖ న్యాయవాదులు- కపిల్ సిబల్, శ్యాం దివాన్, ఆనంద్ గ్రోవర్, సి.ఎ.సుందరం, రాకేష్ ద్వివేది తదితరులు ఈ కేసులో వాదనలు వినిపించారు.

మానవ హక్కుల పరిరక్షణ 'భారత్' సంస్కృతి

భారత్ అనే ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో మానవ హక్కుల పరిరక్షణపైనే 'రాజ్యాంగ సంస్కృతి' ఆధారపడి ఉందని జస్టిస్ నారీమన్, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ బాబ్డే పేర్కొన్నారు. ఈ ముగ్గురూ విడివిడిగా తీర్పులు వెలువరించారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల మూలాల్లోకి ఈ అంశం వెళ్తుందని చెప్పారు. అంశంపై తామె లాంటి నిర్ణయం తీసుకున్నా అది భారత్ ప్రజాస్వామ్య గణతంత్రంపై భారీ ప్రభావం చూపిస్తుందని జస్టిస్ నారీమన్ చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ ఉన్న అంశాలపై ప్రశ్నలకు తాము సమాధానం చెప్పాల్సి వస్తోందని జస్టిస్ బాబ్డే అన్నారు. రాజ్యాంగానికి ప్రాతిపదికగా ఉన్న మూల సూత్రాలను తాము సమీక్షిస్తున్నామని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. వ్యక్తులు, సమాజం, రాజ్య ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించడాన్ని న్యాయవ్యవస్థకి విడిచిపెట్టాలని జస్టిస్ నారీమన్ చెప్పారు. కూడు, గూడు, వస్త్రాలు వంటి కనీస సదుపాయాలు కోట్లాది మందికి లేని దేశంలో గోప్యతను ప్రాథమిక హక్కుగా కోరడానికి వీల్లేదన్న కేంద్రం వాదనను ఆయన తోసిపుచ్చారు.

ఆ వర్గాలకు గోప్యత హక్కును నిరాకరించలేం

'స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లు వంటివారు సంఖ్యాపరంగా తక్కువైనంత మాత్రాన వారికి గోప్యత హక్కును నిరాకరించలేం. ప్రాథమిక హక్కులను వారి నుంచి దూరం చేయలేం' అని ధర్మాసనం పేర్కొంది. 'వారి విశ్వాసాలు, భావనలు, జీవన విధానం ప్రధాన జనజీవన స్రవంతికి అనుగుణంగా లేనందువల్ల వారిపై వివక్ష చూపడం తగదు. అలాంటి వివక్ష వారి ఆత్మగౌరవానికి భంగకరం. లింగభేదానికి అతీతంగా సమాజంలో ప్రతి ఒక్కరి గౌరవాన్ని పరిరక్షించాలి' అని చెప్పింది.

ఇదీ సంగతి!



'మమ్మల్ని బలిపశువును చేస్తే ప్రయోజనం లేదు'

అమెరికాపై పాకిస్థాన్ మండిపాటు

ఇస్లామాబాద్: ఉగ్రవాద శిబిరాలకు పాకిస్థాన్ ఆశ్రయమిస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను పాక్ ఖండించింది. తమ దేశాన్ని బలిపశువును చేసినంత మాత్రాన అఫ్గానిస్థాన్‌లో శాంతి, సుస్థిరత సాధ్యం కాదని వ్యాఖ్యానించింది. ట్రంప్ ఆరోపణలపై ప్రతిస్పందించేందుకు.. పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీ గురువారం జాతీయ భద్రత కమిటీ (ఎన్ఎస్‌సీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు ఐదు గంటలపాటు ఈ భేటీ జరిగింది. పాక్‌పై అగ్రరాజ్యం వైఖరి 'తీవ్రమైన అంశం'మని సమావేశం అనంతరం అబ్బాసీ వ్యాఖ్యానించారు. ఇటు పాక్‌పై అమెరికా చేసిన ఆరోపణలను తోసిపుచ్చుతున్నట్లు ఎన్ఎస్‌సీ అధికారిక ప్రకటనలో పేర్కొంది.

పాక్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలి

అమెరికాకు చైనా సూచన

బీజింగ్: పాకిస్థాన్ సార్వభౌమత్వం, భద్రతపరమైన ఆందోళనలను గౌరవించాలని అమెరికాకు చైనా సూచించింది. అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిలెర్సన్‌తో ఈ మేరకు చైనా స్టేట్ కౌన్సిలర్ యాంగ్ జీచి టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ట్రంప్ తాజా ఆరోపణల నేపథ్యంలో.. పాక్ తీరును ఆయన వెనుకేసుకొచ్చారు. ఉగ్రవాదంపై పాక్ ముందుండి పోరాడుతోందని.. ఎన్నో త్యాగాలు చేసిందని వ్యాఖ్యానించారు. శాంతి, సుస్థిరతలను నెలకొల్పడంలో ఆ దేశం గొప్ప భాగస్వామ్యం వహిస్తోందని అన్నారు.

'వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలి'

ఈనాడు, హైదరాబాద్: వికలాంగులకు రైల్వేలో సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత వికలాంగుల రక్షణ వేదిక ద.మ. రైల్వే జీఎం వినోద్‌కుమార్‌ను కోరింది. వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఇతర ప్రతినిధులు ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రైల్వే స్టేషన్‌లో వికలాంగులకు దుకాణాలను కేటాయించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, ప్రతీ రైలులో వికలాంగుల కోసం బోగీలను ఏర్పాటు చేయాలని కోరారు.

'ఓబీసీ వర్గీకరణ గడువు పొడిగించాలి'

కేంద్రంలో ఓబీసీల వర్గీకరణ గడువును పొడిగించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. గురువారం బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓబీసీల వర్గీకరణ విప్లవాత్మక నిర్ణయమమన్నారు.

ట్రైబ్యునల్ ఎదుట కేసీఆర్ వాదనలు?

ఈనాడు, హైదరాబాద్: బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట కృష్ణా జలాలపై వాదనకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తీసుకెళ్లాలని నీటిపారుదల శాఖ అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల న్యాయవాదుల బృందం, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమైనప్పుడు ఈ అంశం చర్చకు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అవసరమైతే బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట తానే తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తానని గతంలో పలు సందర్భాల్లో జరిగిన సమీక్షల్లో ముఖ్యమంత్రి చెప్పారని, ప్రస్తుత పరిస్థితిని పరిగణనలోకి తీసుకొంటే ముఖ్యమంత్రి ఓసారి హాజరవడం మేలని న్యాయవాదులు అభిప్రాయపడినట్లు తెలిసింది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ బచావత్ కేటాయింపుల జోలికి వెళ్లే అవకాశం కనిపించడం లేదని, తెలంగాణకు జరిగిన అన్యాయం, మరింత గట్టిగా వాదనను వినిపించడానికి ముఖ్యమంత్రిని రమ్మని కోరదామన్నట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చిస్తామని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.



నీళ్లిచ్చే నిలబడతం..

(మొదటి పేజీ తరువాయి)

పంపుసెట్లకు 24 గంటలూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తాం. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లను కేటాయించటంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల ద్వారానూ నిధులను సమకూరుస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులపై ఈ ఏడాది మొత్తం రూ.58 వేల కోట్లను ఖర్చుపెడుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే ఏడాది నుంచి గోదావరి జలాలు అందుబాటులోకి వస్తాయి. ప్రగతి నిరోధక శక్తులు ఆటంకాలు కలిగిస్తున్నా ప్రభుత్వం పట్టుదలతో ముందుకు వెళ్తోంది. ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తున్నాం.

జలాశయాల్లో మంచినీటికే ప్రాధాన్యం

జలాశయాలను వాడుకొనే విషయంలో మంచి నీటికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తాం. అందుకోసమే ప్రాజెక్టుల్లో 10 శాతం నీటిని కేటాయిస్తూ చట్టాన్ని తెచ్చాం. తాగునీటి కోసం రిజర్వాయర్లలో ఎండీడీఎల్ (మినిమమ్ డ్రా డౌన్ లెవెల్స్) ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు ఆపరేషన్ మాన్యువల్ మార్చాలి. రాష్ట్రంలో 19 జల సేకరణ ప్రాంతాలకు గాను దుమ్ముగూడెం వద్ద మాత్రమే 365 రోజులు నీటి లభ్యత ఉంటుంది. మిగతా చోట్ల కూడా ఎప్పుడూ నీరు అందుబాటులో ఉండటం కోసం ఎండీడీఎల్ ఉండేలా చూడటం అత్యంత ముఖ్యమైన విషయం. రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని భగీరథను రూపొందించాం'.



గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

జీఎస్టీతో అధిక భారం

జీఎస్టీతో తమ పనులపై ఆర్థిక భారం పెరిగిందని గుత్తేదారులు వాపోయారు. పరికరాలు, సామగ్రి కొనుగోలు సందర్భంలో తాము 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. చొరవ తీసుకొని జీఎస్టీ తగ్గింపుపై కేంద్రంపై వత్తిడి తేవాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఎం స్పందిస్తూ.. ప్రజా పనులకు అధిక జీఎస్టీని విధించవద్దని తాము కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నామని, త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే జీఎస్టీ సమావేశంలో ఈ అంశాన్ని రాష్ట్రం తరఫున గట్టిగా ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందిస్తుందనే ఆశా భావాన్ని ఆయన వ్యక్తంచేశారు. కేంద్రం స్పందించకుంటే ఏజెన్సీలకు నష్టం కలగని రీతిలో ఒక విధానాన్ని తెస్తామన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జగదీష్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, భగీరథ సంస్థ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సీఎంకు నివేదించిన భగీరథ పనుల వివరాలు

పని	చేయాల్సినవి	పూర్తిచేసినవి
ఇంటేక్ వెల్స్	19	16
నీటి శుద్ధికేంద్రాలు	50	15
పైపులైన్లు	49,238 కి.మీ.	43,427 (88శాతం) కి.మీ.
సంపులు	421	247
గ్రౌండ్ లెవెల్ రిజర్వాయర్లు	143	73
జల బాండాగారాలు	562	192
పంపు హౌస్‌లు	248	51

చైనా సరిహద్దుల్లో కీలక స్థావరం

- గప్‌చుప్‌గా హిందాన్‌లో సిద్ధం చేసిన భారత్
- ఇక వేగంగా శత్రు భూభాగంలోకి ప్రత్యేక బలగాల రవాణా

కోల్‌కతా

డోక్లామ్‌లో సైనిక ప్రతిష్టంభన నేపథ్యంలో ఒకవైపు చైనా.. రణగొణ ధ్వనులు చేస్తుండగా, భారత్ మాత్రం గప్‌చుప్‌గా తన రక్షణ సన్నద్ధతను మెరుగుపరచుకుంటోంది. పశ్చిమ బెంగాల్‌లోని పనాగఢ్‌లో తన కీలక వైమానిక స్థావరాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చింది. అక్కడ ఆరు భారీ సి-130జె సూపర్ హెర్క్యులెస్ విమానాలను మోహరించింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన మరుక్షణం.. శత్రు భూభాగంలోకి సుశిక్షిత ప్రత్యేక బలగాలను చేరవేసేందుకు ఈ లోహ విహంగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి.

కోల్‌కతాకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కేంద్రాన్ని అర్జున్ సింగ్ వైమానిక స్థావరంగా పిలుస్తున్నారు. ఘజియాబాద్‌లోని హిందాన్‌లోనూ సి-130జె విమానాలను మోహరించారు. పనాగఢ్‌లో ఈ విమానాల నిర్వహణ కోసం అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ ఇంజినీర్లు గత రెండేళ్లుగా హ్యాంగర్లు, ఇతర సౌకర్యాలను నిర్మిస్తున్నారు. బలగాలు, భారీ సాధనాల మోసుకెళుతూ.. చైనాకు చేరువలోని అడ్వాన్స్ ల్యాండింగ్ గ్రౌండ్లలో ఉన్న చిన్నపాటి రన్‌వేలపై సునాయాసంగా దిగే సామర్థ్యం ఈ విమానాలకు ఉంది. శరవేగంగా శత్రు భూభాగంలో మన బలగాలను చేరవేయగల సత్తా వీటి సొంతం. వీటికితోడు సుఖోయ్-30 ఎంకేఐ సహా తూర్పు వైమానిక విభాగంలోని యుద్ధవిమానాల పరిధిని పెంచడం కోసం గగనతలంలోనే ఇంధనాన్ని నింపే ఐఎల్-78 విమానాన్ని పనాగఢ్‌లో మోహరించారు. తూర్పు వైమానిక విభాగంలో ప్రధాన యుద్ధవిమానంగా ఉన్న సుఖోయ్‌లకు 3వేల కిలోమీటర్ల పరిధి ఉంది. గాల్లోనే వీటికి ఇంధనాన్ని నింపడం వల్ల వాటి పరిధి మరింత పెరుగుతుంది. ఫలితంగా అవి వ్యూహాత్మక ఆయుధాలను మోసుకెళ్లగలుగుతాయి.

హిందాన్, పనాగఢ్‌లో హ్యాంగర్లు, ఇతర సౌకర్యాలను గప్‌చుప్‌గా ఏర్పాటుచేశారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ హ్యాంగర్ల కింద.. ప్రత్యేక బలగాలు, వారికి సంబంధించిన సాధనాలతో ఏసీ క్వార్టర్లను నిర్మించారు. దీనివల్ల వారు ఆదేశం వచ్చిన కొద్ది నిమిషాల్లోనే సి-130జె విమానాలను ఎక్కగలుగుతారు. అత్యవసరంగా చేరవేయడం కోసం.. నిరంతరంగా కొన్ని లోహవిహంగాలను టేకాఫ్ కోసం సిద్ధంగా ఉంచుతారు.

పనాగఢ్ వైమానిక స్థావరం చాలా కీలకం. ఎందుకంటే చైనాను లక్ష్యంగా చేసుకొని భారత్ కొత్తగా ఏర్పాటు చేస్తున్న పర్వత ప్రాంత దాడి దళ (17 స్ట్రైక్ కోర్) ప్రధాన కార్యాలయం కూడా ఈ పట్టణంలోనే ఉంది. ఈ దళం పరిధిలో పనిచేసే 'పర్వత పదాతి దళ డివిజన్' కూడా ఇక్కడే మోహరించింది. ఈ నేపథ్యంలో స్వల్పకాల, మెరుపు దాడుల కోసం పనాగఢ్ వైమానిక స్థావరాన్ని పూర్తిస్థాయి సన్నద్ధతలో ఉంచినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్థావరాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంపై చైనాలో అనుమానాలు పెరగడం ఖాయం. అయితే ప్రస్తుతం సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులతో ఈ పరిణామానికి సంబంధం లేదని భారత వైమానిక దళ అధికారులు పేర్కొన్నారు. ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారమే ఇది సిద్ధమైందని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

25-8-2017 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
చవితి: రా. 9-32 తదుపరి పంచమి
హస్త నక్షత్రం: సా. 4-38 తదుపరి చిత్త
అమృతఘడియలు: ఉ. 10-29 నుంచి 12-07 వరకు
వర్జ్యం: రా. 1-00 నుంచి 2-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-18 నుంచి 9-08 వరకు తిరిగి 12-27 నుంచి 1-17 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-17

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	22.4	31.7
ఖమ్మం	24.0	25.0
నిజామాబాద్	24.0	30.0
మహబూబ్‌నగర్	24.6	31.6
హైదరాబాద్	24.7	31.8
రామగుండం	24.9	29.8
హన్మకొండ	25.5	33.0
సూర్యాపేట	28.0	34.0

నేటి నుంచి చలామణిలోకి రూ.200 నోటు

ముంబయి: పసుపు వర్ణంలో మెరుస్తున్న రూ.200 నోటు నేడు (శుక్రవారం) మార్కెట్‌లోకి అడుగు పెట్టబోతోంది. దీని విడుదలకు ముహూర్తం ఖరారుచేస్తూ. రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గురువారం ఓ ప్రకటన విడుదలచేసింది.

ఆకర్షణీయంగా: నోటు పైభాగంలో కొట్టొచ్చేలా మహాత్ముడి చిత్రాన్ని ముద్రించారు. దృష్టి లోపాలున్నవారు సైతం గుర్తుపట్టేలా దీన్ని కాస్త ఉబ్బెత్తుగా సిద్ధంచేశారు. అశోకుడి స్తంభం గుర్తునూ ఇలానే ముద్రించారు. చిన్న చిన్న "రూ.200" అక్షరాలతో "హెచ్" మార్కునూ దీనిపై పెట్టారు. కింది భాగంలో 200 రూపాయల గుర్తు (పచ్చ నుంచి నీలం రంగుకు మారే సిరాలో) ఉంటుంది. నోటుపై వంపు తిరిగిన నాలుగు వర్ణాల గీతలు పారదర్శకంగా కనిపిస్తున్నాయి. వాటి మధ్య రెండు వలయాలు ఉన్నాయి. 66 మి.మీ. పొడవు, 146 మి.మీ. వెడల్పున్న ఈ నోటు మధ్య భాగంలో పచ్చ నుంచి నీలం రంగులోకి మారే సిరాతో నిలువుగీత ఏర్పాటుచేశారు. దీనిపై భారత్, ఆర్‌బీఐ అని రాసివుంది. భారత సంస్కృతీ వారసత్వానికి ప్రతీకగా సాంచి స్తూపం చిహ్నాన్ని వెనుకవైపు ముద్రించారు. దీనికి పక్కనే 'స్వచ్ఛ భారత్' నినాదం కనిపిస్తోంది.



ఛార్జింగ్ చేస్తుండగా పేలిన సెల్‌ఫోను



అచ్యుతాపురం, న్యూస్‌టుడే: విశాఖపట్నం అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో ఛార్జింగ్‌లో ఉన్న ఓ సెల్‌ఫోను పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపాలెంనకు చెందిన గంధం సాయి 4 నెలల క్రితం అచ్యుతాపురంలో రెడ్ మి నోట్-4 కొనుగోలు చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు ఛార్జింగ్ అవుతుండగానే 10 నిమిషాలపాటు ఫోన్‌లో మాట్లాడాడు. మాట్లాడటం పూర్తయ్యాక ఫోను టేబుల్‌పై పెట్టాడు. వెంటనే పెద్దశబ్దంతో ఫోను పేలిపోయి మంటలు వచ్చాయి. కళ్లముందే సెల్ పేలిపోవడంతో యువకుడు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఫోను మొత్తం నల్లగా బూడిదలా మారిపోయింది.

1న తిరుమలకు రాష్ట్రపతి

శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆస్పత్రి భవనం ప్రారంభించనున్న రామ్‌నాథ్

ఈనాడు, తిరుపతి: రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత రామ్‌నాథ్ కోవింద్ తొలిసారిగా రాష్ట్రానికి రానున్నారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి రెండు రోజులపాటు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. అధికారికంగా ఇంకా షెడ్యూలు వెల్లడి కానప్పటికీ.. ఈ పర్యటన దాదాపు ఖరారైనట్లేనని చిత్తూరు జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. 1న కోవింద్ దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆ తర్వాత రోడ్డు మార్గం ద్వారా నేరుగా తిరుమలకు వెళ్లనున్నారు. 1వ తేదీ రాత్రి అక్కడ బస చేసి 2న ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం తిరుమల నుంచి తిరుపతికి బయల్దేరుతారు. తిరుపతిలో శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రపతితోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నట్లు అధికారులు వెల్లడించారు.





అసాంక్రమిక వ్యాధుల నివారణ క్లినిక్‌ల్లో 1,78,277 మందికి చికిత్స

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న అసాంక్రమిక వ్యాధుల నివారణ క్లినిక్‌ల్లో గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకూ మొత్తం 1,78,277 మంది చికిత్స పొందారు. వీరిలో మధుమేహులు 26,782 (15శాతం) మంది, అధిక రక్తపోటు బాధితులు 28,079 (15.75శాతం) మంది, సాధారణ క్యాన్సర్ రోగులు 1,334 (0.74శాతం) మంది ఉన్నట్లుగా, మిగిలినవారు ఇతర వ్యాధులతో బాధపడుతున్నట్లుగా నిర్ధారించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ అసాంక్రమిక వ్యాధుల నివారణ క్లినిక్‌ల్లో నమోదైన రోగుల సమాచారంతో కూడిన నివేదికను 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం' పేరిట ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసింది.





26, 27 తేదీల్లో కాకినాడలో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈ నెల 26, 27 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో పర్యటించనున్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెదేపా తరపున ఆయన రెండు రోజులపాటు విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటారు. 26న మధ్యాహ్నం 3.15 నుంచి ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం మొదలవుతుంది.



ఈనాడు

సామాజిక రుగ్మతకు న్యాయచికిత్స!

దేశంలో అసంఖ్యాక అభాగినుల బతుకుల్ని బండలు చేస్తున్న సాంఘిక దురాచార నియంత్రణకై అస్త్రం గురి తప్పిందన్న వాదనలకు సర్వోన్నత న్యాయస్థానంలో గట్టి మద్దతు లభించింది. వరకట్నం వేధింపుల ఆరోపణలకు సంబంధించి భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 498 ఏ దుర్వినియోగాన్ని అరికట్టేందుకంటూ విస్పష్ట ఆదేశాలూ జారీ అయ్యాయి. సుమారు మూడేళ్ల క్రితమే ఆ సెక్షన్ అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తీకరించిన సుప్రీంకోర్టు, నిందితుల అరెస్టు విషయంలో పోలీసు అధికారులు జాగ్రత్తగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్రాలకు నిర్దేశించింది. ఆ స్ఫూర్తికి ఎవరూ ఎక్కడా కట్టుబాటు చాటడం లేదన్న ఆవేదన- రాజేశ్ శర్మ, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాల మధ్య కేసులో ఇటీవల జారీ అయిన సుప్రీం ఉత్తర్వుల్లో ప్రస్ఫుటమైంది. ప్రస్తుతం వరకట్న వేధింపుల కేసులలో చాలావరకు ఒత్తిళ్ల, ఇతరత్రా కారణాలతో అరెస్టులు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. నిజంగా వేధింపులకు పాల్పడినవారిపై కేసులు నమోదైనా అరెస్టులు జరగడం లేదన్న ఫిర్యాదులు, తప్పుడు కేసులు జోరెత్తుతున్నాయన్న ఆందోళనల వెలుగులో న్యాయపాలిక వివరణాత్మకంగా స్పందించింది. జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కుటుంబ సంక్షేమ కమిటీ నెలకొల్పి, 498 ఏ సెక్షన్ కింద కేసుల్ని అది క్షుణ్నంగా పరిశీలించాకనే తదుపరి చర్యలు చేపట్టడమే సరైన విరుగుడుగా న్యాయపాలిక సంభావిస్తోంది. భౌతిక దాడులు, మృతి సంభవించిన పక్షంలో ఈ నిబంధనలు వర్తించబోవన్న వివరణలో ముందుచూపు ప్రశంసార్హం. పని ఒత్తిడి ప్రాతిపదికన జిల్లాకు ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ కమిటీల ఏర్పాటుకు అక్టోబరు నెలాఖరులోగా అన్ని రాష్ట్రాలూ చొరవ చూపాలన్నది సర్వోన్నత న్యాయస్థానం ఆదేశ సారాంశం.

తమ కన్నకూతురు అత్తవారింట కష్టకాలంలోనూ ఇక్కట్లపాలు కారాదన్న ఆపేక్షతో తల్లిదండ్రులు ఇచ్చే బహుమానంగా మొదలైన సంప్రదాయం కాలక్రమేణా వికృతరూపం దాల్చింది. పెళ్లికుమారుడి విద్యార్హతలకు, ఉద్యోగానికి, ఆర్థిక స్తోమతకు దీటుగా ఫలానా మొత్తంలో కట్నకానుకలు లాంఛనాలు ముట్టజెప్పాల్సిందేనన్న డిమాండ్లు వెర్రి తలలు వేస్తున్నాయి. ఈ విపరీత పోకడల్ని పరిమార్చేందుకంటూ ఏనాడో 1961లో తెచ్చిన వరకట్న నిషేధ చట్టం ఆచరణలో చట్టుబండలైంది. 'వైవాహిక క్రూరత్వం'పై ఎత్తిన కత్తిగా 1983లో భారతీయ శిక్షాస్మృతిని సవరించి పొందుపరచిన 498 ఏ సెక్షన్ విషయంలో శాసన నిర్మాతల ఉద్దేశం ఒకటి, జరిగింది ఒకటి. వివాహితలకు రక్షణ ఛత్రం కావాల్సిన సెక్షన్, అమాయకులెందరినో అవమానంపాలు చేసి వేధించడానికి ఉపయుక్తమవుతోందన్న ఆరోపణలు ఏళ్లతరబడి వెల్లువెత్తుతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ లెక్కల ప్రకారం 498 ఏ కింద ఏటా సగటున లక్ష కేసులు నమోదవుతున్నా, వాటిలో నేర నిర్ధారణ జరుగుతున్నవి 14-15 శాతం లోపే. భర్తను, అతడి సంబంధీకుల్ని కొంతమంది ఉద్దేశపూర్వకంగానే వేధిస్తున్నారన్న వాదనతో ఏకీభవిస్తూ న్యాయ సంఘం (లా కమిషన్), జస్టిస్ మలిమత్ కమిటీ గతంలోనే నిర్దిష్ట సవరణల్ని సూచించాయి. దుర్వినియోగం యథార్థమేనని ప్రీతిగుప్తా వర్సెస్ ఝార్ఖండ్ కేసులో సుప్రీంకోర్టే వ్యాఖ్యానించింది. 498 ఏ వినియోగంలో వివేచనాయుతంగా వ్యవహరించాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పనుపున రాష్ట్రాలకు మూడేళ్ల క్రితమే సూచనలు జారీ అయ్యాయి. అవేమీ మన్ననకు నోచుకోకపోవడాన్ని గర్హిస్తూ సుప్రీంకోర్టు ఇప్పుడు జిల్లా న్యాయసేవాధికార సంస్థల క్రియాశీలక భూమికను అభిలషిస్తోంది. రాష్ట్రప్రభుత్వాలు చురుగ్గా స్పందిస్తేనే, వరకట్నం కేసుల దుర్వినియోగానికి అడ్డుకట్ట సాధ్యపడుతుంది!

సామాజికంగా వేళ్లూనుకున్న సమస్యల్ని శాసనాలే పరిష్కరించలేవని, చట్టబద్ధ విధినిషేధాలతో పాటు జనచైతన్య కార్యక్రమాలూ కీలకమన్న పండిత నెహ్రూ పదనిర్దేశాన్ని ఆయన పార్టీ ప్రభుత్వాలే గాలికొదిలేశాయి. పర్యవసానంగానే భారీ ప్రచారార్భాటంతో తెచ్చిన వరకట్న నిషేధ చట్టం ప్రభావ శూన్యమైంది. పోనీ 498 ఏ రూపేణా వరకట్న పీడితులకు తగిన ఉపశమనం చేకూరుతోందా అన్న ప్రశ్నకు- నేటికీ ఆగని వేధింపులు, పెచ్చరిల్లుతున్న క్రూరత్వాలే జవాబు. ఇప్పటికీ దేశంలో ప్రతిరోజూ ఇరవై పైగా వరకట్నం చావులు అధికారికంగా నమోదవుతున్నాయి. ఇటువంటప్పుడు 498 ఏ దుర్వినియోగాన్ని కట్టడి చేయడంతో పాటు, మౌలిక శాసన స్ఫూర్తికే గొడుగు పట్టే వాతావరణ పరికల్పన మరెంతో ఆవశ్యకం. అనవసర అరెస్టులు నివారించాలనడం వరకు బాగానే ఉంది; సాధింపులు, వేధింపులకు తెగబడి ఏ ఒక్కరూ తప్పించుకోలేని విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లే అంతిమ లక్ష్యం కావాలి. ఉద్దేశపూర్వకంగా అవమానించడం, భయపెట్టడం ఐపీసీ 504, 506 సెక్షన్ల ప్రకారం శిక్షార్హ నేరాలు. ఇటువంటి నిబంధనల్ని, చట్టాలను లెక్కకు మిక్కిలిగా పేరబెట్టిన కారణంగా ఇప్పటికే తీరని నష్టం వాటిల్లింది. విదేశీ పెళ్లి సంబంధాల పట్ల మోజును సొమ్ముచేసుకుంటూ పబ్బం గడుపుకొని సందు చూసి బంధాన్ని దులపరించేసుకుపోతున్న మోసగాళ్ల ఆగడాలూ కొన్నేళ్లుగా శ్రుతి మించుతున్నాయి. అవి జీవితకాల వేధింపులు! న్యాయ పరిభాషలో చట్టం ఎదుట అందరూ సమానమే. దోషుల పాలిట అంకుశంగా, బాధితుల పట్ల అభయహస్తంగా అది సమర్థ పాత్ర పోషించాలి. వ్యవస్థాగతంగా అందుకు అనువైన స్థితిగతులు కల్పిస్తూ సామాజికంగానూ చేతన క్రతువు నిర్వహించడం బాధ్యతాయుత ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం. ముస్లిం మహిళల ప్రాథమిక హక్కుల రక్షణలో తాజాగా చారిత్రక విజయం సాధించిన మోదీ ప్రభుత్వం, దేశంలో ఏ మహిళ కంటా నీరు చిందనివ్వరాదన్న అజెండాను భుజాలకెత్తుకోవాలి. అఘాయిత్యాల్ని అరికట్టి, ఆపన్నుల్ని ఆదుకోవడం కన్నా 'సుపరిపాలన' ఇంకేముంటుంది?

కలిమి చేకూర్చనున్న చెలిమి!

'పారిశ్రామికీకరణ ప్రపంచానికి అత్యంత అవసరం. ఒక దేశపు సాంకేతికతను మరో దేశం ఇచ్చిపుచ్చుకోవాలి. ఆవిష్కరణలు, పరిశోధనలకు పెద్దపీట వేయాలి. అంకుర పరిశ్రమలకు ఊతమివ్వాలి. అమెరికా, భారత్‌ల మధ్య ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి, పెట్టుబడుల సాధన-ఉద్యోగాల కల్పనకు కలిసిమెలిసి పనిచేయాలి'- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత జూన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా చేసిన వ్యాఖ్యలివి. ఉభయ దేశాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా వచ్చే నవంబరులో ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడిదారుల వార్షిక శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఆ మేరకు నిర్ణయం ఖరారయ్యాక ఆయన ఈ అభిప్రాయం వ్యక్తపరచారు. ప్రపంచంలో వేగంగా చోటుచేసుకుంటున్న అనేక పరిణామాల నేపథ్యంలో, భారత్‌కు ఈ అరుదైన అవకాశం లభించనుంది. అమెరికా నిర్వహణలో దక్షిణాసియాలో తొలిసారిగా జరిగే అంతర్జాతీయ కార్యక్రమమిది. పలు ప్రపంచ దేశాల నుంచి పారిశ్రామిక వ్యవస్థాపకులు, ప్రసిద్ధ వాణిజ్యరంగ నిపుణులు ఇతర ప్రముఖులు దీనికి హాజరవుతున్నారు. ఈ సదస్సు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. భారత్‌లోనూ దీనిపై భారీ అంచనాలున్నాయి.

చిగురిస్తున్న ఆశలు

అగ్రరాజ్యం అమెరికా ఏదైనా కార్యక్రమాన్ని తలపెట్టినప్పుడు తన ముద్రను, ప్రత్యేకతను చాటుకుంటుంది. అలాంటి దేశం తొలిసారిగా భారత్‌లో ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హెచ్1బీ వీసాల నియంత్రణ, విదేశీయుల ఉద్యోగ నియామకాల వంటి విషయాల్లో అమెరికా ధోరణి అందరినీ కలవరపరుస్తోంది. ముఖ్యంగా భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో భారత్‌లో పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సుకు అగ్రరాజ్యం సుముఖత తెలపడం గమనార్హం. ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడం, ఉద్యోగాలను సృష్టించడం, ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడమే లక్ష్యాలుగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని ట్రంప్ ప్రకటించడం దీని ప్రాధాన్యాన్ని చాటుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికాతో సాన్నిహిత్యాన్ని కోరుకుంటున్నాయి. భారత్ సైతం అదే ధోరణితో వ్యవహరిస్తోంది. ఆది నుంచి రెండు దేశాల సంబంధాలు సానుకూలంగా ఉన్నాయి. రెండు దేశాలు ఇప్పటికే పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఉగ్రవాద నిర్మూలనకు చేతులు కలిపాయి. దౌత్యపరంగానే గాక వ్యాపార, వాణిజ్య బంధాలు దృఢంగానే కొనసాగుతున్నాయి. అమెరికాకు చెందిన ప్రముఖ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్‌లోని వృత్తి, సాంకేతిక నిపుణులు అమెరికాకు వెళ్లి, అక్కడ స్థిరపడుతున్నారు. ఇరు దేశాలూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉమ్మడిగా పనిచేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్- విదేశీ ఉద్యోగ నియామకాలకు వ్యతిరేక విధానాన్ని అవలంబించారు. దాంతో, అక్కడ స్థిరపడిన భారతీయుల్లో తీవ్ర కలవరం రేగింది. మోదీ ఈ అంశాన్ని అమెరికాతో చర్చించినప్పటికీ, ట్రంప్ ధోరణిలో మార్పు రాలేదు. ఇది ఉద్యోగ రంగంపైనా ప్రభావం చూపుతుందనే ఆందోళన నెలకొంది. ఈ తరుణంలో అమెరికా ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సుకు భారత్‌నే వేదికగా ప్రకటించడం విశేషం.

అమెరికాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, సిలికాన్ వ్యాలీకి కొత్త కళ తెచ్చే సంకల్పంతో 2009లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇలాంటి సదస్సుల నిర్వహణకు చొరవ చూపారు. కాలుష్య నియంత్రణతో పాటు వ్యయాల్ని తగ్గించుకునేందుకు అమెరికా ఎక్కువగా దిగుమతులపై ఆధారపడుతోంది. దీంతో అక్కడ పారిశ్రామికాభివృద్ధి మందగించింది. ఎనిమిదేళ్ల క్రితం పారిశ్రామిక రంగంలో సాధికారత కోసం ఒబామా భారీ సదస్సు నిర్వహించారు. అది 2010 ఏప్రిల్‌నాటి మాట. అమెరికా కార్యక్రమం కావడంతో, ఎదురే లేకుండా పోయింది. ఆ దేశం ఆహ్వానం మేరకు వాషింగ్టన్‌లో జరిగిన మొదటి సదస్సుకు 100కి పైగా దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. పారిశ్రామికరంగంతోపాటు దాని అనుబంధ రంగాలపై విస్తృతంగా చర్చించి, ప్రపంచాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలపై అప్పట్లో నిర్ణయాలు తీసుకున్నారు. మొదటి సదస్సు విజయవంతమైన అనంతరం దాన్ని విశ్వవ్యాప్త కార్యక్రమంగా మార్చారు. తమ ఉనికిని చాటేలా అనుకూల దేశాల్లో దీన్ని నిర్వహించదలచారు. 2011లో టర్కీ, 2012లో యూఏఈ, 2013లో మలేసియా, 2014లో మొరాకో, 2015లో కెన్యా, 2016లో అమెరికాలో సదస్సులు జరిగాయి. వీటికి విశేష ఆదరణ లభించింది. వీటిలో తీసుకొన్న నిర్ణయాలు, కుదుర్చుకొన్న ఒప్పందాలు పూర్తిస్థాయిలో అమలయ్యాయి. సిలికాన్ వ్యాలీలో పెట్టుబడులు పెరిగాయి. పర్యావరణ, హరిత, శాంతి, ఆరోగ్య పరిరక్షణకు ప్రపంచ దేశాలు నడుంకట్టాయి. సదస్సుల ద్వారా టర్కీ, మొరాకో, కెన్యా, మలేసియా, యూఏఈలకు ప్రయోజనాలు సమకూరాయి. టర్కీ, యూఏఈలు ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కేందుకు ఇవి మార్గం చూపాయి. గత జూన్ 26న మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, ట్రంప్‌తో భేటీ అయ్యారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సును భారత్‌లో నిర్వహించడంపై ఆ సందర్భంగా అంగీకారం కుదిరింది. భారత్‌తో స్నేహ సంబంధాలతో పాటు పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పన వంటి అంశాల్లో పరస్పర సహకారానికి దోహదపడుతుందన్న భావనతో అమెరికాయే భారత్‌లో సదస్సు నిర్వహణకు ముందుకు రావడం ఆశావహ పరిణామం. అమెరికా ఆధ్వర్యంలో జరిగే సదస్సు సాధికారికంగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాల ప్రతినిధులు దీనికి హాజరవుతారు. దీంతో పాటు భారత్‌లో పెట్టుబడుల సమీకరణ, పరిశ్రమల స్థాపనకు వీలు కలుగుతుందని ప్రధాని ఆశిస్తున్నారు. అందుకు అనుగుణంగానే హైదరాబాద్ సదస్సు జరగనున్నది.


సదస్సు నిర్వహణపై మోదీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్ సదస్సుతో అమెరికాకు మరింత సన్నిహితం

అమెరికా ప్రతినిధులతో పాటు భారత్‌లోని నీతి ఆయోగ్‌కు దీని నిర్వహణ బాధ్యతల్ని అప్పగించారు. విస్తృత చర్చల అనంతరమే సదస్సుకు ఆతిథ్య వేదికగా హైదరాబాద్‌ను ఎంపిక చేశారు. ఔషధ రాజధాని, ఐటీ అభివృద్ధి, జీవశాస్త్ర, వైమానిక రంగాలకు గమ్యస్థానంగా ఉన్నందువల్ల హైదరాబాద్‌కే కేంద్రం, అమెరికా ఓటు వేశాయి. ఈ కార్యక్రమం ఇరు దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్నా, పూర్తిగా అమెరికా అజమాయిషీలోనే సాగుతుంది. విదేశాంగ కార్యదర్శి సహా పలువురు శ్వేతసౌధ ప్రముఖులు హాజరవుతారు. సదస్సులో పాల్గొనే ప్రముఖులను అమెరికా ఆహ్వానిస్తుంది. 170 దేశాలకు చెందిన 2000 మందికి దీనికి హాజరు కానున్నారు. రాయబారులు, మంత్రులతో పాటు ప్రముఖ పరిశ్రమలు, వాణిజ్య సంస్థల యాజమానులు, వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు రానున్నారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రభుత్వాల అధికారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఇందులో ఉంటారు. భేటీలు, కార్యశాలలు, బృంద చర్చలు, మార్గదర్శక విధానాలు (మెంటరింగ్), సంస్థాగత కార్యాచరణ (నెట్‌వర్కింగ్) పెట్టుబడి అవకాశాలు, నైపుణ్య, వాణిజ్య సంబంధాలపై సమావేశాలు, ప్రదర్శనలు (ఎగ్జిబిషన్స్), ఇతర కార్యక్రమాలు జరుగుతాయి. సదస్సులో నాలుగు ప్రధానాంశాలైన విద్యుత్, మౌలికవసతులు, ఆరోగ్యపరిరక్షణ, జీవశాస్త్రంతోపాటు ఆర్థిక సాంకేతికత, డిజిటల్ రంగం. మీడియా, వినోదరంగాల గురించీ చర్చిస్తారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సులో ఈసారి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. మహిళలకే ప్రాథమ్యం- అందరికీ సౌభాగ్యం నినాదాన్ని ఇచ్చారు. మహిళలు అభివృద్ధి చెందితే అన్ని దేశాలు పురోగమిస్తాయని పేర్కొన్నారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, సాధికారతతో మహిళలు ముందుకు రావాలని, అంతర్జాతీయ భద్రత, శాంతిసౌభాగ్యాలకు వారు పాటుపడాలంటూ సందేశం ఇచ్చారు.

ప్రధాన ఆకర్షణ ఇవాంకా



వచ్చే నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు పలువిధాల విశిష్టమైనది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనయ ఇవాంకా ఆ దేశ వాణిజ్య బృందంతో కలిసి దీనికి హాజరుకానుండటం ప్రత్యేక ఆకర్షణ. అగ్రదేశానికి చెందిన పరిశ్రమల వ్యవస్థాపకులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర పరిశ్రమలవారు కలిసి వేదికను పంచుకునే అరుదైన అవకాశం ఇది. పెట్టుబడుల సమీకరణ, ఉపాధి కల్పనకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

అపూర్వ అవకాశం

అమెరికా ఆధ్వర్యంలో జరిగే ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సుపై భారత్‌కు ఎన్నో ఆశలున్నాయి. దీనివల్ల అమెరికాతో సంబంధాలు మరింత దృఢమవుతాయి. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అవకాశాలు పెరుగుతాయి. అమెరికాతో పాటు వివిధ దేశాలూ భారత్‌లో పెట్టుబడులపై ఆసక్తి చూపవచ్చు. అమెరికాతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు సదస్సు దోహదపడుతుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఆయా రాష్ట్రాలకు అనుకూలమైన రీతిలో చర్చలు జరుగుతాయి, ఒప్పందాలు కుదురుతాయని అనుకొంటున్నారు. భారతీయ పారిశ్రామికవేత్తలకు ఇది స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తుందనడంలో వేరు మాటలేదు. దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలనుంచి పోటీ ఎదురవుతున్నప్పటికీ హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు నిర్వహణకు అవకాశం దక్కించుకుంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కూ లబ్ధి చేకూర్చే పరిణామమిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎప్పటినుంచో అమెరికాతో మంచి సంబంధాలున్నాయి. అప్పటి ఆ దేశ అధ్యక్షులు జార్జి బుష్, బిల్ క్లింటన్, ఒబామా వంటి వారు హైదరాబాద్‌ను సందర్శించారు. ప్రసిద్ధ అమెరికా ఐటీ కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటివి హైదరాబాద్‌లో తమ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. అమెరికా కంపెనీలు తమ వైమానిక పరిశ్రమలనూ ఇక్కడ స్థాపించాయి. వివిధ రంగాల్లో అమెరికా నుంచి తెలంగాణ, ఏపీలు సాయం పొందుతున్నాయి. సులభతర వాణిజ్య నిర్వహణలో రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ సానుకూలతను ఆలంబనగా చేసుకుని సదస్సు ద్వారా ఈ రాష్ట్రాలు ఎంతో ప్రయోజనం పొందే వీలుంది. పారిశ్రామికంగా పురోగమించే అవకాశం ఉంది. సదస్సు కారణంగా హైదరాబాద్‌కు విశ్వవ్యాప్త గుర్తింపు వస్తుందని తెలంగాణ ప్రభుత్వం నమ్ముతోంది. భారత్‌లో, అందునా హైదరాబాద్‌లో ఇలాంటి గొప్ప సదస్సును నిర్వహించేందుకు లభించిన స్వర్ణావకాశాన్ని భారత ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. ఇరు దేశాల మధ్య సుహృద్భావానికి, మరింత సన్నిహిత సంబంధాలకు మేలుబాటలు పరవాలి.

– ఆకారపు మల్లేశం

సాహితీ మూర్తి - చైతన్య దీప్తి

హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనపై ప్రజానీకానికి ఎంత ఆగ్రహం ఉన్నా బహిరంగంగా తిరగబడటానికి అవకాశంలేని రోజులవి. అందుకే రాజకీయ లక్ష్యాలు సాధించుకోవడానికి, భాష, సాహిత్య పరిరక్షణ రూపంలో తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. ఆ చారిత్రక దశలో ఉండటం ఎవరికైనా మహదవకాశం. దాన్ని వినియోగించుకోవడానికి కార్యదక్షత అవసరం. ప్రజా కంటకంగా తయారైన పాత వ్యవస్థను కూల్చేసి కొత్త వ్యవస్థ నిర్మించే క్రమంలో అనేక రంగాల్లో ఏక కాలంలో కృషి అనివార్యం అవుతుంది. ఒక్కో రంగానికి కొందరు పని చేయడం ఒక పద్ధతి. అన్ని రంగాల్లోనూ పని చేసి ప్రతిభను ప్రదర్శించడం మరో పద్ధతి. దేవులపల్లి రామానుజరావు రెండోకోవకు చెందినవారు. నిర్దిష్టమైన చారిత్రక దశలో జీవించిన దేవులపల్లి, పైకి సాహిత్య రంగంలో ప్రసిద్ధులుగా కనిపిస్తారు. కానీ అంతర్గతంగా ఆయన అనేక రంగాలలో కృషి చేసిన కార్యదక్షుడు. ఆ రోజుల్లో ఉద్ధృతంగా సాగిన గ్రంథాలయోద్యమం, ఆంధ్రోద్యమం, విశాలాంధ్రోద్యమం, రాజకీయాలు, సాహిత్యం, వ్యవస్థల నిర్మాణం మొదలైన అన్ని రంగాలలోనూ కృషితో పాటు- చేసిన ప్రతి పనిలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు.

చిరునామా... సారస్వత పరిషత్

అందరి జీవితాలూ నిరుపేద కుటుంబంలో ప్రారంభం కానక్కరలేదు. సంపన్నులలో కూడా సామాన్య ప్రజలపై ఆపేక్ష ఉన్న వారు ఉండకూడదన్న నియమం లేదు. దేవులపల్లి రామానుజరావు వరంగల్ జిల్లా బొల్లికుంటలో 1917 ఆగస్టు 25వ తేదీన సంపన్న కుటుంబంలోనే జన్మించారు. విద్యాభ్యాసం అంతా ఆంగ్లంలోనే సాగింది. డిగ్రీలో చేరేదాకా విద్యాభ్యాసం అంతా వరంగల్‌లోనే. ఆ తరవాత నిజాం కళాశాలలో బి.ఎ. పూర్తిచేసి, మధ్యలో వ్యవసాయం చూసుకోవాలా, న్యాయశాస్త్రం అభ్యసించాలా అన్న మీమాంసలో కొంతకాలం గడిపి నాగపూర్‌లో ఎల్.ఎల్.బి. చదివారు. ఆ విరామ సమయంలోనే ఆయన తన రచనా శక్తికి పదును పెట్టుకున్నారు. ఆ రోజుల్లో జాతీయోద్యమంలో భాగస్వాములైన విద్యావంతుల్లో ఎక్కువమంది న్యాయవాదులే. కాని రామానుజరావు న్యాయశాస్త్రం చదివినా ఆ వృత్తి చేపట్టలేదు. ఆ మాట కొస్తే ఆయన ఏ ఉద్యోగమూ చేయలేదు. జీవితమంతా రాజకీయ, సాహిత్య కార్యకలాపాలలోనే గడిచింది. నిజాం కళాశాలలో చదువుతున్నప్పుడే ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి వారితో పరిచయం కలిగింది. హైదరాబాద్ వచ్చినప్పుడల్లా వారిని కలవడం పరిపాటిగా ఉండేది.

1942లో ప్రారంభమైన 'తెలంగాణ' పత్రికలో చేరే అవకాశం వచ్చింది. కాని అప్పటికే నాగపూర్‌లో న్యాయశాస్త్ర విద్య అభ్యసించడానికి వెళ్లినందువల్ల ఆ ఉద్యోగంలో చేరలేదు. నాగపూర్‌లో ఉన్నప్పుడు ఆయన ఒక వైపు సాహితీ సృజన కొనసాగిస్తూనే మరోవైపున జాతీయ ఉద్యమం ప్రభావానికి లోనయ్యారు. వార్ధాలో గాంధీజీ దర్శనంతో జాతీయోద్యమంలో భాగస్వామి కావాలన్న సంకల్పం బలపడింది. మరోవంక, పత్రికలకు వ్యాసాలు రాసేవారు.

హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనలో పది శాతం పౌరులు మాట్లాడే ఉర్దూనే అందలం ఎక్కించారు, అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే తెలుగును చిన్న చూపు చూశారు. అప్పటికి హైదరాబాద్‌లో తెలుగువారికి ఉన్న ఏకైక సంస్థ 1901లో ఏర్పడిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర గ్రంథాలయం మాత్రమే. ఇది కేవలం గ్రంథాలయంగా కాకుండా ఒక సాంస్కృతిక కేంద్రంగా ఉండేది. 1921లో కార్వే పండితుడి అధ్యక్షతన వివేకవర్ధని కళాశాలలో జరిగిన సమావేశంలో తెలుగులో ప్రసంగించిన టేక్మాల్ రంగారావుకు జరిగిన అవమానం ఫలితంగా ప్రారంభమైన ఆంధ్ర జన సంఘం, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి బీజం వేసింది. ఇదే క్రమంగా ఆంధ్ర మహాసభగా రూపాంతరం చెందింది. తెలుగు పరిరక్షణకు 1943 మే 23న ఆంధ్ర సారస్వత పరిషత్ ఏర్పడే నాటికి రామానుజరావు ఉత్సాహం ఉరకలెత్తుతున్న 26 ఏళ్ల యువకులు. అప్పటికే ఆయన వరంగల్‌లోని శబ్దానుశాసన గ్రంథాలయ కార్యదర్శి. ఆంధ్ర సారస్వత పరిషత్ మొదటి వార్షిక సభలు వరంగల్‌లో జరిగాయి. ఆ సభల్లో రామానుజరావు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సభలకోసం వరంగల్ కోటలో వేసిన పందిళ్లను రజాకార్లు తగలబెట్టారు. అయినా సభలు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో రామానుజరావు పాత్ర కీలకమైంది. 1946లో ఆయన 'శోభ' పత్రిక ప్రారంభించి సంపాదకులుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలోని కొన్ని భాగాలు ఈ పత్రికలోనే ప్రచురితమైనాయి. ప్రతాపరెడ్డి మరణం తరవాత ఈ గ్రంథాన్ని సారస్వత పరిషత్తే ప్రచురించింది. అప్పటికి రామానుజరావుకు ఆంధ్ర సారస్వత పరిషత్ మరో చిరునామా అయింది. 1953లో అధ్యక్షులైన దగ్గర నుంచి ఊపిరి విడిచేదాకా పరిషత్తుకు ఆయనే సర్వస్వం.

ఈ పరిణామాలన్నీ రామానుజరావు రాజకీయ, సామాజిక కార్యకలాపాలకు పూర్వరంగాన్ని సమకూర్చాయి. తెలంగాణ విమోచనోద్యమానికి వెన్నెముకగా నిలిచిన 'గోలకొండ పత్రిక'తో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. చాలా ఏళ్ల పాటు ఆ పత్రికకు సంపాదకీయాలు రాశారు. ఆ రోజుల్లో రామానుజరావుకు జాతీయ స్థాయిలోనూ, తెలుగు నేలలో ఉన్న ప్రముఖులందరితోనూ పరిచయాలుండేవి. ఆయనకు తెలియని వారెవరో, సన్నిహితులు కాని వారెవరో చెప్పడమే తేలిక.



దేవులపల్లి రామానుజరావు శత జయంత్యుత్సవం నేడు



సామాజిక రాజకీయ రంగాలలో రామానుజరావు వీరంగం తొక్కినవారు కాకపోయినా దీక్షా దక్షతలతో వ్యవహరించారు. ఏ రంగంలో పని చేసినా ఆయన కర్తవ్య నిష్ఠ అపూర్వమైంది, అనితర సాధ్యమైంది. ఆయన రాజకీయాలు కాంగ్రెస్‌తో పెనవేసుకుపోయినా అప్పుడు బలంగా ఉన్న కమ్యూనిస్టు నాయకులందరూ వారికి ఆప్తమిత్రులే. ప్రత్యర్థిపక్షానికి చెందినవారిలోనూ మంచిని చూడగలిగే ఔదార్యం ఆయనలో ఎక్కువ. ఆయనకు సంబంధంలేని రంగమే లేదు. హైదరాబాద్ జనరల్ కో ఆపరేటివ్ ట్రేడింగ్ సొసైటీ డైరెక్టర్‌గా, హైదరాబాద్ కో ఆపరేటివ్ జనరల్ ఇన్సూరెన్స్ సొసైటీ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించడమే దీనికి ఉదాహరణ.

నిరాడంబర జీవనం

స్వభావ రీత్యా ఆయన సంప్రదాయవాది అయినా ఆచరణలో ఆధునిక భావాలు ఉన్నవారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశం సాధించే విజయాలు చూసి మురిసిపోయేవారు. తెలుగు కోసం ఎంతగా పరితపించారో ఉర్దూ మీద కూడా ఆయనకు అంతే అభిమానం ఉండేది. 'అంజుమన్ ఎ తరక్కీ ఉర్దూ'లో కార్యవర్గ సభ్యుడిగా ఉండేవారు. ఉర్దూ అకాడమీతో సంబంధం ఉంది. తెలుగు సాహిత్య చరిత్రను ఉర్దూలో రాశారు. నిజాం హయాములో ఉర్దూ సాహిత్యం ఏమాత్రం వృద్ధి చెందలేదని మఖ్దూం లాంటి కవులు నిజామ్‌ను వ్యతిరేకించి రాణకెక్కారని మనసులో మాట చెప్పేవారు. ఆయన మాట ఒక్కొక్కసారి కఠినంగా అనిపించేది. కొన్ని సార్లు ఆశ్రిత పక్షపాతం చూపినట్లు కనిపించేది. ఆయన రాజకీయంగా అధికార పార్టీకి సన్నిహితంగా ఉన్నట్లు భావించడానికి ఆస్కారం ఉన్నా తన పలుకుబడిని ఏనాడూ సొంత వ్యవహారాలకు వాడుకోలేదు. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకే తన చాకచక్యాన్ని, ప్రతిష్ఠను వినియోగించారు.

రామానుజరావు కలిగిన కుటుంబంలో పుట్టినా నిరాడంబరంగానే జీవించేవారు. ఆయన వరంగల్‌లో ఉన్నప్పుడు, హైదరాబాద్ చేరిన తరవాత కడదాకా రిక్షాలోనే తిరిగేవారు. మొదట్లో లాగూ, షేర్వానీ వేసుకునేవారు. ఆ తరవాత ధోవతి, కమీజులోకి మారిపోయారు. ఆయనకు ఓ అలవాటు ఉండేది. రిక్షాలో వెళ్తూ కుడి చేతి వేళ్లను ఎవరినో పిలుస్తున్నట్లు కదిలించేవారు. అప్పుడప్పుడు కుడి కన్ను కింది భాగాన్ని చూపుడు వేలితో రుద్దేవారు. ఆ అలవాట్లు విలక్షణంగా ఉండేవి.

– ఆర్వీ రామారావ్

గణపతి తత్త్వం

ఆనందం, జ్ఞానం, ఐశ్వర్యం, బలం- ఈ నాలుగు తత్త్వాల ఈశ్వరత్వమే గణపతి స్వరూపం. ఆ స్వామి ఆరాధన వల్ల ఆ నాలుగూ లభిస్తాయని పురాణాలు, ఆగమాలు వివరిస్తున్నాయి. పృథ్వీవాసులందరికీ భూతత్త్వమే ప్రధానం. యోగ, ఉపాసన తత్త్వాల పరంగా భూ రూపమైన పరమేశ్వర తత్త్వమే గణేశుడు. మిగిలిన నాలుగింటినీ కలబోసుకున్న అవనీ తత్త్వమూర్తిగా దైవాన్ని భావించడమే మట్టి గణపతి రూపంలోని ప్రత్యేకత.

నాలుగు దిక్కుల వ్యాపకత్వమే 'చతుర్భుజం విష్ణుం'. ఏ వర్ణమూ లేని ఆకాశ తత్త్వమే 'శుక్లాంబరం ధరం'. శుద్ధ జ్ఞానమే 'శశి వర్ణం'. ఆనందానుగ్రహ భావమే 'ప్రసన్న వదనం'.

ప్రకృతి పురుషుల ఏకతత్త్వమే పార్వతీ శంకరుల తనయుడిగా వ్యక్తమైంది. వేద, పురాణ, ఆగమ, కావ్య, సంగీత, నాట్య, శిల్ప, చిత్రకళ రూపాల్లో గణేశుడికి అత్యంత ప్రాధాన్యం ఉంది.

తెలివితేటలకు, నాయకత్వ లక్షణాలకు గణేశుడు అధి దైవం. ఉపాసన శాస్త్రాల్లో బాల గణపతి నుంచి మహా గణపతి వరకు అనేక రూపాల్ని వర్ణించారు. దేవ, దానవ, మానవ, పశు, పక్షి, వృక్ష- ఇత్యాది భిన్నజీవుల గణాల్ని పరిపాలించే ఏక ఈశ్వర తత్త్వమే 'గణపతి' అని రుషుల తాత్పర్యం.

గణపతి తత్త్వాన్ని ఆధారం చేసుకొని, అత్యంత విస్తారమైన సంప్రదాయం ఉంది. శైవ వైష్ణవ శాక్తేయాల్లాగే 'గాణపత్యం' ఒక విశిష్ట విశాల శాస్త్రం. ఉన్న ఒకే ఈశ్వరుణ్ని భిన్న నామ రూపాలతో ఆశ్రయించి కొలుచుకొనే సమున్నత సంస్కృతిలో- ఆ పరమేశ్వరుడి గణేశ రూప లీలావైభవాలు బహువిధాలు. లోతైన తాత్త్వికత, యోగ రహస్యాలు వినాయకుడి విశేషాల్లో దాగి ఉన్నాయి.



వర్షాలకు భూమి తడిసి, పూర్ణంగా అంకురించి ఎదిగే దశ- భాద్రపదం. అది సత్ఫల కారిణి కావాలన్న ఒక ఆకాంక్ష... ఈ మాసంనాటి గణేశ పూజలో అంతర్లీనమైంది. శ్రావణ మాసంలో వరలక్ష్మి, భాద్రపదంలో వరద వినాయక చతుర్థి. గాణపత్యం సంప్రదాయంలో శుక్ల చవితులకు 'వరద చవితి' అని పేరు. ఏడాదిలో పన్నెండు చవితి తిథులు హేరంబ పూజకు ప్రాధాన్యాలు. వాటిలో ముఖ్యం ఈ శుద్ధ చవితి. అభీష్ట సిద్ధులే వరాలు. వాటిని ప్రసాదించే స్వామి 'వరదుడు'. వరద మూర్తయే నమః అని 'అథర్వ శీర్షోపనిషత్తు' చెబుతుంది. సిద్ధే వరం కాబట్టి, ఆయన సిద్ధి గణపతి.

ఒక కార్యానికి ఐశ్వర్యం, దాని ఫలమైన 'సిద్ధి' మాత్రమే. సిద్ధి కోసమే ఏ పనైనా! కార్యానికి ఆటంకాల్ని తొలగించే సిద్ధి- గణేశ శక్తి. ఆ సిద్ధియే అసలు లక్ష్మి (సంపద). అన్నింటి కంటే గొప్ప లక్ష్మి అయిన 'సిద్ధి' స్వామి శక్తి కావడంతో- ఆ శక్తిని సిద్ధ లక్ష్మీదేవిగా, ఆయనను లక్ష్మీ గణపతిగా ఉపాసిస్తారు.

భారతదేశంలో ఆసేతు శీతాచలమూ విధిగా పూజించే ఈ గణనాయకుడు- దేశ 'జనగణ'ముల 'మన'సులకు 'అధి నాయకుడు'. 'భారత భాగ్య విధాత'గా అనుగ్రహించాలని ప్రార్థిద్దాం. పంజాబ్, సింధు, గుజరాత్, మరాఠా మొదలుకొని- వింధ్య, హిమాచల, యమున, గంగాది ప్రాంత వాసులందరూ ఈ చతుర్థీ ఉత్సవాల్ని సంబరంగా జరుపుకొంటారు.

వేదాల ప్రకారం, యజ్ఞ తత్త్వమే గణపతి. దేవత, మంత్ర, ద్రవ్య, క్రియ- అనే నాలుగింటితో కూడినదే యజ్ఞం. ఈ నాలుగు గణాల నియామకుడైన యజ్ఞ రూపుడు 'గణపతి'. యజ్ఞంలో ఉపయోగించే వేదాలు నాలుగు. అగ్నిగుండం చతురస్రం- చతుర్భుజ గణపతి స్వరూపం. ఆయన నాలుగు సంఖ్య ప్రధానంగా కలిగిన 'చవితి' పూజలవాడు.

యోగపరంగా మొదటి చక్రమైన మూలాధారంలో గల ఈశ్వరశక్తి, వేదపరంగా శబ్దాలన్నింటికీ మొదటిదైన ప్రణవ శక్తి- గణపతి. అందుకే ఆయన తొలి దైవం.

భారతీయుల సమైక్యానికి గణపతి ఉత్సవాలను ప్రధాన భూమికగా ఎంచుకున్న తిలక్ వంటి మహాత్ముల భావన సాకారమై- భిన్న 'గణా'లవారిని 'ఏక' భావనా సూత్రంతో సమన్వయపరచే గణపతి తత్త్వం దేశ హితాన్ని సిద్ధింపజేయాలి!

– సామవేదం షణ్ముఖశర్మ


Ganesh Utsav
గణనాథుని ఆశీస్సులతో...
...గణనీయమైన ఆఫర్లు మీ TMCలో!
విస్తృత శ్రేణి... ప్రత్యేక ధరలు & అతి తక్కువ EMIలతో...
TMC
Touching Homes & Hearts
ఈ ఆఫర్ 3 రోజులే
కేవలం 1 రూపాయి చెల్లించండి.
ఏదైనా ప్రోడక్టును ఇంటికి తీసుకెళ్లండి. మిగిలిన మొత్తం నెలసరి సులభ వాయిదాలలో చెల్లించండి.
(On select brands & models only.)
Maruti Vitara Brezza గెల్చుకోండి
విలువ: రూ॥7,52,478/-
(Ex-showroom) (Mdl. LDi, Metallic)
ఈ ఆఫరు 4 సెప్టెంబర్ 2017 వరకే
(రూ॥1000/-, ఆపై కొనుగోలుపై మాత్రమే)
డ్రా తేది: గురువారం, 7 సెప్టెంబర్ 2017
వేదిక: TMC బేగంపేట షోరూం
సమయం: సా॥ 7 గంటలకు
మా కస్టమర్లందరికీ ఇదే మా సాదర ఆహ్వానం.
TMC ఇప్పుడు BHEL & వనస్థలిపురంలో కూడా.
మా కస్టమర్లు, మాన్యుఫ్యాక్చరర్లు, శ్రేయోభిలాషులు అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు.
"BEST PRICE GUARANTEED @ TMC." Please check before you buy anywhere else.
Refrigerator's Range & EMI Starts From:
FREE Assured Gift on Frost-free worth Rs.660/-
Direct Cool: Rs.12,990/- EMI: Rs.1,083/-
Frost-free: Rs.20,590/- EMI: Rs.1,716/-
Side-by-Side: Rs.85,000/- EMI: Rs.7,083/-
LG SAMSUNG Whirlpool Haier Panasonic OGENERAL
AC's Range & EMI Starts From:
3 Star 1.5 Ton AC: Rs.27,990/- EMI: Rs.2,333/-
5 Star 1.5 Ton AC: Rs.32,490/- EMI: Rs.2,708/-
3 Star 2 Ton AC: Rs.42,990/- EMI: Rs.3,583/-
LG SAMSUNG LLOYD Carrier Midea Panasonic Whirlpool OGENERAL
LED TV లపై ప్రత్యేక ఆఫర్
42 LED TV for Rs.27,990/-
EMI: Rs.2,333/-
USB 2 USB copy; HDMI; 8W RMS; Full HD
49 LED TV for Rs.39,990/-
EMI: Rs.3,333/-
1+4 Years Warranty
LG SAMSUNG SONY Panasonic LLOYD Haier
Small Appliances Range Starts From:
Mixer Grinder: Rs.1,990/-
Wet Grinder: Rs.4,990/-
Geyser: Rs.6,990/-
Water Purifier: Rs.9,490/-
LG AO Smith USHA Panasonic Ultra Maharaja hindware moonbow
Washing Machines Range & EMI Starts From:
Semi Automatic: Rs.7,990/- EMI: Rs.666/-
F/A Top Load: Rs.13,990/- EMI: Rs.1,166/-
F/A Front Load: Rs.19,990/- EMI: Rs.1,666/-
LG SAMSUNG Whirlpool IFB BOSCH Haier LLOYD Midea
Images shown are for illustration purposes only & actual products may vary.
BAJAJ FINSERV CAPITAL FIRST
Finance is at the sole discretion of the finance company
Processing charges extra
ఆకర్షణీయమైన మార్పిడి సదుపాయం
For Service & Repairs THE Touch Home Express Tel: 44 66 44 66
BEGUMPET - OPP. OLD AIRPORT
Abids Opp. Chermas
A S Rao Nagar Main Road
BHEL Beside State Bank of India
Kompally Near Suchitra Junction
Kukatpally Besides Bramarambika Theatre
L.B. Nagar Opp. RR Dist. Court
Malakpet Main Road
Putlibowli Municipal Complex
Toli Chowki Besides Micro ENT Hospital
Vanastalipuram Near Rainbow Children Hospital
Guntur • Rajahmundry • Tirupathi • Vijayawada (M.G. Road & Auto Nagar) • Vizag (Dondaparthy & Gajuwaka) • Warangal
www.tmcelectronics.co.in I No. 1 Retailer for Consumer Electronics and Home Appliances in A.P. & Telangana
SAMSUNG LG SONY Panasonic LLOYD Skyworth Whirlpool IFB BOSCH Carrier Midea OGENERAL Haier AO Smith morphy richards USHA Maharaja Ultra hindware CLIX elica Preethi lenovo hp oppo


PIXMA
Quality. Promised.
Canon
Delighting You Always
Now 18,000* PRINTS
Up to A4 Borderless Photo Printing
Integrated Ink Tank Compact Design
₹0.08# for Black ₹0.21# for Colour
Direct Mobile Printing *available on G3000
All-In-One Printers PRINT, SCAN, COPY
PIXMA G-3000 MRP ₹15495.00/U incl. of all taxes
PIXMA G-2002 MRP ₹12995.00/U incl. of all taxes
PIXMA G-2000 MRP ₹11995.00/U incl. of all taxes *promotional offer
CANON PIXMA G-SERIES
6,000 pages yield per unit of black bottle
Hyderabad: Abhishek Computers And Laptop: 9030466697; Systron Systems: 9848178932; Arun Computer: 9866206183; Compage Computers Pvt. Ltd.: 9849006438; Dhriti Computers & Peripherals: 9848046123; Computer Creation: 9866227079; Devi Sri Computers: 9849007319; Sree Techno Systems: 9849750678; Orient Business Services Pvt. Ltd.: 9949489564; Youdan Marketing: 9849770066; Shivam Computers: 9848436205; Global India: 8465943013; S.V. Electronics Ltd.: 9849510573; Tejas Systems: 9000100182.



హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నేతలు

'పంచాయతీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన ఉద్యోగులు చేపట్టారు. పంచాయతీల్లో కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, స్వీపర్లు, కామాటీలు, ఎలక్ట్రీషియన్లు, పంపు ఆపరేటర్లు, అటెండర్లు తదితర సిబ్బంది తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరానికి చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో సమావేశమై తొలుత తమ ఇబ్బందులపై చర్చించారు. అక్కడి నుంచి పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు శాంతియుత ర్యాలీ చేపట్టారు. కొద్ది దూరం ర్యాలీగా వెళ్లి అనుమతి లేకపోవడంతో వాహనాల్లో కమిషనరేట్ చేరుకుని అక్కడ ధర్నా చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.భూమన్నయా.దవ్, రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల నర్సింహులు మాట్లాడుతూ.. సిబ్బందికి ప్రభుత్వం ద్వారా కనీస వేతనం ఇవ్వడం లేదని, తమ జీవితాలు దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కారోబార్లకు రూ.15వేలు, ఇతర సిబ్బందికి రూ.10,500 చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు తమ సమస్యలపై సీఎంకు పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు

నీట్‌తోనే సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ

- కౌన్సెలింగ్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేసిన హైకోర్టు
- ఇతర రాష్ట్రాల్లో కేటాయించిన సీట్ల రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆదేశం
- ప్రాంతీయ అసమానతల తొలగింపునకే 371-డి
- సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లకు వర్తింపజేయలేమని వెల్లడి

ఈనాడు – హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లోని ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలో డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని నీట్ ద్వారానే చేపట్టాలని ఉమ్మడి హైకోర్టు బుధవారం తేల్చిచెప్పింది. రెండు యూనివర్సిటీల్లో నీట్ ద్వారా సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీపై ఈ నెల 17న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. కొందరి ప్రయోజనాల కోసం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి అసంఖ్యాక మందికి నష్టం కలిగించలేమని వ్యాఖ్యానించింది. ఈ కోర్సుల్లో ఇతర రాష్ట్రాల్లో సీట్లు పొందిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు 18న జారీ చేసిన రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీకి 371-డిని వర్తింపజేయలేమని స్పష్టం చేసింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో 371-డికి సంబంధించి తలెత్తే పలు ముఖ్యమైన ప్రశ్నలను తుది విచారణలో తేలుస్తామంటూ విచారణను సెప్టెంబరు 11కి వాయిదా వేసింది. 371-డి అమల్లో ఉండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధిలోని ఎన్టీఆర్, కాళోజీ యూనివర్సిటీల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని జాతీయ కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మే 4న ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాలు చేస్తూ డాక్టర్ బి.సతీష్‌కుమార్, మరో 12 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు నీట్ కింద కేటాయించిన సీట్లను తిరస్కరిస్తూ ఈ నెల 18న ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ మరో 5 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిపై సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ నెల 17న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది.

12 మంది కోసం..: 371డి అమలు చేయాలంటూ 12 మంది పిటిషన్లు దాఖలు చేయడంతో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించడం వల్ల ఎక్కువ మందికి నష్టం కలిగే అవకాశం ఉందని ధర్మాసనం తెలిపింది. 'మధ్యంతర ఉత్తర్వుల వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఇక్కడ తలుపులు మూసేశాం. చర్యకు ప్రతి చర్య ఉంటుందన్న న్యూటన్ సిద్ధాంతంలాగా ఇక్కడ ప్రవేశాలు నిరాకరించడంతో ఇతర రాష్ట్రాల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో తెలుగు విద్యార్థులకు కేటాయించిన సీట్లను రద్దు చేశారు. అక్కడ సీట్లు కోల్పోయినవారూ ఇక్కడ పిటిషన్లు దాఖలు చేశారు. అంటే ఇక్కడున్న సీట్లన్నీ తమకే కావాలి, ఇతర రాష్ట్రాల్లో సీట్లలో వాటా కావాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. సాంకేతికంగా మా మధ్యంతర ఉత్తర్వులు సబబే అయినప్పటికీ ఇతర రాష్ట్రాల్లో తెలుగు విద్యార్థులకు ప్రవేశాలు కోల్పోయేలా చేయాలన్నది వాటి ఉద్దేశం కాదు. మా మధ్యంతర ఉత్తర్వుల ప్రభావాన్ని అప్పట్లో గుర్తించలేకపోయాం. వీటిని కొనసాగించాలని నీట్‌ను ఆదేశిస్తే ఇతర రాష్ట్రాల్లో తెలుగు విద్యార్థుల ప్రవేశాల రద్దుతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. 371-డిని అమలు చేయాలన్న ఉత్తర్వులను కొనసాగిస్తే ఇతర రాష్ట్రాల్లో రద్దు నిర్ణయాన్ని కూడా సమర్థించాలి. దీనివల్ల ఎక్కువ నష్టం ఉంటుంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి పోస్టులుగా విభజించారు. అయితే అఖిల భారత సర్వీసు ఉద్యోగులకు ఇది వర్తించదు. భారతీయ వైద్యమండలి (ఎంసీఐ) చట్టానికి సవరణలు, అనంతరం నిబంధనలకు సవరణల నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లను కూడా అఖిల భారత సర్వీసుల కిందనే పరిగణించాల్సి ఉంటుంది. అందువల్ల వీటికి రాష్ట్రపతి ఉత్తర్వులను వర్తింపజేయడం సరికాదు. 40 ఏళ్ల క్రితం ఏ ప్రయోజనం కోసమైతే పోరాడారో దానివల్ల ఇప్పుడు తెలుగు విద్యార్థులు బాధితులుగా మారారు. 371డి అమలు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో లభించే సీట్ల కన్నా దేశవ్యాప్తంగా తెలుగువారు కోల్పోయే సీట్లే ఎక్కువగా ఉంటాయి. అందువల్ల 371డి వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. కాబట్టే మధ్యంతర ఉత్తర్వులను తొలగించి దేశవ్యాప్తంగా తెలుగు విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నాం.

ప్రాంతీయ అసమానతలు తొలగించడానికే 371డి

371డి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ అసమతుల్యతను తొలగించడానికే. అంతేగానీ ఏపీలోని ప్రజల మధ్య, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోని ప్రజల మధ్య అసమానతలను తొలగించడానికి కాదు. ఒక ఇంట్లో విభజన నిమిత్తం గోడ కట్టి దాన్ని కాంపౌండ్‌గా మార్చి బెర్లిన్ గోడంత పటిష్ఠంగా చేయడానికి వీల్లేదు. 371డి ద్వారా జాతీయ స్థాయిలో రక్షణ కల్పించాలన్నది పార్లమెంట్ ఉద్దేశం కాదు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1956 నుంచి 1969 వరకు చేస్తూ వచ్చిన డిమాండ్‌ను తోసిపుచ్చి.

తెలంగాణ ప్రాంత ప్రజల అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాల్లో కొంత రక్షణ కల్పించడానికే 371డిని తీసుకువచ్చింది. ఇది తాత్కాలికమేనని అప్పట్లో పేర్కొంది. అయితే 371డి తీసుకొచ్చినా ఉద్యమాలు కొనసాగి 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో భారీ ప్రయోజనం పొందాక రాయితీ కింద పొందిన చిన్నపాటి లబ్ధి దానంతటే పోతుంది. సందీప్ కేసులో సుప్రీం కోర్టు 371డిని సమర్థించినప్పటి పరిస్థితులకూ ఇప్పటికీ తేడా ఉంది. ఎంసీఐ చట్టానికి సవరణలు, అనంతరం జాతీయ స్థాయిలో ఏకరూప పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్న నిబంధనలు తీసుకురావడంతోపాటు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనందున దీన్ని అమలు చేయాలని చెప్పలేం' అని హైకోర్టు పేర్కొంది.

నంద్యాలలో కాల్పుల కలకలం

- తెదేపా నాయకుడిపై వైకాపా వర్గీయుల రాళ్ల దాడి
- గాలిలోకి కాల్పులు జరిపిన అంగరక్షకుడు
- పోలీసుల రాకతో కత్తి పట్టి ప్రతిసవాలుకు దిగిన అభిరుచి మధు





రాళ్లు రువ్వుతున్న శిల్పా వర్గీయులు ★ కత్తి పట్టుకుని సవాలు విసురుతున్న అభిరుచి మధు

నంద్యాల, న్యూస్‌టుడే: నంద్యాల శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసిందని అందరూ ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో గురువారం చోటుచేసుకున్న కాల్పుల సంఘటనతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తెదేపా, వైకాపా నాయకుల మధ్య చిన్న గొడవ చినికిచినికి గాలివానగా మారింది. స్వల్ప వ్యవధిలోనే వాగ్వాదం, రాళ్లు విసురుకోవడం, కత్తి పట్టుకుని మీదకు ఉరకడం, గాలిలోకి కాల్పులతో పరిస్థితి అదుపుతప్పింది. స్థానిక 35వ వార్డు వైకాపా కౌన్సిలరు మహబూబ్‌బీ భర్త మహబూబ్ బాషా అనారోగ్యంతో మృతి చెందారు. బాషా కుమారుల్లో ఒకరు తెదేపాలో ఉండగా, భార్య వైకాపాలోనే కొనసాగుతున్నారు. బాషా మృతదేహాన్ని సందర్శించేందుకు వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం స్థానిక సలీంనగర్‌లోని కౌన్సిలరు ఇంటికి వచ్చారు. ఆయన తిరిగి వెళ్తున్నప్పుడు, తెదేపా నాయకుడు అభిరుచి మధు తన వాహనంలో బాషా ఇంటికి బయల్దేరారు. ఇరు వర్గాల వాహనాలు ఎదురెదురయ్యాయి. ఇరుకైన మార్గం కావడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది తలెత్తింది. వాహనాలు రోడ్డు మీదనే ఆగిపోయాయి. శిల్పా చక్రపాణిరెడ్డి సమీప బంధువులు జగదీశ్వరరెడ్డి, ఆదిరెడ్డి, మరికొందరు మధు కారు వద్దకు వచ్చి వెనుదిరిగి వెళ్లాలని కోరారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మధు కారుపై శిల్పా వర్గీయులు రాళ్లు రువ్వారు. ఆయనను బయటకు లాగి కొందరు పిడిగుద్దులు కురిపించారు. వెంటనే మధు గన్‌మెన్ బయటకు వచ్చి గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులు రావడంతో వాహనంలో నుంచి దిగిన మధు పక్కనే ఉన్న కొబ్బరి బొండాల కత్తిని తీసుకుని వైకాపా నాయకులు ఉన్నవైపు చొచ్చుకెళ్లారు. కత్తి తిప్పుతూ ప్రతి సవాలు చేశారు. పోలీసులు సముదాయించినా కొద్దిసేపు మాట వినని ఆయన మాటల యుద్ధం కొనసాగించారు. పోలీసులు నచ్చజెప్పి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడిలో మధు స్వల్పంగా గాయపడ్డారు. విషయం దావానలంలా వ్యాపించడంతో ఇరువర్గాల వారు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. నంద్యాలలో గురువారం జరిగిన ఘర్షణ.. ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధం లేదని స్థానిక ఓఎస్డీ రవిప్రకాశ్ పేర్కొన్నారు. ఇది అకస్మాత్తుగా జరిగిన సంఘటన అన్నారు. ఉభయ వర్గాలు పరస్పరం చేసుకున్న ఫిర్యాదుల మేరకు కేసులు నమోదయ్యాయి.

తీర్పిచ్చిన కొన్ని గంటల్లోనే ముమ్మారు తలాక్ చెప్పాడు

మేరట్, లఖ్‌నవూ: ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పిచ్చిన కొన్ని గంటల్లోనే తన భార్యకు తలాక్ చెప్పాడు ఓ భర్త. గర్భవతి అని కూడా చూడకుండా చేయిచేసుకోవడంతో గర్భస్రావం అయి తీవ్రంగా బాధపడుతోంది ఆ మహిళ. మేరట్‌లోని మొహల్లా కస్రా నవాబన్‌లో నివాసముంటున్న మహిళకు ఆరేళ్ల క్రితం పెళ్లి అయింది. వారికి ముగ్గురు పిల్లలున్నారు. ఆమెను కొట్టిన విషయమై ఆమె తల్లిదండ్రులు అతనితో చర్చించగా మూడుసార్లు తలాక్ చెప్పాడు. ఇలా తలాక్ చెప్పి విడాకులివ్వడాన్ని న్యాయస్థానం నిలిపివేసిందని చెప్పినా పట్టించుకోలేదని బాధిత మహిళ వాపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దీనిపై స్పందించిన అఖిల భారత ముస్లిం మహిళ పర్సనల్ లా బోర్డు ఈ కేసును ఉదాహరణగా చూపుతూ ఇలా తలాక్ చెబుతున్న వారికి ఎలాంటి శిక్షలు విధిస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోందని పేర్కొంది.

పోషకాహారలోపం, అతిమద్యపానం కారణంగా దక్షిణాదిలో క్షయ వ్యాప్తి

బోస్టన్: భారత్‌లోని దక్షిణాది రాష్ట్రాల్లో క్షయవ్యాధి వ్యాప్తికి పోషకాహారలోపం, అతిమద్యపానం కారణమవుతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని బోస్టన్ వర్సిటీ, తమిళనాడులోని జవహర్‌లాల్ పీజీ వైద్య విద్య, పరిశోధన సంస్థకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్నినిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో మద్యపాన వ్యసనాన్ని నిర్మూలించే కార్యక్రమాలు లేకపోవడం..క్షయ చికిత్సలపై ప్రభావం చూపుతోందని తెలిపారు.

భారత్ చేరిన అమెరికా యుద్ధనౌక 'పెరల్ హార్బర్'

దిల్లీ: అమెరికాకు చెందిన ఉభయచర యుద్ధనౌక యూఎస్ఎస్ పెరల్ హార్బర్ తొలిసారిగా భారత్ చేరుకుంది. రెండు దేశాల నడుమ రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవడంలో భాగంగా గురువారం ఈ యుద్ధనౌక గోవాలో లంగరేసింది. ఇందులో 700 మందికిపైగా నావికులు, మెరీన్ కమాండోలు ఉంటారు. ఇందులో 15వ మెరీన్ ఎక్స్‌పెడిషనరీ దళం.. భారత నౌకాదళంలోని మెరైన్ కమాండోలతో కలిసి ఉభయచర (నేల, సముద్రం) యుద్ధరీతులపై సంయుక్త విన్యాసాలు చేపడతుంది. భారత్‌ను సందర్శించే అవకాశం లభించడం తమకు ఆనందదాయకమని పెరల్ హార్బర్ కమాండింగ్ అధికారి థియోడర్ ఎసెన్‌ఫెల్డ్ తెలిపారు. పెరల్ హార్బర్ యుద్ధనౌకను 1998 మేలో అమెరికా నౌకాదళంలో చేరింది. ప్రస్తుతం ఇది.. ఏదైనా అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి, మిత్రపక్షాలతో భాగస్వామ్యాలను వృద్ధి చేసుకోవడానికి భారత్-ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మోహరించింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ముదిగొండ, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఖమ్మం జిల్లాలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ముదిగొండ మండలంలోని వనంవారికిష్టాపురానికి చెందిన వట్టె లింగయ్య(45)కు పంటలు సరిగా పండకపోవటంతో రూ.నాలుగు లక్షలు అప్పులయ్యాయి. అప్పులు ఎక్కువయ్యాయని కొన్నిరోజులుగా మానసికంగా బాధపడుతున్న లింగయ్య గురువారం పొలంలోనే పురుగుల మందు తాగాడు. ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.

'వారధి' వ్యాస రచన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సోమాజిగూడ, న్యూస్‌టుడే: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు ఈ ఏడాదికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ప్రాంతాల వారీగా పోటీలు నిర్వహిస్తామని.. తుది పోటీలు, అవార్డుల ప్రదానం అక్టోబరు 8న హైదరాబాద్‌లో ఉంటాయని వెల్లడించారు. 'విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నా ఎంతో సహనంతో సౌభ్రాతృత్వంతో జీవిస్తున్న భారతీయుల ఔన్నత్యం'పై వ్యాసరచన, 'త్వరగా విస్తరించిన సామాజిక మాధ్యమం, నైతిక విలువలు, ప్రభావాలు, బాధ్యత' అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలిపారు. పది, ఇంటర్ విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. విజేతలకు కందా భీమ శంకరరావు, పాపాయమ్మ స్మారక అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 7680999293లో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలలో గెలిచేదెవరు మామా!

- నంద్యాల ఫలితాలపై జోరుగా పందేలు
- మొదట్లో ఆధిక్యత ఎంతనేదానిపైనే
- ప్రస్తుతం గెలుపోటములు ఎవరివనేదానిపైనే
- ఒక్క కడపలోనే రూ.150 కోట్ల పందేలని అంచనా

ఈనాడు, అమరావతి, ఖమ్మం, న్యూస్‌టుడే: మొన్నటి వరకూ ఉప ఎన్నికల హోరుతో పతాక శీర్షికలకెక్కిన నంద్యాల నియోజకవర్గం తాజాగా ఫలితాలపై భారీ ఎత్తున పందేలతో వార్తల్లో నిలుస్తోంది. ఉప ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటములపైన రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున బెట్టింగులు నడుస్తున్నాయి. 79.20 శాతం మేర పోలింగ్ నమోదు కావడంతో ఆయా పార్టీల వీరాభిమానులు తమ పార్టీదే విజయమంటూ రూ.కోట్లల్లో పందేలు కాస్తున్నారు. ప్రధానంగా కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పందేల జోరు ఎక్కువగా ఉంది. కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు, ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు ఇలా పందేలు కాస్తున్న వారిలో అధికంగా ఉన్నారు. కొందరు పోలింగ్ సరళిని విశ్లేషించి ఓ స్పష్టమైన అభిప్రాయా నికి వచ్చిన తర్వాత తాము అనుకున్న పార్టీ గెలుస్తుందన్న ధీమాతో ఎంత మొత్తమైనా పందెంలో పెట్టేందుకు వెనుకాడటం లేదు. మరికొందరైతే తమకు తెలిసిన పాత్రికేయులు, నాయకులు, ఇతర మార్గాల ద్వారా గెలుపోటములపై ఆరా తీసి వాటి ఆధారంగా పందెం కాస్తున్నారు.

గెలిస్తే రూ.లక్ష ఇవ్వు.. ఓడితే రూ.లక్షన్నర ఇస్తా: ఎన్నికల ప్రచారం సాగినన్ని రోజులు కూడా ఆయా పార్టీల ఎంత ఆధిక్యతతో గెలుస్తాయనేదానిపైనే ఎక్కువగా బెట్టింగులు జరిగాయి. 10-15 వేల ఓట్ల ఆధిక్యతతో గెలిచే అవకాశాలున్నాయని ఆయా పార్టీల తరఫున చాలా మంది పందెం కాశారు. అయితే పోలింగ్ తర్వాత మాత్రం ఒక్కసారిగా తీరు మారిపోయింది. గత రెండు రోజులుగా ఆధిక్యత ఎంతనేదానిపైన పందేలు జరుగుతున్నా...ఎక్కువ మంది మాత్రం ఎవరు గెలుస్తారనేదానిపైనే కడుతున్నారు. తామనుకున్న పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందన్న ధీమాతో కొందరు "నేను చెప్పిన అభ్యర్థి గెలిస్తే రూ.లక్షే ఇవ్వు. ఓడిపోతే నేను రూ.లక్షకు రూ.1.50 లక్ష ఇస్తాను" అంటూ పందేలు కాస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. మరికొందరు మాత్రం సమాన మొత్తానికి పందెం కాస్తున్నారు. ప్రకాశం జిల్లాల్లో కురిచేడులో ఓ వ్యక్తి ఏకంగా మూడెకరాల వ్యవసాయ భూమిని పందెం కట్టడం గమనార్హం. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో చాలా మందిలో ఈ ఎన్నిక ఫలితంపై ఆసక్తి నెలకొంది. అదే స్థాయిలోనే పందేలు కూడా నడుస్తున్నాయి. ఒక్క కడప జిల్లాలోనే రూ.150 కోట్ల వరకూ పందేలు జరిగినట్లు అనధికారిక అంచనా. నలుగురైదుగురు బృందాలుగా ఏర్పడి సొమ్ములు సమకూర్చుకుని పందేలు కడుతున్న ఘటనలు ఎక్కువగానే ఉన్నాయి.

పక్క రాష్ట్రాల్లోని నగరాలు.. ఎన్ఆర్ఐల్లోనూ: చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో రాయలసీమ నుంచి వెళ్లి ఉంటున్న వారు అధికంగా ఉండటంతో వారు కూడా పందేలు కాసినట్లు సమాచారం. నంద్యాల ఎన్నికలను తొలి నుంచి జాగ్రత్తగా గమనిస్తున్న కొందరు ఎన్ఆర్ఐలు కూడా ఈ పందేల్లో భారీగా డబ్బులు పెట్టారు. ఎన్నికల ఫలితాలపై పందేలు కాయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగులు నిర్వహించే కొందరు బుకీలు రంగప్రవేశం చేసినట్లు సమాచారం. వీరు కమిషన్ ప్రాతిపదికన కొందరు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని పందేలు కాస్తున్నట్లు సమాచారం.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ

నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సత్తుపల్లి, అశ్వారావుపేట, పెనుబల్లి, కల్లూరు, కొత్తగూడెం, మణుగూరు, ఖమ్మం ప్రాంతాల్లో నంద్యాల ఉప ఎన్నిక ఫలితంపై పందెం రాయుళ్లు రంగంలోకి దిగారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కొందరు బెట్టింగ్ ఆఫర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. సత్తుపల్లి, పెనుబల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఫోన్ ద్వారానే పందేలకు సిద్ధం అయ్యారు. లక్షల రూపాయలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నెల 28 తేదీన ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. ఆ సమయానికి బెట్టింగ్ రాయుళ్లు మరింతగా రెచ్చిపోయే అవకాశం కనిపిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (LA) డిపార్ట్‌మెంట్, కలెక్టర్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా.

నెం.C2/348/2017
గెజిట్ నెం. Hyd. 15

ఫారం - సి

తేది: 16-8-2017
తేది: 21-8-2017

నోటిఫికేషన్
(10A మినహాయింపు యివ్వబడిన, చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద)
(రూల్ 6/12ని చూడండి)

ప్రజోపయోగార్థం, అనగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ యొక్క మెట్రో రైల్ ఎలైన్‌మెంట్ మరియు స్టేషన్ ఎంట్రీ/ ఎగ్జిట్స్ యొక్క నిర్మాణం నిమిత్తం హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ లిమిటెడ్ కొరకు హైదరాబాద్ జిల్లా, హిమాయత్‌నగర్ మండలం, లింగంపల్లి గ్రామంలోని మొత్తం 324.6 చ.మీ. లేదా 388.22 చ.గ. విస్తీర్ణంగల భూమి అవసరమైయున్నదని తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, హైదరాబాద్‌వారు భావిస్తున్నారు. అందువలన, ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా హైదరాబాద్ జిల్లా, హిమాయత్‌నగర్ మండలం, లింగంపల్లి గ్రామంలో పైన తెలిపిన ప్రాజెక్ట్ కొరకు ప్రామాణిక కొలతల మేరకు సుమారు 324.6 చ.మీ. లేదా 388.22 చ.గ. విస్తీర్ణంగల భూమి సేకరించబడుటకు ప్రతిపాదించబడినది. సదరు సేకరించబడనున్న భూమి యొక్క విపులమైన వివరణ దిగువ యివ్వబడినది:

షెడ్యూలు

జిల్లా: హైదరాబాద్ | మండలం: హిమాయత్‌నగర్ | గ్రామం: లింగంపల్లి

క్రమ సంఖ్య	భూమి వర్గీకరణ					టైటిల్ రకము	భూమి రకము	ఆవరణ నెం.	ప్రయోజనంగల వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు				సేకరించబడనున్న విస్తీర్ణం (చ.మీ./చ.గ. లలో)		చెట్లు		కట్టడాలు	
	సర్వే నెం./ టి.ఎస్. నెం.	బ్లాక్ నెం.	వార్డు నెం.	కాలమ్ 10	కాలమ్ 20					ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	రిక్విజిషన్ ప్రకారం విస్తీర్ణం (చ.గ. లలో)	ఎస్.డి. రికార్డుల ప్రకారం విస్తీర్ణం (చ.గ. లలో)	రకము	సంఖ్య	రకము	రిక్విజిషన్ ప్రకారం ప్లింత్ ఏరియా చ.మీ. లలో
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20
1	2/2	188	H	పైగా	G	యజమాని	G	1-8-27/8 to 14 (GF) & 1-8-27/8/1,2,3 (1వ అంతస్తు)	శ్రీమతి సబీరా బేగం	లేన్	1-8-27/8 to 14 (మిర్ ముస్తాక్ అలీఖాన్)	యజమాని యొక్క మిగిలిన ఆస్తి భాగం	రోడ్డు	202.22	202.22	-	-	G+1	169.08
2	3/2	188	H			యజమాని	G	1-8-27/1 to 7 & 1-8-27/4 to 1	శ్రీ మిర్ ముస్తాక్ అలీ ఖాన్	1-8-27/1 to 7 (సబీరా బేగం)	లేన్	యజమాని యొక్క మిగిలిన ఆస్తి భాగం	రోడ్డు	186.00	186.00	-	-	G+1	155.52
												స్థూల మొత్తము		388.22	388.22	-	-	-	324.6

ది రైట్ టు కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (తెలంగాణ ఎమెండ్‌మెంట్) యాక్ట్, 2016 (చట్టం నెం. 21/2017)చే సవరించబడిన ది రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) యొక్క సెక్షన్-11(1) యొక్క నిబంధనల క్రింద సంబంధితులందరికీ ఈ ప్రకటనను చేయడమైనది.

సదరు భూమి యొక్క ప్లానును జిల్లా కలెక్టర్, హైదరాబాద్ మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, భూ సేకరణ అధికారి, హైదరాబాద్ మెట్రో రైల్, 3వ అంతస్తు, మెట్రో రైల్ భవన్, రసూల్‌పురా, సికింద్రాబాద్, హైదరాబాద్‌వారి కార్యాలయం నందు ఏదేనీ పని దినమున పని వేళల్లో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టం యొక్క సెక్షన్-12లో నిర్దేశించబడిన మరియు పొందుపర్చబడిన విధంగా వారి పని యొక్క సక్రమ నిర్వహణ కొరకు అవసరమైన విధంగా సదరు భూమిలో ప్రవేశించటానికి మరియు భూమిని సర్వే చేయటానికి, ఏదేనీ భూమి యొక్క లెవెల్స్‌ను తీసుకోవటానికి, భూమి లోపలి పొరల్లోకి త్రవ్వటానికి లేదా బోర్ వేయటానికి మరియు అవసరమైన అన్ని యితర పనులను చేయటానికి అధికారికి, అనగా ప్రత్యేక ఉప కలెక్టర్ మరియు భూ సేకరణ అధికారి, హైదరాబాద్ మెట్రో రైల్‌వారికి మరియు ఆయన సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వము/ కలెక్టర్-కం-తగిన ప్రభుత్వ అధికారి అధికారమిచ్చారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద, జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లావారి నుండి ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి సదరు భూమికి సంబంధించి ఏవేనీ వ్యవహారాలు, అనగా అమ్మకం/కొనుగోలు, వగైరాలను జరపరాదు లేదా జరిపించరాదు లేదా సదరు భూమి మీద ఎట్టి ఎన్‌కంబ్రెన్స్‌లను సృష్టించరాదు.

ఈ భూసేకరణ పట్ల ఏదేనీ ఆక్షేపణగల ఎవరేనీ ప్రయోజనంగల వ్యక్తులు వారి ఆక్షేపణలను మరియు చర్చల ద్వారా పరిహార పరిష్కారం వలన ప్రభావితం అయిన/ ప్రయోజనం గల వ్యక్తులందరూ వారి క్లైమ్‌లను చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద నిర్దేశించబడిన విధంగా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోపు జిల్లా కలెక్టర్, హైదరాబాద్/ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సేకరణ), హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్‌వారి సమక్షంలో దాఖలు చేయవలెను.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 16-8-2017

సం/–
కలెక్టర్, హైదరాబాద్ జిల్లా.

సెన్సెక్స్ ▲ 28		31596
నిఫ్టీ ▲ 05		9857
రూపాయి 64.04 ▲	(ఒక అమెరికా డాలరుకు)	08 పైసలు
బంగారం 29,060 ▼	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	రూ.లలో 90
వెండి 38,710 ▼	ముంబయిలో కిలో	రూ.లలో 325
ముడి చమురు 51.93 ▼	(బ్రెంట్ ధర డాలర్లలో)	




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,815	+03
నాస్‌డాక్	6,271	−07
నిక్కీ 225 (జపాన్)	19,354	−81
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,272	+12
షాంఘై(చైనా)	3,272	−16
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,407	+24
డాక్స్ (జర్మనీ)	12,181	+06

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.29	67.59
పౌండ్ స్టెర్లింగ్	74.48	86.42
యూరో	68.76	79.74
జపనీస్ యెన్/100	53.36	61.89
ఆస్ట్రేలియా డాలరు	46.01	53.26
సింగపూర్ డాలరు	42.81	50.71
థాయ్ బాత్/100	174.74	209.04
బహ్రెయిన్ దీనార్	157.93	180.89
కువైట్ దీనార్	175.44	218.47
ఒమన్ రియాల్	154.54	176.85
సౌదీ రియాల్	15.50	18.37
యూఏఈ దిర్హమ్	15.86	18.54
మలేషియా రింగిట్	13.34	16.40

గురువారం నిఫ్టీ కదలికలు





హుందాగా.. హుషారుగా...

ట్రయంఫ్ నుంచి స్ట్రీట్ స్క్రాంబ్లర్ బైకు

ధర రూ.8.10 లక్షలు

దిల్లీ: బ్రిటన్ ఖరీదైన బైకుల తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్, భారత్‌లో తమ స్ట్రీట్ స్క్రాంబ్లర్ మోడల్‌కు కొత్త వెర్షన్‌ను గురువారం విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.8.10 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. 900 సీసీ ఇంజిన్ కలిగిన ఈ బైకులో 5 స్పీడ్ గేర్‌బాక్స్ అమర్చారు. కొత్త తరం యాంటీ లాకింగ్ బ్రేకింగ్ వ్యవస్థ- స్విచ్చబుల్ ఏబీఎస్ వంటి భద్రతా సదుపాయాలు ఇందులో ఉన్నాయని ట్రయంఫ్ వెల్లడించింది. కొత్త తరం వినియోగదారులకు అత్యాధునిక బైకులను అందించడమే తమ లక్ష్యమని ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విమల్ సంబ్లీ తెలిపారు. యువత అభిరుచులకు అనుగుణంగా కొత్త స్ట్రీట్ స్క్రాంబ్లర్ రూపొందించినట్లు వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 14 విక్రయశాలల్లో కంపెనీ ఖరీదైన బైకులను విక్రయిస్తోంది. హరియాణాలోని మనేసర్‌లో కంపెనీకి అసెంబ్లింగ్ కేంద్రం ఉంది.

ఎయిరిండియా ఫ్లాట్లు, స్థలాలు అమ్మకానికి

- రూ.500 కోట్ల సమీకరణ లక్ష్యం

ముంబయి: దేశవ్యాప్తంగా తనకున్న వివిధ స్థిరాస్తులను ఎయిరిండియా అమ్మకానికి పెట్టింది. వీటిల్లో 27 ఫ్లాట్లు, గృహ, వాణిజ్య స్థలాలు, కార్యాలయాల భవంతులు ఉన్నాయి. ఈ ఆస్తుల వేలాన్ని ప్రభుత్వ నేతృత్వంలోని ఎంఎస్‌టీసీ నిర్వహించనుంది. బిడ్‌లకు సెప్టెంబరు 6ను గడువు తేదీగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. పత్రికా ప్రకటన ప్రకారం ముంబయి, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, తిరువనంతపురం, అహ్మదాబాద్, పుణె, గోవా, లక్నో, గ్వాలియర్, గుడ్‌గావ్, భుజ్ ప్రాంతాల్లో తనకున్న స్థిరాస్తులను విక్రయించేందుకు ఎయిరిండియా బిడ్‌లను ఆహ్వానించింది. ఈ ఆస్తుల విక్రయం ద్వారా కనీసం రూ.500 కోట్ల వరకు రావొచ్చని సంస్థ భావిస్తోంది. 2012 పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా 2021 వరకు ఎయిరిండియాకు రూ.30,231 కోట్ల నిధుల సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో ఆస్తుల విక్రయం, అద్దెల ద్వారా ఎయిరిండియా రూ.5,000 కోట్ల వరకు సమీకరించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు ముంబయిలో నాలుగు ఫ్లాట్ల అమ్మకం ద్వారా కేవలం రూ.90 కోట్లు మాత్రమే సమీకరించింది.

జియో ఫోన్ బుకింగ్‌కు అంతరాయం

ప్రారంభమైన కొద్ది సమయానికే పనిచేయని వెబ్‌సైట్

దిల్లీ: జియో ఫోన్ బుకింగ్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం 5 గంటలకు బుకింగ్ ప్రారంభమైన కొద్ది సమయానికే వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందిపడ్డారు. అటు జియో స్టోర్‌లలోనూ రద్దీ వాతావరణం నెలకొంది. బుకింగ్ ప్రారంభం కాక ముందు నుంచే రూ.500 చెల్లించేందుకు వినియోగదారులు బారులు తీరారు. దిల్లీలోని ఓ జియో విక్రయ కేంద్రంలో బుకింగ్ ప్రారంభమైన 15-20 నిమిషాలకే సుమారు 100 ఫోన్లలకు బుకింగ్‌లు జరిగాయి. తొలివిడతగా రూ.500 చెల్లించి ఈ ఫోన్‌ను బుకింగ్‌లు చేసుకోవచ్చు. ఫోన్ మన చేతికి చేరాక రూ.1000 చెల్లించాలి.

జెన్ టెక్నాలజీస్ నష్టం రూ.2 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: జెన్ టెక్నాలజీస్ నష్టాలను తగ్గించుకుంది. 2016, జూన్‌తో ముగిసిన మూడు నెలలకు రూ.6.10 కోట్ల నష్టాలను చవిచూడగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికానికి రూ.1.99 కోట్లకు పరిమితమైనట్లు కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి మొత్తం ఆదాయం రూ.3.95 కోట్ల నుంచి రూ.8.91 కోట్లకు పెరిగింది.

బీఎస్ఈలో షేరు ధర 3.28 శాతం తగ్గి రూ.50.20 వద్ద ముగిసింది.

ఆద్యంతం ఒడుదొడుకులే

- మూడో రోజూ సూచీలకు లాభాలు
- రాణించిన లోహ, ఔషధ షేర్లు

సమీక్ష

రోజంతా తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అమెరికాలో అంతర్జాతీయ కేంద్ర బ్యాంకర్ల సదస్సు ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఇటీవల కుదేలైన ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు కళకళలాడాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 71.38 పాయింట్లు, నిఫ్టీ 19.65 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. గత 8 వారాల్లో సూచీలు లాభపడటం ఇది ఏడోసారి కావడం విశేషం.

సెన్సెక్స్ ఉదయం 31673.44 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం తీవ్ర హెచ్చుతగ్గులు ఎదుర్కొన్న సూచీ.. ఇంట్రాడేలో 31,678.19 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 28.05 పాయింట్ల లాభంతో 31,596.06 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 4.55 పాయింట్లు పెరిగి 9,857.05 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 9,848.85- 9,881.50 పాయింట్ల మధ్య కదలాడింది.

మద్యం షేర్ల జోరు: జాతీయ రహదారులపై మద్య నిషేధం, మున్సిపాలిటీలకు పొడిగించబోమని సుప్రీం కోర్టు స్పష్టం చేసినట్లు వార్తలు వెలువడటంతో మద్యం కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. యునైటెడ్ స్పిరిట్స్ అత్యధికంగా 3.89 శాతం లాభంతో రూ.2,567.65 వద్ద ముగిసింది. జీఎం బ్రూవరీస్ 5.03 శాతం పెరిగి రూ.421.75 దగ్గర స్థిరపడింది. గ్లోబల్ స్పిరిట్స్ 12.10%, పిన్‌కాన్ స్పిరిట్ 9.99%, ఎంపీ డిస్టిలరీస్ 3.68%, సోమ్ డిస్టిలరీస్ 3.39%, పయోనీర్ డిస్టిలరీస్ 2.68%, రాడికో ఖైతాన్ 1.85% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

- ఇక మాజీ సీఈఓ నందన్ నీలేకనీ తిరిగి ఇన్ఫోసిస్ పగ్గాలు చేపట్టనున్నట్లు వార్తలు రావడంతో కంపెనీ షేరు 2.01 శాతం రూ.912.50 వద్ద ముగిసింది
- రక్తపోటు చికిత్సలో వినియోగించే ఔషధ విక్రయానికి అమెరికా నియంత్రణ సంస్థ యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి ఇవ్వడంతో కేడిలా హెల్త్‌కేర్ షేర్లు పరుగులు తీశాయి. ఒకానొకదశలో 8.95 శాతం పెరిగిన షేరు.. చివరకు 7.02 శాతం లాభంతో రూ.494.95 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభాలతో ముగిశాయి. లుపిన్ 3.87%, సన్‌ఫార్మా 3.10%, డాక్టర్ రెడ్డీస్ 2.88%, సిప్లా 2.47%, టాటా మోటార్స్ 1.03%, టాటా స్టీల్ 0.88%, ఎస్‌బీఐ 0.61%, ఎల్ అండ్ టీ 0.61%, యాక్సిస్ బ్యాంక్ 0.52%లు రాణించిన వాటిలో ఉన్నాయి. అదానీ పోర్ట్స్ అత్యధికంగా 1.32% నష్టపోయింది. బజాజ్ ఆటో (0.94%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.88%), హెచ్‌యూఎల్ (0.72%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే ఔషధ 2.53% పెరిగింది. ఐటీ, టెక్నాలజీ, యంత్ర పరికరాల రంగాలు సైతం అదే బాటలో నడిచాయి.



నేడు మార్కెట్లకు సెలవు

గణేశ్ చతుర్థి సందర్భంగా నేడు బొంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లకు సెలవు ప్రకటించారు. బులియన్ సహా ఫారెక్స్, కమొడిటీ మార్కెట్లు కూడా పని చేయవు.

హైదరాబాద్‌లో 7 నుంచి అగ్రిటెక్స్

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ రంగంలో ధోరణులపై అవగాహన కల్పించడానికి హైదరాబాద్‌లో సెప్టెంబరు 7-9 తేదీల్లో 'అగ్రిటెక్స్ 2017'ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో ఉపయోగపడే యంత్రపరికాలు, ఇతర సామగ్రి ప్రదర్శన కూడా జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి 'హైటెక్స్'లో దీన్ని నిర్వహిస్తున్నట్లు కేన్స్ ఎగ్జిబిషన్స్ పేర్కొంది. వ్యవసాయ రంగానికి రుణాలు, పంటల బీమా, సరఫరా గొలుసుకట్టు వ్యవస్థ నిర్వహణ, నీటి నిర్వహణ వంటి అనేక అంశాలపై ఆయా రంగాల్లోకి ప్రముఖులు ప్రసంగిస్తారు.

ఐఐఎల్ నుంచి మూలికా పశు ఔషధం

ఈనాడు, హైదరాబాద్: మూలికా పశు ఔషధ విపణిలోకి హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యునిలాజికల్స్ (ఐఐఎల్) అడుగు పెట్టింది. పశువుల శరీరంపై ఉండే గాయాల చికిత్సకు స్ప్రే చేయడానికి మూలికలతో తయారు చేసిన స్ప్రే ఔషధం 'జుస్ప్రే'ను విడుదల చేసింది. ఈ ఉత్పత్తితో దాదాపు రూ.480 కోట్ల విలువైన మూలికా పశు ఔషధ విపణిలోకి ప్రవేశించినట్లవుతుందని ఐఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ స్ప్రేలో హరిద్రా అనే మూలిక నుంచి తీసిన పదార్థాలు ఉంటాయి. వివిధ విభాగాల్లోకి ప్రవేశించే వ్యూహంలో భాగంగా మూలికా పశు ఔషధాల విభాగంలోకి ఐఐఎల్ ప్రవేశించింది. ఈ విభాగంలో మరిన్ని ఉత్పత్తులను విడుదల చేయనుంది.

రెండు మూడేళ్లలో 8% వృద్ధి

- ఆ సత్తా భారత్‌కు ఉంది
- నీతి ఆయోగ్ అంచనా



దిల్లీ: రెండు మూడేళ్లలోనే 8 శాతం వృద్ధిని సాధించగల సత్తా భారత్‌కు ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. అయితే మొత్తం 125 కోట్ల మంది జనాభాకు సంస్కరణల ఫలాలు అందేలా చూడాలని ఈ సందర్భంగా సూచించింది. ఆర్థిక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, నియంత్రణ వ్యవస్థ, సామాజిక రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణల పూర్తి వివరాలతో 'త్రీ ఇయర్ యాక్షన్ అజెండా 2017-18 టు 2019-2020' నివేదికను నీతి ఆయోగ్ తీసుకొచ్చింది. 'రాబోయే 2-3 ఏళ్లలోనే 8 శాతం పైగా వృద్ధిని సాధించే అవకాశాలున్నాయి. కాబట్టి వచ్చే దశాబ్ద కాలంలో పేదరికాన్ని దాదాపు రూపుమాపడానికి అవకాశం ఉంద'ని అందులో పేర్కొంది.

2016-17లో భారత వృద్ధి రేటు 7.1 శాతానికి పరిమితమైన సంగతి తెలిసిందే. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసిక వృద్ధి గణాంకాలను కేంద్ర గణాంక కార్యాలయం(సీఎస్ఓ) ఆగస్టు 31న విడుదల చేయనుంది. నీతి ఆయోగ్ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం.. కేంద్ర ప్రభుత్వ వ్యయాలను భవిష్యత్ ప్రాధాన్యాలతో అనుసంధానించాలి. అభివృద్ధి అవసరం ఉందనుకున్న అధిక ప్రాధాన్య రంగాలకు అదనపు కేటాయింపులు చేయాలి. 2019-20 కల్లా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, రక్షణ, రైల్వేలు, రోడ్లు, ఇతర విభాగాల్లో వ్యయాలను పెంచాల్సి ఉందని ఆ ప్రణాళిక అంటోంది. అందుబాటులో గృహాలు, మౌలికాభివృద్ధి, ప్రజా రవాణా, స్వచ్ఛ భారత్ తదితర కీలక సవాళ్లను ఎదుర్కోవాలంటే.. పట్టణీకరణ వేగంగా జరగాలని సూచించింది. అవినీతి, నల్లధనాన్ని రూపుమాపడానికి, పన్ను విస్తృతి పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని కూడా తెలిపింది.

ఇష్యూ ధరలు బాగుండాలి సుమా!

- న్యూ ఇండియా అసూరెన్స్, జీఐసీలకు కేంద్రం సలహా

దిల్లీ: ఇష్యూ ధరలు పోటీపడే విధంగా చూసుకోవాలని ప్రభుత్వ రంగ బీమా కంపెనీలైన జనరల్ ఇన్సూరెన్స్ కార్ప్, న్యూ ఇండియా అసూరెన్స్‌లకు కేంద్రం సలహా ఇచ్చింది. ప్రైవేటు బీమా కంపెనీలు కూడా ఎక్స్ఛేంజీల్లో నమోదుకానుండడం ఇందుకు నేపథ్యం. ఈ నెల మొదట్లో జీఐసీ, న్యూ ఇండియా అసూరెన్స్‌లు సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసిన విషయం తెలిసిందే. జీఐసీ, న్యూ ఇండియా అసూరెన్స్‌లు పబ్లిక్ ఇష్యూల ద్వారా వరుసగా రూ.10,000 కోట్లు; రూ.6,500 కోట్లు చొప్పున నిధులను సమీకరించనున్నాయి. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్‌లు కూడా పబ్లిక్ ఇష్యూకు వస్తున్నట్లు ప్రకటించాయి. 'ఈ బీమా కంపెనీలన్నీ కలిసి మార్కెట్ నుంచి రూ.30,000 కోట్ల మేర నిధులను సమీకరించాలని భావిస్తున్నాయి. ముందుగా వచ్చే కంపెనీలకు ఎక్కువ స్పందన ఉంటుంద'ని ఆర్థిక శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు అంచనా వేశారు. ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు రెండూ అక్టోబరు-డిసెంబరులో మార్కెట్లోకి రావొచ్చు. ఈ రెండింటిలో జీఐసీపై ఎక్కువ ఆసక్తి ఉండొచ్చంటున్నారు. రీఇన్సూరెన్స్ రంగంలో పబ్లిక్ ఇష్యూకు వస్తున్న ఏకైక కంపెనీ ఇదే కావడం వల్ల మదుపర్లు కన్నేయవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. జీఐసీ, న్యూ ఇండియా అసూరెన్స్‌తో పాటు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లకు కూడా పబ్లిక్ ఇష్యూలకు రావడానికి జనవరిలో ఆమోదం లభించింది.

దిలీప్ బిల్డ్‌కాన్ రోడ్ల ప్రాజెక్టుల విక్రయం

- విలువ రూ.10,500 కోట్లు
- శ్రేమ్ గ్రూప్‌నకు రూ.1600 కోట్లకు

ముంబయి: దిలీప్ బిల్డ్‌కాన్ టోల్ రోడ్ విభాగం నుంచి వైదొలగింది. రూ.10,500 కోట్ల విలువ చేసే మొత్తం 24 ప్రాజెక్టులను శ్రేమ్ గ్రూప్‌నకు రూ.1600 కోట్లకు విక్రయించింది. కంపెనీ వీటిపై పెట్టిన రూ.682 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఈ విక్రయ విలువ 135 శాతం అధికం కావడం గమనార్హం. దేశంలోనే అతిపెద్ద రోడ్ల ఆస్తుల విక్రయం ఇదే కావొచ్చు. మరో పక్క, ఈపీసీ పద్ధతి కింద ప్రాజెక్టులను నిర్మించడం కొనసాగిస్తుంది. విక్రయించిన ఆస్తుల్లో 14 నిర్వహణ ఆస్తులు, నాలుగు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హెచ్ఏఎమ్) కింద ఆరు ఆస్తులు వివిధ అభివృద్ధి దశల్లో ఉన్నాయి.

24వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
25న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1781.50 (1801.90) 245230
ADANI PORT & 380.05 (385.00) 2507753
AMBUJA CEMEN 275.40 (276.65) 1073190
ASIAN PAINTS 1135.60 (1141.30) 483362
AUROBIND PHA 732.15 (698.65) 4300438
AXIS BANK LT 506.85 (502.65) 7157375
BAJAJ AUTO L 2728.55 (2754.65) 213909
BANK OFBAROD 142.85 (140.95) 12332259
BHARTI AIRTE 432.95 (431.90) 2499222
BHARTI INFRA 383.90 (382.80) 1863817
BOSCH LTD 21676.25 (21882.40) 10131
BPCL 508.20 (509.70) 2927916
CIPLA 574.05 (559.15) 1866440
COAL INDIA L 241.30 (241.10) 3835139
DR. REDDYS 2088.15 (2030.95) 1124967
EICHER MOTOR 30750.90 (30648.25) 21126
GAIL 383.00 (385.45) 3284133
HCL TECH 867.50 (880.00) 812123
HDFC 1757.35 (1765.25) 1560281
HDFC BANK 1762.50 (1772.45) 1969569
HERO MOTOCOR 3882.65 (3888.90) 222636
HINDALCO IND 233.00 (230.90) 9492099
HINDUSTAN UN 1179.70 (1188.15) 780599
ICICI BANK 297.70 (298.60) 12766567
INDIABULLS H 1210.35 (1221.75) 858188
INDIAN OIL 428.20 (426.85) 3949307
INDUSINDBANK 1667.70 (1660.90) 1400606
INFOSYS LTD 912.15 (892.80) 21190262
ITC 281.45 (282.55) 10819303
KOTAK MAHIND 972.10 (980.10) 1336640
LARSEN & TOU 1131.70 (1124.15) 1316100
LUPIN 992.50 (955.85) 2451008
M&M 1375.15 (1374.20) 790046
MARUTI SUZIK 7612.85 (7573.05) 436912
NTPC LTD 169.00 (170.25) 4966410
ONGC 159.45 (159.70) 3724532
POWER GRID C 220.95 (219.75) 3089395
RELIANCE IND 1568.05 (1582.05) 2892571
SBI 280.30 (279.00) 14138226
SUN PHARMA 483.00 (469.20) 5680084
TATA CONSULT 2496.60 (2489.45) 811954
TATA MOT DVR 227.35 (226.55) 1158954
TATA MOTORS 384.15 (379.95) 5208541
TATA POWER 79.15 (78.75) 7107291
TATA STEEL L 639.00 (634.60) 4909312
TECH MAHINDR 427.70 (430.20) 2607190
ULTRATECH 3939.65 (3951.55) 287019
VEDANTA LIMI 298.55 (299.60) 10177654
WIPRO 289.40 (290.00) 2780093
YES BANK LTD 1719.45 (1723.25) 1773053
ZEE ENTERTAI 511.70 (514.90) 1187770

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1349.70 (1349.85) 59194
ASHOK LEYLAN 103.00 (102.70) 4476831
BAJAJ FINANC 1760.10 (1779.30) 1324532
BAJAJ FINSER 5506.25 (5351.30) 185689
BEL 187.95 (183.05) 6425558
BHEL 126.95 (127.55) 3020942
BRITANNIA 4214.10 (4247.15) 123419
CADILA HEALT 494.35 (462.65) 4402293
COLGATE PALM 1093.75 (1087.15) 290514
CONTAINER 1267.80 (1258.00) 350989
CUMMINS INDI 891.85 (880.75) 224506
DABUR INDIA 300.05 (298.85) 767155
DIVIS LAB 673.40 (638.40) 1927158
DLF LIMITED 186.95 (185.95) 10932188
EMAMI LIMITE 1075.05 (1087.60) 139218
GLAXOSMI CON 5295.60 (5347.55) 2507
GLAXOSMI PHA 2398.35 (2390.60) 8346
GLENMARK PHA 616.30 (599.85) 1311918
GODREJ CONSU 917.45 (904.95) 848782
HAVELLS INDI 487.15 (475.45) 892166
HINDUSTAN ZI 283.95 (286.50) 1445309
HPCL 466.20 (457.90) 4723140
ICICI PRU LI 422.90 (422.15) 379407
IDEA CELLULR 90.00 (90.50) 3124042
INTERGLOBE A 1186.60 (1216.45) 691728
JSW STEEL LT 246.05 (239.75) 4460587
LIC HOUS.FIN 658.00 (659.70) 1109699
MARICO LIMIT 316.10 (314.95) 695941
MCDOWELL 2567.15 (2469.45) 836932
MOTHERSON 310.50 (314.25) 2627572
NHPC LTD 29.75 (29.70) 4433035
NMDC LTD 122.20 (123.10) 1535957
OIL INDIA 283.40 (278.80) 366213
ORACLE FIN S 3436.30 (3435.10) 15508
P&G HYG&HEAL 8156.45 (8118.35) 3122
PETRONET LNG 226.55 (230.95) 4053081
PIDILITE IND 829.05 (815.85) 344575
PIRAMAL ENTE 2676.75 (2625.20) 105335
PNB 144.30 (142.65) 8742823
POWER FIN CO 121.40 (120.65) 3991035
RURAL ELEC C 160.80 (157.20) 8476541
SAIL 60.65 (60.70) 6898559
SHREE CEMENT 16992.10 (17166.20) 13211
SHRIRAM TRAN 975.00 (971.30) 451762
SIEMENS 1265.15 (1255.65) 222294
SUN TV LTD 712.45 (714.65) 749708
TITAN IND 606.80 (607.50) 1115671
TORRENT PHAR 1226.35 (1207.50) 226000
UNITED BREWE 812.70 (804.85) 303403
UPL LIMITED 833.10 (814.10) 879641

ఇతర ప్రధాన షేర్లు


ABAN OFFSHOR 175.65 (173.75) 856003
ADANI ENTERP 109.15 (110.05) 4390164
ADANI POWER 28.55 (28.35) 11635039
ALL BANK 68.40 (67.10) 4763909
AMARA RAJA 777.20 (767.30) 850609
ANANT RAJIND 55.85 (55.90) 481414
ANDHRA BANK 52.40 (51.45) 2878070
APOLLO HOSPI 1083.20 (1092.60) 399263
APOLLO TYRES 257.00 (259.80) 3459869
APTECH 313.20 (276.50) 11152784
BAJAJ ELECT. 340.20 (339.50) 246156
BAJAJ HIND 14.90 (14.45) 9634609
BAJAJ HOLDIN 2750.80 (2634.85) 112086
BALAJI TELE 168.60 (163.05) 1052624
BALLARPUR IN 13.00 (13.65) 1772001
BALRAMPUR CH 166.00 (164.90) 1436756
BANK OF MAHA 27.15 (27.20) 81591
BANK OFINDIA 144.15 (143.80) 4681415
BATA INDIA 667.75 (678.15) 626183
BGR ENERGY S 134.80 (137.20) 122635
BHARAT FORGE 1147.95 (1165.95) 458889
BHUSHAN STEE 69.95 (70.10) 621475
BIOCON LTD 338.95 (330.10) 2602725
BOMBAY DYE 85.05 (79.30) 5142230
CANARA BANK 341.20 (336.15) 2153546
CEAT LIMITED 1649.90 (1671.80) 746139
CENTRAL BANK 73.55 (73.80) 509608
CHAMBAL FERT 143.95 (144.10) 531347
CHENNAI PETR 416.30 (405.50) 3139383
CITY UNIBANK 162.20 (158.40) 628334
CORPO BANK 46.55 (45.45) 230582
COX & KINGS 262.50 (262.15) 289665
D B REALTY L 36.50 (36.05) 281988
DELTA CORP L 182.15 (182.25) 4099265
DENA BANK 31.15 (31.35) 861150
DHANALAKBANK 33.40 (32.90) 327923
EDELWEISS CA 236.10 (242.40) 1910211
EDUCOMP SOLU 8.20 (7.85) 385830
EID PARRY 315.40 (322.95) 132864
EIH 131.35 (132.15) 94497
ESSAR SHIPPI 25.55 (25.95) 86735
ESTER INDUST 31.50 (32.10) 24825
EXIDE INDUST 202.55 (198.85) 2746403
FEDERAL BANK 106.45 (106.65) 6102318
FINOLEX CABL 530.15 (531.85) 22874
G E SHIP LTD 389.50 (388.90) 21241
GAMMON INDIA 8.50 (8.40) 211865
GAMMON INFRA 3.90 (3.80) 911011
GATI LIMITED 113.80 (114.15) 526147
GAYATRI PROJ 176.30 (171.50) 244086
GITANJALIGEM 60.50 (60.80) 149728
GMR INFRASTR 17.25 (17.20) 18655881
GODREJ IND 604.65 (600.30) 554040
GRASIM IND 1134.45 (1119.05) 1418657
GUJ ALK&CHEM 419.35 (409.20) 153214
HCL INFOSYS 45.15 (45.15) 2110554
HEXA TECH 274.15 (269.00) 1622377
HIMACHAL FUT 17.30 (16.40) 6996283
HINDU MOTORS 8.10 (8.20) 128195
HOUSING DEV 61.60 (61.75) 14532588
IDBI 55.00 (54.65) 3192065
IDFC 54.60 (54.85) 3347726
IFCI 23.65 (23.15) 9766419
IL&FS TRANS 79.50 (77.15) 254558
IND SWIFTLAB 33.50 (33.55) 7427
INDBULLS REL 230.55 (233.25) 6211252
INDIA CEM 177.30 (178.15) 3367441
INDIAN BANK 294.95 (298.40) 1481670
INDO RAMA SY 27.50 (27.50) 12434
INDRAPRASTHA 1251.85 (1268.25) 302133
IND-SWIFTLTD 7.45 (7.70) 5604
INGERSOLL-R 809.05 (803.60) 9585
IOB 22.95 (23.10) 654661
IPCA LAB 414.80 (412.20) 144739
IRB INFRA DE 212.55 (212.60) 533049
J&K BANK 81.95 (80.70) 318648
JAI CORP 77.65 (78.25) 299160
JAIN IRRIGAT 95.35 (94.80) 1808818
JAYPEE INFRA 14.90 (14.20) 8708130
JAYSHREE TEA 100.10 (99.75) 32302
JET AIRWAYS 574.25 (574.40) 1351241
JINDAL SAW 91.60 (90.75) 740380
JINDAL STEEL 135.15 (133.10) 6541270
JK LAKSHMI C 411.70 (416.85) 53036
JK PAPER LIM 99.25 (97.05) 1036342
JM FINANCIAL 126.25 (127.25) 396120
JP ASSOCIATS 23.35 (21.50) 116202079
JSW ENERGY L 63.80 (61.15) 10981203
JUBILANT FOO 1393.55 (1380.30) 730350
JUBILANT ORG 726.25 (719.45) 435598
JYOTHY LABS 377.75 (374.40) 26227
KARNATA BANK 151.45 (144.40) 2792004
KEC INTL LTD 296.20 (299.70) 293414
KOLTE PATIL 156.05 (158.15) 80296
KPIT CUMMINS 114.90 (113.70) 545883
L&TFIN.HOLD 174.85 (173.35) 2899498
LAK VIL BANK 177.20 (175.65) 419740
M & M FINANC 409.65 (410.50) 1382709
M & M FINANC 409.65 (410.50) 1382709
MANAPPURAM G 95.75 (92.90) 12345852
MMTC LIMITED 55.70 (55.45) 264580
MOSER-BEAR 4.50 (4.55) 93611
MPHASIS LTD 604.85 (591.80) 27101
MRPL 124.95 (125.55) 7893159
MTNL 19.55 (17.40) 8238499
NAGARJUNA OI 3.70 (3.65) 169387
NCC LIMITED 86.10 (86.20) 2373052
NETWORK18 FI 49.75 (50.35) 232007
NEULAND LAB 1230.55 (1217.90) 7862
NIIT LTD 94.45 (93.25) 1971845
NIIT TECHNOL 497.10 (495.95) 353816
OMAXE LTD 203.65 (205.05) 349649
ONMOBILE GLO 58.55 (54.80) 493593
ORIENT PAPER 94.50 (96.60) 178315
ORIENTALBANK 124.35 (123.50) 2911371
PATEL ENGG 71.00 (70.00) 179802
PFIZER 1813.20 (1808.35) 37258
POLARIS SOFT 242.05 (241.10) 20344
POWERTRADING 114.80 (113.45) 2166221
PRAJ IND 68.90 (66.90) 1178817
PRISM CEMENT 109.90 (111.00) 96482
PROVOGUE (IN 4.10 (4.00) 65980
PUNJ LLOYD 19.10 (19.05) 461611
PUNJAB & SIN 48.95 (48.45) 55577
PURAVANKARA 70.60 (72.15) 57786
PVP VENTURES 4.95 (5.00) 33097
PVR LIMITED 1263.55 (1255.45) 103862
RADICO KHAIT 165.00 (161.65) 1267212
RAJ OIL MILL 1.30 (1.35) 64409
RAJESH EXPOR 719.90 (719.30) 963465
RALLIS INDIA 229.30 (232.40) 140519
RAMCO IND 243.50 (239.85) 160159
RAMCO SYS 347.65 (357.95) 37141
RAMKY INFRA 81.20 (80.65) 51999
RAYMOND 733.75 (737.00) 245429
RELIANCE CAP 776.90 (767.30) 2835724
RELIANCE COM 22.90 (23.05) 10465137
RELIANCE INF 479.90 (474.80) 1598138
RELIANCE POW 39.50 (39.20) 1337878
ROLTA INDIA 53.10 (52.95) 183397
SAGAR CEMENT 829.40 (829.20) 2561
SAREGAMA 395.55 (396.55) 42298
SHANTHI GEAR 132.65 (132.95) 14921
SHIPPNG CORP 94.70 (93.65) 2228479
SHREE RENUKA 17.35 (17.40) 2735821
SINTEX IND 30.00 (30.30) 13862355
SOBHA DEVELO 387.00 (391.70) 107045
SOUTHINDBANK 27.90 (27.20) 11351353
SRS LIMITED 2.70 (2.80) 581625
STERLITE TEC 217.10 (215.75) 513260
SUJANA METAL 1.60 (1.55) 32961
SUN PHARMA 391.90 (425.05) 1574845
SUND FASTNER 392.55 (385.95) 95821
SUZLON ENERG 16.30 (16.35) 30399132
SYND. BANK 65.15 (64.60) 1621562
TATA CHEM 583.85 (588.10) 394780
TATA COFFEE 132.05 (134.15) 244845
TATA COMMUN 641.55 (637.55) 1041228
TATA GLOBAL 194.25 (196.55) 4587179
TATA METALIK 636.90 (637.40) 59719
TATA TELESER 6.75 (6.75) 997270
THE INDIAN H 110.90 (111.65) 1045668
TORRENT POWE 209.95 (209.35) 726706
TRIVENI ENGG 92.60 (89.65) 1867883
TTK PRESTIGE 6369.90 (6360.85) 5425
TV TODAY NET 242.60 (245.50) 40022
TV18 BROADCA 36.65 (36.40) 1321683
TVS MOTOR 595.15 (584.60) 613152
UCO BANK 30.85 (30.75) 499308
UNION BANK 136.05 (134.20) 4079241
UNITECH 7.60 (7.30) 38118596
UNITED BANK 18.30 (18.25) 658952
USHA MARTIN 18.95 (19.05) 353191
VADILAL INDU 851.45 (856.95) 22397
VENKYS 2032.70 (2078.30) 125159
V-GUARD IND 182.25 (183.00) 353415
VIJAYA BANK 69.60 (64.50) 2046836
VIP 211.60 (206.80) 1490825
VOLTAS 521.00 (522.00) 953036
ZEE LEARN LI 42.55 (42.20) 256982
ZUARI GLOBAL 118.60 (116.80) 19547
ZYDUS WELLNE 871.45 (865.40) 3837

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 767.15 (760.55) 1406
AMAR RAJA BA 778.55 (765.40) 359912
ANDHRA BANK 52.30 (51.40) 220844
ANDHRA CEMEN 8.64 (8.66) 24430
ANDHRA PAPER 295.45 (293.05) 125
ANDHRA PETRO 32.05 (31.75) 137986
ANDHRA SUGAR 336.95 (337.60) 3042
ANJANI PORTL 214.95 (206) 1115
ASTRA MICROW 122.35 (123.90) 19503
AUROBINDO PH 732.50 (698.50) 263779
AVANTEL SOFT 252.45 (237) 6209
AVANTI FEEDS 1920.30 (1946.75) 8799
BALAJI AMIN 311.20 (310.70) 3620
BHAGIRA CHEM 199.85 (205.60) 9197
COROMAN FERT 428.90 (422.65) 9139
CYIENT LIMIT 531.35 (519.45) 2392
DECCAN CEMEN 1120.05 (1121.95) 2067
DIVI'S LAB 673.10 (638.95) 163858
DIVYA GRANIT 100 (98.50) 1583
DR REDDY 2087.90 (2029.50) 81323
GATI CORPN 113.50 (113.90) 88393
GAYATRI PROJ 175.45 (170.90) 11080
GMR INFRASTR 17.25 (17.15) 1385497
GOLDST INFRA 137.05 (130.55) 88674
GOLDSTONE EN 10.71 (11.13) 3545
GRANULES (I) 130 (127.90) 111420
GSS AMERICA 22.85 (22.95) 3517
GVK POWER 11.46 (11.75) 2108941
HBL NIFE POW 44.20 (44.50) 13268
HERITAGE FOO 1373.05 (1315.35) 10760
ILFS ENGINEE 41.45 (39.90) 9519
INCAP 54.10 (56.90) 4835
IVRCL INFRAS 4.97 (4.89) 96043
JEEVAN SCIEN 39.05 (38.25) 2568
KAKATIYA CEM 338.35 (343.60) 4762
KALLAM SPG 34 (31.90) 146738
KAVERI SEED 541.25 (543.55) 27504
KCP LTD 102.10 (102.10) 95840
KNR CONSTRUC 217.65 (216.20) 12100
KREBS BIO 92.80 (93.65) 1315
LA MAN GRANI 9.95 (10.47) 3000
LANCO INDUS 368.15 (366.15) 5492
LANCO INFRAT 0.92 (0.89) 942839
LAURUS LABS 522.30 (524.95) 6735
LOKESH MACH 80.50 (81.35) 7079
MADHUCON PRO 28.55 (29.35) 15789
MEGA SOFT 12.85 (13.10) 12567
MIC ELECTRON 7.73 (7.76) 117227
MOLD-TEK.TEC 50 (49.75) 3795
MOLDTK PLA 290.75 (291.55) 4427
MSR INDIA LT 34.50 (36.30) 1880
NAGARJAGRICH 34 (33.90) 13064
NATCO PHARMA 726.10 (726.20) 60136
NAVA BH VENT 121.85 (122.30) 35612
NCC 86.50 (86.20) 203597
NCL IND 231.50 (230.30) 17831
NEHA INTER 4.90 (5.13) 67705
NETTLINX 82.75 (80.80) 23007
NILE 594.05 (602.40) 3787
OIL COUNTRY 43.50 (45) 3767
PANYAM CEMEN 58.95 (58.50) 2510
PENNER IND 61.65 (59.70) 353115
PIONEER DIST 203.25 (197.95) 5071
PITTI LAMIN 60.35 (58.85) 24385
PRISM CEMENT 109.50 (110.85) 6633
RAIN INDUSTR 145.55 (144.70) 356059
RAJ PACKAGIN 60.60 (56.50) 21789
SAMKRG PIST 258.10 (255.50) 1707
SAMPRE NUTRI 42.40 (40.40) 4722
SATVAH. ISPA 41.45 (34.55) 489138
SMS PHARMA 80.20 (82.60) 32155
SPHERE GLOBA 46.70 (44.05) 13050
SREE RAYAL A 30.30 (28.45) 901731
SRINIVASA SH 65.80 (63.30) 7756
STEEL EXCHAN 84.45 (83.15) 100183
SURYALAKSH.C 99.95 (97.55) 4275
SUVEN PHARMA 167.55 (162.45) 88268
TANLA 32.10 (32.60) 12593
TERA SOFTWAR 61.30 (61.30) 4763
VAMSHI RUBB 60.30 (61.45) 4799
VIJAY TEXTIL 63.40 (62.15) 56786
VIMTA LABS 130.25 (130.25) 7127
VISAKA IND 540.70 (537.20) 18523
VISTA PHARMA 32.50 (33.05) 3478
VIVIMED LABS 102.90 (103.60) 80610
ZENOTECH LAB 47.80 (47.55) 10251
ZENTECH 50.20 (51.90) 15047

ఈనాడు బిజినెస్

హితుడు..! సన్నిహితుడు..!!



ఇన్ఫోసిస్‌లో పరిణామాలు రోజు రోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి.

మొన్నటికి మొన్న సిక్కా అనూహ్యంగా రాజీనామా చేయడంతో మదుపర్లు షాక్‌కు గురయ్యారు. ఆ భయంతో ఇన్ఫీ షేర్లను తెగనమ్ముకున్నారు. రెండు రోజుల్లోనే 15% దాకా నష్టాల పాలయ్యాయి.

కంపెనీ మార్కెట్ విలువ రూ.35,000 కోట్లకు పైగా క్షీణించింది.

ఇక.. ఇన్ఫీ షేరు మరింత కిందకు దిగజారుతుందా? కంపెనీని గాడిలో పెట్టే సీఈఓ కోసం 2018 దాకా ఎదురుచూడాల్సిందేనా? మూర్తి అనుకున్నట్లు కార్పొరేట్ పాలన విషయంలో ఇన్ఫోసిస్ మెరుగై మళ్లీ తిరిగి ప్రాభవాన్ని ఎపుడు పొందుతుందో? అన్న అనుమానాలు సహజంగానే వచ్చాయి.

అయితే తాజా పరిణామంతో కొంత మేరకు ఆ అనుమానాలకు నివృతి కలిగింది. కొంత భరోసా ఏర్పడింది.

అదే.. ఛైర్మన్‌గా నందన్ నీలేకని నియామకం.


దీంతో మదుపర్లలో ఉత్సాహం కలుగుతుందన్న మాట ఎంత వాస్తవమో.. క్లయింట్లలో ఈయన ఉత్సాహం నింపుతారన్నదీ అంతే వాస్తవం..!!!!

నందన్ నీలేకని చేతికి ఇన్ఫోసిస్ బోర్డు పగ్గాలు

సిక్కా, శేషశాయి, మరో ఇద్దరు డైరెక్టర్ల రాజీనామా..

సహఛైర్మన్ పదవికి రవి వెంకటేశన్ దూరం.. డైరెక్టర్‌గా కొనసాగింపు..

నెగ్గిన నారాయణమూర్తి పంతం! మదుపర్లకు అనుకూల పరిణామమే


మూర్తి

దిల్లీ/ముంబయి/బెంగళూరు

ఎట్టకేలకు మూర్తి పంతం నెగ్గింది. కంపెనీలో ప్రక్షాళన జరగాల్సిందేనన్న కీలక డిమాండ్ నెరవేరింది. సహ వ్యవస్థాపకులకు తోడుగా సంస్థాగత మదుపర్లు.. అందులోనూ ఎల్ఐసీలాంటి ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఒత్తిడి తీసుకురావడంతో ఇన్ఫోసిస్ బోర్డు తలొగ్గక తప్పలేదు. గురువారం రాత్రి ఇన్ఫోసిస్‌కు ఛైర్మన్‌గా నందన్ నీలేకనిని నియమిస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. కంపెనీ మాజీ సీఈఓ, ఆధార్ రూపశిల్పి అయిన నీలేకని(62) రాకతో ప్రస్తుతం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆర్. శేషశాయి వైదొలగుతారు. అదే సమయంలో సహ-ఛైర్మన్‌గా ఉన్న రవి వెంకటేశన్ కూడా ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటారు. అయితే స్వతంత్ర డైరెక్టర్‌గా మాత్రం కొనసాగుతారు. గత వారం సీఈఓగా రాజీనామా చేసిన విశాల్ సిక్కా కూడా బోర్డు నుంచి తక్షణం వైదొలగుతారు. ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లయిన జెఫ్రీ ఎస్ లేమాన్, జాన్ ఎచ్‌మెండీలు కూడా బోర్డు నుంచి నిష్క్రమిస్తారు. ఆ మేరకు కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. ఇక కొత్త వ్యక్తిని నియమించేంతవరకు యు.బి. ప్రవీణ్ రావు తాత్కాలిక సీఈఓ, ఎండీగా కొనసాగుతారని కంపెనీ స్పష్టం చేసింది. తాజా రాజీనామాలతో తొమ్మిది మంది సభ్యుల బోర్డు దాదాపు ప్రక్షాళించినట్లు అయింది. ముఖ్యంగా మూర్తి కోరిక నెరవేరింది.

నందన్ సరిపోతారు

ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీ అభివృద్ధికి సరిపోయే నాయకుడు నందనేనని నిష్క్రమిస్తున్న ఛైర్మన్ ఆర్. శేషశాయి పేర్కొన్నారు. ఆయన నియామకంతో భవిష్యత్‌లో ఆకర్షణీయమైన అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమయ్యే వ్యూహాత్మక మార్పులపై ఇన్ఫోసిస్ దృష్టి సారించగలదని శేషశాయి ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త ఛైర్మన్ నియమించబోయే కొత్త యాజమాన్య బృందం.. వాటాదార్లలో విశ్వాసాన్ని పెంచుతుందన్నారు.

చాలా సంతోషంగా ఉంది: నీలేకని

కంపెనీలోకి తిరిగి రావడం సంతోషంగా ఉందని నీలేకని పేర్కొన్నారు. బోర్డులోని తన సహచరులు, ఎగ్జిక్యూటివ్ యాజమాన్యంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఆయన అన్నారు. ఇక తీసుకుబోయే నిర్ణయాలకు వాటాదార్లతో చర్చలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

సిక్కాతో తెగదెంపులు

ఇక సీఈఓగా రాజీనామా చేసిన సిక్కాను ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించుకున్నప్పటికీ.. ఆ ఉద్యోగ ఒప్పందాన్ని బోర్డు రద్దు చేసింది. 90 రోజుల మూల వేతనాన్ని(2,46,575 డాలర్లు) చెల్లించి.. ఆయనను బయటకు పంపింది. చలన చెల్లింపు(వేరియబుల్ పే) 2,05,572 డాలర్లు, ఉద్యోగి ప్రయోజనాల కింద మరో 90 రోజుల వేతనాన్ని చెల్లించింది. దీంతో సిక్కాకు, ఇన్ఫోసిస్‌కు సంబంధాలు తెగిపోయినట్లే.

ఆధార్.. నీలేకని మానసపుత్రిక

అభివృద్ధి చెందిన దేశాల తరహాలో, వేలిముద్రల ఆధారంగా మన దేశ పౌరులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు ప్రతిపాదించిన ఆధార్ ప్రాజెక్టు, నందన్ నీలేకని ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న ఈ ఆలోచన, ఆయన ఆధ్వర్యంలోనే కార్యరూపం దాల్చి, విజయవంతమైంది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నీలేకని, నారాయణమూర్తి తరవాత 2002 నుంచి 2007 ఏప్రిల్ వరకు సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం క్రిస్ గోపాలకృష్ణన్‌కు ఆ బాధ్యతలు అప్పగించి, తాను ఇన్ఫోసిస్ సహ ఛైర్మన్‌గా 2009 జులై వరకు కొనసాగారు. అమోఘమైన ఆలోచనలు, సిద్ధాంతకర్త, అత్యున్నత సాంకేతిక నిపుణుడిగా, సామాజిక బాధ్యత మరువని మేధావిగా ఉన్న నందన్ నీలేకనికి 'యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ- ఆధార్) బాధ్యతలను నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అప్పగించారు. దేశీయ పౌరులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య, పేరు, లింగం, వయస్సు, చిరునామా, వారి వేలిముద్రలు, కనుపాపలు (ఐరిస్) ఫొటోతో సహా ప్రభుత్వం దగ్గర నిక్షిప్తం చేయాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే వేర్వేరు మంత్రిత్వశాఖల మధ్య వివాదాలు, కోర్టు కేసుల నేపథ్యంలో పనులు పెద్దగా ముందుకు సాగలేదు. 2014 ఎన్నికల్లో పోటీచేసేందుకు నీలేకని యూఐడీఏఐ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి, బెంగళూరు దక్షిణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున లోక్‌సభకు పోటీచేసి, ఓడిపోయారు. 2014 మే నెలలో అధికారంలోకి ఎన్‌డీఏ నేతృత్వంలోని, నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా కూడా ఆధార్ గురించి వివరించేందుకు సమయం కోరిన నీలేకనికి ప్రధాని మోదీ సమయం ఇచ్చారు. ఆధార్ ఆవశ్యకతపై నీలేకని వివరించిన తీరు, అతి తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ, అవినీతి తగ్గించే వీలు, సబ్సిడీల దుర్వినియోగం అరికట్టే అవకాశం వంటివి మోదీని ఆకట్టుకున్నాయి. ఆధార్ ప్రయోజనాలపై నమ్మకం, నీలేకని సామర్థ్యంపై విశ్వాసం ఉంచిన మోదీ. ప్రాజెక్టు కొనసాగేందుకు మొగ్గుచూపడం ద్వారా, దేశ విశాల ప్రయోజనాలకే పెద్దపీట వేశారు.

ఈ ప్రాజెక్టు ఎందుకంటే..

దేశంలోని రాష్ట్రాల్లో జనాభా లెక్కలు, ఓటర్ల జాబితాలు ఉంటాయి. విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారిలో ఎక్కువమంది ఈ జాబితాల్లో ఉండేవారు కాదు. ఇక కూలీ పనుల నిమిత్తం వలస వెళ్లే కార్మికులు, నిరుపేదల పరిస్థితి చెప్పనక్కరలేదు. వీరికి గుర్తింపునకు ఎటువంటి ధ్రువీకరణలు ఉండనందున, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందలేకపోయేవారు. దేశంలోని 120 కోట్ల మందికీ, ఆధార్ కార్డుల ద్వారా ప్రత్యేక ధ్రువీకరణ కల్పించే ఉద్దేశంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే ఈ తరహా ప్రాజెక్టుల్లో అతి పెద్దది.

చిన్న బృందంతో ప్రారంభించి..

పదవి చేపట్టిన వారాల్లోనే కొద్దిమంది ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులతో చిన్న బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రాజెక్టు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సేకరించిన వివరాలు, అందుకు కావాల్సిన వసతులు, ప్రభుత్వాలు, సంస్థల భాగస్వామ్యం వంటివీ నిర్ణయించుకున్నారు. నీలేకని ప్రతి రాష్ట్రానికీ వెళ్లి, ముఖ్యమంత్రులు, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో సంప్రదింపులు జరిపి, తమకు కావాల్సిన వివరాలు, సహకారం వివరించి, ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో, వారి నుంచి పూర్తి సహకారం పొందగలిగారు. అప్పటి ప్రధాని, ఆర్థిక మంత్రి ఇందుకు పూర్తి సహకారం అందించారు.

2016 నవంబరులో పెద్దనోట్ల రద్దు అనంతరం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే చర్యల కోసం నీలేకనిని, ప్రభుత్వానికి డిజిటల్ సలహాదారుగా మోదీ ప్రభుత్వం నియమించడం ఆయన సామర్థ్యానికి మరో మచ్చుతునక.

ఉద్యోగులకు సిక్కా నచ్చలేదా?

ఈనాడు, హైదరాబాద్: అనూహ్యంగా ఇన్ఫోసిస్ కొత్త ఛైర్మన్‌గా నందన్ నీలేకనిని నియమించడంపై కంపెనీలోని పైస్థాయి నుంచి కింద స్థాయి వరకూ అధిక శాతం మంది ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. నందన్ నీలేకని మాటల మనిషి కాదని.. చేతల మనిషని చెబుతున్నారు. టెక్నాలజీపై మంచి పట్టున్న, సామర్థ్యం కలిగిన వ్యక్తన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో సిక్కాపై ఎక్కువ శాతం మంది ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సిక్కా వెళ్లిపోతే కంపెనీకి వచ్చే నష్టమేమీ లేదంటున్నారు. సిక్కా కంపెనీ నుంచి బయటకు వెళతాడన్న విషయం 3 నెలల క్రితం నుంచే కంపెనీలోని ఉద్యోగులకు తెలుసని, గత నెల, నెలన్నర నుంచి సిక్కా పెద్దగా ఏ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని చెబుతున్నారు. 'గత మూడేళ్లలో ఆయన తీసుకువచ్చిన పెద్ద మార్పులేమీ లేవు. ఉద్యోగులకు వేతనాలను పెంచలేదు. చిన్న, చిన్న కారణాలపై ఉద్యోగులను ఇబ్బంది పెట్టారు. జీరో బెంచ్ విధానం వంటివి ఆయన రాకముందు నుంచే ఉన్నాయి. నీలేకని మళ్లీ పగ్గాలు చేపడితే ఇన్ఫోసిస్‌కు మంచి జరుగుతుంది. అన్ని అంశాలు సర్దుకుంటాయి. ఆయనకు అంతా తెలుసు, అందుబాటులో ఉంటార'ని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఉద్యోగి ఒకరు తెలిపారు. ఇన్ఫోసిస్ ఉద్యోగులు ఇప్పటి వరకూ ఉన్న సహ ఛైర్మన్ రవి వెంకటేశన్ కలిసి మూర్తిని బోర్డు నిందించడంపై తమ అసంతృప్తిని కూడా వ్యక్తం చేశారు. మూర్తికి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ ఛైర్మన్ శేషశాయి, సహ ఛైర్మన్ రవి వెంకటేశన్ రాజీనామాలు చేయడం ఒక మంచి పరిణామమేనని అయితే.. ఇంత తొందరగా మార్పు వస్తుందనుకోలేదని చెబుతున్నారు.

నీలేకని రాక వెనక

సంక్షోభం: సిక్కా ఆగస్టు 18న వైదొలిగాక కంపెనీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అదే రోజున బోర్డు ఎన్నడూ లేనివిధంగా సిక్కా రాజీనామాకు కారణం మూర్తి వ్యక్తిగత దూషణలేనని ఆరోపించింది.

ఆరోపణలు: గత కొద్ది నెలలుగా కంపెనీలో కార్పొరేట్ పాలన విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని మూర్తి, ఇతర మాజీ ఎగ్జిక్యూటివ్‌లయిన వి. బాలకృష్ణన్ వంటి వారు ఆరోపిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా పనయా కొనుగోలు విషయంలో తీవ్ర ఆరోపణలు ఎదురయ్యాయి.

లేఖా పర్వం: మొన్నటికి మొన్న హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్, బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సహా డజను సంస్థాగత మదుపర్లు నీలేకనిని వెనక్కి తీసుకురావాలని బోర్డుకు లేఖ రాశారు. మూర్తికి 3%పైన, నీలేకనికి 2%పైగా వాటా ఉండడంతో బోర్డు తలొగ్గకతప్పలేదు.

నేపథ్యం: నీలేకని 2002-2007ల మధ్య కంపెనీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన సమయంలో డాలర్లలో ఆదాయం 42% మేర సమ్మిళిత వృద్ధిని సాధించింది. ఆధార్ ప్రాజెక్టును అత్యంత విజయవంతం చేసిన ఘనతా ఈయనదే.కంపెనీ వృద్ధికి, క్లయింట్లను రాబట్టుకోవడానికి అది ఉపయోగపడుతుందని విశ్లేషకులు అంటున్నారు.

విశ్వాసం: క్లయింట్ల, వాటాదార్ల, ఉద్యోగులకు నీలేకనిపై విశ్వాసం ఉందని సంస్థాగత మదుపర్లు వాదించడం కూడా ఒక కారణం. దీంతో ఒక రోజు తర్వాత అంటే గురువారం రాత్రికల్లా బోర్డు ఏకగ్రీవంగా నీలేకనిని నియమిస్తూ.. తీర్మానం చేసింది.

పాయ్‌కి ముందే తెలుసా?



ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తులో కంపెనీ నిర్వహణ మార్గాలపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణ మూర్తితో ప్రధాన మదుపర్లు చర్చిస్తున్నారని ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) టి.వి.మోహన్‌దాస్ పాయ్ వెల్లడించిన కొద్ది సేపటికే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. ఇన్ఫోసిస్ మాజీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనికి మళ్లీ కంపెనీ పగ్గాలు అప్పజెప్పడంపై కంపెనీ సహ వ్యవస్థాపకులందరూ కలిసి నిర్ణయం తీసుకోగలరని పాయ్ తెలిపారు. ఇన్ఫోసిస్ ఛైర్మన్, సహ ఛైర్మన్‌లు కొద్ది రోజుల్లోనే ఆ పదవుల నుంచి తప్పుకోగలరని, కొత్త ఛైర్మన్ నియామకం జరగగలదని పేర్కొన్నారు. 'నీలేకని మళ్లీ రావాలని చాలా మంది మదుపర్లు కోరుతున్నారు. వ్యవస్థాపకులు కలిసి సమావేశమై నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం మూర్తికి ఆరోగ్యం బాగాలేదు. వ్యవస్థాపకులందరూ ఒక తాటిపై ఉన్నారు. ఇన్ఫోసిస్‌లోని పరిణామాలపై ఇతర సహ వ్యవస్థాపకులు మాట్లాడడం లేదు. మూర్తి వారి ప్రతినిధి' అని పాయ్ అన్నారు. ప్రస్తుత బోర్డు రద్దయి కొత్త బోర్డు రావాలని కోరుకుంటున్న ఉద్యోగులు, మదుపర్లు, ఇతర భాగస్వాములు ఎక్కువ అవుతున్నారని పాయ్ వివరించారు.

ఆ'నందన'మే

నందన్ నీలేకని ఇన్ఫీ గూటికి తిరిగి రావడం మదుపర్లలో నవోత్సాహాన్ని నింపుతుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. విశాల్ సిక్కా రాజీనామా అనంతర రెండు రోజుల్లో షేరు సుమారు 20% వరకు పతనమైన సంగతి తెలిసిందే. కంపెనీ మార్కెట్ విలువ కూడా రూ.30,000 కోట్ల వరకు ఆవిరైంది. ఆఖరుకు రూ.13,000 కోట్ల బైబ్యాక్ ఆఫర్ కూడా షేరు పతనాన్ని ఆపలేకపోయింది. అయితే నందన్ నీలేకని ఇన్ఫీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టొచ్చనే వార్త గుప్పుమనడంతో ఇన్ఫీ షేరు బుధ, గురువారం 5% వరకు పెరిగింది. ఇన్ఫీ ఛైర్మన్‌గా నీలేకని బాధ్యతలు చేపట్టాలని మదుపర్లు ఎంతలా కోరుకుంటున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో (ఎన్‌వైఎస్ఈ) కంపెనీ ఏడీఆర్‌లు 1 శాతం వరకు పెరగడం కూడా మదుపరి సెంటిమెంటు పెరిగిందనడానికి సంకేతమని అంటున్నారు. నందన్ నీలేకని గతంలో ఇన్ఫోసిస్‌కు సీఈఓగా పని చేసిన 2002- 2007 మధ్య కూడా కంపెనీ షేరు మదుపర్లకు అద్భుతమైన ప్రతిఫలాలను పంచింది. కంపెనీ మార్కెట్ విలువైతే 374 శాతం వరకు పెరిగింది. ఆ సమయంలో మరో ఐటీ దిగ్గజం విప్రో మార్కెట్ విలువ 110 శాతమే పెరగడం గమనార్హం. ఒక్క షేరు విషయంలోనే కాదు ఆయన హయాంలో కంపెనీ పనితీరు కూడా ఆకర్షణీయమే. 2002- 2007 మధ్య లాభాదాయాల్లో ఏటా సుమారు 40% వరకు వృద్ధి నమోదైంది. ఆ సమయంలో మిగతా ఐటీ కంపెనీలకు మించి ఇన్ఫీ రాణించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మళ్లీ ఇప్పుడు నందన్ నీలేకని ఇన్ఫీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా కంపెనీకి ఆనాటి శోభ తిరిగి తీసుకొస్తారని మదుపర్లు ఆశాభావంతో ఉన్నారు. అందుకే సిక్కా రాజీనామా చేసిన మరుక్షణం నుంచే నందన్ నీలేకనిని తీసుకొని రావాలనే అభిప్రాయాన్ని చాలా మంది వ్యక్తం చేశారు.

బోర్డు సభ్యులు

విశాల్ సిక్కా	✗	(ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్)
ఆర్.శేషశాయి	✗	(ఛైర్మన్)
ప్రవీణ్ రావు	✓	(తాత్కాలిక సీఈఓ)
★ రవి వెంకటేషన్	✗	(సహ ఛైర్మన్)
జాన్ డబ్ల్యూ ఎచ్‌మెండీ	✗	(స్వతంత్ర డైరెక్టరు)
జెఫ్రీ సీన్ లేమాన్	✗	(స్వతంత్ర డైరెక్టరు)
కిరణ్ మజుందార్‌షా	✓	(స్వతంత్ర డైరెక్టరు)
ప్రహ్లాద్, సుందరం	✓	(స్వతంత్ర డైరెక్టరు)
రూప, పునీత	✓	(స్వతంత్ర డైరెక్టరు)

★ డైరెక్టర్‌గా బోర్డులో కొనసాగుతారు


ఆర్.శేషశాయి


విశాల్ సిక్కా



రవి వెంకటేషన్

ఆర్.శేషశాయి: చార్టర్డ్ అకౌంటెంట్ అయిన శేషశాయి 2011లో ఇన్ఫీ బోర్డులోకి వచ్చారు. ఆ తర్వాత కంపెనీ ఛైర్మన్‌గా నియమితులయారు. ఇప్పుడు ఈ రెండు పదవులకు రాజీనామా చేశారు. హిందుస్థాన్ యునిలీవర్‌తో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన అశోక్ లేలాండ్‌లో వైస్‌ఛైర్మన్‌సహా పలు కీలక బాధ్యతలను నిర్వహించారు.

రాజీనామా చేసింది వీరే..

విశాల్ సిక్కా: అమెరికా కంపెనీ ఎస్ఏపీలో వివిధ ఉన్నత స్థాయి పదవులు నిర్వర్తించిన సిక్కా 2014లో ఇన్ఫోసిస్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే ఆ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్‌గా నియమితులైన ఆయన తాజాగా కంపెనీ బోర్డు నుంచి కూడా వైదొలిగారు.

రవి వెంకటేశన్: 2004- 2011 మధ్య మైక్రోసాఫ్ట్ ఇండియాకు ఛైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఇన్ఫోసిస్ బోర్డులోకి అడుగుపెట్టారు. సహ ఛైర్మన్‌గా, స్వతంత్ర డైరక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. తాజాగా సహ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. బోర్డులో మాత్రం కొనసాగనున్నారు.



జెఫ్రీ ఎస్ లేమాన్ : ఎన్‌వైయూ షాంఘైకి వ్యవస్థాపక వైస్ ఛాన్స్‌లర్. ఆ తర్వాత ఛాన్స్‌లర్‌గా కూడా ఉన్నారు. పెకింగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ట్రాన్స్‌నేషనల్ లాకి వ్యవస్థాపక డీన్‌గానూ పనిచేశారు.



జాన్ డబ్ల్యూ ఎచ్‌మెండీ: వృత్తిరీత్యా ఆచార్యులు (ప్రొఫెషర్). స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీకి హెడ్‌గా ఉన్నారు. సింబాలిక్ సిస్టమ్స్ ప్రోగ్రామ్‌లో ఫ్యాకల్టీ సభ్యుడిగా ఉన్నారు. ఎక్సెలెన్స్ ఇన్ టీచింగ్ విభాగంలో డీన్, బింగ్ అవార్డులు ఆయన పొందారు. పలు పుస్తకాలను, వ్యాసాలను కూడా రాశారు.

ఈనాడు సినిమా

లవకుమార్ వచ్చేశాడు!


ఎన్టీఆర్

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. రాశీ ఖన్నా కథా నాయిక. బాబి దర్శకుడు. కల్యాణ్‌రామ్ నిర్మాత. ఇది వరకు 'జై' పాత్రని పరిచయం చేస్తూ ఓ టీజర్‌ని విడుదల చేశారు. గురువారం లవకుమార్ టీజర్ వచ్చేసింది. 'హాయ్... నా పేరు లవకుమార్. ఓ ప్రైవేటు బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్నా' అనే ఎన్టీఆర్ డైలాగ్‌తో ఈ టీజర్ మొదలైంది. 'నాకో వీక్‌నెస్ ఉంది. అదే.. మంచితనం. అది పుస్తకాల్లో ఉంటే పాఠం అవుతుంది. మనలో ఉంటే గుణపాఠం అవుతుంది' అంటూ తనని తాను పరిచయం చేసుకొన్నాడు లవకుమార్. ఇక కుశల్ ఎలా ఉంటాడో చూడాలి. ఈ దసరాకి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. సెప్టెంబరు మొదటి వారంలో పాటల్ని విడుదల చేస్తారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్


శర్వానంద్, మెహరీన్

శుభ్రత... పరిశుభ్రత

అతని పేరు ఆనంద్. అతనికి ఓసీడీ ఉంది. ఓసీడీ అంటే ఎల్ఈడీ, ఎల్‌సీడీలా టీవీ కాదు. అదో జబ్బు. శుభ్రత లేకపోతే కొన్ని రోగాలొస్తుంటాయి. కానీ అతని రోగమే అతి శుభ్రత. ఏదైనా సరే పరిశుభ్రంగా ఉండాలి. షేక్ హ్యాండ్ ఇవ్వాలన్నా.. చేతుల్ని సబ్బుతో కడిగి ఇవ్వాల్సిందే. ఆఖరికి ప్రియురాలు ముద్దు పెట్టడానికి రొమాంటిక్‌గా దగ్గరకు వచ్చినా సరే.. ఇంకోసారి పళ్లు తోముకుని రావొచ్చు కదా? అనేంత శుభ్రత. అతని అతి శుభ్రత వల్ల ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు మారుతి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మహానుభావుడు'. శర్వానంద్ కథానాయకుడు. మెహరిన్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ సంస్థ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. గురువారం టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "శర్వానంద్‌తో చేస్తున్న మూడో చిత్రమిది. టీజర్ చూస్తేనే ఆయన పాత్ర ఎలా ఉండబోతోందో, ఎన్ని నవ్వులు పంచబోతోందో అర్థమవుతోంది. తమన్ పాటలు ఆకట్టుకొంటాయి. దసరాకి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"న్నారు.


ఏడేళ్ల తర్వాత కలసి!


అజయ్‌దేవగన్, కాజోల్

వెండితెరపై అజయ్‌దేవగణ్- కాజోల్‌ది కూడా మంచి జోడీయే. నిజ జీవితంలోనూ మంచి భార్యాభర్తలుగా మెలుగుతున్నారు. ఈ జంట వెండితెరపై కలిసి నటించి ఏడేళ్లు అయింది. ఈ ఇద్దరూ కలిసి నటిస్తారనే వార్తలు వస్తున్నా ఎవరూ పూర్తిస్థాయిలో ధ్రువీకరించ లేదు. ఇప్పుడు ఈ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కబోతుంది. ఈ చిత్ర దర్శకుడు ప్రదీప్ సర్కార్ మాట్లాడుతూ "అజయ్ దేవగణ్, కాజోల్ జంటగా మా చిత్రం తెరకెక్కుతోంది. త్వరలోనే ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లనుంద"ని చెప్పారు. 2010లో వచ్చిన 'తూన్‌పుర్ క సూపర్ హీరో' తర్వాత అజయ్, కాజోల్ కలిసి నటించలేదు. 'యు మీ జౌర్ హమ్', 'రాజు చాచా', 'దిల్ క్యా కరేగా', 'ఇష్క్' తదితర చిత్రాలు ఈ జోడీకి మంచి గుర్తింపు తెచ్చాయి.

బాలకృష్ణ... ఎన్టీఆర్‌లా!

నందమూరి బాలకృష్ణ 101వ చిత్రం 'పైసా వసూల్'లో చాలా ప్రత్యేకతలున్నాయి. ఈ సినిమా కోసం బాలయ్య తొలిసారి గొంతు సవరించుకొన్నారు. అంతేకాదు తొలిసారి నాన్న ఎన్టీఆర్‌లా స్టెప్పులు వేశారు. ఇన్నేళ్ల సినీ జీవితంలో ఎప్పుడూ తండ్రిని అనుకరిస్తూ డ్యాన్సులు చేయలేదు. కానీ 'పైసా వసూల్'లో ఎన్టీఆర్‌ని అనుకరిస్తూ చిందులు వేశారు. ఈ సినిమా కోసం 'జీవిత చక్రం' సినిమాలోని 'కొంటె నవ్వు చెబుతోంది' అనే గీతాన్ని రీమిక్స్ చేశారు. ఆ పాటలో బాలయ్య.. ఎన్టీఆర్‌లా స్టెప్పులు వేశారు. బాలకృష్ణ - ముస్కాన్‌లపై పోర్చుగల్‌లోని ఒబిడోస్ అనే గ్రామంలో ఈ పాటని తెరకెక్కించారు. ఈ గ్రామానికి పదహారు వందల ఏళ్లనాటి చరిత్ర ఉందట. "కొంటె నవ్వు చెబుతోంది అనే గీతమంటే పూరి జగన్నాథ్‌కి చాలా ఇష్టం. ఎన్నో వందలసార్లు ఈ పాట విన్నారు. ఆ ఇష్టంతోనే 'పైసా వసూల్'లో ఈ పాటని రీమిక్స్ చేశారు. ఈ పాటలో బాలకృష్ణ కాస్ట్యూమ్స్ కొత్తగా కనిపించనున్నాయి. పాత తరం లుక్ కనిపించడం కోసం కాస్ట్యూమ్స్‌లో ప్రత్యేక రంగులు వాడాం" అని చిత్రబృందం చెబుతోంది. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఆనంద్ ప్రసాద్ నిర్మాత. సెప్టెంబరు 1న విడుదల కానుంది. గురువారం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి.


'పైసా వసూల్'లో బాలకృష్ణ

పంచ్ డైలాగ్

నువ్వు బాక్సింగ్‌ని అడ్డం పెట్టుకొని బతకాలనుకున్నావ్... అది బాక్సింగ్ కోసం చచ్చిపోద్ది!

చిత్రం: గురు

- పంపినవారు: జోగిపర్తి ప్రసాద్, బుచ్చిరెడ్డిపాలెం


సమంత

మళ్లీ మళ్లీ కోరుకొంటారు!


హిట్ పెయిర్ అనే మాటకు చిత్రసీమలో చాలా ప్రాముఖ్యం ఉంది. విజయవంతమైన జోడీలను మళ్లీ మళ్లీ చూడాలని ప్రేక్షకులు కోరుకొంటారు. వాళ్లతో సినిమాలు చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తుంటారు. అదో సెంటిమెంట్ కూడా. మీరూ ఇలాంటి సెంటిమెంట్లని నమ్ముతారా? అని సమంతని అడిగితే "హిట్ పెయిర్ అనేది సెంటిమెంట్ అవునో కాదో తెలీదు గానీ, వాళ్లని మరోసారి వెండి తెరపై చూడాలని అభిమానులు కోరుకొంటుంటారు. పనిచేసిన వాళ్లతోనే మరోసారి జట్టు కడితే... మా పనీ సులభం అవుతుంది. మహేష్‌బాబు, ఎన్టీఆర్, నాగచైతన్యతో ఎక్కువ సినిమాలు చేశా. ఓ కథానాయకుడు సెట్లో ఎలా ఉంటాడు, బయట ఎలా ఉంటాడు? ఏయే సన్నివేశాల్లో ఎలా నటించగలడు అనే విషయాల్లో అవగాహన ఏర్పడుతుంది. దాంతో సులభంగా ప్రయాణం చేయగలం. ఒకరి బలాలు, బలహీనతలు మరొకరికి తెలుసు కాబట్టి వాటిని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. సెట్లోనూ వాతావరణం బాగుంటుంది. అందుకే హిట్ పెయిర్‌తో సినిమాలు చేయాలని ఎలా కోరుకొంటారో, అలాంటి జోడీల్లో నేనూ ఉండాలని భావిస్తుంటా" అంటోంది సమంత.

కష్టం నష్టం ఎదురైనా
నచ్చినదే చేసేద్దాం
అలవాటైతే చేదైనా తకదిమితోం
తప్పో ఒప్పో చేసేద్దాం
తొలి అడుగే వేసేద్దాం
అనుభవమైతే ఏదైనా తకదిమితోం
కృషి ఉంటే నీ వెంటేరా ఈ లోకం

గీతం: తకదిమితోం తకదిమితోం...
చిత్రం: ఆర్య
రచన: సురేంద్రకృష్ణ
- పంపినవారు: పి. బాలాజీ నాయుడు, ఢిల్లీ

గీతోపదేశం

రాబోయే నలభై ఏళ్లలో ఎలా ఉంటారు?


లావణ్య త్రిపాఠి, సందీప్‌కిషన్

సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన ద్విభాషా చిత్రం 'ప్రాజెక్టు జెడ్'. హిందీ నటుడు జాకీ ష్రాఫ్ ప్రతినాయకుడిగా నటించారు. సి.వి.కుమార్ దర్శకత్వం వహించారు. ఎస్‌కె.బషీద్, ఎస్‌కె.కరీమున్నీసా నిర్మాతలు. విడుదలకి సిద్ధమైంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాతల్లో ఒకరైన ఎస్‌కె.బషీద్ మాట్లాడుతూ "మనుషులు నలభై ఏళ్ల క్రితం ఎలా ఉన్నారు? రానున్న నలభై ఏళ్లలో ఎలా ఉండబోతున్నారనే అంశాలను చూపిస్తూ తెరకెక్కించాం. భిన్నమైన పోకడలతో ప్రవర్తించే పోలీసు అధికారి పాత్రను సందీప్‌కిషన్ పోషించారు. లావణ్య త్రిపాఠి వైద్య విద్యార్థినిగా నటించింది. జాకీష్రాఫ్ నాలుగొందల ఏళ్లు బతకాలని కోరుకునేవ్యక్తిగా కనిపిస్తాడు. ఇందులో మూడు పాటలున్నాయి. ఈ చిత్రకథలో నేపథ్యసంగీతానికీ ప్రాధాన్యముంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతుల్ని పంచే కథాకథనాలతో దర్శకుడు రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబర్ రెండో వారంలో విడుదల చేస్తామ"న్నారు. ఈ చిత్రానికి మాటలు:శశాంక్ వెన్నెలకంటి, సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: గోపి అమర్‌నాథ్

ఆ గొప్పతనం యువ దర్శకులదే!


కరీనాకపూర్

"ప్రతి ఒక్కరూ గమనించే ఉండుంటారు. ఇప్పుడొస్తున్న చిత్రాల్లో మహిళల్ని ప్రగతిశీల మార్గంలో ఎక్కువగా చూపిస్తున్నారు. ఈ విషయంలో నాకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందని"అంటోంది కరీనాకపూర్. ఓ బిడ్డకు జన్మనిచ్చాక కూడా సినిమాలపై కరీనాకు ప్రేమ తగ్గలేదు. అందం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొంటూ ముందుకెళుతోంది. "మహిళల్ని గొప్పగా చూపిస్తున్న క్రెడిట్ నేటితరం యువ రచయితలు, దర్శకులకే దక్కుతుంది. మహిళా పాత్రల్ని ఉన్నతంగా చూపించడంలో యువ దర్శకులు వందశాతం విజయం సాధిస్తున్నారు. ఇలాంటి సినిమాల్ని ప్రేక్షకులు చక్కగా ఆదరించడం మరో మంచి పరిణామం" అంది కరీనా. ఆమె నటించిన చివరి చిత్రం 'ఉడ్తా పంజాబ్'. ఆ తర్వాత ఓ బిడ్డకు జన్మనివ్వడంతో కొన్ని నెలలు సినిమాలకు దూరంగా ఉంది. ఇప్పుడు షూటింగ్లో పాల్గొంటుంది. "నేను ఎప్పుడూ వ్యక్తిగతం, వృత్తిగతం... రెండింటినీ వేరుగానే చూస్తాను. నా బిడ్డ తైమూర్‌తో షూటింగ్‌లకు రావడం ఇబ్బందిగా ఉన్నా సర్దుకుపోతున్నాను. నేటి ఆధునిక మహిళలు జీవితంలో అనేక పాత్రలు పోషిస్తున్నారు. నేనూ అలాంటిదాన్నే. అంతే కానీ హీరోయిన్ కాబట్టి ప్రత్యేకత ఏమీ లేదు"అని చెప్పింది కరీనా. వివాహం...వ్యక్తిగత జీవితం...నటన... ఈ మూడూ తనకు ముఖ్యమే అని చెబుతోంది కరీనా. "పెళ్లైనా...తల్లైనా నా ఐడెంటిటీనీ ఎప్పటికీ కోల్పోను"అని చెప్పింది కరీనా.

స్పందించ లేదు: కరీనా ప్రస్తుతం 'వీరే దె వెడ్డింగ్'లో నటిస్తోంది. దీని తర్వాత ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో ఓ బయోపిక్‌లో నటించనుందని సమాచారం. కానీ ఈ విషయంపై కరీనా నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

'ప్రేమిక' పాటలు


తనీష్, శృతియుగళ్

తనీష్, శృతియుగళ్ జంటగా నటించిన చిత్రం 'ప్రేమిక'. మహేంద్ర దర్శకుడు. దేశాల లక్ష్మయ్య నిర్మాత. దిలీప్ బండారి స్వరకర్త. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని దిలీప్ బండారి ఆవిష్కరించారు. ఆడియో సీడీలను దర్శకుడు త్రినాధరావు నక్కిన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "విన సొంపైన పాటలతో ప్రేమకథని దర్శకుడు తెరకెక్కించార"న్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు రసమయి బాలకిషన్ మాట్లాడుతూ "సందేశంతో కూడిన ప్రేమకథని తెరకెక్కించిన దర్శకనిర్మాతలను అభినందిస్తున్నాను" అని చెప్పారు. చిత్రదర్శకుడు మాట్లాడుతూ "ఈ ప్రేమకథ భావోద్వేగభరితంగా నడుస్తుంది. వాణిజ్యాంశాలతో ఆసక్తిగా తెరకెక్కించామ"న్నారు. తనీష్ మాట్లాడుతూ "నా కెరీర్‌లోనే చక్కటి ప్రేమకథా చిత్రం. దిలీప్ సంగీతం, రాహుల్ ఛాయాగ్రహణం సినిమాకి బలమ"న్నారు. "ఎనిమిది పాటలు కథానుగుణంగానే ఉంటాయ"న్నారు సంగీతదర్శకుడు. నిర్మాత మాట్లాడుతూ "యువత ప్రేమిస్తే సరిపోదు, సాధించుకునేందుకు ప్రయోజకులుగా మారాలనే సందేశాన్ని చెప్పాం. సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. ఈ కార్యక్రమంలో మన్నెం గోవర్ధన్‌రెడ్డి, కోవ లక్ష్మి, పురాణం సతీష్, బుక్కా గోపాల్, బొంతు శ్రీదేవి, ఉమ, చిన్మయి, గణేష్, గట్టు రామచంద్రరావు, కె.పి.చౌదరి, వైభవ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నన్నొదిలి 'వెళ్లిపోమాకే'


నిత్య, విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, నిత్య జంటగా నటించిన చిత్రం 'వెళ్లిపోమాకే'. యాకూబ్ అలీ దర్శకుడు. సెప్టెంబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ "ఈ సినిమా చూశా. బాగా నచ్చింది. మంచి చిత్రాల్ని ప్రోత్సహిస్తే ప్రతిభావంతులు మరింతగా వెలుగులోకి వస్తారు. అందుకే విడుదల చేయడానికి ముందుకొచ్చా. అనుపమ్ ఖేర్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకొన్నాడు విశ్వక్. సంగీత దర్శకుడు ప్రశాంత్.. రెహమాన్ స్కూల్‌లో సంగీత పాఠాలు నేర్చుకొన్నాడు. ఈ బృందం చేసిన కృషి ఫలిస్తుందన్న నమ్మకం ఉంద"న్నారు.

మరోసారి ప్రేమిస్తే


భరత్, అంగనా రాయ్

'ప్రేమిస్తే' భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మళ్లీ ప్రేమిస్తే'. రవి భార్గవన్ దర్శకుడు. జాన్ సుధీర్ పూదోట నిర్మాత. వచ్చే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రేమలో విఫలమైన ఓ ప్రేమికుడి కథ ఇది. ఓ అమ్మాయి మోసం చేస్తే అతడు ఎలా స్పందించాడు? తన ప్రేమని ఎలా సాధించుకొన్నాడు? అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. విజయ్ కురాకుల సంగీతం అందించారు. అయిదు పాటలున్నాయ"న్నారు. కాశీ విశ్వనాథ్, సురేఖా వాణి, సన, కోటేశ్వరరావు తదితరులు నటించారు.

వసుంధర

ధగధగల దుపట్టా!

కాంజీవరం సొగసు... పోచంపల్లి చీరల హొయలు మనకు తెలుసు. కానీ ఆధునిక అమ్మాయిల ఫ్యాషన్లకి సరిపోయే విధంగా ఆ అందాలనే చూడముచ్చటైన దుపట్టాలుగా మార్చేస్తే? ఇకత్, కాంజీవరం, గద్వాల్ అందాల దుపట్టాలుగా దర్శమిస్తుంటే చూపుతిప్పుకోగలమా? మరెందుకు ఆలస్యం. పండగ పూట నిండుదనం తెచ్చే ఈ దుపట్టాలపై ఓ లుక్కేయండి మరి...



మనోహరమైన నీలిరంగులో కనులవిందుగా కనిపిస్తున్న కాంజీవరం సోయగం.

చిలుకలూ, ఏనుగుల మోటిఫ్‌లతో చూడగానే ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన ఇకత్ దుపట్టా అందమిది.

గద్వాల్ సిల్క్ దుపట్టాపై పొదిగిన నెమలి మోటిఫ్‌లు... పండగల వేళ నిండు దనం తెస్తుందీ దుపట్టా.

రాణీరంగు అంచుతో హుందాగా కనిపిస్తున్న ముదురు గోధుమరంగు ఇకత్ సిల్క్ దుపట్టా గురించి వర్ణించ తరమా!.

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
040-23231147
సైఫాబాద్.

మోడల్: సంగీత, లావణ్య బబ్బర్, గీతిక
ఫొటోలు: డి. శ్రీనివాస్



మహాగణపతింతో మొదలుపెట్టా!

'హేయ్ రబ్బా' అంటూ పాప్ సంగీతంతో అలరించినా... 'ఎవరైనా చూసుంటారా? నడిచే నక్షత్రాన్నీ..' అంటూ కుర్రకారుని ఊపేసినా.. భక్తజనాన్నిఆధ్యాత్మిక పరవశంతో ఓలలాడించినా ఆ ఘనత పాప్ సింగర్ స్మితకే దక్కుతుంది. ఇప్పుడు వినాయక చవితి సందర్భంగా...గణపతి స్తుతిని రాక్ బ్యాండ్‌తో మేళవించి మరోసారి మన ముందుకు వస్తున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లో...

సంగీతానికి పరిధులు లేవు...దాన్ని ఎలా అయినా ఎంచుకోవచ్చు. చక్కని రాగం జతైతే అద్భుతంగా వినిపిస్తుంది. ఆ ఆలోచనతోనే ఆధ్యాతిక్మ సాహిత్యానికి రాక్ సంగీతం మేళవించాలన్న ఆలోచన వచ్చినప్పుడు గణపతి పాటతోనే మొదలుపెట్టాలనుకున్నా. ఈ పండక్కే విడుదల చేస్తున్నా. 'స్పిరిట్యువల్ ఫ్యూజన్ రాక్' పేరుతో ఈ వీడియోని రూపొందించా. ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే... కొన్నాళ్లక్రితం ఓ వేదికపై థియరీ పేరుతో ఓ వయొలినిస్ట్, కీబోర్డ్ ప్లేయర్, డ్రమ్మర్‌ల బృందం చేసిన ప్రదర్శన చూస్తే.. అద్భుతంగా అనిపించింది. వాళ్లతోనే నేనేదైనా ఆల్బమ్ చేయాలనుకున్నా. నాలుగున్నర నిమిషాల నిడివితో 'మహా గణపతిం మనసా స్మరామి'ని ప్రయోగం చేశా. నెలరోజుల ప్రయత్నం... ఒకరోజు వీడియో షూట్‌తో అది పూర్తయ్యింది.

ఆల్బమ్‌లు కాకుండా.. శాస్త్రీయ సంగీతం, పాప్ బీట్స్ మాత్రమే కాదు ఇప్పుడు రాక్ కలిపి రూపొందించిన ఈ కొత్త ప్రయోగం కచ్చితంగా ఆకట్టుకుంటుందని నా నమ్మకం. ఆల్బమ్‌లు వాణిజ్యపరంగానే తయారు చేస్తారు. కానీ నేను మాత్రం ఈ ఆధ్యాత్మిక పాటల్ని కేవలం నా ఆత్మ సంతృప్తికోసమే రూపొందిస్తున్నా. కొన్నేళ్లక్రితం శివరాత్రికి ఈషా ఫౌండేషన్ కోసం 'ఇషానా ఆల్బమ్' విడుదల చేశా. ఇప్పుడు ఈ పాట. ఇవనే కాదు.. అవకాశం వచ్చినప్పుడల్లా సినిమా పాటలూ పాడుతున్నా. అలా ఇప్పటివరకూ వందవరకూ పాడి ఉంటా. నేను పాడిన వాటిల్లో 'ఎవరైనా చూసుంటారా... నడిచే నక్షత్రాన్ని' అనే పాటకు ఎక్కువ గుర్తింపు వచ్చింది.

పాకం పట్టేముందు...



- పాకం పట్టేటప్పుడు అందులో కొద్దిగా పాలు పోయాలి. పాకంలో తుక్కు ఏదయినా ఉంటే.. పైకి తేలుతుంది.
- పిండివంటలు చేస్తున్నప్పుడు నూనె ఎక్కువగా పీల్చకుండా ఉండాలన్నా.. పైకి చిందకుండా ఉండాలన్నా అందులో కొద్దిగా చింతపండు వేయాలి.
- గారెలూ, బూరెల్లాంటివి చేస్తుంటే... తరవాత బాణలిని వెనిగర్ కలిపిన నీటిలో కాసేపు ఉంచి. . కడగాలి. జిడ్డు వదులుతుంది.

వినాయక చవితి అంటే బోలెడు సందడి....చవితి పందిళ్లలోనే కాదు...ఇంట్లో పెట్టుకునే బొజ్జగణపయ్యను ఉంచే వేదికా చక్కగా అలంకరించుకోవాలని ఆలోచిస్తున్నారా... అయితే ఈ సూచనలు మీకోసమే.

గణపతి పందిరి ముచ్చటగా!



పండగ వేళ పూలు తెచ్చే శోభ అంతా ఇంతా కాదు... చామంతి, బంతి, గులాబీలతో పూజా వేదికను అలంకరించుకోవాచ్చు. అందుకోసం కావలసిన ఎత్తులో నాలుగు వెదురు కర్రల్ని ఎంచుకుని ఫ్రేమ్‌లా తయారుచేసుకోవాలి. లేదా రెడీమేడ్‌గా ఫ్రేమ్‌లు లభిస్తాయి. వాటినీ ఎంచుకోవచ్చు. దానికి తెలుపు రంగులో ఉండే వస్త్రాన్ని జతచేసుకోవాలి. ఇప్పుడు అరటిఆకుల్ని అరచేతిలో పట్టేట్టు గుండ్రటి పరిమాణంలో కత్తిరించుకోవాలి. వాటిని రెండు చొప్పున తీసుకుని దానిపై పెట్టి ఓ గులాబీ, ఓ చామంతి కలిపి కుట్టుకోవాలి. చివరిగా సూదీ దారంతో ఫ్రేమ్‌కి ఉన్న వస్త్రానికి జతచేసుకోవాలి. దీన్ని నేరుగా మీరు వినాయకపూజ చేయాలనుకున్న ప్రదేశంలో గోడకు ఆనిస్తే చాలు చక్కగా కనిపిస్తుంది. ఆపై బంతిపూల దండలు వేలాడదీస్తే ఆ అందమే వేరు.

- అరటి ఆకులను ఒకదాని చివర ఒకటి పేర్చుకుంటూ పైన చెప్పిన తరహాలో ఎంచుకున్న ఫ్రేమ్ వస్త్రానికి జత చేస్తూ రావాలి. చివరగా బంతిపూలతో మధ్యలో వినాయకుని ఆకృతిలో డిజైన్ చేసుకోవచ్చు. ముందు భాగంలో విగ్రహాన్ని ఉంచుకోవచ్చు. భలే అందంగానూ ఉంటుంది.
- పచ్చదనం తెచ్చే ప్రత్యేకత అంతా ఇంతా కాదు. దాన్ని మనం చవితి వేడుకల్లో అలంకరణకూ ఉపయోగించుకోవచ్చు. చిన్న చిన్న వెదురు బుట్టల్ని ఎంచుకుని వాటిల్లో మట్టిని నింపుకోవాలి. వాటిల్లో చిన్నచిన్న మొక్కల్ని నాటి.. మీరు పూజ చేసే చోట అమర్చుకోవచ్చు.
- మీరు పూజ చేసేచోట చుట్టూ వేయాలనుకుంటున్నారా. అయితే అవి చిన్నగా వేసి.. వాటిని పువ్వులూ, నవధాన్యాలూ, రంగులతో అలంకరించినా బాగుంటుంది.

జైబోలో.. చాక్లెట్ గణేష్!



చిన్నా... పెద్దా బొజ్జగణపయ్యని భలే ఇష్టపడతారు. రకరకాల రీతుల్లో కొలవడానికి ఆసక్తి చూపిస్తారు. అందుకే ఈసారి గణపయ్యని పర్యావరణ హితంగా కొలుద్దాం అని ఒకరంటే... మరొకరేమో మట్టితో ఎందుకు చాక్లెట్‌తోనే చేద్దాం అంటున్నారు. ఒకటేంటి... గణపతిపై ఉన్న ప్రేమని ఒక్కొక్కరు ఒక్కోరకంగా కొలుస్తున్నారు.



కుటుంబమంతా అదే పనిలో..

గణేశ చతుర్థి వచ్చిందంటే పర్యావరణ ప్రేమికులంతా మట్టి గణపతులకే ఓటేస్తారు. వరంగల్‌కు చెందిన గుండ వరపు లక్ష్మి, సరబోయిన రాధికలు గత కొన్నేళ్లుగా ఈ విగ్రహాలని తయారుచేయడమే కాదు వాటిని పదిమందికీ నేర్పిస్తున్నారు కూడా... లక్ష్మి వాళ్లాయన భిక్షపతి నలభై ఏళ్లనుంచి వరంగల్‌లో గణపతి విగ్రహాలను తయారుచేస్తున్నారు. అత్తారింట్లో అడుగుపెట్టిన తర్వాత లక్ష్మికూడా విగ్రహాల తయారీని నేర్చుకున్నారు. కొన్నేళ్లకు చేయి తిరిగిన కళాకారిణిగా మారారు. అంతేనా... తన తమ్ముడూ, మరదలు రాధికకి కూడా ఆ తయారీలో మెలకువలు నేర్పించారామె. లక్ష్మి దాదాపు 30 ఏళ్ల నుంచి గణపతి విగ్రహాలు చేస్తుండగా, రాధిక పదిహేనేళ్లుగా ఈ కళలో నైపుణ్యం పొందింది. బొమ్మ ఆకృతి చేయడం నుంచి నగిషీలు చెక్కి, అందమైన రంగులు వేసే వరకు అన్ని పనుల్లో నైపుణ్యం సాధించారు. గత పదేళ్ల క్రితం నుంచీ మాత్రం మట్టి విగ్రహాలపై సమాజంలో అవగాహన తీసుకొస్తూ పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలనే తయారుచేస్తున్నారు. ఏ తరహా వినాయక విగ్రహాన్ని అయినా తయారు చేయడం ఈమె ప్రత్యేకత. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పోలిస్తే మట్టి విగ్రహాలు చేయడం కష్టమేనంటున్నారు. మట్టిలో ఇసుక పాళ్లు ఎక్కువగా ఉంటే విగ్రహాలను మలచడం కాస్త కష్టం అంటారు లక్ష్మి. ఇప్పుడు ఇరుగుపొరుగు మహిళలకూ దీని తయారీలో శిక్షణ అందిస్తున్నారామె.

కాలుష్యం ఆపండి.. కడుపు నింపండి...





చిన్నారులకు ఇష్టమైన చిట్టి గణపతిని చాక్లెట్‌తోనే తయారుచేస్తూ పర్యావరణ సమస్యకు చెక్‌పెడుతున్నారు రింటూ కల్యాణి రాథోడ్. ఇలా చేయడం వల్ల కాలుష్యానికి చెక్‌పెట్టడమే కాదు... మరో వైపు నిరుపేద చిన్నారుల ఆకలినీ తీరుస్తున్నారు. కళ్యాణిరాథోడ్‌ది ముంబయి. గత ఆరేళ్లుగా వినాయక విగ్రహాన్ని ఇలా చాక్లెట్‌తోనే రూపొందిస్తున్నారామె. ఆ విగ్రహాన్ని పూజాధికాల తర్వాత పాలల్లో కరిగించి చిన్నారులకు అందిస్తారు. అంతేకాదు ఆసక్తి ఉన్నవారికి ఐదునిమిషాల్లో ఫైవ్‌స్టార్ చాక్లెట్‌తో బుజ్జి వినాయకుడిని ఎలా తయారుచేయాలో వీడియో ద్వారా వివరిస్తున్నారు. ఈ ఏడాది చిరుధాన్యాలతో వినాయకుడిని తయారుచేసి పూజ తరువాత వాటితో ఆహారాన్ని వండి నిరుపేద చిన్నారులకు అందించబోతున్నారు. ఈమె స్ఫూర్తితో హైదరాబాద్‌కు చెందిన ప్రసన్న కూడా పదమూడు కేజీల చాక్లెట్‌తో వినాయక విగ్రహాన్ని తయారుచేసింది. దాన్ని కూడా పూజ అయ్యాక పాలల్లో నిమజ్జనం చేసి.. ప్రసాదంలా పంచాలని నిర్ణయించుకుంది.

సహజ రంగులతో సిద్ధివినాయక




సహజరంగులు అద్దిన మట్టిగణపతి విగ్రహాలని పెద్ద ఎత్తున్న తయారుచేసి ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన తీసుకొస్తున్నారు కాలుష్య నియంత్రణా మండలి, ఆచార్య జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయం సభ్యులు. 18 టన్నుల సహజ రంగులు ఉపయోగించి లక్ష విగ్రహాలని ఎంతో చూడముచ్చటగా తయారు చేసిందీ బృందం. డాక్టర్ శారదాదేవి నేతృత్వంలోని అగ్రి బీఎస్సీ విద్యార్థులు సహజసిద్ధ గణపయ్యలని తయారుచేయడం విశేషం. మట్టివిగ్రహాలపై రంగుల కోసం బంతిపూలూ, వివిధ రకాల చెట్ల బెరడూ, గింజలు వాడి ఈ రంగులు తయారుచేయడంతో అవి నీళ్లలో కలిసినా పర్యావరణహితమే అంటున్నారీ విద్యార్థినులు.

బంగారం వెండి

24న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,764	2,770
వెండి (గ్రా)	41.70	42.00



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	30,100	29,900	29,900	29,900	29,570	29,630	29,990	29,990
ఆర్నమెంట్	-------	-------	27,800	27,750	27,680	27,680	27,640	27,700	27,590	27,590
వెండి(కిలో)	-------	-------	40,200	40,200	40,100	40,000	39,000	39,300	40,500	40,500

పద్ధతిగా.. పెట్టుబడులు వెనక్కి!


చిన్న మొత్తాలతో మదుపు చేయాలనుకునే వారికి మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ -సిప్) అనుకూలమైన పద్ధతి. మార్కెట్లో మదుపు చేయాలనుకునే వారి నుంచి దీనికి ఎంతో ఆదరణ లభిస్తోంది. ఫండ్లలో మదుపు చేయడమే కాదు.. ఆ పెట్టుబడి ప్రయోజనాలను వెనక్కి తీసుకునే విషయంలోనూ కొంత జాగ్రత్తగా ఉండాలి. అందుకోసం అందుబాటులో ఉన్న మార్గమే సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ). మరి, ఇది ఎలా పనిచేస్తుంది? దీని ప్రయోజనాలేమిటో చూద్దామా!



మంచి పనితీరు ఉన్న పథకాన్ని ఎంచుకొని, దానిలో దీర్ఘకాలిక దృష్టితో నెలనెలా నిర్ణీత మొత్తాన్ని మదుపు చేయడమే సిప్. దీనికి పూర్తి వ్యతిరేకంగా.. జమైన పెట్టుబడి నుంచి నెలనెలా లేదా మూడు నెలలకోసారి నిర్ణీత మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు వీలు కల్పించేదే ఎస్‌డబ్ల్యూపీ.

స్థిర మొత్తంలో...

మీ పెట్టుబడులు డెట్ ఫండ్లలో ఉన్నా.. ఈక్విటీల్లో ఉన్నా.. వీటి నుంచి క్రమానుగతంగా కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు వీలుంది. మీరు ఈ ఫండ్ల నుంచి ఎస్‌డబ్ల్యూపీ ప్రారంభించగానే, మీరు నిర్ణయించుకున్న వ్యవధి ఆధారంగా.. మీరు పేర్కొన్న మొత్తానికి సమానమైన యూనిట్లను విక్రయించి, ఆ మొత్తాన్ని మీ ఖాతాలోకి జమ చేస్తారు. ఉదాహరణకు మీ దగ్గర 1000 యూనిట్లు ఉన్నాయనుకుందాం. యూనిట్ విలువ రూ.10 ఉంది. మీరు నెలనెలా రూ.500 కావాలనుకున్నారు. అప్పుడు మీరు పేర్కొన్న తేదీ నాడు మీ రూ.500లకు సమానమైన యూనిట్లు.. అంటే 50 యూనిట్లను విక్రయించి, ఆ డబ్బును మీ ఖాతాలో వేస్తారు.



పన్ను భారం తక్కువగా...

సాధారణంగా సంప్రదాయ పథకాలను ఎంచుకున్నప్పుడు వచ్చిన రాబడిపై మూలధన రాబడి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పైగా దీన్ని మూలం వద్ద పన్ను కోత విధించి, మిగిలిందే మనకు చెల్లిస్తారు. మ్యూచువల్ ఫండ్లలో మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) అంటూ ఉండదు. కాబట్టి, ఇవి మదుపరులకు ఎంతో అనుకూలమైనవిగా చెప్పొచ్చు. ఈక్విటీ ఫండ్లలో ఏడాదికి మించి మదుపు చేసినప్పుడు మూలధన రాబడిపై ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఏడాది లోపు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు స్వల్పకాలిక మూలధన రాబడి పన్ను 15శాతం చెల్లించాలి. డెట్ ఫండ్లలో 36 నెలల లోపు పెట్టుబడులు వెనక్కి తీసుకుంటే.. మదుపరులు తమకు వర్తించే పన్ను శ్లాబును బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, గరిష్ఠ పన్ను శ్లాబులో ఉన్నవారు సంప్రదాయ పథకాలకన్నా.. మ్యూచువల్ ఫండ్లలోని డెట్ పథకాలను ఎంచుకోవడమే కలిసొస్తుంది. రాబడి కోసం ఎస్‌డబ్ల్యూపీ మార్గాన్ని అనుసరించడం ఉత్తమం.

ఆదాయం.. క్రమం తప్పకుండా..

పెట్టుబడుల ద్వారా నెలనెలా స్థిరమైన ఆదాయం అందాలనుకునే వారు ఎస్‌డబ్ల్యూపీని ఎంచుకోవచ్చు. కొంత మొత్తాన్ని మదుపు చేసి, దాని నుంచి స్థిరంగా ఆదాయం పొందాలనుకునే వారు కూడా ఈ మార్గాన్ని అనుసరించవచ్చు.

✦ ముందు నుంచే సరైన ప్రణాళికతో మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసిన వారికి.. దీర్ఘకాలం తర్వాత తమ ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు ఎస్‌డబ్ల్యూపీ ఓ మంచి అవకాశాన్ని ఇస్తుంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తూ వెళ్లి.. పదవీ విరమణ తర్వాత ఆ మొత్తాలను క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడం ప్రారంభించినప్పుడు నిర్ణీత ఆదాయం కచ్చితంగా పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఎవరికి అనుకూలం...

పదవీ విరమణ చేసి, నెలనెలా కొంత ఆదాయం వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలనుకునే వారు మ్యూచువల్ ఫండ్లలో ఎస్‌డబ్ల్యూపీ అనుకూలంగా ఉంటుంది. త్వరలో పదవీ విరమణ చేయబోతున్న వారికీ ఇది మంచిదే. మీరు 5-10ఏళ్లపాటు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేశారనుకుందాం. అప్పుడు పెట్టుబడి వృద్ధికి అవకాశం బాగుంటుంది. ఆ తర్వాత నుంచి క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడం ప్రారంభిస్తే.. అటు పెట్టుబడి వృద్ధి ప్రయోజనంతోపాటు, ఇటు పన్నుపరమైన ప్రయోజనాలూ లభిస్తాయి.

✦ దీర్ఘకాలంపాటు మదుపు చేసిన తర్వాత, ఒకేసారి పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకునే అవసరం ఉండదు. కొంతకాలం పాటు క్రమం తప్పకుండా ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల అటు మిగిలిన పెట్టుబడి వృద్ధి చెందే అవకాశమూ లభిస్తుంది.

✦ కేవలం పదవీ విరమణ చేసిన వారికే కాకుండా.. ఏ వయసు వారైనా ఈ మార్గాన్ని అనుసరించవచ్చు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు నెలనెలా స్థిరమైన రాబడి అందే ఏర్పాటు చేయాలనుకునే వారూ దీన్ని ప్రయత్నించవచ్చు. జీవిత భాగస్వామి, పిల్లలకు అవసరమైన ఖర్చులను ఇచ్చేందుకూ దీన్ని ఒక మార్గంగా ఎంచుకోవచ్చు. ఒకవైపు దీర్ఘకాలిక పెట్టుబడులు కొనసాగిస్తూనే.. మరోవైపు దాని నుంచి వచ్చిన లాభాలను తీసుకునేందుకు ఎస్‌డబ్ల్యూపీ అవకాశాన్ని కల్పిస్తుంది.

చిన్న మదుపరుల ఆలోచన, ఆర్థిక లక్ష్యాలకు తగ్గట్టు పలు రకాల పథకాలు, విధానాలను మ్యూచువల్ ఫండ్లు అందిస్తున్నాయి. ఇందులో సిప్, ఎస్‌డబ్ల్యూపీలను క్రమశిక్షణతో ఉపయోగించుకుంటే మంచి ఫలితాలను పొందే ఆస్కారం ఉంది. మార్కెట్ స్థాయులు, పనితీరుతో సంబంధం లేకుండా.. పెట్టుబడులను కొనసాగించేందుకూ... ఉపసంహరించుకునేందుకూ ఈ రెండూ ఎంతో అనువైన మార్గాలుగా చెప్పుకోవచ్చు.


- డి.పి.సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఎంఓ, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్

రక్షణ తోడుగా.. రాబడికి హామీగా!

వడ్డీ రేట్లు గత మూడు నాలుగేళ్లుగా తగ్గుతూనే ఉన్నాయి. కేవలం బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీదే ఆధారపడిన వారికి ఇది కాస్త ఇబ్బందికరమైన అంశమే. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయానికి వచ్చినప్పుడు స్వల్పకాలిక పరిణామాలు పెద్దగా ప్రభావం చూపవు. అయితే, దీర్ఘకాలిక లక్ష్యాల కోసం అనుకున్న మొత్తాలను ఆర్జించలేకపోవడమే ఇక్కడ ప్రధాన ఇబ్బందిగా మారుతుంది. పిల్లల ఉన్నత చదువులు, వారి వివాహం, మీ పదవీ విరమణ ప్రణాళికల్లాంటి వాటికి అవసరమైన మొత్తాన్ని జమ చేయడం సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటప్పుడు అందుబాటులో ఉన్న ఇతర మార్గాల గురించి అన్వేషించే వారు రాబడి హామీతో లభించే జీవిత బీమా పాలసీల గురించి ఆలోచించవచ్చు.



వీలైనంత వరకూ ఖర్చులు తగ్గించుకుంటూ.. పొదుపు మొత్తాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తారందరూ.. ఇలా కష్టపడి సంపాదించిన మొత్తాన్ని తక్కువ వడ్డీ అందించే పథకాల్లో పెట్టుబడి పెట్టడం వల్ల పెరుగుతున్న ఖర్చులను తట్టుకోవడం అంత తేలిక కాదు. పిల్లల చదువులు, వారి ఇతర ఖర్చులు, పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించడంలాంటి వాటికి డబ్బును జమ చేయడంతోపాటు, ప్రస్తుత వ్యయాలను కూడా మీరు చూసుకోవాల్సి ఉంటుంది. పైగా ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయే కానీ తగ్గడం లేదు. పెట్టుబడులపై వచ్చే వడ్డీ రాబడి తగ్గినప్పుడు.. ఆర్థిక ప్రణాళిక మొత్తంపై దాని ప్రభావం ఉంటుంది. ప్రతి పెట్టుబడి నిర్ణీత కాలం తర్వాత ఎంత మొత్తంలో రాబడినిస్తుంది.. అనే విషయంలో మనకు కొంత అవగాహన ఉండాలి. అయితే, వడ్డీ రేట్లు తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో కొన్నేళ్ల తర్వాత కచ్చితంగా ఎంత మన చేతిలో ఉండబోతోందో తెలుసుకోవడం అంత తేలికేమీ కాదు.



సమీక్షించుకోండి..

ఇటీవల ఆర్‌బీఐ రెపో రేటును 0.25శాతం తగ్గించి, 6శాతానికి పరిమితం చేసింది. ప్రస్తుతం ఇది ఏడేళ్ల కనిష్ఠానికి చేరింది. దీంతో బ్యాంకులు కూడా డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్లను ఆ మేరకు తగ్గించాయి. ఫలితం.. ఇన్నాళ్లూ వీటిపై ఆధారపడిన వారు తక్కువ రాబడితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఆర్థికవేత్తలు, విశ్లేషకులు ముందుముందు వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.

రూ.10లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారనుకుందాం. మూడేళ్ల క్రితం ఉన్న వడ్డీ రేటు 8.75శాతంతో పోలిస్తే.. ప్రస్తుతం ఉన్న 6శాతంతో ఏటా రూ.30వేల వరకూ తక్కువగా రాబడి వస్తుంది. 20-25ఏళ్ల కాలాన్ని పరిగణనలోనికి తీసుకుంటే..కోల్పోయే రాబడి తక్కువేమీ కాదు. భవిష్యత్తులో వడ్డీ రేటు మరింత తగ్గితే ఎంత ఇబ్బందో ఒకసారి ఆలోచించండి.

ఉదాహరణకు.. మీరు 20ఏళ్లలో రూ.70లక్షల వరకూ జమ చేయాలని ఆలోచిస్తున్నారనుకుందాం. దీనికోసం 6శాతం రాబడి అంచనాతో మీరు నెలకు రూ.15వేల చొప్పున మదుపు చేయాల్సి ఉంటుంది. ఇలా మదుపు చేస్తున్నప్పుడు వడ్డీ రేటు 4శాతానికి పడిపోతే.. మీ దగ్గర జమ అయ్యే మొత్తం రూ.55లక్షలే. అంటే.. తేడా రూ.15లక్షలు. మీ పిల్లల ఉన్నత చదువులకు అవసరమయ్యే మొత్తం, లేదా వారి వివాహానికి అయ్యే ఖర్చులకు ఇబ్బంది ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు మీరు పెట్టుబడి మొత్తాన్ని పెంచడం తప్ప ప్రత్యామ్నాయం ఏదీ లేదు.. అంటే.. నెలకు మీరు మదుపు చేయాల్సిన మొత్తం రూ.19వేలు. ప్రస్తుతం ఉన్న బాధ్యతలను చూసుకుంటూ.. ఇంత మొత్తం మదుపు చేయడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు.

తక్కువ నష్టభయం ఉండాలని కోరుకుంటూ.. స్థిరాదాయ పథకాల్లో మదుపు చేసే వారికి వడ్డీ రేట్ల తగ్గింపు కొంత ఇబ్బందికరమైన పరిణామమే. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్లను అర్థం చేసుకోవడంలో ఇప్పటికీ చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అనేకమంది ఇప్పటికీ ఫిక్స్‌డ్ డిపాజిట్లలాంటి రాబడికి హామీ ఉండే పథకాలవైపు మొగ్గు చూపిస్తున్నారు.

హామీ ఉంటూనే..

మార్కెట్ పరిస్థితులు.. వడ్డీ రేట్ల కదలికలతో సంబంధం లేకుండా రాబడికి హామీ ఉండే పథకాల గురించి ఆలోచించాల్సిన తరుణమిది. మదుపరులు రాబడికి కనీస హామీ ఇచ్చే ఇతర మార్గాలను అన్వేషించాలి. ఈ నేపథ్యంలో జీవిత బీమా పాలసీలు కాస్త ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. ఇందులోనూ రాబడికి హామీ ఇచ్చే పథకాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇవి జీవిత బీమా రక్షణ కల్పిస్తూనే.. ఫిక్స్‌డ్ డిపాజిట్లకన్నా మెరుగైన రాబడిని అందించే ప్రయత్నం చేస్తున్నాయి. పైగా పన్ను భారం కూడా ఉండదు.

ఈ తరహా జీవిత బీమా పాలసీలు.. స్థిరమైన రాబడిని అందించడంతోపాటు.. అనుకోని సంఘటనల్లో పాలసీదారుడికి ఏదైనా జరిగితే.. పరిహారాన్ని చెల్లిస్తాయి. కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడం.. స్థిరమైన రాబడినివ్వడం ఈ పాలసీలు రెండిందాలుగా ప్రయోజనాన్ని కల్పిస్తాయన్నమాట.

◗ రాబడి హామీనిచ్చే మనీ బ్యాక్ పాలసీలు.. ప్రీమియం చెల్లించినప్పుడు పన్ను మినహాయింపు అవకాశాన్ని కల్పిస్తాయి. పైగా వచ్చిన రాబడికి కూడా ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. జీవిత బీమా రక్షణ కల్పించడం అదనపు ప్రయోజనం. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పైగా ఇవి ఎలాంటి ఆర్థిక రక్షణనూ కల్పించవు.

◗ జీవిత బీమా పాలసీ తీసుకున్నప్పుడు.. వ్యవధిలోపు పాలసీదారుడికి ఏదైనా జరిగితే.. పాలసీ విలువను పరిహారంగా నామినీకి చెల్లిస్తారు. జీవిత బీమా కౌన్సిల్ సమాచారం మేరకు.. 2016-17లో జీవిత బీమా సంస్థలు దాదాపు రూ.19వేల కోట్ల బీమా పరిహారాన్ని చెల్లించాయి.

కింద పట్టికను పరిశీలిస్తే.. ఎఫ్‌డీలు, రాబడి హామీ జీవిత బీమా పాలసీల మధ్య తేడా ఏమిటో సులభంగా అర్థం చేసుకోవచ్చు..

అంశం	ఫిక్స్‌డ్ డిపాజిట్లు	రాబడి హామీ పాలసీలు
ముందస్తు పన్ను మినహాయింపు	లేదు	ఉంది
పెట్టుబడిపై రాబడి	తగ్గుతోంది	హామీతోపాటు స్థిరంగా ఉంటుంది
రాబడిపై పన్ను మినహాయింపు	లేదు	ఉంది
నగదుగా మార్చుకునే వీలు	అధికం. రుసుములు ఉండవచ్చు.	తక్కువ
బీమా రక్షణ	ఉండదు	ఉంటుంది

ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర ఏ సురక్షిత పథకాలతో పోల్చి చూసినా.. బీమా పాలసీల ద్వారా అందే ప్రతిఫలం కాస్త హెచ్చుగానే ఉంటోంది. కాబట్టి, పొదుపు గురించి ఆలోచించే వారు తమ ప్రణాళికలను ఒకసారి సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తోంది. దీర్ఘకాలిక పొదుపు పథకాలను పరిశీలించేప్పుడు రాబడి హామీ బీమా పథకాలను పరిశీలించవచ్చు. ఈ పాలసీలను ఎంచుకునేప్పుడు.. పాలసీదారుడి వయసును కూడా దృష్టిలో పెట్టుకోవాలి. బీమా సంస్థలు పేర్కొనే 'ఉదాహరణల'ను జాగ్రత్తగా గమనించాలి. వ్యవధి తీరకముందే పాలసీని రద్దు చేసుకుంటే ఉండే రుసుములు, పన్ను ప్రయోజనాలు, ఇతర నిబంధనలు కూడా పూర్తిగా తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.

- ఆశిశ్ వోరా, ఈడీ-సీఈఓ, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్

ఆయుర్వేద చికిత్సకూ వర్తించేలా...

కొత్త పథకం

సాధారణ ఆరోగ్య చికిత్సతోపాటు.. ఆయుర్వేద చికిత్సకూ పరిహారం అందించేలా ఓ కొత్త పాలసీని సిగ్నా టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని పేరు 'ప్రో హెల్త్ సెలెక్ట్'. పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకొని, తీవ్ర వ్యాధులు, జీవన శైలి వ్యాధులకు కూడా రక్షణ కల్పించే ఏర్పాటు ఈ పాలసీలో ఉంది. క్లెయింలతో సంబంధం లేకుండా ఏటా ఒకే ప్రీమియం ఉండేందుకు ప్రత్యేకంగా 'ఇన్‌ఫ్లేషన్ షీల్డ్'ను అందిస్తోంది. ప్రత్యామ్నాయ వైద్య విధానాలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలోపెట్టుకొని 'ఆయుష్' వైద్య చికిత్సలకు కూడా ఈ పాలసీ పరిహారాన్ని ఇస్తామంటోంది. ఈ పాలసీని కనిష్ఠంగా రూ.50వేల నుంచి గరిష్ఠంగా రూ.25లక్షల వరకూ ఎంచుకునే వెసులుబాటు ఉంది. కనీసం 91 రోజుల వయసుపైబడిన ఎవరైనా ఇందులో చేరేందుకు వీలుంది. ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. జీవితాంతం పునరుద్ధరించుకునే వెసులుబాటు ఉంది. పాలసీదారుడు వయసు, తీసుకునే మొత్తాన్ని బట్టి వైద్య పరీక్షలు అవసరం అవుతాయి. ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల వ్యవధికి ప్రీమియాన్ని చెల్లించే అవకాశం ఉంది. ఇద్దరికి మించి కుటుంబ సభ్యులతో ఫ్లోటర్ పాలసీ తీసుకున్నప్పుడు 10శాతం మేరకు ప్రీమియంలో రాయితీ ఉంటుంది. సహ చెల్లింపు వర్తించేలా పాలసీ తీసుకున్నా కొంత రాయితీ ఇస్తారు. చెల్లించిన ప్రీమియానికి సెక్షన్ 80డీ నిబంధనల మేరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

అసలుకు ఇబ్బంది లేకుండా..

పెట్టుబడికి రక్షణ ఉండటంతోపాటు.. దీర్ఘకాలంలో అందులో వృద్ధి కనిపించాలని అనుకునే వారికి **యూనియన్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఓరియంటెడ్ ఫండ్ – సిరీస్ 8** అందుబాటులోకి వచ్చింది. స్థిరాదాయ పథకాల్లో అంటే డెట్, మనీ మార్కెట్ ఆధారిత పథకాల్లో 80-100శాతం, ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పథకాల్లో 20శాతం వరకూ మదుపు చేసే వ్యూహంతో పనిచేస్తోంది. క్రిసిల్ ఎంఐపీ బ్లెండెడ్ ఫండ్ ప్రామాణికంగా ఇది పనిచేస్తోంది. పెట్టుబడిని 1100 రోజులు కొనసాగించాలి. కనీస పెట్టుబడి రూ.5వేలు. ఎన్‌ఎఫ్‌ఓ ఆగస్టు 28 వరకూ అందుబాటులో ఉంటుంది.

వడ్డీ రేట్లు తగ్గుతున్న నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడి కోసం ఆలోచించే వారికి **యూటీఐ ఎఫ్‌టీఐఎఫ్ ఫండ్**ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. పూర్తిగా సురక్షితంగా ఉండేలా స్థిరాదాయ పథకాల్లో మాత్రమే ఈ ఫండ్ మదుపు చేస్తుంది. ఇన్‌కం విభాగానికి చెందిన క్లోజ్ ఎండెడ్ పథకమిది. కనీస పెట్టుబడి రూ.5వేలు. పెట్టుబడిని కనీసం 1104 రోజులు కొనసాగించాలి. సెప్టెంబరు 6 వరకూ మదుపు చేయవచ్చు.

బృంద వైద్య బీమా సరిపోదా?



■ **మా పిల్లల చదువుల ఖర్చుల కోసం ఏడాదికి రూ.2లక్షల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికోసం నెలకు రూ.20వేల వరకూ పెట్టుబడి మదుపు చేయాలని ఆలోచన. అవసరమైనప్పుడల్లా వెనక్కి తీసుకునేలా ఉండే పథకాలను ఎంచుకోవాలని అనుకుంటున్నాను. దీనికోసం నా ప్రణాళిక ఎలా ఉంటే బాగుంటుంది? - రమేశ్**

● మీరు పెట్టుబడి పెడుతూ.. డబ్బులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తీసుకోవాలనే ఆలోచన ఉంటే.. లిక్విడ్ ప్లస్ లేదా అల్ట్రాషార్ట్ టర్మ్ బాండ్ ఫండ్లను కానీ ఎంచుకోవచ్చు. ఇందులో మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు మీ పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. దీనికి మీరు బిర్లా సన్ లైఫ్ క్యాష్ మేనేజర్ ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా సేవింగ్స్ ప్లస్ ఫండ్‌ను పరిశీలించవచ్చు.

■ **నేను ఇప్పటి వరకూ నెలకు రూ.8వేలు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నాను. మరో రూ.4వేలను అదనంగా మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాను. ఫండ్లకు బదులుగా షేర్లలో కూడా నెలనెలా మదుపు చేసే వీలుందని అంటున్నారు. నిజమేనా? ఇందులో ఏదైనా నష్టం ఉందా? - సుబ్బారావు**

● మ్యూచువల్ ఫండ్లలో చేస్తున్నట్లే.. షేర్లలో కూడా నెలనెలా మదుపు చేసే అవకాశం ఉంది. దీనిని సిస్టమేటిక్ ఈక్విటీ ప్లాన్ అంటారు. అయితే, నెలకు రూ.4వేలతో మీరు ఎక్కువ షేర్లు కొనలేరు. నేరుగా షేర్లలో మదుపు చేసినప్పుడు హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయి. మంచి షేర్లను ఎంపిక చేసుకోవడం అంత సులభం కాదు. మీరు కొత్తగా మదుపు చేసే రూ.4వేలను కూడా మ్యూచువల్ ఫండ్లకే కేటాయించడం ఉత్తమం. ఇవి కూడా షేర్లలోనే మదుపు చేస్తాయి. దీనిద్వారా వైవిధ్యంగా మదుపు చేసే అవకాశంతో పాటు, నిపుణుల సేవలను వినియోగించుకునే వీలుంటుంది.

■ **నా వయసు 62ఏళ్లు. జీవిత బీమా పాలసీ నుంచి రూ.3లక్షల వరకూ చేతికి రాబోతున్నాయి. ఈ మొత్తంతో నెలనెలా రాబడి వచ్చేలా కొంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. బీమా సంస్థ అందించే పింఛను పాలసీ తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఇది మంచిదేనా? - రామ్మోహన్**

● మీరు వెంటనే పింఛను ఇచ్చే యాన్యుటీ పథకాల్లో పెట్టుబడి పెడితే.. మీకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 6.5%-7% వరకూ రాబడి లభిస్తోంది. ఒకవేళ మీరు ఈ పాలసీని తీసుకోవాలంటే.. జీవితాంతం పింఛను ఇవ్వడంతోపాటు, పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి ఇచ్చే పథకాన్ని ఎంచుకోవాలి. మీరు ఈ డబ్బును పోస్టాఫీసు పెద్దల పొదుపు పథకంలో మదుపు చేస్తే.. ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ ఆదాయం అందుతుంది. ప్రస్తుతం ఇందులో 8.4శాతం వడ్డీ అందుతోంది. ఇందులో పెట్టుబడిని ఐదేళ్లపాటు కొనసాగించాల్సి ఉంటుంది. మరో మూడేళ్ల పాటు పొడిగించుకోవచ్చు.

మార్గదర్శి

■ **మా కార్యాలయ బృంద ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నాను. మా అమ్మానాన్నలను కూడా ఇందులో సభ్యులుగా చేర్పించాను. అయితే, ప్రత్యేకంగా మరో ఆరోగ్య బీమా పాలసీ కూడా తీసుకోవాలని అంటున్నారు. ఇది అవసరమా? ఒక్క బీమా పాలసీ సరిపోదా? నా వయసు 38 ఏళ్లు. వార్షిక సంపాదన రూ.7లక్షలు. నేను ఎంత మొత్తంలో టర్మ్ పాలసీ తీసుకోవాలి? – మహిపాల్**

● మీకు బృంద ఆరోగ్య బీమా ఉన్నప్పుడు.. మీరు ఉద్యోగం మానేసినప్పుడు ఆ బీమా రక్షణ మీకు వర్తించకపోవచ్చు. ముందుగా నిబంధనలు తెలుసుకోండి. వీలైనంత వరకూ బృంద బీమాపైనే పూర్తిగా ఆధారపడకుండా.. వ్యక్తిగతంగా ఒక ఆరోగ్య బీమా పాలసీ కూడా తీసుకోవడం మంచిది. జీవిత బీమా విషయానికి వస్తే.. మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ బీమా మొత్తం ఉండాలి. మీరు రూ.70లక్షల వరకూ బీమా తీసుకోవడం మంచిది. మీపై ఉన్న బాధ్యతలను కూడా దృష్టిలో పెట్టుకొని, బీమా మొత్తాన్ని నిర్ణయించుకోండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

సొంతింటి కోసం... రుణం తీసుకుంటే..

సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి చాలామంది గృహరుణాలపైనే ఆధారపడతారు. వడ్డీ రేట్లు తగ్గుతుండటంతో ఇప్పుడు ఈ రుణాలను తీసుకోవాలనుకునేవారు పెరిగారు. బ్యాంకులు కూడా గృహరుణాలపై ఎప్పటికప్పుడు వడ్డీ రేట్లను సవరిస్తూ కొత్త ఖాతాదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రుణ మొత్తాలకు బ్యాంకులు విధిస్తున్న వడ్డీ రేట్లను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యాంకులు ప్రస్తుతం మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేటు విధానానికి ఈ రుణాలను జత చేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే రుణం తీసుకున్న వారు కూడా ఏ రేటు వర్తిస్తుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

బ్యాంకు	కొన్ని బ్యాంకుల గృహరుణ చలన వడ్డీ రేట్లు				
	రూ.30లక్షల్లోపు	30లక్షలు-75లక్షలు	75లక్షల్లోపు	ఎంసీఎల్ఆర్	వర్తింపు
యాక్సిస్ బ్యాంక్	8.35-8.4	8.35-8.7	8.65-8.75	8.15	---
ఆంధ్రా బ్యాంక్	8.65	8.65	8.65-8.75	8.65	16.08.17
బ్యాంక్ ఆఫ్ బరోడా	8.35-9.35	8.35-9.35	8.35-9.35	8.35	07.08.17
బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.55-8.6	8.55-8.6	8.55-8.6	8.4	10.08.17
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.4	8.4	8.4	8.4	01.08.17
కార్పొరేషన్ బ్యాంక్	8.75	8.75	8.75-9.1	8.75	01.06.17
ఇండియన్ బ్యాంక్	8.5	8.5	8.5-8.6	8.5	11.07.17
అలహాబాద్ బ్యాంక్	8.55	8.55	8.55-9.05	8.5	01.07.17
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.35-8.75	8.35-8.75	8.5-8.8	8	15.06.17
కెనరా బ్యాంక్	8.45-8.5	8.45-8.6	8.55-8.65	8.4	07.06.17
దేనా బ్యాంక్	8.55	8.55	8.55-8.65	8.6	15.06.17
ఫెడరల్ బ్యాంక్	8.95-9.2	8.95-9.2	8.95-9.2	8.9	16.08.17
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.35-8.55	8.35-8.75	8.5-8.8	---	15.05.17
ఐసీఐసీఐ బ్యాంక్	8.35-8.55	8.35-8.85	8.63-8.85	8.2	03.01.17
ఐడీబీఐ బ్యాంక్	8.35-8.4	8.35-8.55	8.5-8.65	8.35	01.07.17
కరూర్ వైశ్యా బ్యాంక్	9.1	9.1	9.1	9.1	---
పంజాబ్ నేషనల్ బ్యాంక్	8.55-8.6	8.55-8.6	8.55-8.65	8.35	01.08.17
యూకో బ్యాంక్	8.55	8.55-8.65	8.65-8.8	8.55	10.07.17
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.50	8.50	8.5-8.55	8.40	01.08.17
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.55	8.55	8.55	8.55	16.06.17
విజయా బ్యాంక్	8.65	8.65	8.65	8.65	10.01.17
దివాన్ హౌసింగ్ ఫైనాన్స్	8.35	8.35	8.35	---	---
టాటా క్యాపిటల్	8.75-8.9	8.75-8.9	8.75-9.05	---	06.01.17
పీఎన్‌బీ హౌసింగ్	8.6-10.75	8.6-10.75	8.6-10.75	---	---
సెంట్రల్ బ్యాంక్ హౌసింగ్	9.8-9.95	9.9-9.95	9.9-9.95	---	01.01.17
హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్	8.35-8.9	8.35-9	8.5-9.05	---	---

వడ్డీ రేట్లు శాతాల్లో. ఆగస్టు 24, 2017 నాటికి. ఇవి ఎప్పటికప్పుడు మారవచ్చు. ఎంసీఎల్ఆర్ ఆరు నెలలకు, ఏడాదికోసారి మారుతుంది. పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పూర్తి వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. - bankbazaar.com

ప్రజాభిప్రాయ సేకరణ విచ్ఛిన్నానికి కాంగ్రెస్ కుట్ర: హరీశ్

ఈనాడు, హైదరాబాద్: 'కాళేశ్వరం' ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా మాజీమంత్రి శ్రీధర్‌బాబు చేసిన రౌడీయిజాన్ని జానారెడ్డి, షబ్బీర్ అలీలు సమర్థించడం విడ్డూరంగా ఉందని నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కాంగ్రెస్ నాయకులు హరిత ట్రైబ్యునల్, కోర్టుల చుట్టూ తిరగడమే కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను సైతం విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతున్నారని గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటివరకు 11 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా ముగిసిందని, ప్రాజెక్టును గట్టిగా సమర్థించడంతోపాటు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరారని మంత్రి తెలిపారు. శ్రీధర్‌బాబు తదితరులకు తమ అభిప్రాయం చెప్పే అవకాశం ఉన్నా, ప్రజాభిప్రాయ సేకరణను భగ్నం చేయడానికి ప్రయత్నించడంతోనే పోలీసులు అరెస్టు చేయాల్సి వచ్చిందన్నారు. సీపీఐ నాయకుడు గుండా మల్లేష్, కొందరు కాంగ్రెస్ నాయకులు కూడా తమ అభిప్రాయాలు చెప్పారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు చేయడం కూడా కాంగ్రెస్ కుట్రలో భాగమేనని అన్నారు.

న్యాయమూర్తుల వాహనాలపై ప్రత్యేకంగా నామఫలకం, జెండా

దిల్లీ: దేశ ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల అధికారిక వాహనాలపై ప్రత్యేక జెండా, నామఫలకం ఉపయోగించాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సైతం ఇదే తరహాలో జెండాను, నామఫలకాన్ని తమ అధికారిక వాహనాలపై ఉంచాలని రాష్ట్రాల హైకోర్టులకు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం లేఖలు రాసింది.

పాత పింఛను విధానం పునరుద్ధరణకు ఆందోళనలు

ఉద్యోగ సంఘాల ఐకాస నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: పాత పింఛను విధానం పునరుద్ధరణ కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస) నిర్ణయించింది. ఈనెల 30న అన్ని జిల్లా, మండల, డివిజన్, రాష్ట్ర స్థాయి కార్యాలయాల పరిధిలోని ఉద్యోగులు ర్యాలీలను చేపట్టాలని, సెప్టెంబరు 1న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రస్తుత నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరిస్తూ చట్టాన్ని తేవాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం ఐకాస ప్రతినిధులు తమ సమావేశ వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం ద్వారా తెలిపారు.

26, 27 తేదీల్లో వైద్య విద్యకు ఆఖరి విడత వెబ్‌ఆప్షన్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మూడో విడత ప్రవేశాలకు ఈనెల 26, 27 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కరుణాకరరెడ్డి తెలిపారు. కన్వీనర్ కోటాలో వైద్యవిద్యలో ప్రవేశాలకు ఇదే ఆఖరి అవకాశమన్నారు. ఆఖరి విడత ప్రవేశాలకు 84 ఎంబీబీఎస్ సీట్లు, 283 బీడీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. బీ, సీ కేటగిరీల్లోనూ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను ఈనెల 27న నిర్వహించే అవకాశాలున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో మిగిలిన కోటా సీట్ల వివరాలను 26న ప్రకటించే అవకాశాలున్నాయి.

బియ్యం అక్రమార్కులపై పీడీ కేసులు: ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: బియ్యం అక్రమార్కులపై ఉక్కుపాదాన్ని మోపుతున్నట్లు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. నల్గొండ జిల్లా దేవరకొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్‌పై తాజాగా పీడీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయనపై ఇప్పటికే 6ఏ కేసులు 16, అయిదు క్రిమినల్ కేసులు, మూడు బైండోవర్ కేసులున్నాయని చెప్పారు. ఇన్ని కేసులున్నా బియ్యం అక్రమ రవాణాను కొనసాగిస్తూనే ఉన్నారని, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు కొంతకాలంగా చంద్రశేఖర్ కదలికలపై నిఘా పెట్టారని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో చంద్రశేఖర్ నుంచి 90.40క్వింటాళ్ల బియ్యాన్ని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో నల్గొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తాజాగా పీడీ యాక్టు కింద కేసు నమోదు చేశారని తెలిపారు. గతంలోనూ రెండు పీడీ కేసులు నమోదు చేశాం. గత ఆరు నెలల్లో 444 తనిఖీలు నిర్వహించామని 122 కేసులు నమోదు చేసి రూ.4.26కోట్ల విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీవీ ఆనంద్ వివరించారు.

రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషి పేరరివాళన్‌కు పెరోల్ మంజూరు

చెన్నై, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషుల్లో ఒకరైన పేరరివాళన్‌కు తమిళనాడు ప్రభుత్వం పెరోల్ మంజూరు చేసింది. 1991లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడుకు వచ్చిన రాజీవ్‌గాంధీ దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో శాంతన్, మురుగన్, పేరరివాళన్, నళిని, రాబర్ట్ ఫయాజ్, జయకుమార్, రవిచంద్రన్‌లకు మొదట ఉరిశిక్ష విధించగా. . తర్వాత దానిని జీవిత ఖైదుగా కోర్టు మార్చింది. వీరంతా వేలూరు, పుళల్ జైల్లో 26 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నారు. పేరరివాళన్ తండ్రి అనారోగ్యం పాలయ్యారు. ఆయన్ను చూసుకునేందుకు తన కుమారుడికి పెరోల్ అందించాలని పేరరివాళన్ తల్లి అర్పుదమ్మాళ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెల రోజులు పెరోల్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. పేరరివాళన్ గురువారం రాత్రి కారాగారం నుంచి బయటకు వచ్చారు.

నిర్మల్‌లో ప్రతిపక్షాల నిరసన

- ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు తెలపనీయండి



వేదికముందు కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నిర్మల్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో నిర్మించే హైలెవల్ కాలువల నిర్మాణానికి పర్యావరణ అనుమతులపై గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కాంగ్రెస్, భాజపాలు నిరసన వ్యక్తం చేశాయి. కలెక్టర్ ఇలంబరిది అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ జి.నగేశ్, ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా సాగునీటి కాలువల పనులు ప్రారంభించడం సరైంది కాదని, వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, భాజపా నాయకులు ఆందోళన చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం చేసిన అధికారులు ఆ పనులు చేపట్టిన గుత్తేదార్లకు రూ.కోట్లు అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో తెరాస, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సభలో గందరగోళం సృష్టించేవారిని బయటకు పంపాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. దీంతో కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లి తర్వాత విడుదల చేశారు. తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా సాగింది. చివరకు పర్యావరణానికి ముప్పు లేదని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

తెరాస తీరు అప్రజాస్వామికం: జానారెడ్డి

ఈనాడు, హైదరాబాద్ : ప్రాజెక్టులపై ప్రజలు అభిప్రాయం చెప్పకూడదని అధికార తెరాస పార్టీ భావించడం పూర్తి అప్రజాస్వామికమని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత కె.జానారెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు చెప్పనీయకుండా ప్రజలను తెరాస నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో మండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్‌అలీతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాభిప్రాయసేకరణలో కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెరాస కార్యకర్తల దాడి దారుణమన్నారు. వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా ప్రాజెక్ట్ కట్టాలా వద్దా అని అధికారులు అడగడం సరికాదన్నారు. భూసర్వే విధి విధానాలు బయటపెడితే కాంగ్రెస్ పార్టీ సలహాలు ఇస్తుందన్నారు. నేరెళ్ల ఘటన తర్వాత కూడా పోలీసుల తీరు మారలేదని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. పోలీసుల సహాయంతో ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అమలు చేయాలని చూస్తోందన్నారు. 'కాళేశ్వరం' ప్రజాభిప్రాయ సేకరణలో పోలీసులను మోహరించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు.

గొర్రెల పంపిణీలో అవకతవకలు లేకుండా చూడాలి.. జీవన్‌రెడ్డి: గొర్రెల పంపిణీలో అవకతవకలు లేకుండా చూడాలని కోరుతూ సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రికి లేఖరాశారు. గొర్రెల వయసు, సామర్థ్యం పరిశీలనకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో గాలికుంటు వ్యాధితో నష్టం జరిగే అవకాశం ఉందని, గొర్రెలన్నింటికీ వ్యాధి టీకాలను వేయించాలన్నారు.

ప్రతిష్ఠ పెరిగేలా పరిశోధనలు చేయాలి

- మంత్రి హరీశ్‌రావు సూచన
- సిద్దిపేట డిగ్రీ కళాశాలలో సాహిత్య పరిశోధన కేంద్రం ప్రారంభం



సాహిత్య పరిశోధన కేంద్రంలో పుస్తకాలను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి

సిద్దిపేట,న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో సిద్దిపేట ప్రతిష్ఠ పెరిగేలా పరిశోధనలు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేవీ.రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం పేరిట తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. .డిగ్రీ కళాశాల స్థాయిలో తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా సాహిత్య పరిశోధన కేంద్రం ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారు కేవీ. రమణాచారి తన తండ్రి పేరిట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కేవీ రమణాచారి మాట్లాడుతూ...తాను చదివిన, తన తండ్రి అధ్యాపకుడిగా పనిచేసిన కళాశాలలో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దీంట్లో మూడు వేల పుస్తకాలున్నాయని, వీటిని వినియోగించుకొని పరిశోధనలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జయ జయ శంకర ఛానల్ సీఈఓ పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఆరుగురు అధికారుల సరెండర్

- వరంగల్ మహా నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం

వరంగల్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం సంచలన నిర్ణయం తీసుకుంది. గురువారం మేయర్ నరేందర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆరుగురు అధికారులను రాష్ట్రప్రభుత్వానికి సరెండర్ చేస్తూ తీర్మానం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు వరంగల్ మహా నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ షాహిద్ మసూద్, ఉపకమిషనర్ ఇంద్రసేనారెడ్డి, సిటీప్లానర్ చంద్రిక, అకౌంట్స్ విభాగం పర్యవేక్షకుడు జాకీర్ హుస్సేన్, టీపీబీవో ఎండీ.బషీర్, అసిస్టెంట్ ఇంజినీర్ భాస్కర్‌రావును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లుగా మేయర్ నరేందర్ ప్రకటించారు. ఒకేసారి ఆరుగురు అధికారులను సరెండర్ చేయడం చర్చనీయాశంగా మారింది. నగరపాలక సంస్థలో కీలకంగా పనిచేసే ముఖ్య అధికారులను పంపిస్తే పాలన ఎలా సాగుతుందని అధికార తెరాసపక్షం కార్పొరేటర్లే నిరసన వ్యక్తం చేశారు.

తెలుగును నిర్బంధంగా అమలు చేయాల్సిందే

- భాషోద్యమం ఇంటి నుంచే మొదలవ్వాలి: దత్తాత్రేయ



ప్రముఖ సాహితీవేత్త కపిలవాయి లింగమూర్తికి దేవులపల్లి రామానుజరావు స్మారక పురస్కారాన్ని అందచేస్తున్న ఎంపీ కవిత. తదితరులు

రవీంద్రభారతి(హైదరాబాద్), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి వరకు తెలుగును నిర్బంధంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సాహితీవేత్త, భాషాభిమాని అయిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగును వెలిగించడానికి పూనుకోవాలన్నారు. గురువారం ప్రముఖ సాహితీవేత్త, భాషా పరిరక్షకుడు దేవులపల్లి రామానుజరావు శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున రవీంద్రభారతిలో నిర్వహించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ముద్రించిన 'డా.దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనలో భాషాభివృద్ధికి దేవులపల్లి వంటి మహనీయులెందరో ఉద్యమాలు చేస్తే, ప్రస్తుతం ఆంగ్ల భాషకు పెద్దపీట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ప్రభుత్వాలు భాషోద్యమానికి శ్రీకారం చుట్టాలన్నారు. తెలుగు పండిత పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. దేవులపల్లిని తెలుగు సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. దేవులపల్లి రామానుజరావు కుమారుడు సుధాకర్ పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమంలో ఆయుధాలు: తెలంగాణ వైతాళికులు దేవులపల్లి రామానుజరావు జీవితానుభవాలు, ఆయన రచనలను తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయుధంగా చేసుకొన్నామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో దేవులపల్లి రామానుజరావు శతజయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పరిషత్తు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామానుజరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కవిత ప్రసంగిస్తూ.. దేవులపల్లి విగ్రహాన్ని చూసినప్పుడు ఆయన, సినారె వంటి మహనీయుల స్థాయికి ఎదగాలనే ఆలోచన యువతరంలో రావాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త కపిలవాయి లింగమూర్తికి దేవులపల్లి రామానుజరావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు.

రైలు నుంచి తోసేసిన వ్యక్తికి జీవిత ఖైదు

కాజీపేట న్యూస్‌టుడే: తోటి ప్రయాణికుడితో గొడవ పడి అతన్ని రైలు నుంచి తోసేసిన ఘటనలో ఓ వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష పడింది. 2016 ఏప్రిల్ 4న ప్రస్తుత జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలోని కోమళ్ల రైల్వే గేటు వద్ద ఈ ఘటన జరిగింది. ఏప్రిల్ 4న నర్సాపూర్ నుంచి నాగర్‌సోల్ వెళ్లు నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లో వరంగల్‌లోని కరీమాబాదుకు చెందిన ఎండీ సోహేల్(24) (తండ్రి పేరు మసూద్), ఎండీ సోహేల్(18) (తండ్రి పేరు గౌస్)లు బోగీ తలుపు వద్ద కూర్చున్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎ.మల్లేశం(25) వీరి వద్దకు వచ్చి కూర్చునేందుకు ప్రయత్నించగా వారి మధ్య గొడవ జరిగింది. సోహేల్(తండ్రిపేరు మసూద్)ను మల్లేశం రైలు నుంచి కిందకు తోసేశాడు. గాయపడిన అతన్ని ఆసుపత్రికి చేర్చగా, చికిత్స పొందుతూ మరణించాడు. జీఆర్పీ సిబ్బంది హత్య కేసుగా నమోదు చేశారు. గురువారం వరంగల్ ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి చిరంజీవులు మల్లేశానికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.25 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లను విడుదల చేసింది. రెండో వాయిదాగా ఈ మొత్తాన్ని విడుదల చేస్తూ ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అందరికీ ఉప వర్గీకరణ వెలుగులు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఓబీసీ ఉపవర్గీకరణ నిర్ణయంపై తెలుగు రాష్ట్రాల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు దక్కని అత్యంత వెనకబడిన కులాలవారు ఇప్పుడు వాటిని పొందే అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. దేశంలో తమ సంఖ్య గణనీయంగా ఉన్నా జనాభా దామాషాలో రిజర్వేషన్లు దక్కడం లేదని చాన్నాళ్లుగా ఆయా వర్గాల్లో అసంతృప్తి ఉంది. దేశంలో దశాబ్దాలుగా రిజర్వేషన్ల విధానం అమల్లో ఉన్నా బీసీలకు మాత్రం 1990ల్లో మండల్ కమిషన్ ద్వారా రిజర్వేషన్లు ప్రాప్తించాయి. కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో వీటిని అమలు చేస్తున్నారు. అదీ నిర్ణీత ఆదాయ పరిమితి ఉన్న వారికి మాత్రమే దక్కుతున్నాయి. ఆదాయ పరిమితి ఎక్కువగా ఉంటే వారిని సంపన్న శ్రేణి (క్రీమిలేయర్)గా పరిగణిస్తూ రిజర్వేషన్లను ఇవ్వడం లేదు. దీంతో కొన్నివర్గాలవారు తమకు అన్యాయం జరుగుతోందని భావిస్తున్నారు.

దేశంలో అలా.. రాష్ట్రాల్లో ఇలా..

- దేశంలో మొత్తం 5,000 బీసీ కులాలుండగా 2,479 మాత్రమే ఓబీసీ జాబితాలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ఈ జాబితాను రూపొందించి అమలు చేస్తోంది.
- ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కులాలు 125 కాగా ఇందులో 112 కులాలు కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయి.
- తెలంగాణలో మొత్తం 113 బీసీ కులాలుండగా ఇందులో 90 కులాలు ఓబీసీ జాబితాలో ఉన్నాయి.
- కేంద్ర ప్రభుత్వం కులాల స్థితిగతుల ఆధారంగా వాటిని ఓబీసీ జాబితాలో చేరుస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని కులాలపై బీసీ కమిషన్ ద్వారా అధ్యయనం చేయించి కేంద్ర సామాజిక న్యాయ శాఖకు పంపించాలి. అనేకరకాల వడపోతలు, పరిశీలనల అనంతరం వాటిని ఓబీసీ జాబితాలో చేరుస్తారు.
- తెలుగు రాష్ట్రాల నుంచి మిగిలిన బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లినా వాటికి ఆమోదం లభించలేదు. దీంతో ఏపీలో 13, తెలంగాణలో 23 కులాలకు అన్యాయం జరుగుతోంది.

కొన్ని కులాలకే పరిమితం

ప్రస్తుతం ఉన్న పద్ధతిలో కొన్ని కులాల వారు మాత్రమే ఓబీసీ రిజర్వేషన్లు పొందుతున్నారని దేశవ్యాప్త పరిశీలనల ద్వారా తేలింది. అది కూడా ఆర్థికంగా, సామాజికంగా కొంత ఉన్నత స్థాయిలో ఉన్నవారికే పదేపదే అవకాశాలు దక్కుతున్నట్లు వెల్లడైంది. వివిధ సంస్థల పరిశీలన ప్రకారం ఏపీలో 28 కులాలు, తెలంగాణ 19 కులాల వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నట్లు తేలింది. శ్రీకాకుళం, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లోని కొన్నివర్గాలవారైతే విద్యా, ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. అఖిలభారత సర్వీసు పోస్టులు కూడా కొన్ని కులాల వారికే దక్కుతున్నాయనే భావన కొందరిలో ఉంది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు సైతం అన్ని కులాల వారికి అందడం లేదు. కేంద్రప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి శిక్షణ అవసరం కాగా ఆర్థిక స్తోమత లేక చాలామంది దానికి ప్రయత్నించడం లేదు. పేరొందిన విద్యాసంస్థల్లో ఇంటర్ పూర్తి చేసిన వారికే ఐఐటీ, ఎన్ఐటీ వంటి వాటిల్లో ప్రవేశాలు దొరకుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు కూడా కొందరి దరి చేరడం లేదు.

రాష్ట్ర స్థాయిల్లో ఉప వర్గీకరణలు

- ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో ఇప్పటికే బీసీ కులాల్లో ఉప వర్గీకరణలున్నాయి.
- ఇక్కడ బీసీలకు 5 కేటగిరిల్లో 29 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో బీసీ వర్గాలు.. రిజర్వేషన్లు..

- ★ బీసీ ఏ - 7 శాతం
- ★ బీసీ బి - 10 శాతం
- ★ బీసీ సి - 1 శాతం
- ★ బీసీ డి - 7 శాతం
- ★ బీసీ ఇ - 4 శాతం

తెలుగు రాష్ట్రాల మద్దతు

కేంద్ర ప్రభుత్వం ఓబీసీలను మూడు విభాగాలుగా వర్గీకరిస్తే అన్ని బీసీ కులాల వారు రిజర్వేషన్ ఫలాలు పొందే వీలుంటుందని ఆయా సామాజికవర్గాల వారు భావిస్తున్నారు. బీసీ కులాల ఉప వర్గీకరణకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరవచ్చని, దీనికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు తెలిపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రయాణికుల భద్రతకు భరోసానిద్దాం

- సిబ్బందిని అప్రమత్తం చేసిన ద.మ.రైల్వే జీఎం
- హైదరాబాద్ స్టేషన్‌లో క్షేత్రస్థాయి పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణికుల భద్రతే మా ప్రథమ.. ద్వితీయ.. తృతీయ ప్రాధాన్యాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రయాణికులకు భద్రమైన ప్రయాణం సమకూర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రైల్వే ప్రమాదాల నేపథ్యంలో.. భద్రతకు తీసుకుంటున్న చర్యలపై జీఎం గురువారం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ద.మ.రైల్వే పరిధిలో 15శాతం ఉద్యోగాలు ఖాళీలున్నాయని.. వీటి భర్తీకి రైల్వే బోర్డు అంగీకారం తెలిపిందని.. త్వరలో నియామకాలు చేపడతామన్నారు. వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి భద్రతా చర్యలపై సమీక్షించారు. ట్రాక్, బోగీలు, చక్రాలు.. అన్ని అంశాలనూ తనిఖీ చేయడంతో మానవ తప్పిదాలను నివారించవచ్చన్నారు. స్టేషన్లోని సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. కోచ్‌ల నిర్వహణ షెడ్డుకు వెళ్లి.. అక్కడ వీడియో రికార్డింగ్‌తో తనిఖీలు చేపట్టిన తీరును చూసి సిబ్బందిని అభినందించారు. సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ అమిత్ వర్ధన్ పాల్గొన్నారు.

26 నుంచి డిగ్రీ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు


ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ మూడో విడతలో తక్కువ ఆప్షన్ల కారణంగా సీట్లు దక్కని వారికి, సీటు వచ్చినా ప్రవేశాలు పొందని వారికి మరోసారి అవకాశం ఇవ్వాలని విద్యా శాఖ నిర్ణయించింది. మరోసారి వారు ఈనెల 26నుంచి 29 వరకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ లింబాద్రి తెలిపారు. ఈనెల 31న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబరు 1-4 మధ్య కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఇప్పటికే కళాశాలల్లో చేరిన వారికి మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి వీల్లేదని తెలిపారు.

ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తకు పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ షకీల్ అహ్మద్ ప్రఖ్యాత ఎన్‌జీఆర్ఐ-ఏహెచ్ఐ ఇండియన్ హైడ్రాలజీ లెక్చర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఎన్‌జీఆర్ఐలో అన్వేషణ నిపుణుడిగా పేరొందిన షకీల్ పలు పరిశోధనలు చేశారు. ఆస్ట్రేలియా, ఇరాన్, ఈజిప్టు, కెన్యా, సుడాన్, చైనా, పాకిస్థాన్, ఫ్రాన్స్ దేశాల్లో పలు ఉపన్యాసాలు ఇచ్చారు. ఇప్పటివరకు 150కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. భూభౌతిక పరిశోధనల్లో కీలకమైన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అక్విఫ్ మ్యాపింగ్, త్రీడీ మ్యాపింగ్ ప్రాజెక్టును షకీల్ అహ్మద్ విజయవంతంగా పూర్తి చేశారు.

సున్నపురాయి గనుల లీజు వ్యవధి పొడిగింపు

ఈనాడు-హైదరాబాద్: వివిధ సంస్థలకు తెలంగాణలో గతంలో కేటాయించిన సున్నపురాయి గనుల లీజు వ్యవధిని పొడిగిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పలు జిల్లాల్లో ఆయా సంస్థల వినతి మేరకు మొత్తం 3,624 ఎకరాల సున్నపురాయి గనుల లీజు కాలాన్ని పొడిగించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ గురువారం వేర్వేరు ఉత్తర్వులు జారీచేశారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లిలో ఇండియాసిమెంట్స్‌కు 1978లో 782.01 ఎకరాల సున్నపురాయి గనుల్ని 20 ఏళ్లకు కేటాయించారు. ఆ తర్వాత మరోసారి గడువు పెంచారు. తాజాగా లీజు కాలాన్ని 2030 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం మేళ్లచెరువు, రేవూరు గ్రామాల్లో రేయిన్ సిమెంట్స్ లిమిటెడ్‌కు 1981లో 1,032 ఎకరాలను లీజుకు ఇచ్చారు. తాజాగా ఆ లీజు వ్యవధిని మంజూరుచేసినప్పటి నుంచి 50 ఏళ్లకు గనులశాఖ పొడిగించింది. మఠంపల్లి మండలం పెదవీడులో సాగర్ సిమెంట్స్‌కు 1985లో 355 ఎకరాల భూమిని కేటాయించగా.. ఆ లీజును 2035 అక్టోబరు 30 వరకు పొడిగించింది. మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో మైహోం ఇండస్ట్రీస్‌కు కేటాయించిన 647.39 ఎకరాల గడువును 2055 జులై 31 వరకు పొడిగించారు. ఇదే సంస్థకు 2002లో సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం యేపలమాధవరంలో 22.34 ఎకరాలను 20 ఏళ్ల వ్యవధితో లీజుకు కేటాయించారు. ఈవ్యవధిని గనులశాఖ 2052 వరకు పొడిగించింది. మఠంపల్లిలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు 1980లో ఇచ్చిన భూముల లీజును పొడిగించారు. తాజాగా 46.35 హెక్టార్ల భూమికి 2030 అక్టోబరు 13 వరకు పొడిగిస్తున్నట్లు గనులశాఖ పేర్కొంది.



తొలిపూజకు సర్వంసిద్ధం



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులను అనుగ్రహించేందుకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహాగణపతి సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాడు. ఈ ఏడాది 57 అడుగుల ఎత్తుతో కొలువుదీరిన పార్వతీ తనయుడు.. శ్రీ చండీకుమార అనంత మహాగణపతి రూపంలో దర్శనమిస్తున్నాడు. లంబోదరుడికి శుక్రవారం ఉదయం గవర్నర్ నరసింహన్ దంపతులు తొలిపూజ నిర్వహిస్తారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు గజాననుడిని దర్శించుకొని ఆశీస్సులు పొందనున్నారు. విఘ్ననాథుడిని కనులారా తిలకించేందుకు గురువారం రాత్రి నుంచే భక్తజనం పోటెత్తింది. దీంతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది. –ఈనాడు, హైదరాబాద్

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

గవర్నర్, సీఎంల వినాయక చవితి శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని గవర్నర్ కోరుకున్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన అన్నిపథకాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా కొనసాగాలని. . వాటి ప్రయోజనాలన్నీ ప్రజలకు అందాలని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

ఉత్సవ నిర్వాహకులూ అప్రమత్తంగా ఉండండి

- రక్షణ చర్యలతో ప్రమాదాలకు దూరం
- చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రమణప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: వినాయక ఉత్సవాల నేపథ్యంలో మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రమణప్రసాద్ తెలిపారు. రక్షణ ఏర్పాట్లు, ఎర్తింగ్ వ్యవస్థ లేకపోవడం, మండపాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేలా సూచనలు, భద్రతా చర్యలను వివరించారు. విద్యుత్తు లైను నుంచి సరఫరాకు మధ్య ఫ్యూజు వ్యవస్థలు ఉండాలని, ఎర్తింగ్ వ్యవస్థను తప్పనిసరి ఏర్పాటు చేయాలన్నారు. మండపాలకు స్టవ్‌లు దూరంగా పెట్టాలని, పరిసరాల్లో టీ, కాఫీ పెట్టడం చేయకూడదని తెలిపారు. విద్యుత్తు పనులు చేసేప్పుడు, కనెక్షన్లు సరిచూసేటపుడు తప్పనిసరి తొడుగులు, ఇతర రక్షణ పరికరాలు ధరించాలని చెప్పారు. వినాయక విగ్రహం నిమజ్జనమయ్యే వరకు ఒక బాధ్యతాయుతమైన మండప నిర్వాహకులు అక్కడే ఉండాలన్నారు. విగ్రహం, భక్తులు గుమిగూడే ప్రాంతానికి దూరంగా విద్యుత్ స్విచ్‌బోర్డులను పెట్టాలని కోరారు. ప్రతి మండపం వద్ద అగ్నిమాపక పరికరాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు.

శ్రీశ్రీ రవిశంకర్ సందేశాలతో మణిపూర్‌లో శాంతి

ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్



వేదికపై శ్రీశ్రీ రవిశంకర్‌తో మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్

ఈనాడు, హైదరాబాద్: శ్రీశ్రీ రవిశంకర్ శాంతి సందేశాలతో మణిపూర్ రాష్ట్రంలో శాంతి స్థాపన జరుగుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తెలిపారు. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చెప్పారు. గత వారం 68 మంది మణిపూర్ తీవ్రవాదులు ప్రభుత్వానికి లొంగిపోయిన అనంతరం ఇటీవల బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్‌ను కలుసుకుని సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీరేన్‌సింగ్ మాట్లాడుతూ 'ఇంతమంది తీవ్రవాదులు ఆయుధాలతో సహా లొంగిపోవడం ఇదే తొలిసారి. శ్రీశ్రీ కృషి వల్లే ఇది సాధ్యమైంది.. రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా గురుదేవ్ అందిస్తున్న శాంతి సందేశం అన్ని ప్రాంతాలకు చేరింది. అనేక మంది యువత నేడు సత్యాన్ని గ్రహించి ప్రధాన జీవన స్రవంతిలోకి వస్తున్నారు. వారందరికీ సరైన పునరావాసం కల్పించటానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ప్రకటించారు.

కమిషన్ వల్ల ఎక్కువ మంది ఓబీసీలకు న్యాయం: లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: ఓబీసీల వర్గీకరణ చేపట్టేందుకు కమిషన్ వేయాలని కేంద్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయంతో ఎక్కువ మంది ఓబీసీలకు న్యాయం జరుగుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఓబీసీలను వర్గీకరించాలని 1992లోనే సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికీ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నంతకాలం పట్టించుకోలేదని, వారిపై ఆ పార్టీకి ప్రేమ లేదని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు.

హౌరా నుంచి సికింద్రాబాద్‌కు 2 ప్రత్యేకరైళ్లు

ఈనాడు, హైదరాబాద్: రద్దీ నేపథ్యంలో హౌరా నుంచి సికింద్రాబాద్‌కు రెండు ప్రత్యేకరైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హౌరా నుంచి 27న మధ్యాహ్నం 1.30 గంటలకు, 29న మధ్యాహ్నం 1.05 గంటలకు రైళ్లు బయల్దేరుతాయని పేర్కొన్నారు.

నేడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ 8.25కి: హైదరాబాద్ నుంచి దిల్లీకి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 6.25కి బదులుగా రెండు గంటలు ఆలస్యంగా 8.25 గంటలకు బయల్దేరుతుందని దక్షిణమధ్యరైల్వే తెలిపింది.

కాళేశ్వరానికి శనిలా మారిన కాంగ్రెస్: బాల్క సుమన్

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ నేతలు శనిలా మారారని, ఆ ప్రాజెక్టును అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని పెద్దపల్లి తెరాస ఎంపీ బాల్క సుమన్ ధ్వజమెత్తారు. తెలంగాణ రైతులు సుఖసంతోషాలతో ఉండడం ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం ఇష్టం లేదని, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు పెద్దపల్లిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ ప్రభుత్వం అంతకు రెట్టించిన ఉత్సాహంతో ప్రాజెక్టును పూర్తి చేస్తుందని చెప్పారు. ఐకాస ఛైర్మన్ కోదండరాం తెలంగాణకు నష్టం చేసే ఉద్దేశంతోనే అభివృద్ధి నిరోధకులతో చేతులు కలిపారన్నారు.


ఉసురుతీసిన ఉన్నతాధికారి వేధింపులు

- సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆత్మహత్య
- జగిత్యాల జిల్లాలో ఘటన

వెల్గటూరు – న్యూస్‌టుడే



మృతుడు శ్రీకాంత్ (దాచిన చిత్రం)



ఆత్మహత్యకు ముందు కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ రాసిన లేఖ

ఉన్నతాధికారి వేధింపులు ఓ ఉద్యోగి ఉసురు తీశాయి. తన పై అధికారి సూటిపోటీ మాటలు అనడం, కులం పేరుతో దూషించడంతో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల మండలం వెల్గటూరు మండలం ఎండపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఉన్నతాధికారి ఆగడాలు భరించలేకనే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు మృతుడి వద్ద లేఖ లభ్యమైంది. పోలీసులు, మృతుని భార్య కథనం ప్రకారం.. ఎండపల్లికి చెందిన దేవి శ్రీకాంత్(30) ఏడాదిన్నర క్రితం టీఎస్‌పీఎస్సీ నియామకాల ద్వారా సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్(ఏఈఈ)గా ఉద్యోగం సాధించి కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పరిధిలో విజిలెన్స్, నాణ్యత నియంత్రణ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా కొద్ది రోజులుగా నిర్మల్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్(ఈఈ) రఘువీరారెడ్డి నుంచి వేధింపులు మొదలయ్యాయి. గుత్తేదార్ల నుంచి డబ్బులు వసూలు చేసి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చేవాడు. దీనికి శ్రీకాంత్ అంగీకరించకపోవడంతో కులం పేరిట దూషిస్తూ వేధింపులకు పాల్పడేవాడు. ఈ విషయాన్ని ఆయన చాలా సార్లు భార్య శ్రీలక్ష్మితో చెప్పి ఆవేదన చెందారు. ఈ క్రమంలోనే ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు శ్రీకాంత్ ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. కాగా భార్య, కుటుంబ సభ్యులు ఆచూకీ తెలుసుకొని ఆయన్ను తీసుకురాగా 11న తిరిగి విధుల్లో చేరారు. అనంతరం శ్రీకాంత్‌ను రఘువీరారెడ్డి మంచిర్యాలలోని తన కార్యాలయానికి పిలిపించుకుని 'మళ్లీ విధుల్లో ఎందుకు చేరావురా..' అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి మరోసారి కులం పేరిట దూషించాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఈ నెల 22న ఈఈ వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు లేఖ రాసి అధికారులకు మెయిల్ చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని భార్య శ్రీలక్ష్మికి చరవాణి ద్వారా చెప్పి కనిపించకుండా పోయారు. దీంతో తన భర్తను వేధిస్తున్న ఈఈపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీలక్ష్మి బుధవారం వెల్గటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్ కోసం వెతుకుతుండగానే గురువారం ఉదయం గుల్లకోట శివారులోని సొంత వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించారు. శ్రీకాంత్ మృతికి కారణమైన ఈఈపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు జగిత్యాల-రాజారాంపల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎన్‌జీ వాహన సిలిండర్ తనిఖీ తప్పనిసరి

రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: వాహన సామర్థ్య పరీక్షల్లో బాడీ, ఇంజిన్‌తో పాటు సీఎన్‌జీ వాహనాల సిలిండర్ సామర్థ్య తనిఖీలు తప్పనిసరి చేయాల్సిన అవసరముందని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. సీఎన్‌జీ వాహనాల సిలిండర్ ఫిట్‌నెస్ లేకుండా వాహనాలు నడుపుతూ పర్యావరణ హానితో పాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రేటర్ హైదరాబాద్ వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు మంత్రికి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో నడిచే 35 వేల వాహనాల్లో 20శాతం మాత్రమే ఫిట్‌నెస్‌తో ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో వాహన సామర్థ్య సమయంలో సిలిండర్ ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో హరిబాబు, అంజన్‌కుమార్ తదితరులున్నారు.

ఔషధనగరి, జౌళి పార్కుల సత్వర నిర్మాణం: రాజీవ్‌శర్మ

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులైన ఔషధనగరి, వరంగల్ అంతర్జాతీయ జౌళి పార్కుల సత్వర నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. రాజీవ్‌శర్మ మాట్లాడుతూ.. జౌళి పార్కుకు వెంటనే రోడ్డు నిర్మాణంతో పాటు మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని, ఇంటర్‌నెట్ ఇతర సాంకేతిక సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో ఒప్పందాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధనగరికి రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో రోడ్డు నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సూచించారు.

అవగాహనతోనే కేన్సర్ దూరం

- నిజామాబాద్ నియోజకవర్గంలో మహిళలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు
- 'ఐ యామ్ ఎ సర్వైవర్' పుస్తకావిష్కరణలో ఎంపీ కవిత

ఈనాడు, హైదరాబాద్: అవగాహనతో కేన్సర్‌కు దూరంగా ఉండొచ్చని, ముందే గుర్తించడం ద్వారా వ్యాధిని పూర్తిగా జయించవచ్చని నిజామాబాద్ ఎంపీ కవిత చెప్పారు. ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తన నియోజకవర్గంలో మహిళలకు సర్వైకల్ కేన్సర్‌కు సంబంధించి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేన్సర్ నుంచి కోలుకున్న 108 మంది విజేతల స్ఫూర్తి గాథలతో అపోలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డి రచించిన 'ఐ యామ్ ఎ సర్వైవర్' పుస్తకాన్ని గురువారమిక్కడ కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కేన్సర్ అంటే ఎన్నో అపోహలు ఉండేవన్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య సేవలతో అవన్నీ పటాపంచలయ్యాయని, ముందే గుర్తించడం ద్వారా కేన్సర్‌ను పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. ఇందుకు ఈ పుస్తకంలో పేర్కొన్న 108 మంది విజేతల జీవితమే నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యక్తుల విజయగాథలు యువ వైద్యులతోపాటు కేన్సర్ బాధితుల్లో స్ఫూర్తిని నింపుతాయని కవిత అన్నారు. ఇంత మంచి పుస్తకాన్ని అందించిన డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవడానికి ముందుకొచ్చిన విజేతలకు అభినందలు తెలిపారు. 2011లో యువరాజ్ సింగ్‌కు కేన్సర్ ఉన్నట్లు తెలియడంతో భారత జట్టు మొత్తం షాక్‌కు గురైందన్నారు. కానీ, యువరాజ్ త్వరలోనే కోలుకొని టీ20, వన్డేల్లో అద్భుతాలు సృష్టిస్తున్నాడని గుర్తుచేశారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జీఎన్‌రావు మాట్లాడుతూ.. వైద్యుడి కంటే ఒక రోగి మరో రోగితో తన అనుభవాలను పంచుకోవడం ద్వారా ఎంతో ఊరట లభిస్తుందని చెప్పారు. పుస్తక రచయిత విజయ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను వైద్యం చేసిన కేన్సర్ బాధితుల అనుభవాలను ఇతరులకు అందించాలనే ఉద్దేశంతో వారి అనుమతితో ఈ పుస్తకాన్ని రచించానన్నారు.

కవితకు నారీ ప్రతిభా పురస్కారం



ఎంపీ కవితకు నారీ ప్రతిభా పురస్కారాన్ని అందచేస్తున్న వసంతలక్ష్మి

ఈనాడు, హైదరాబాద్: మహిళలు, యువత సాధికారత కోసం కృషి చేసినందుకు గాను నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత నారీ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ; జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం సంయుక్తంగా కవితను ఈ పురస్కారానికి ఎంపిక చేశాయి. సంఘం అధ్యక్షురాలు వసంతలక్ష్మి ఎంఎస్ఎంఈ తరపున గురువారమిక్కడ కవితకు పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దిల్లీలో రెండు వారాల క్రితం జరిగిన పురస్కార ప్రదాన కార్యక్రమానికి కవిత హాజరు కాలేదు. దీంతో కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రి కల్‌రాజ్ మిశ్రా ఆదేశాల మేరకు వసంతలక్ష్మి వచ్చి ఈ పురస్కారాన్ని కవితకు బహూకరించారు. తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా మహిళల అభ్యున్నతి, సాధికారతకు కవిత విశేష కృషి చేస్తున్నారని చెప్పారు.

ఆర్టీసీ ఆస్తుల విభజనపై అదే ప్రతిష్టంభన

- ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చాకే చర్చిస్తామన్న తెలంగాణ
- ఉద్యోగుల విభజన మార్గదర్శకాలకు ఆమోదం
- విజయవాడలో ముగిసిన బోర్డు సమావేశం

ఈనాడు – అమరావతి

హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఉమ్మడి ఆస్తుల అంశం గురువారం నాటి బోర్డు సమావేశంలో ఒక కొలిక్కి వస్తుందని ఏపీఎస్‌ఆర్టీసీ వర్గాలు భావించగా దీనిపై తెలంగాణ అధికారులు మరింత సమయం కావాలని కోరారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉన్నతాధికారులతోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి పి.ఎస్.ఆనందరావు, రాజేంద్ర బి.పాటిల్ పాల్గొన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు ఉమ్మడి ఆస్తుల పంపకం అంశాన్నే తొలుత ప్రస్తావించగా ఇందుకు తమకు మరికొంత సమయం కావాలని తెలంగాణ ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకోవడంతోపాటు అనుమతి వచ్చిన తరువాతే చర్చిస్తామన్నారు. రెండో అంశంగా రాష్ట్ర విభజనకు 14 నెలల ముందుకాలానికి సంబంధించిన సంస్థ జమాఖర్చులకు ఆమోదం తెలిపారు. సంస్థలో ఉద్యోగుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను ఆమోదించారు. రాష్ట్ర స్థానికత నిబంధనల ఆధారంగా విభజనలో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. జీవిత భాగస్వామి ఉద్యోగం ఆధారంగాను, ఆరోగ్యపరమైన కారణాలతోపాటు మార్పు కోరుకుంటున్నవారి విషయంలో మానవతా దక్పథంతో బదిలీకి అనుమతించాలని ఈ సమావేశంలో నిర్ణయానికి వచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ ఎం.మాలకొండయ్య, తెలంగాణ ఆర్టీసీ ఎండీ జి.వి.రమణరావులు మాట్లాడుతూ సెప్టెంబరు 15న మరోసారి సమావేశం కానున్నట్లు తెలిపారు. ఉద్యోగుల విభజనకు సంబంధించి స్పష్టత తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీ తరఫున సుమితా దావ్ర, కె.వి.వి.సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, కె.సత్యనారాయణ, తెలంగాణ నుంచి సునీల్‌శర్మ, బి.జనార్ధనరెడ్డి, కె.రామకృష్ణారావు, శశాంక్ గోయెల్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాల అసంతృప్తి

విభజన తరవాత ఆర్థికంగా కష్టాల్లో ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ హైదరాబాద్‌లోని వాటా పొందకపోతే నష్టపోతుందని సంఘాల నేతలు ఆందోళన వ్యక్తపరిచారు. రూ.వెయ్యి కోట్ల మేర ఆస్తులు అక్కడ ఉన్నాయనీ, వీటి విషయంలో వాయిదాలు వేసుకొంటూ వెళ్లడం తగదంటున్నారు. బోర్డు సమావేశంలో కార్మిక సంఘం ప్రతినిధికి స్థానం కల్పించకపోవడంపై అభ్యంతరం లేవనెత్తారు.

నేడు, రేపు నేపాల్ ప్రధాని పర్యటన

ఈనాడు, హైదరాబాద్: నేపాల్ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దూబ శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఇన్ఫోసిస్ ప్రాంగణం, టీహబ్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లను సందర్శిస్తారు. రాత్రికి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలుస్తారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన గౌరవార్థం ఇచ్చే విందులో పాల్గొంటారు. శనివారం ఉదయం తిరుపతికి బయల్దేరి వెళతారు.

అంతర్జాతీయ గనుల సదస్సులకు రాష్ట్ర బృందం

ఈనాడు, హైదరాబాద్: ఆస్ట్రేలియాలో జరిగే రెండు అంతర్జాతీయ గనుల సదస్సులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి అధ్యక్షతన ప్రతినిధి బృందం హాజరుకానుంది. ఈ నెల 29, 30 తేదీల్లో బ్రిస్బేన్‌లో గనుల వనరుల సదస్సు జరగనుండగా, 31న సిడ్నీలో ఆసియా పసిఫిక్ అంతర్జాతీయ ఖనిజ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల గనుల శాఖల ప్రతినిధులు హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రతినిధి బృందం 27న ఆస్ట్రేలియాకు వెళుతోంది.

13 మంది అధికారులకు పదోన్నతులు

వివిధ శాఖల్లోని 13 మంది అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ శాఖాపరమైన పదోన్నతుల కమిటీ నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన గురువారం సచివాలయంలో పదోన్నతుల కమిటీ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ శాఖలో ఒకరికి ఉప సంచాలకుడిగా, ఐదుగురికి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా, జైళ్ల శాఖలో ఇద్దరికి సూపరింటెండెంట్లుగా, ఒకరికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా, నలుగురికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారులుగా పదోన్నతులు కల్పించారు.

ఐజీ సునీల్‌కుమార్‌పై వరకట్న వేధింపుల కేసు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ఐజీ స్థాయిలో ఉన్న ఐపీఎస్ అధికారిపై తెలంగాణ సీఐడీలో వరకట్నవేధింపుల కేసు నమోదైంది. గత మే 25న కేసు నమోదైనప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఏపీ సీఐడీలో ఐజీస్థాయిలో పనిచేస్తున్న సునీల్‌కుమార్‌పై హైదరాబాద్‌లోఉంటున్న ఆయన భార్య అరుణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. తనను తన భర్త అదనపు కట్నం తెమ్మని, శారీరకంగా, మానసికంగానూ వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐడీలోని మహిళా సంరక్షణా విభాగం(డబ్ల్యూ.పి.సి.) అధికారులు మే 25న కేసు (క్రైం నెంబరు 12/2017) నమోదు చేశారు. వరకట్న వేధింపుల చట్టం 498ఎ, ఐపీసీ సెక్షన్ 506 తోపాటు వరకట్న నిరోధక చట్టంలోని సెక్షన్ 3,4ల కింద కేసులునమోదు చేశారు.



నక్షత్రం ఉపరితలం, వాతావరణం అద్భుత చిత్రీకరణ

లండన్: తేలు(ది స్కార్పియన్) అనే పాలపుంతలో 'అంటారెస్' అనే చల్లటి, ఎర్రనైన నక్షత్రమిది. సూర్యుడి కంటే పరిమాణంలో పెద్దదైన అంటారెస్ ఉపరితలాన్ని, వాతావరణాన్ని చిలీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు భారీ టెలిస్కోపు సాయంతో చిత్రీకరించగలిగారు. సూర్యుడు తరువాత అంత స్పష్టంగా, అక్కడి పదార్థాల వేగాన్ని ద్విమితీయం(2డీ)గా చిత్రీకరించిన నక్షత్రం ఇదేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 1 నుంచి ఆందోళనలు

- తెలంగాణ ఉపాధ్యాయ ఐకాస

ఈనాడు, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం రద్దును కోరుతూ సెప్టెంబరు 1 నుంచి ఆందోళనలు చేపట్టాలని తెలంగాణ ఉపాధ్యాయ ఐకాస నిర్ణయించింది. ఐకాస ఛైర్మన్ పులి సరోత్తంరెడ్డి అధ్యక్షతన గురువారం పీఆర్‌టీయూ కార్యాలయంలో సమావేశం జరిగింది. 1 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించాలని, భోజన విరామ సమయంలో మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని, గ్రాట్యుటీ, కుటుంబ పింఛను ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని సరోత్తంరెడ్డి డిమాండ్ చేశారు.

చదువుల వలస..!

- ఈ ఏడాది మైగ్రేషన్ ధ్రువపత్రాలు తీసుకున్న వారు 8,351 మంది
- వారిలో కేంద్ర సంస్థల్లో సీట్లు పొందుతున్న వారు 4 వేల లోపే
- ఇంటర్‌లో ప్రవేశానికి తెలంగాణకు బారులు

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రాల మధ్య విద్యార్థుల వలసలు భారీగా పెరిగాయి. చదువు, కెరీర్‌కు ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో..పిల్లల్ని ఎంత దూరం పంపేందుకైనా తల్లిదండ్రులు వెనకాడటం లేదు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి 10 వేల మంది తరలిపోతుండగా...రాష్ట్రంలో ఇంటర్ లేదా తత్సమాన విద్య అభ్యసించేందుకు అంతకు రెట్టింపు సంఖ్యలో విద్యార్థులు వస్తుండటమే పరిస్థితికి నిదర్శనం.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విద్యాసంస్థల ఖిల్లా అయినా వేల మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ బోర్డు నుంచి మైగ్రేషన్ ధ్రువపత్రాలు పొందిన వారి సంఖ్య ఆ విషయాన్ని స్పష్టంచేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో బీటెక్‌లో ప్రవేశం పొందినప్పుడు ఇంటర్ బోర్డు నుంచి మైగ్రేషన్ ధ్రువపత్రం తీసుకెళ్లడం తప్పనిసరి. రెండేళ్ల క్రితం కేవలం 3,343 మందే ఈ ధ్రువపత్రాన్ని పొందగా. .గతేడు 10,383 మంది తీసుకున్నారు. ఈ సారి ఆ సంఖ్య 8,351కు(ఇప్పటివరకు) చేరింది. సెమిస్టర్ పరీక్షల వరకు సమర్పణ గడువున్న నేపథ్యంలో ఈ దఫా కూడా ఆ సంఖ్య పదివేలు దాటే అవకాశం లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉన్నత విద్య కోసమే అధికం

ఐఐటీ, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో ఏటా 3,500 నుంచి 4 వేల మంది వరకు రాష్ట్ర విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. గత ఏడాది 3,531 మంది వాటిల్లో సీట్లు పొందారు. ఏ సంవత్సరం తాలూకా గణాంకాలు ఇంకా విడుదల కాకున్నా..సీట్లు పెరిగినందున ఈ సంఖ్య మరింత పెరగవచ్చని నిపుణుల అంచనా. వీరితోపాటు..మరో 5 వేల మంది బీటెక్, ఎంబీబీఎస్, అగ్రికల్చర్ బీఎస్సీ లాంటి కోర్సులను కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, దిల్లీ చుట్టుపక్కలలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో అభ్యసించేందుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యనందించే ఇంజినీరింగ్ కళాశాలలు తక్కువగా ఉండటం, ప్రాంగణ నియామకాలు దక్కువన్న కారణంతోనే వీరంతా ఇతర రాష్ట్రాల వైపు మొగ్గుచూపుతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తెలంగాణ ఇంటర్ బోర్డు నుంచి మూడేళ్లలో వివిధ ధ్రువపత్రాలు పొందిన వారి వివరాలు ఇలా..

ధ్రువపత్రం	2015–16	2016–17	2017–18
మైగ్రేషన్	3343	10,383	8,351
అర్హత	24,816	27,950	14,866
సమానత్వ	4,190	3,625	1182

వేలల్లో ఇక్కడికి

ఇదే తరుణంలో ఇతర రాష్ట్రాల్లో పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ తెలంగాణలో చదివేందుకు వేల సంఖ్యలో వస్తున్నారు. ఇతర ఎస్ఎస్‌సీ బోర్డుల పరిధిలో పదో తరగతి చదివిన వారు తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ చదవాలంటే ఇంటర్ బోర్డు నుంచి అర్హత ధ్రువపత్రం(ఎలిజిబిలిటీ సర్టిఫికెట్) పొందాలి. ఆ విధంగా గతేడు 27,950 మంది తీసుకున్నారు. వారిలో ఏపీ విద్యార్థులతోపాటు పలు రాష్ట్రాల వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది బదిలీలపై వచ్చే ఐటీ, ఇతర ఉద్యోగుల పిల్లలేనన్నది ఓ విశ్లేషణ. అలాగే ఇతర రాష్ట్రాలు లేదా ఇతర బోర్డుల పరిధిలో ఇంటర్ చదివి..ఇక్కడ ఉన్నత విద్య చదివేందుకు 3 వేల నుంచి 4 వేల మంది వస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీరు తీసుకున్న సమానత్వ ధ్రువీకరణ పత్రాలే(ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదువు ఇక్కడి ఇంటర్‌తో సమానమని) దానికి రుజువు.

గోప్యత జీవించే హక్కులో భాగమే

- 21వ అధికరణం సారాంశం ఇదే
- వ్యక్తుల గౌరవప్రద జీవితం రాజ్యాంగం మౌలిక ఆశయం
- అన్ని స్వేచ్ఛలూ దానికి అనుసంధానమైనవే
- తీర్పు వెలువరించిన జస్టిస్ డి.వై.చంద్రచూడ్

మానవ ప్రతిష్ఠ.. రాజ్యాంగంలోని మౌలిక సూత్రమని, వ్యక్తిగత గోప్యత దీని పరిధిలోకే వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇది రక్షిత హక్కు అని పేర్కొంది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛను అనుభవించే హక్కులను ప్రసాదించే రాజ్యాంగంలోని 21వ అధికరణం ద్వారానే వ్యక్తిగత గోప్యత హక్కు కూడా సంక్రమించిందని తెలిపింది. తొమ్మిది మంది ధర్మాసనంలోని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, జస్టిస్ ఎస్.ఎ.నజీర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లు విడిగా వెలువరించిన తీర్పులో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వీరి తరఫున జస్టిస్ చంద్రచూడ్ విడిగా తీర్పు రాశారు. మొత్తం 547 పేజీల తీర్పులో ఆయన 266 పేజీలు రాశారు.



వ్యక్తిగత ప్రతిష్ఠ.. రాజ్యాంగం మౌలిక విలువల కిందకు వస్తుందని.. ఇది జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛల హక్కులను పరిక్షిస్తుందని తెలిపింది. వ్యక్తిగత గోప్యత ఉన్నప్పుడే ఇవి సాకారం దాల్చుతాయని పేర్కొంది. స్వేచ్ఛ, ప్రతిష్ఠలకు బహుముఖ కోణాలు ఉన్నాయని, రాజ్యాంగంలోని మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులన్నింటి ద్వారా వాటికి గుర్తింపు, రక్షణ లభిస్తోందని వివరించింది. గోప్యత హక్కు.. వ్యక్తుల స్వయంప్రతిపత్తిని, తమ జీవితాలను నియంత్రించుకొవడంలో వారికి ఉండే సామర్థ్యాలను గుర్తిస్తుందని పేర్కొంది. మిగిలిన ప్రాథమిక హక్కులు మాదిరిగానే ఇది కూడా సంపూర్ణమైన హక్కేమీ కాదని స్పష్టం చేసింది.

వ్యక్తి ప్రతిష్ఠ అన్ని ప్రాథమిక హక్కులను సమైక్య పరుస్తుంది. వ్యక్తులు గౌరవ ప్రదంగా జీవించేలా చేయడమే ప్రాథమిక హక్కుల లక్ష్యం. స్వతంత్రంగా ఉండాలంటే గౌరవ ప్రదంగా జీవించాలి. అది జరగాలంటే గోప్యత అవసరం. గోప్యత హక్కు వ్యక్తిగత ప్రతిష్ఠకు హామీ ఇస్తుంది. అది ఉన్నప్పుడే జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులను పరిరక్షించడం సాధ్యమవుతుంది

రాజ్యాంగం... నిరంతర చైతన్య పూరితం

"వ్యక్తిగత గోప్యత హక్కును రాజ్యాంగపరమైన హక్కుగా న్యాయ వ్యవస్థ గుర్తింపు ఇస్తోందంటే.. అది రాజ్యాంగాన్ని సవరించే ప్రక్రియ కాదు. పార్లమెంటుకు ఉన్న రాజ్యాంగపరమైన విధుల్లో న్యాయస్థానం తిష్ఠవేసినట్టు కాదు. న్యాయ సూత్రాలకు అనుగుణంగా జరుగుతున్న పరిపాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎదురయిన సవాళ్లను పరిష్కరించడానికి రాజ్యాంగం పరిణామం చెందాల్సి ఉంది. రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన సమయంలో ఉన్న దృక్పథమే కొనసాగాలంటూ రాజ్యాంగం పరమార్థాన్ని పరిమితం చేయలేం. ఏడు దశాబ్దాల క్రితం లేని సమస్యలు ఇప్పుడు ఉన్నాయి. సాంకేతిక మార్పులే ఇందుకు కారణం. అందువల్ల సమస్యలు పరిష్కరించేలా, సరళంగా ఉండేలా రాజ్యాంగానికి భాష్యం చెప్పాల్సి ఉంది. మౌలిక లక్షణాలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ సారాన్ని భావితరాలు స్వీకరించేలా నిర్వచించాల్సి ఉంది."

రెండు రకాలుగా చర్యలు

"వ్యక్తిగత గోప్యత హక్కు నకారాత్మకం (నెగిటివ్), సకారాత్మకం (పాజిటివ్) రెండు విధాలుగా ఉంటుంది. నకారాత్మక అంశాలు అంటే..పౌరుల జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులను హరించేలా రాజ్యం చర్యలు తీసుకోకూడదు. సకారాత్మకం అంటే.. వ్యక్తిగత గోప్యత పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి."

అన్నింటికన్నా జీవితమే విలువైనది

"అన్నింటికన్నా జీవితమేవిలువైనది. అర్థవంతమైన జీవితం గడపాలంటే స్వేచ్ఛ ఉండాలి. జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నదాన్ని వ్యక్తులకే విడిచిపెట్టాలి. తామున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగావారు తమను తాము తీర్చిదిద్దుకుంటారు. రాజ్యం బాధ్యత ఏమిటంటే.. వారు ఆ నిర్ణయాలు తీసుకునేలా, స్వయంప్రతిపత్తిని కాపాడుకునేలా రక్షణలు కల్పించడమే. అంతే తప్ప అలాంటి నిర్ణయాలుతీసుకోవాలని ఆదేశించడం కాదు".

"రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం 'జీవితం' అంటే కేవలం దేహం మనుగడకు సంబంధించినదే కాదు. జ్ఞానాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకోవడానికి సంబంధించింది కూడా. ఆ జ్ఞానమే జీవితానికి పరిపూర్ణత చేకూర్చుతుంది. జీవించే హక్కుకు రక్షణ కల్పించడం అంటే దీన్ని పరిరక్షించడం కూడా. జీవించడం అంటే హుందాతనంతో బతకడం. అందుకే రాజ్యాంగ నిర్మాతలు ఇతర స్వేచ్ఛలతో పాటు స్వతంత్రత, ప్రతిష్ఠలకు ప్రాధాన్యం ఇచ్చి తమ దృష్టిలో రాజ్యాంగ విలువలు ఉన్న సమాజమేమిటో నిర్వచించారు. అందువల్ల గౌరవప్రద జీవితం ప్రధానమైనది, అది రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల ప్రకారం అభయం పొందిన హక్కులు లాంటిదే".

మరణించే స్వేచ్ఛ గోప్యత హక్కు పరిధిలోనే..

తీర్పులోని ఇతర కోణాలను ప్రత్యేకంగా వివరించిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్



దీర్ఘకాలంగా వ్యాధిగ్రస్తులై ఔషధాలే ప్రాణాధారంగా జీవిస్తున్న వ్యక్తులకు తమ జీవితాన్ని కొనగించాలో లేక ముగించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ...వ్యక్తిగత గోప్యత హక్కు పరిధిలోకే వస్తుందని సుప్రీంకోర్టు విస్పష్టం చేసింది. టెలిఫోన్ సంభాషణల ట్యాపింగ్, అంతర్జాల హ్యాకింగ్‌ల ద్వారా వ్యక్తుల సమాచారాన్ని సేకరించటం వంటివీ గోప్యత హక్కును ఉల్లంఘించే చర్యలేనని పేర్కొంది. ఇలాగే వ్యక్తిగత గోప్యత హక్కు పరిధిలోకి వచ్చే వివిధ దృక్కోణాలను రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యులైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రత్యేకంగా వివరించారు. 44పేజీల తీర్పును ఆయన విడిగానే వెలువరించినప్పటికీ దీనిపై ధర్మాసనం ఏకాభిప్రాయం ఉంది. అయితే ప్రతి స్వేచ్ఛకు కొన్ని పరిమితులు ఉంటాయని, అవి ఆయా కేసుల ప్రత్యేకతలు, స్వభావం, ప్రయోజనాలను అనుసరించి మారుతుంటాయన్నారు.

- "వ్యక్తి శరీరకపరమైన అంశాల్లోకి రాజ్య వ్యవస్థలు జోక్యం చేసుకోవాలని ప్రయత్నించినపుడు వ్యక్తిగత గోప్యత ఉల్లంఘన ప్రశ్న తలెత్తుతుంది. భౌతిక దండనలు మన దేశానికి తెలియనివేమీ కాదు. వాటిని రద్దు చేయటం ఇటీవలి చరిత్రే. రాజ్యం వ్యక్తులకు బలవంతంగా ఆహారం తినిపించాలని చూడటమూ గోప్యత ఉల్లంఘన ప్రశ్నను లేవనెత్తుతుంది".
- "ఓ మహిళ తనకు సంతానం కావాలో వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ లేదా గర్భస్రావం కోరుకునే స్వేచ్ఛ కూడా వ్యక్తిగత గోప్యత హక్కు పరిధిలోని అంశమే"
- "తాను ఏ దుస్తులు ధరించాలి. ఏ ఆహారం తినాలి. ఎవరితో జీవించాలి. వ్యక్తిగతంగా, సామాజికంగా, రాజకీయంగా ఎవరితో సన్నిహితంగా మెలగాలి అనే అంశాలను రాజ్యం నిర్దేశించాలని ఏ వ్యక్తీ కోరుకోడు"
- "టెలిఫోన్ల ట్యాపింగ్, అంతర్జాలం హ్యాకింగ్‌ల ద్వారా వ్యక్తుల సమాచారణ సేకరణకు రాజ్యం యత్నించే అంశమూ వ్యక్తిగత గోప్యత పరిధిలోదే. దేశ ప్రజలందరి వేలిముద్రలు సేకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దీనిలో భాగమే"
- "మానవ జీవితంలోని వివిధ అంశాల్లోకి చొరబడే అనర్థమైన అధికారాలు రాజ్యానికి ఉండరాదని, అలాంటి అధికారాలకు పరిమితులను రాజ్యాంగబద్ధంగా విధించాలన్నది ఉదార ప్రజాస్వామ్యవాదులందరి విశ్వాసం".

వైద్య చికిత్సలపై ఆధారపడి జీవితాన్ని నెట్టుకురావాల్సిన దుస్థితిని నిరాకరించే వ్యక్తిగత స్వేచ్ఛ లేదా జీవన సమాప్తిని కోరుకునే స్వేచ్ఛ కూడా వ్యక్తిగోప్యత హక్కు పరిధిలోకే వస్తుంది

- "ప్రతి స్వేచ్ఛకూ కొన్ని పరిమితులు ఉంటాయి. ప్రాథమిక హక్కు అయిన గోప్యతకూ ఇది వర్తిస్తుంది. అయితే, ఆ పరిమితులను కేసును బట్టి, గోప్యత ప్రయోజనం, స్వభావాన్ని బట్టి నిర్ణయించాలి".
- "విదేశీ పాలకుల చెర నుంచి దేశాన్ని, దేశ ప్రజలను విముక్తి చేసేందుకు తమ ప్రాణాలను పణంగాపెట్టి త్యాగాలకు సిద్ధపడిన మహిళలు, పురుషులు సృష్టించిన రాజకీయ పవిత్రమైన సాధనం రాజ్యాంగం. ఇది వారి తరానికే కాదు రాబోయే తరాలకూ ఉద్దేశించినది" అని జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్నారు.

ఇవేగాక సహజీవన స్వేచ్ఛ, కలిసి ప్రయాణించే స్వేచ్ఛ, నివాస స్వేచ్ఛ, ఎయిడ్స్‌వ్యాధి వివరాల వెల్లడి, నేరపరిశోధనలో భాగంగా చేపట్టే శాస్త్రీయపరీక్షలు తదితరాలన్నీ కూడా వ్యక్తిగత గోప్యత హక్కుపరిధిలోకే వస్తాయంటూ జస్టిస్ చలమేశ్వర్ పలు ఉదాహరణలు పేర్కొన్నారు.

జననం నుంచి మరణం వరకు

- వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే
- సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సాప్రే

గోప్యత హక్కు వ్యక్తి పుట్టుకతోనే ఏర్పడి..మరణంతోనే ముగుస్తుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అది సహజసిద్ధం, సుసంపన్నం, అవిభాజ్యం, శాశ్వతం అని వివరించింది. 9 మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే విడిగా రాసిన 24 పుటల తన తీర్పులో.. రాజ్యాంగం ప్రకారం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని ప్రకటించారు. అలాంటి హక్కు లేకుండా ఒక వ్యక్తి అర్థవంతమైన జీవితాన్ని గడుపుతారని భావించలేమని వ్యాఖ్యానించారు. ఇది రాజ్యాంగంలోని మూడో భాగంకింద పౌరులకు హామీగా దఖలైన ప్రాథమిక హక్కుల్లో భాగమన్నారు. అయితే.. ఈ హక్కు నిరపేక్షం కాదనీ, సామాజిక, నైతిక, చట్టపరిధిలో ప్రజాప్రయోజనాల కోసం దేశం విధించే కొన్ని సహేతుక ఆంక్షలకు లోబడి ఉంటుందన్నారు. గోప్యత హక్కుకు నిఘంటువులు, న్యాయస్థానాల్లో తప్పించి చట్టంలో నిర్వచనం లేదనీ, న్యాయపరమైన వ్యాఖ్యానానికి కేసులవారీగా అర్థం చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. గోప్యత హక్కుకు ఎక్కువగా ప్రచారంలో ఉన్న అర్థం.. ఏకాంతంగా ఉండే హక్కు అని వివరించారు. న్యాయపాలన కింద నడిచే ప్రతి నాగరిక సమాజంలో ప్రతి మనిషిలోనూ గుర్తించిన సంరక్షిత హక్కుల్లో ఒకటన్నారు. లింగం, జాతి, మతం, కులం, వర్గ భేదం లేకుండా ఒక వ్యక్తి గౌరవాన్ని పరిరక్షించే దిశగా ఇలాంటి హక్కుల్ని గుర్తించడం బాధ్యతన్నారు. భావప్రకటన, వ్యక్తీకరణ, విశ్వాసం, ఆరాధనతో పాటు, వ్యక్తి గౌరవానికి హామీనిచ్చే సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ పీఠికలోని అంశాల నుంచి జనిస్తున్న గోప్యత హక్కును గుర్తించడంలో ఎలాంటి ఇబ్బందులు లేవని వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికీ భావ ప్రకటన, వ్యక్తీకరణ స్వేచ్ఛను ప్రసాదించే ఆర్టికల్ 19(1), ప్రతి పౌరుడికీ భారత్‌లో ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లగలిగే హక్కును కల్పిస్తున్న ఆర్టికల్ 19(1)డి, వ్యక్తిగత స్వేచ్ఛకు అవకాశం కల్పిస్తున్న ఆర్టికల్ 21ల నుంచి ఇది జనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యక్తీకరణల్లోనే గోప్యత హక్కు నిర్మితమై ఉందన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టులో ప్రస్తావించిన న్యాయవాదులందరినీ జస్టిస్ సాప్రే అభినందించారు.

ఇది శాశ్వత ప్రాథమిక హక్కు

జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్

'అధికారంలో ఉండే ప్రభుత్వాల వైఖరులెలా మారినా.. గోప్యత శాశ్వత ప్రాథమిక హక్కు. పార్లమెంటులో సాధారణ మెజారిటీతో చట్టం చేయవచ్చు, చేయకపోవచ్చు. చట్టపరంగా దాఖలైన ఏవైనా రక్షణల్ని అధికార పక్షం కల్పించకపోవచ్చు. కానీ.. ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలోనే పొందుపరిచారు. అందుకని ప్రభుత్వంతో సంబంధం లేకుండా దేశ పౌరులు వాటిని అనుభవించవచ్చు. వ్యక్తిగత గోప్యత వంటి ప్రాథమిక హక్కు శాశ్వతమైనది. చట్టాలు ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించవచ్చు, ఉల్లంఘించవచ్చు. ఎలాంటి సామాజిక, ప్రజా ప్రయోజనాలు లేకుండా గోప్యత హక్కును ఏదైనా చట్టం ఉల్లంఘిస్తే, అలాంటి చట్టం చెల్లనేరదని చెప్పే బాధ్యత న్యాయస్థానానికి ఉంది'.

గోప్యత.. ఏం చెబుతోంది?

గోప్యత అంటే?

పూర్వంనుంచీ గోప్యతకు ఒక్కొక్కరు ఒక్కోలా అర్థం చెప్పారు. 'ఒంటరిగా వదిలే హక్కు' అని కొంత మంది అభివర్ణించారు. ఆ అర్థం ప్రకారం చూస్తే.. గోప్యత అంటే ఏదైనా అంశాన్ని దాయడం, రహస్యం అని భావించాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి, ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో వెల్లడించాలనే విషయంలో స్వీయ నియంత్రణ సామర్థ్యమే గోప్యతగా భావించవచ్చు.



భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో అందరి దృష్టినీ ఆకర్షించిన 'గోప్యత' అంశంపై కొంతకాలంగా చర్చ కొనసాగుతోంది. ఇంతకీ వ్యక్తిగత గోప్యత అంటే ఏమిటి? దీనినెలా అర్థం చేసుకోవాలి? ఇది ఎవరి సమస్య? ప్రభుత్వ ఉద్దేశమేంటి? కొన్ని ముఖ్యమైన అంశాలివి..

గోప్యతకు ముప్పు

ఇటీవలి కాలంలో డేటా విజ్ఞానశాస్త్ర విప్లవం వెల్లువెత్తిన నేపథ్యంలో గూగుల్, ఫేస్‌బుక్ వంటి ప్రైవేటు కంపెనీలు కోట్ల సంఖ్యలో ఉండే వారి వినియోగదారులకు సంబంధించిన సమాచారాన్ని భారీస్థాయిలో సేకరించి, నిక్షిప్తం చేస్తున్నాయి. డేటా ఖజానాను ప్రాసెస్ చేయడం, వాణిజ్య ప్రకటనల్ని అమ్ముకోవడం ద్వారా ఉచితమని చెప్పుకొనే సేవల నుంచి సొమ్ము చేసుకోవడంపైనే వారి వ్యాపార మూలం ఆధారపడి ఉంటోంది. సమాచారం పేరిట ప్రభుత్వం పెట్టే వివిధ రకాల నిఘాతో పౌరుల గోప్యతకు ముప్పున్నట్లే.

జాతీయ భద్రత-గోప్యత..

జాతీయ భద్రత, బిగ్‌డేటా ప్రయోజనాలకు గోప్యతకు సరిపడదు. పౌరులకు సంబంధించిన సమాచార సేకరణ ఉగ్రవాదంపై పోరులో తోడ్పడుతుందని చెబుతూ, గోప్యతకు మంగళం పాడుతూ ప్రభుత్వం తన నిఘా కార్యక్రమాలను సమర్థించుకుంటోంది.

గోప్యతపై దాడి ప్రభావం ఏమిటి?

గోప్యతపై దాడి జరిగిందంటే.. మీ ఫోన్ నంబర్లు, మీ పేరిట ఉన్న క్రెడిట్ కార్డుల వ్యక్తిగత సమాచారం చౌర్యానికి గురవుతాయి. ఇది ఆర్థిక మోసాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకూ కావచ్చు. ఇలా పొందిన సమాచారాన్ని అవకతవకలకు పాల్పడేందుకూ, ఇతరత్రా అనేక మార్గాల్లో ఉపయోగించవచ్చు.

గోప్యత ఉన్నత వర్గాలకేనా?

భారత్‌లో గోప్యత అనేది పెద్ద విషయమే కాదనే వాదన ఉంది. దీనికి సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన లేదనే అభిప్రాయాలున్నాయి. గోప్యత అనేది ధనికులు, ఉన్నత వర్గాలకు సంబంధించిన అంశం మాత్రమేననీ, దానిని రక్షించుకునేందుకు వారు మాత్రమే దృష్టి పెడతారనే వాదనలున్నాయి.

దాచేందుకేమీ లేదు..

నావద్ద దాచేందుకేమీ లేదు, గోప్యత గురించి పట్టించుకోను వంటి మాటలు తరచూ వినిపిస్తుంటాయి. ఏదో తప్పు చేసినవారే, దేన్నో దాయాలనుకుంటారనీ, వారికే గోప్యతపై ఆందోళన ఉంటుందని వారి ఉద్దేశం. గోప్యతను రహస్యంతో పోల్చడం వల్లే ఇలాంటి సమస్య ఏర్పడుతోందనీ, ఈ రెండూ విభిన్న భావనలని నిపుణులు చెబుతున్నారు. గోప్యత అంటే..ఇతరులు తెలుసుకోవాల్సిన అవసరం లేని సమాచారాన్ని గోప్యంగా ఉంచుకునే అవకాశమనీ, రహస్యమంటే.. ఇతరులు తెలుసుకునే హక్కున్న సమాచారాన్ని గుప్పిట పట్టడమేనని వివరిస్తున్నారు.

భారత ప్రభుత్వ విరుద్ధ అభిప్రాయాలు

గోప్యతపై భారత ప్రభుత్వం ఒక్కోసారి ఒక్కోలా విరుద్ధ అభిప్రాయాల్ని వ్యక్తీకరిస్తోంది. ఉదాహరణకు గోప్యత హక్కు జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛను అందించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమని వాట్సాప్ కేసులో పేర్కొంది. అదే ఆధార్ విషయానికి వచ్చేసరికి ఈ అభిప్రాయానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గోప్యత అనేది రాజ్యాంగపరంగా సంక్రమించినది కాదనీ, ఈ హక్కును ఆయా కేసులను బట్టి విభిన్నంగా చూడాలని సూచిస్తోంది.

గోప్యత హక్కు అనాదిగా ఉంది

జస్టిస్ ఎస్.ఏ.బాబ్డే

"వ్యక్తిగత గోప్యత హక్కుకు మానవ స్వేచ్ఛలోని అన్ని అంశాలతో అవిభాజ్య సంబంధం ఏర్పడింది. దీన్ని ఏ రీతిలో క్షీణింపచేసినా.. అది ప్రాథమిక హక్కులను బలహీనపరుస్తుంది. రాజ్యాంగంలోని మూడో భాగంలో పేర్కొన్న అనేక ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత కూడా అంతర్భాగంగా ఉంది. అందువల్ల దాన్ని కూడా ప్రాథమిక హక్కుగానే గుర్తించాలి. పురాతన మత గ్రంథాల్లోనూ వ్యక్తిగత గోప్యత అంశం ఉంది. ఒక మహిళను పరాయి పురుషుడు చూడకూడదన్న నిబంధన రామాయణంలో ఉంది. ఇతరుల ఇళ్లల్లోకి తొంగి చూడటం ఇస్లాంలో నిషిద్ధం. పరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా జీవించాలని క్రైస్తవుల బైబిల్ చెబుతోంది. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కును అనుభవించడానికి వ్యక్తిగత గోప్యత అనేది తప్పనిసరి."

"ఏకాంతం ఆవశ్యకతను నాగరిక సమాజం మొత్తం గుర్తించింది. మినహాయింపు లేకుండా ప్రతి వ్యక్తీ ఏకాంతంగా తన చర్యలను నిర్వహించుకునేందుకు అధికారం ఉంది. పడకగది, బాత్‌రూం వంటి వాటికే ఇది పరిమితం కాదు. సదరు వ్యక్తి ఎక్కడికి వెళ్లినా ఈ హక్కు.. అతడి వెంట నడుస్తుంది. అతడు బహిరంగ ప్రదేశంలో ఉన్నప్పటికీ ఇందులో మార్పు ఉండదు. ఇంట్లోని సభ్యుల ఏకాంతాన్ని పరిరక్షించేలా; మతపరమైన ఆచారాలు నిర్వహణ, వేద పఠనం, భోజన సమయంలోనూ పవిత్రను కాపాడేలా ఇంటిని నిర్మించాల్సిన విధానాన్ని 'గృహ సూత్రాల్లో' పేర్కొన్నారు. యజమాని అనుమతి లేకుండా మరొకరి ఇంట్లోకి ప్రవేశించరాదని అర్థశాస్త్రం చెబుతోంది. ఇతరుల సమక్షంలో భోజన పానీయాలు తీసుకోరాదన్న రామానుజ సంప్రదాయం దక్షిణ భారత దేశంలో ఉంది. ఒక చర్యను ఏకాంతంలో చేసే ప్రాథమిక స్వేచ్ఛను.. సదరు చర్యను నిర్వహించే స్వేచ్ఛ నుంచి వేరు చేయడం సాధ్యం కాదు."

బాలల కోసం ప్రత్యేక రక్షణ అవసరం

జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్

డిజిటల్ యుగంలో బాలలకు సంబంధించిన గోప్యతకు ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. తెలిసీ తెలియక చేసే తప్పుల పరిణామాలకు వారు గురి కాకుండా చూడాలి. ఇప్పుడు పిల్లలంతా నిరంతరం సామాజిక మాధ్యమాల ద్వారా 'డిజిటల్ పాదముద్ర'లే వేస్తున్నారు. ఏ అంటే యాపిల్, బి అంటే బ్లూటూత్, సి- చాట్, డి- డౌన్‌లోడ్, ఇ-ఇమెయిల్, ఎఫ్-ఫేస్‌బుక్, జి-గూగుల్, హెచ్-హాట్‌మెయిల్, ఐ అంటే ఇన్‌స్టాగ్రామ్ అన్నట్లు నేర్చుకుంటున్నారు. తెలిసీ తెలియని పసితనంలో చేసే తప్పుల పరిణామాన్ని జీవితాంతం వారు భరించాలనడం తగదు. కాల్పనిక జగత్తులో, వాస్తవ ప్రపంచంలో వారి గోప్యతపై ప్రత్యేక హక్కు అవసరం. ప్రభుత్వంలో ఉన్నవారి నుంచి, లేనివారి నుంచి కూడా వ్యక్తిగత గోప్యత హక్కును కాపాడాల్సిన అవసరం ఉంది. ఇంట్లోకి రావడానికి ఒక వ్యక్తిని అనుమతించినంతమాత్రాన దాని అర్థం ఇతరులూ అలా రావచ్చనేది కాదు. ప్రభుత్వ, ప్రభుత్వేతరుల ప్రమేయం నుంచి వ్యక్తుల అంతర్ స్థితిని కాపాడేది ప్రాథమిక హక్కు. మన స్నేహితులెవరో ఫేస్‌బుక్‌కు తెలుసు. మన కొనుగోళ్ల అలవాట్లు గురించి ఆలీబాబాకు తెలుసు. మనం ఎక్కడకు ప్రయాణిస్తుంటామో ఎయిర్‌బీఎన్‌బీకి తెలుసు. సోషల్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు, శోధనయంత్రాలు, ఇ-మెయిల్ సేవలందించేవారు ... ఇలాంటివారంతా ప్రభుత్వేతర వర్గాలే. వీరందరికీ మన వివరాలు తెలుస్తున్నాయి. మన డిజిటల్ ముద్రలు మరింత బలంగా పడుతుంటాయి. వ్యక్తులు ఏ సమాచారం ఇతరులకు తెలియకూడదని భావిస్తారో దానికి రక్షణ అవసరం. సమాచారాన్ని పంచుకోవడం ద్వారానే కాకుండా ప్రతీ క్లిక్‌తోనూ సమాచారం పరోక్షంగా వెళ్తునే ఉంటుంది.'

(విడిగా 47 పేజీల తీర్పులో)

సామాన్యుడి చేతికి అస్త్రం

- వ్యక్తిగత హక్కుకు భంగం కలిగితే కోర్టులకు వెళ్లే వీలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రతికూల ప్రభావం

దిల్లీ

వ్యక్తిగత గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా నిర్ధరిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పు దేశ పౌరుల చేతికి ఓ ఆయుధాన్ని అందించింది. ఏ వ్యక్తి అయినా తన వ్యక్తిగత సమాచార గోప్యత హక్కుకు భంగం వాటిల్లుతుందని భావిస్తున్నట్లయితే దాని పరిరక్షణ కోసం నేరుగా హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించే వీలును ఇది కల్పిస్తోంది. అయితే, పలు సంక్షేమ పథకాల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలపైనా ఇది ప్రభావం చూపనుంది. వ్యక్తిగత సమాచారాన్ని వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకుంటున్న ప్రైవేటు సంస్థలు, సాంకేతిక సంస్థలపైనా దీని పర్యవసానాలు ఉండనున్నాయి. రాజ్యాంగ అధికరణం 21లో పేర్కొన్న వ్యక్తుల జీవిత, స్వేచ్ఛ హక్కులతో ముడిపడిన గోప్యత హక్కుకు 32, 226 అధికరణలు రక్షణ కల్పిస్తున్నాయని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని మూడో భాగంలో పేర్కొన్న ప్రతి ప్రాథమికహక్కుతో సమాన స్థాయిని వ్యక్తిగత గోప్యత హక్కు కలిగి ఉంటుందని పేర్కొంది. సమానత్వ హక్కు, భావప్రకటన హక్కు, మత హక్కు, గౌరవంగా జీవించే హక్కులతో పాటు గోప్యత హక్కుకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం స్పష్టం చేయటం ద్వారా ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచారంలోకి రాజ్య వ్యవస్థల నిర్హేతుక చొరబాటును నిరోధించే ఆయుధాన్ని సగటు పౌరునికి అందించినట్లయింది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు సంస్థలకు అందజేస్తున్న తీరును ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం." ప్రభుత్వం అందజేస్తున్న వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు సంస్థలు/కంపెనీలు తమతమ ఉత్పత్తుల ప్రచారానికి ఉపయోగించుకుంటున్నాయి. వ్యక్తుల సమాచారం దుర్వినియోగం అవుతుందన్నదే మా ప్రధాన ఆందోళన" అని జస్టిస్ డీవై చంద్రచూడ్ ఒకానొక సందర్భంలో వ్యాఖ్యానించారు.

ఇక ఆధార్ తప్పనిసరి సాధ్యమేనా?

వ్యక్తుల వ్యక్తిగత సమాచార గోప్యతలోకి ప్రభుత్వాల చొరబాటును నియంత్రించే తాజా తీర్పు వల్ల ఆధార్ విశిష్ట సంఖ్య అనుసంధానాన్ని వివిధ పథకాలతో ముడిపెడుతున్న ప్రభుత్వాలు ప్రత్యామ్నాయాన్ని ఆలోచించక తప్పదు. రాయితీలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందించే పథకాలకు వ్యక్తిగత సమాచార సేకరణ ప్రభుత్వ సంస్థలకు కష్టమవుతుంది. ఆధార్ చట్టం-2016 ప్రకారం ఆయా వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి పొందటం ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వ సంస్థలు పొందే వీలుంది. అయితే, తాజా తీర్పుతో 'సమ్మతి' నిబంధనను తోసిపుచ్చే అధికారం జిల్లా జడ్జీలకు లభిస్తుంది. ఆధార్ చట్టంలో ఉన్న ఇలాంటి మరి కొన్ని నిబంధనలను సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం సమీక్షించే వీలు కలుగుతుంది. ఆధార్ అనుసంధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి నిబంధనగా చేర్చిన దాదాపు 100 సంక్షేమ పథకాలు న్యాయ సమీక్ష ముందు నిలవటం కష్టమే.



అంతర్జాల సేవల్లో గోప్యత కఠినతరం

వ్యక్తిగత సమాచార గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు వల్ల సామాజిక మాధ్యమ వేదికలు, గూగుల్ వంటి అంతర్జాల సాంకేతిక దిగ్గజ సంస్థలు గోప్యత నిబంధలను, వ్యక్తిగత సమాచార నిల్వ, మార్పిడి నిబంధనలను మరింత కఠినతరం చేయక తప్పదు. సమాచార సాంకేతిక చట్టం(2000) భద్రత కల్పించేది...సమాచారానికి మాత్రమే. వ్యక్తిగత గోప్యతకు కాదు. దీని ప్రకారం సమాచార భద్రత నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలపై రూ.కోటి వరకూ జరిమానా విధించవచ్చు. వ్యక్తిగత సమాచార అభద్రతకు గురైన వ్యక్తులకు పరిహారం చెల్లించే నిబంధన అందులో లేదు.

బిడ్డకు జన్మనివ్వాలా వద్దా, గర్భస్రావం చేయించుకోవాలా వద్దా అనేది మహిళల స్వేచ్ఛ పరిధిలోని అంశమేనని సుప్రీంకోర్టు పేర్కొనటంతో సంతానంపై నిర్ణయం కూడా వారి వ్యక్తి స్వేచ్ఛ పరిధిలోకే రానుంది.

వివిధ కేసుల విచారణ సమయంలో వ్యక్తుల టెలిఫోన్ సంభాషణలను ట్యాప్ చేయటానికి, ఇంటర్నెట్ హ్యాకింగ్ చేయటానికి పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు అనుమతించే అధికారం దేశ అంతర్గత భద్రత వ్యవహారాలు చూసే ఉన్నతాధికారులకు ఉండేది. తాజా తీర్పు వల్ల ఈ విధమైన అనుమతులపై ప్రభుత్వం మరో మార్గాన్వేషణ చేయాల్సి ఉంటుంది.

స్వలింగసంపర్కులపై ఆంక్షలు చెల్లనేరవు

వ్యక్తిగత స్వేచ్ఛ, జీవిత హక్కులలో గోప్యత హక్కు కూడా భాగమైనందున స్వలింగసంపర్కులపై నిషేధం విధిస్తూ గతంలో వెలువడిన తీర్పును తాజాగా సవాల్ చేసే అవకాశం ఉంది. డీఎన్ఏ బ్యాంకు ఏర్పాటుకు వీలుకల్పించే డీఎన్ఏ ఆధారిత సాంకేతిక బిల్లు-2017పైనా గోప్యత హక్కు తీర్పు ప్రభావం చూపనుంది.

- గొడ్డు మాంసం కలిగి ఉండటంపై పలు రాష్ట్రాలు విధించిన ఆంక్షలనూ పునఃసమీక్షించాల్సి వస్తుంది.

ఆది నుంచీ వివాదాలే

మన దేశంలో అన్నింటికీ అనుసంధానం

వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవుతుందని ఆందోళన

ఎన్నో ఏళ్ల నుంచి దేశంలోని ప్రజలకు గుర్తింపు కార్డు అంటే రేషన్ కార్డే. తర్వాత ఓటరు కార్డు, ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే పాన్ కార్డు వచ్చాయి. కానీ వీటన్నింటికీ భిన్నంగా జాతీయ గుర్తింపు కార్డు మాదిరిగా ఆధార్ కార్డుకు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ప్రధానంగా సబ్సిడీ పథకాల దుర్వినియోగాన్ని అరికట్టటానికి, నకిలీలు, బోగస్ చర్యలను అదుపు చేయటానికి ఇది దోహదపడుతుందని భావించింది. దీనివల్ల కొన్ని సత్ఫలితాలు సైతం కనిపించాయి. ముఖ్యంగా సబ్సిడీ పథకాల్లో వేల కోట్ల రూపాయల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆధార్ కార్డును ప్రతి పనికీ తప్పనిసరి చేసింది. పాన్ కార్డు నుంచి ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, మొబైల్ ఫోన్ కనెక్షన్, బ్యాంకు ఖాతా.. ఇలా ప్రతి అవసరానికి ఆధార్ నంబరును తప్పనిసరి చేసింది. చివరికి భూముల రిజిస్ట్రేషన్లు, వాహనాల కొనుగోళ్లకు కూడా ఆధార్ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడు



తోంది. ఈ పరిస్థితి ప్రజల గోప్యతకు భంగకరంగా ఉండటం, వ్యక్తిగత సమాచారం చేతులు మారే ప్రమాదం ఉండటం ప్రధాన అభ్యంతరాలుగా మారాయి. కొన్ని వర్గాల్లో దీనిపై పెద్దఎత్తున నిరసన వ్యక్తం అయింది.

ఆధార్ అమలు తీరును ప్రశ్నిస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. అదే సమయంలో ఆధార్ సమాచారం కొన్ని ప్రైవేటు సంస్థల చేతికి వెళ్లటం, వాణిజ్య అవసరాలకు ఆ సమాచారాన్ని అవి వాడుకునే అవకాశం ఉండటం పెద్దఎత్తున విమర్శలకు తావిచ్చింది. ఇలా ఎన్నో వివాదాలు చుట్టుముట్టాయి.

చట్టబద్ధత లేదు..

ఆధార్ కార్డుల జారీ 2010లో మొదలైంది. ప్రణాళికా సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా అంతకుముందు ఏడాదిలో ఏర్పాటైన ఉడాయ్ (యునీక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా) ఈ కార్డుల జారీ ప్రక్రియను మొదలుపెట్టింది. కానీ దీనికి చట్టబద్ధత లేదనే విమర్శ వచ్చింది. ఆధార్ కార్డు చుట్టూ మొదలైన తొలి అతిపెద్ద వివాదం ఇదే. 2012లో నవంబరులో కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ పుట్టస్వామి, న్యాయవాది పర్వేస్ ఖన్నా సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. చట్టబద్ధత లేకుండా ఆధార్‌ను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. దీంతో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దీనికి చట్టబద్ధత కల్పించేందుకు గత ఏడాది ఆధార్ చట్టం తీసుకు వచ్చింది. దీన్లోని కొన్ని నిబంధనలపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అయినప్పటికీ చట్టం అమల్లోకి వచ్చింది.



గోప్యతకు ముప్పు

ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ సమాచారం సేకరించటం వ్యక్తిగత గోప్యతకు పెద్ద ముప్పు అని, రాజ్యాంగం కల్పించి ప్రాథమిక హక్కులకు భంగకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్న వారెందరో ఉన్నారు. దేశ ప్రజలకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన గోప్యత హక్కుకు ఆధార్ ముప్పుగా పరిణమిస్తుందని వాదిస్తూ పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రాథమిక హక్కుల్లో గోప్యత హక్కు లేదని వాదించింది.

సమాచారం బట్టబయలు


ఆధార్ కార్డు జారీ చేయటానికి ఒక వ్యక్తి పూర్తి సమాచారాన్ని, వేలిముద్రలు, ఐరిస్‌లు సేకరించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. కాని సమాచారానికి భద్రత లేకుండా పోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆధార్ కార్డును బ్యాంక్ ఖాతా నుంచి పాన్‌కార్డు, గ్యాస్ సబ్సిడీ, పాస్‌పోర్టు జారీ.. ఇలా ప్రతి అంశానికీ అనుసంధానం చేసినందువల్ల ఆధార్ కార్డు నెంబరు ద్వారా ఒక వ్యక్తి పూర్తి సమాచారాన్ని తెలుసుకునే అవకాశం లభిస్తోంది.

- నాలుగు ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి 13 కోట్ల మంది ఆధార్ సమాచారం బయటకు వెళ్లిపోయినట్లు బెంగుళూరు కేంద్రం పనిచేస్తున్న సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ సొసైటీ అనే సంస్థ ఈ ఏడాది ప్రారంభంలో నివేదించింది.
- సాంకేతిక తప్పిదం వల్ల ఝార్ఖండ్ రాష్ట్రంలో ఝార్ఖండ్ డైరెక్టరేట్ ఆఫ్ సోషల్ సెక్యూరిటీ వెబ్‌సైట్ నుంచి 16 లక్షలమంది పెన్షనర్ల ఆధార్ కార్డుల సమాచారం లీక్ అయింది. ఇందులో 14 లక్షలమంది ఆధార్ నెంబర్లు వాటి బ్యాంకు ఖాతాలతో అనుసంధానం అయి ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఇటువంటి సమస్య ఉత్పన్నం అయింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమాచారం సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి బహిర్గతమైంది. ఆయా లబ్ధిదార్ల బ్యాంకు ఖాతాలతో పాటు వ్యక్తిగత సమాచారం మొత్తం వెలుగులోకి వచ్చింది.
- ఇటువంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి. ఇంత ప్రమాదకరమైన పథకాన్ని ప్రభుత్వం ప్రజలపై రుద్దుతోందని విమర్శలు వచ్చాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

అన్నింటికీ ఆధార్

వార్షిక ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయటానికి ఆధార్ కార్డును తప్పనిసరి చేయటం పెద్ద వివాదానికి తావిచ్చింది. పాన్ కార్డుతో ఆధార్ కార్డును లింక్ చేసేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావటంతో దీన్ని అనుసరించటం తప్పించి ప్రజలకు మరో మార్గం లేకుండా పోయింది. పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వం వర్తింపజేసే సబ్సిడీ పథకాలన్నింటికీ ఆధార్ నెంబరును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గ్యాస్ సబ్సిడీ, పింఛన్లు, స్కాలర్‌షిప్పులు.. ఇలా అన్నింటికీ ఆధార్ అవసరమైంది. తొలిదశలో దీనిపై విమర్శలు వచ్చాయి. కొందరు న్యాయస్థానాలను సైతం ఆశ్రయించారు.



ఇతర దేశాల్లో గుర్తింపు కోసమే కార్డు

- పొరుగు దేశమైన పాకిస్థాన్‌లో ఆ దేశంలో 'నేషనల్ ఐడెంటిటీ కార్డు' విధానం ఉంది. కానీ అది గుర్తింపు కార్డు వరకే పరిమితం. ఒక వ్యక్తి ఆర్థిక, సాంఘిక కార్యకలాపాలను పర్యవేక్షించేదిగా లేదు. అదే సమయంలో పాకిస్థాన్‌లో 'గోప్యత హక్కు' ప్రాథమిక హక్కుగా ఉంది.
- 'బ్రిక్స్' దేశమైన బ్రెజిల్‌లో మనదేశంలోని ఆధార్ తరహా గుర్తింపు కార్డు పథకం 1980 నుంచి అమల్లో ఉంది. ఈ కార్డు ప్రజలకు ఉపయోగపడేదిగా ఉంది. ఈ కార్డుతో గుర్తింపును నిర్ధారించుకోవటంతో పాటు గుర్తింపు కార్డు బయోమెట్రిక్ సమాచారం (వేలిముద్ర) ద్వారా ఏటీఎం నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకోవటం వరకు పలు రకాలైన పనులు చేసుకోవచ్చు. ఈ కార్డు ఉంటే బ్రెజిల్ పౌరసత్వం ఉన్నట్లే. కానీ చట్టప్రకారం ఈ కార్డు తప్పనిసరి కాదు!
- ఇండోనేషియాలో జాతీయ గుర్తింపు కార్డు విధానం అమల్లో ఉంది. ప్రజలకు ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన కార్డు జారీ చేస్తారు. దీని ప్రధానోద్దేశం గుర్తింపును నిర్ధారించటమే. ఇతర పత్రాలు చూపించాల్సిన అవసరం లేకుండా ఈ కార్డు ఉంటేనే ఇండోనేషియా పౌరుడు అనే నిర్ధారణకు రావటానికి ఉపయోగపడుతుంది. తమ ప్రజలకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలు సులువుగా చేరాలనే ఉద్దేశంతో ఇండోనేషియా ప్రభుత్వం దీన్ని అమల్లోకి తీసుకువచ్చింది.
- ఆఫ్రికా దేశమైన ఘనాలో నేషనల్ ఐడెంటిటీ అథారిటీ 'ఘనా కార్డు' జారీ చేస్తుంది. ఇది గుర్తింపు కార్డు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించటానికి ఈ కార్డు తప్పనిసరి. ఘనా కార్డు సమాచారం సెంట్రల్ డేటా బేస్‌లో ఉంటుంది. ప్రజలకు సేవలు అందించే సంస్థలు వారి సమాచారాన్ని ఈ డేటా బేస్ ద్వారా నిర్ధారించుకోవచ్చు.
- జాతీయ బయోమెట్రిక్ గుర్తింపు కార్డును ప్రవేశపెట్టిన తొలిదేశంగా మలేషియాకు గుర్తింపు ఉంది. ఈ కార్డు ద్వారా తాము ఎటువంటి సేవలు పొందాలనుకుంటున్నదీ మలేషియా ప్రజలు ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. ఇది స్వచ్ఛందం మాత్రమే. ఏటీఎం కార్డుగా, డిజిటల్ వ్యాలెట్‌గా, డ్రైవింగ్ లైసెన్సుగా ఈ కార్డును ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందవచ్చు. పాస్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు కార్డును ఉపయోగించవచ్చు.
- చైనాలో ప్రజలకు ప్రభుత్వం రెసిడెంట్ ఐడెంటిటీ కార్డు జారీ చేస్తుంది. గుర్తింపు కోసం ఇది ఉపయోగపడుతుంది. డ్రైవింగ్ లైసెన్సు జారీ, బ్యాంకు ఖాతా, మొబైల్ ఫోన్ కనెక్షన్ తీసుకోవటానికి, విమానాశ్రయాల్లో ప్రవేశానికి గుర్తింపు కార్డుగా పనికి వస్తుంది. ప్రజల గుర్తింపు కార్డుల సమాచారాన్ని దొంగతనం చేయటం చైనాలో సర్వసాధారణంగా మారింది.
- యూఎస్ పాస్‌పోర్టు కార్డు అమెరికాలో గుర్తింపు కార్డుగా పనికి వస్తుంది. ఫెడరల్ ప్రభుత్వం దీన్ని జారీ చేస్తుంది. కొన్ని సేవలకు ఇది తప్పనిసరి కాగా, మరికొన్నింటికి ఇది స్వచ్ఛందం మాత్రమే.
- ఐరోపాలోని పలు దేశాల్లో జాతీయ గుర్తింపు కార్డులు జారీ విధానం ఉంది. ఇది ప్రభుత్వ సేవలను ప్రజలకు సులువుగా అందించే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమమే కానీ ప్రజలపై నిఘా పెట్టేది కాదు.

కేంద్రానికి ఎదురు దెబ్బ



'వ్యక్తిగత హక్కులు, స్వేచ్ఛలో సుప్రీం కోర్టు తీర్పు నవ శకానికి నాంది పలికింది. సామాన్యుల జీవితాల్లోకి చొచ్చుకొస్తూ.. నిఘా పెట్టేందుకు ప్రయత్నించిన కేంద్ర ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బ. కోర్టు, పార్లమెంటుల్లో కేంద్రానికి వ్యతిరేకంగా విపక్షాలు, రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏకతాటిపై నిలబడ్డాయి. అహంకారపూరిత కేంద్రం చర్యలను అడ్డుకునేందుకు, హక్కుల కోసం గళం విప్పాయి'

- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ

తీర్పును భాజపా ఆహ్వానిస్తోంది



'మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలకు అనుగుణంగానే తీర్పు ఉంది. దీన్ని భాజపా ఆహ్వానిస్తోంది. అయితే కాంగ్రెస్ ఏదో గొప్ప విజయం సాధించినట్లు అసత్య ప్రచారాలు చేపడుతోంది. తప్పులను పక్కవారిపైకి నెట్టేసేందుకు ప్రయత్నిస్తోంది. గోప్యతా హక్కు గురించి ఇప్పుడు డాంబికాలు పలుకుతున్నవారు.. ఈ హక్కు లేకుండానే దశాబ్దాలపాటు దేశాన్ని పాలించారు'

- భాజపా అధ్యక్షుడు అమిత్ షా

వ్యక్తిగత స్వేచ్ఛలో గోప్యత కీలకం



'ఇది చరిత్రాత్మక తీర్పు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన అనంతరం సుప్రీం కోర్టు ఇచ్చిన ప్రధాన తీర్పుల్లో ఇది కూడా ఒకటి. వ్యక్తిగత స్వేచ్ఛలో గోప్యత చాలా కీలకమైనది. ఈ రెండింటినీ విడదీయడం సాధ్యపడదు. తాజా తీర్పుతో 21వ అధికరణకు కొత్త శోభ సంతరించుకుంది'

- కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం

కోర్టుకు ఎలాంటి అధికారమూ లేదు

'ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలో అంతర్భాగం. వాటిని సవరించాలన్నా, రద్దు చేయాలన్నా, కొత్త హక్కును తీసుకురావాలన్నా.. సర్వ హక్కులూ పార్లమెంటుకే ఉన్నాయి. సుప్రీం కోర్టుకు ఈ అంశంపై ఎలాంటి అధికారాలూ లేవు. ఇప్పటివరకూ రాజ్యాంగానికి కోర్టు చేసిన సవరణ ఒక్కటీ లేదు. న్యాయవ్యవస్థ, పార్లమెంటు రెండు భిన్న వ్యవస్థలు. ఒకదాని పరిధిలోకి మరొకటి చొరబడకూడదు. కోర్టు, పిటిషన్‌దారుల వాదనను కేంద్రం ఇదివరకే అంగీకరించినప్పుడు.. అసలు ప్రాధాన్యంలేని అంశాన్ని ఇంత పెద్దది చేయడం అనవసరం'

- మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ

ఇది భారతీయులందరి గెలుపు

'సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా. ఇది భారతీయులందరి గెలుపు. నియంతృత్వ శక్తులకు ఎదురుదెబ్బ. నిఘా పేరుతో అణచివేతకు ప్రణాళికలు రచించిన భాజపా సిద్ధాంతం తిరస్కరణకు గురైంది'

- కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ

కేంద్రం వాదన అసంబద్ధం

'ఇది చరిత్రాత్మక, ప్రగతిశీల, ప్రభావవంతమైన తీర్పు. వ్యక్తిగత గోప్యతా హక్కును నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యతిరేకించడం అసంబద్ధంగా ఉంది. వ్యక్తిగత స్వేచ్ఛపై కేంద్ర సంకుచిత మనస్తత్వం ఈ తీర్పులో ప్రతిబింబించింది. గోప్యతా హక్కు.. మనతో పెనవేసుకుపోయిన భద్రతా హక్కును కాపాడుతుంది'

- కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్

ఏకాభిప్రాయ తీర్పు సంతోషకరం

'ఇది క్రియాశీల తీర్పు. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడుతోంది. గోప్యత మౌలిక హక్కు. ఇది ప్రతిఒక్కరిలోనూ అంతర్భాగమై ఉంది. ధర్మాసనం ఏకాభిప్రాయంతో తీర్పునివ్వడం సంతోషకరం. ప్రాథమిక హక్కులను విస్తృతపరిచే ఏ తీర్పునైనా స్వాగతించాలి'

- మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ

వేడుకలు చేసుకోవాల్సిన రోజు

'ఇది వేడుకలు చేసుకోవాల్సిన రోజు. భారత ప్రజలు ఎలాంటి గూఢచర్యం బారిన పడకుండా ఈ తీర్పుతో రక్షణ లభిస్తుందని ఆశిస్తున్నా. గోప్యత అనేది ప్రాథమిక అంశం. ఇది రోజువారి పనులను చాలా ప్రభావితం చేస్తుంటుంది'

- సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్

సహేతుక పరిమితులున్నాయ్

'తీర్పును స్వాగతిస్తున్నాం. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించడం మంచిదే. అయితే మిగతా ప్రాథమిక హక్కుల్లానే దీనికీ సహేతుకమైన పరిమితులున్నాయి. పూర్తి తీర్పు కోసం ఎదురుచూస్తున్నాం'

- భాజపా అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది అమన్ సిన్హా

కేంద్రం వైఖరి మార్చుకోవాలి

'ఈ చరిత్రాత్మక తీర్పును కేంద్రం సానుకూలంగా తీసుకోవాలి. తమ వైఖరిని మార్చుకోవాలి. వ్యక్తిగత గోప్యత, హుందాగా జీవించే హక్కులను గౌరవించాలి.'

-సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా

సమాచార దుర్వినియోగానికి కళ్లెం

'తీర్పును పార్టీ స్వాగతిస్తోంది. కార్పొరేట్ల ఆధిపత్యంలోని అధునాతన సాంకేతిక ప్రపంచంలో వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా అడ్డుకోవడానికి ఈ తీర్పు మార్గం చూపాలి. వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగకుండా చూడాలి'

- సీపీఎం పొలిట్ బ్యూరో

తీర్పు విస్పష్టంగా ఉంది

'ఇలాంటి ఘటనలే భారత్‌ను పటిష్ఠం చేస్తున్నాయి. ఎలాంటి అస్పష్టత, సందేహాలకు తావులేకుండా తీర్పుఉంది. న్యాయమూర్తులకు మనం ధన్యవాదాలు తెలిపాలి'

- ప్రముఖ నటుడు కమల్ హాసన్

గోప్యత హక్కుపై పోరాడిన పిటిషనర్లు వీరే

దిల్లీ: గోప్యత హక్కుపై న్యాయస్థానంలో పోరాడిన పిటిషనర్లలో కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ పుట్టస్వామి ప్రముఖులు. ఆధార్ పథకాన్ని సవాలు చేస్తూ 2012లో పిటిషన్ దాఖలు చేశారు. అది గోప్యత, సమానత ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తోందంటూ పేర్కొన్నారు. గోప్యతను ప్రాథమిక హక్కుగా ప్రకటించాలని కోరారు. 1926, ఫిబ్రవరి 8న జన్మించిన జస్టిస్ పుట్టస్వామి మైసూరు మహరాజా కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. బెంగళూరు ప్రభుత్వ న్యాయ కళాశాలలో న్యాయవిద్య అభ్యసించారు. 1952లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ అదనపు న్యాయవాదిగా నియామకమయ్యారు. 1977లో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 1986లో కేంద్ర పాలనా ట్రైబ్యునల్ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. పిటిషనర్లలో మరో ప్రముఖ వ్యక్తి పద్మశ్రీ, మెగ్సెసే పురస్కారాల గ్రహీత శాంతాసిన్హా. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ తొలి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బాల కార్మికుల ఉద్యమకర్తగా అంతర్జాతీయంగా పేరొందారు. ఎంవీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర ఆచార్యులు. పిటిషనర్లలో బెజవాడ విల్సన్, అరుణరాయ్, నిఖిల్ డే వంటి సామాజిక ఉద్యమకారులు, స్త్రీవాద పరిశోధకులు కల్యాణిసేన్ మేనన్ కూడా ఉన్నారు.

తీర్పును స్వాగతించిన కేంద్రం

- **సహేతుక పరిమితులుండే ప్రాథమిక హక్కు!**
- **వ్యక్తిగత గోప్యతపై ప్రభుత్వ వివరణ**

దిల్లీ

దిల్లీ: వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం స్వాగతించింది. అయితే అది తిరుగులేని సంపూర్ణ హక్కు కాదని.. సహేతుక పరిమితులకు లోబడి ఉంటుందని పేర్కొంది. ఈ విషయమై ప్రభుత్వ వాదనను సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించడం సానుకూల పరిణామమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గౌరవిస్తూనే.. బయోమెట్రిక్ గుర్తింపు వినియోగానికి రూపొందించిన చట్టంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. చట్టం చేయకుండా యూపీఏ ప్రభుత్వం ఆధార్‌ను తేవడం వల్లే వ్యక్తిగత గోప్యత అంశం సుప్రీం వరకు వెళ్లిందన్నారు. అదే భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం గత ఏడాది ఆధార్ చట్టం తీసుకొచ్చినట్లు వివరించారు. గోప్యతకు సంబంధించి ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా శిక్షలు పడేలా నిబంధనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. గోప్యతకు సంబంధించి సందర్భానికనుగుణంగా పరిమితులుంటాయని వివరించారు. అవి న్యాయపరంగా, నిజాయతీగా, సహేతుకంగా ఉండాలని.. ఆధార్ చట్ట నిబంధనలు అలాగే ఉన్నాయన్నారు. జాతీయ భద్రత, నేర పరిశోధనలకు.. అలాగే సంక్షేమ పథకాలు దుర్వినియోగం కాకుండా ఈ పరిమితులు ఉండవచ్చని సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు తెలిపారు. ఆధార్‌కు సంబంధించి.. వ్యక్తిగత గోప్యతకు కొన్ని పరిమితులుంటాయని కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఇదే విషయమై గత ఏడాది రాజ్యసభలో అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనను ఆయన ఉటంకించారు. భావప్రకటన కూడా ప్రాథమిక హక్కే అయినా.. దుస్తుల్లేకుండా రాష్ట్రపతి భవన్ ఎదుట నిరసన చేపట్టడానికి ఎవరినీ అనుమతించరన్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. వాక్ స్వాతంత్ర్యపు హక్కు కూడా పరువునష్టం చట్టాన్ని అతిక్రమించి ఉండదని విలేకరులతో అన్నారు. ఆధార్, డేటాపై అడిగిన అనేక ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. పరిమితమైన సమాచారం మాత్రమే బహిర్గతంగా ఉంటుందని తెలిపారు. బయోమెట్రిక్స్ సహా డేటా పూర్తి సురక్షితమని వివరించారు. డేటా సురక్షితంగా ఉండేలా.. 10 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ ఈ ఏడాది ఆఖరు నాటికి సిఫార్సులను సమర్పిస్తుందని మంత్రి తెలిపారు.



విలేకరుల సమావేశంలో తన ఆధార్‌కార్డు చూపుతున్న కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

రాహుల్‌కు అది అలవాటే..!: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఏమీ తెలుసుకోకుండా మాట్లాడటం అలవాటై పోయిందని మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు నియంతృత్వ శక్తులకు ఎదురుదెబ్బగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఎమర్జెన్సీ కాలంలో వ్యక్తిగతస్వేచ్ఛను పరిరక్షించడంలో కాంగ్రెస్ రికార్డు ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు జతగా వామపక్షాలు తమను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయన్నారు.

అవి భారత చట్టాలను గౌరవించడం నేర్చుకుంటాయి..: టెక్, ఐటీ దిగ్గజాలు భారత చట్టాలను గౌరవించడం నేర్చుకుంటాయని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, ఐటీ కంపెనీల ద్వారా వివరాలు బహిర్గతమవుతాయన్న గోప్యతపరమైన ఆందోళనలపై అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా స్పందించారు. ఐటీ రంగంలో ఎఫ్‌డీఐలకు పూర్తి స్వేచ్ఛ ఉందని.. గూగుల్, ఫేస్‌బుక్ వంటి కంపెనీలు భారతీయులకు సాధికారిత కల్పిస్తున్నాయన్నారు. సాధారణప్రజలు కూడా సామాజిక మాధ్యమాల్లో ఉంటున్నారని వివరించారు.

పర్యవసానాలపై మంత్రులు భేటీ

ఆధార్‌పైనే ప్రధాన చర్చ!

దిల్లీ: వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో.. పర్యవసానాలను చర్చించేందుకు కీలక మంత్రులు, అత్యున్నత అధికారులు ఏకాంతంగా భేటీ అయ్యారు. ప్రధానంగా ఆధార్ వినియోగంపై వీరంతా చర్చించారు. సుప్రీం తీర్పు వెలువడిన వెంటనే ఆధార్ ప్రాధికార సంస్థ యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్‌ను కలిశారు. అనంతరం ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రాతో కలిపి వారిద్దరూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో భేటీ అయ్యారు. సమావేశ వివరాలను మాత్రం ఎవరూ వెల్లడించలేదు. ప్రభుత్వం తర్వాత నిర్దిష్టమైన సమాచారం అందిస్తుందని అధికారులు తెలిపారు.

ప్రాథమిక హక్కుగా పరిణమించిందిలా..

దిల్లీ: వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించడం వెనుక జరిగిన న్యాయ ప్రక్రియ పరిణామ క్రమం ఇలా...

జులై 7: ఆధార్ వ్యవహారంపై తలెత్తిన సమస్యలను విస్తృత ధర్మాసనం విచారించాల్సి ఉందని, దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉందని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది.

- ఈ విషయాన్ని సీజేఐ ముందు ప్రస్తావించగా, అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు.

జులై 18: అయిదుగురు సభ్యుల ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ... వ్యక్తిగత గోప్యత హక్కును రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కుగా గుర్తించవచ్చా అని తేల్చడానికి తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని సూచించింది. ఆ మేరకు తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం ఏర్పాటయింది.

జులై 19: వాదనల సందర్భంగా వ్యాఖ్యానం చేస్తూ.. వ్యక్తిగత గోప్యత హక్కు పరిపూర్ణమైనది కాదని, దీనిని నియంత్రించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది.

- గోప్యత హక్కు ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

జులై 26: గోప్యత హక్కు ఉండాల్సిందేనని నాలుగు భాజపాయేతర రాష్ట్రాలైన కర్ణాటక, పశ్చిమ బెంగాల్, పంజాబ్, పుదుచ్చేరిలు సుప్రీంకోర్టుకు తెలిపాయి.

- గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించవచ్చని, కానీ ఆంక్షలు విధించాలని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

జులై 27: గోప్యత స్వతంత్రంగా ఉండే హక్కు కాదని, ఒక భావన మాత్రమేనని సుప్రీంకోర్టుకు తెలిపిన మహారాష్ట్ర ప్రభుత్వం

ఆగస్టు 1: ప్రజాక్షేత్రంలో వ్యక్తుల ప్రయివేటు సమాచారం అందుబాటులో ఉంటోందని, దీనిని పరిరక్షించడంపై సమగ్రమైన మార్గదర్శకాలు ఉండాలని సూచించిన సుప్రీంకోర్టు

ఆగస్టు 2: సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత యుగంలో గోప్యతను పరిరక్షించాలన్న భావన ఓటమి పాలయ్యే యుద్ధంలాంటిదని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు. తీర్పు వాయిదా.

ఆగస్టు 24: గోప్యత హక్కు రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కేనని తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు

ప్రజల జీవితాల్లోకి తొంగి చూసేలా..

డేటాకు రక్షణ అవసరం • అందుకు తగిన వ్యవస్థ ఉండాలి

దిల్లీ: ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత గోప్యతకు పొంచి ఉన్న ప్రమాదాలపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. డేటా పరిరక్షణకు గట్టి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. వ్యక్తిగత గోప్యతకు ముప్పులు ప్రభుత్వం నుంచే కాకుండా ప్రభుత్వేతర శక్తుల నుంచీ వస్తుందని పేర్కొంది. ప్రజలకు సంబంధించిన విలువైన డేటాను కొందరు వ్యక్తులు నిరంతరం రూపొందిస్తున్నారని తెలిపింది. ప్రైవేటు పార్టీలు.. ప్రజల ఆలోచనలు, ఇష్టాఇష్టాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఈ డేటాను ఉపయోగించే ప్రమాదం ఉందని వివరించింది. వ్యక్తిగత గోప్యతపై గురువారం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పులో.. డేటా భద్రతకు తలెత్తే ముప్పులపై పలు వ్యాఖ్యానాలు చేశారు.

"డేటా పరిరక్షణకు దృఢమైన ఒక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచిస్తున్నాం. ఈ వ్యవస్థ ఏర్పాటు క్రమంలో వ్యక్తుల ప్రయోజనాలు, ప్రభుత్వానికి ఉన్న చట్టబద్ధ లక్ష్యాల మధ్య సున్నితమైన సమతౌల్యాన్ని సాధించాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. జాతీయ భద్రత, నేర నిరోధం, నేర దర్యాప్తు, నవకల్పనను ప్రోత్సహించడం, విజ్ఞానాన్ని ప్రోత్సహించడం, సాంఘిక సంక్షేమ ప్రయోజనాలు దుర్వినియోగం కాకుండా చూడటం వంటివి ప్రభుత్వ చట్టబద్ధ లక్ష్యాలుగా ఉంటాయి. ఇలాంటివన్నీ విధాన సంబంధ అంశాలు. వీటిని జాగ్రత్తగా పరిశీలించాక డేటా పరిరక్షణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, జస్టిస్ ఎస్.ఏ.నజీర్‌ల తరఫున విడిగా రాసిన తీర్పులో జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో ఒక కమిటీని కేంద్రం ఏర్పాటు చేసిన విషయాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు.

సాంకేతిక పరిజ్ఞాన వృద్ధి కారణంగా 'సమాచార విస్ఫోటం' సంభవిస్తోందని విడిగా 47 పేజీల తీర్పును రాసిన జస్టిస్ ఎస్.కె.కౌల్ పేర్కొన్నారు. దీనివల్ల లాభాలతోపాటు నష్టాలూ ఉన్నాయన్నారు. "బయటకు ఇవ్వడానికి ఒక వ్యక్తి ఇష్టపడని సమాచారానికి వ్యక్తిగత గోప్యత కింద రక్షణ అవసరం. ఇళ్లలోకి, ఏకాంతంలోకి చొరబడేలా ప్రభుత్వేతర శక్తుల సామర్థ్యం పెరిగింది. సాంకేతిక అభివృద్ధి.. ఇంతకుముందెన్నడూ లేని స్థాయిలో చొరబాటుతో కూడిన జర్నలిజానికి దారితీస్తోంది" అని చెప్పారు. సమాచారాన్ని పంచుకోవడం వంటి ప్రత్యక్ష విధానాల ద్వారానే కాక ఇంటర్నెట్‌లో క్లిక్ చేసిన ప్రతిసారీ పరోక్ష విధానాల ద్వారా కూడా డేటా సృష్టి జరుగుతోందని పేర్కొన్నారు. "ప్రపంచంలోనే అత్యంత పెద్ద ట్యాక్సీ సంస్థ అయిన ఉబెర్‌కు సొంతంగా వాహనాలే లేవు. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన మీడియా సంస్థ 'ఫేస్‌బుక్' సొంతంగా ఎలాంటి సమాచారాన్ని సృష్టించదు. ప్రముఖ రిటైల్ సంస్థ అలీబాబాకు సొంతంగా ఎలాంటి వస్తువుల జాబితా లేదు. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన వసతి సేవల సంస్థ ఎయిర్‌బీఎన్‌బీకి ఎలాంటి స్థిరాస్తులు లేవు. ఇలా చాలా ఆసక్తికరమైన అంశాలు చోటుచేసుకుంటున్నాయి" అని పేర్కొన్నారు. జస్టిస్ జె.చలమేశ్వర్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ప్రభుత్వం చేపట్టే టెలిఫోన్ ట్యాపింగ్, ఇంటర్నెట్ హ్యాకింగ్ కూడా వ్యక్తిగత గోప్యత హక్కు పరిధిలోకే వస్తాయని పేర్కొన్నారు.



ఎందుకంత 'విశిష్టత'.. ఏమా గోప్యత!





'ఆధార్' కథా కమామిషు...

వ్యక్తిగత గోప్యతలోకి ప్రభుత్వాల చొరబాటును నియంత్రిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు- ప్రభుత్వం వివిధ పథకాలతో ముడిపెడుతున్న ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యపై నేరుగా ప్రభావం చూపుతోంది. పౌరుల సమస్త వివరాలు ముఖ్యంగా.. వారి ప్రాంతం, బయోమెట్రిక్ సమాచారం.. ఇత్యాది విషయాలన్నీ సేకరించి.. వారికి 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడానికి ఆధార్ ప్రాజెక్టును చేపట్టారు. విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) దీనిని జారీచేస్తోంది. దేశ భద్రతను పరిపుష్టం చేయడం, అక్రమ వలసల్ని అరికట్టడం ప్రధానోద్దేశంగా తొలుత ఈ ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ఆ తర్వాత సంక్షేమ ఫలాల్ని లబ్ధిదారులకు సమర్థంగా చేరవేయడం కోసం దీన్నో సాధనంగా వాడడం ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలు, పథకాల సమర్థ పర్యవేక్షణకూ దీనిని వినియోగించడం మొదలుపెట్టారు. రకరకాల పరిణామాలు, వివాదాల తర్వాత- ఆధార్ ఇప్పుడు దేశంలో ఎక్కడికి వెళ్లినా.. ఏం చేసినా.. ఏం కావాలన్నా తప్పనిసరి అయింది. దేశంలో ఇప్పటికే పాన్, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్ కార్డు... ఇత్యాది కార్డులున్నప్పటికీ.. ఆధార్ ఏకైక గుర్తింపు ఆధారంగా మారింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, టెలికాం, ఇతర వ్యాపార సంస్థలు వినియోగదారుల వివరాలు(కేవైసీ) తెలుసుకోవడానికి ఆధార్‌ను కీలకంగా పరిగణిస్తున్నాయి. సంక్షేమ పథకాల ఫలాల్ని పేదలకు అందివ్వడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే గోప్యంగా ఉంచాల్సిన వ్యక్తుల బయోమెట్రిక్ తదితర సమాచారం పక్కదోవ పట్టొచ్చన్న ఆందోళన దేశంలో చాన్నాళ్లుగా వ్యక్తమవుతూనే ఉంది. ప్రస్తుతం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న ఆధార్‌ను దేశంలో ప్రవేశపెట్టడం వెనుక పెద్ద నేపథ్యమే ఉంది.

ఇదీ నేపథ్యం...

1999: కార్గిల్ యుద్ధం పరిణామాల్ని సమీక్షించడానికి భద్రతా విశ్లేషకులు కె.సుబ్రమణ్యం నేతృత్వంలో 1999లో కమిటీ ఏర్పాటయింది. జాతీయ భద్రతా పరిస్థితిని సమీక్షించడం ఈ కమిటీ ఉద్దేశం. జాతీయ గుర్తింపు కార్డుల జారీ ప్రతిపాదనను ఆ కమిటీయే తెరపైకి తెచ్చింది.

2000: సుబ్రమణ్యం కమిటీ ఈ ఏడాది జనవరి 7వ తేదీన అప్పటి ప్రధాని ఎ.బి.వాజ్‌పేయికి నివేదికను సమర్పించింది. దేశ సరిహద్దుల్లోని గ్రామాల ప్రజలకు గుర్తింపు కార్డులు జారీచేయాలని కమిటీ సూచించింది.

2001: గుర్తింపు కార్డుల ప్రతిపాదనను ఆమోదిస్తూ.. ఎల్.కె.అద్వానీ నేతృత్వంలోని మంత్రుల గ్రూపు ఓ నివేదికను సమర్పించింది. బహుళ ప్రయోజన జాతీయ గుర్తింపు కార్డు ప్రాజెక్టు త్వరలో ప్రారంభమవుతుందని ఆ గ్రూపు తమ నివేదికలో తెలిపింది. జాతీయ గుర్తింపు కార్డు జారీని తప్పనిసరి చేయాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.

2003: పౌర(సవరణ) బిల్లును ఎల్.కె. అద్వానీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. "దేశంలోని ప్రతి పౌరుడినీ కేంద్ర ప్రభుత్వం నమోదుచేస్తుంది. జాతీయ గుర్తింపు కార్డును జారీచేస్తుంది" అని ఆ బిల్లులో నిబంధన పెట్టారు.

2006: యూఐడీఏఐని ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనను ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలోని మంత్రుల గ్రూపు తెరపైకి తెచ్చింది.

2009: ప్రణాళికా సంఘం నోటిఫికేషన్ తర్వాత యూఐడీఏఐ ఏర్పాటయింది. ప్రాజెక్టులో సహకరించడం కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనిని 2009 జూన్ 23న యూపీఏ ప్రభుత్వం యూఐడీఏఐ ఛైర్మన్‌గా నియమించింది. కేబినెట్ మంత్రి హోదాను కట్టబెట్టింది.

2010: విశిష్ట గుర్తింపు సంఖ్య బ్రాండ్ పేరు 'ఆధార్'ను, దాని లోగోను 2010 ఏప్రిల్ నెలలో నీలేకని ఆవిష్కరించారు.

2013: చెల్లింపుల కోసం జాతీయ పేమెంట్స్ కార్పొరేషన్ ఏర్పాటయింది.

2014: కాంగ్రెస్ టిక్కెట్టుపై పోటీచేయడం కోసం నీలేకని యూఐడీఏఐ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆ బాధ్యతల్ని ఐఏఎస్ అధికారి విజయ్ మాధవన్‌కు అప్పగించారు. 2014 ఎన్నికల తర్వాత- ప్రధాని మోదీని నీలేకని కలిసి.. ఆధార్ ప్రాజెక్టును కొనసాగించాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పారు.

2016: ఆధార్ ఆర్థిక, ఇతర రాయితీలు, ప్రయోజనాలు, సేవల) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. గోప్యత హక్కుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టు ముందున్నందువల్ల ఈ బిల్లును ఆమోదించడం సరికాదని రాజ్యసభలో చర్చ సందర్భంగా సీపీఎం నేత సీతారాం ఏచూరి బలంగా వాదించారు.

వాస్తవానికి 2003 ఏప్రిల్‌లోనే జాతీయ గుర్తింపు కార్డు జారీకి సంబంధించిన ప్రయోగాత్మక ప్రాజెక్టు ప్రారంభమయింది. ఆ ఏడాది ఎన్నికల కమిషన్ ఫొటో గుర్తింపు కార్డుల జారీని ప్రారంభించింది. దాదాపు 13 రాష్ట్రాల్లోని 29 లక్షల మందికి దశలవారీగా వీటిని జారీచేశారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు విశిష్ట గుర్తింపు కార్డు ఇవ్వాలన్న ప్రాజెక్టుకు సమాచార, సాంకేతిక పరిజ్ఞాన, కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ 2006 మార్చి 3న ఆమోదం తెలిపింది. తొలుత 12 నెలల పాటు ఎన్ఐసీ ఈ ప్రాజెక్టును అమలుచేసింది. ఆ తర్వాత యూఐడీ ప్రాజెక్టు వ్యూహాత్మక దార్శనిక స్వరూపాన్ని(విజన్) మాత్రం విప్రో కంపెనీ తయారుచేసింది. ప్రస్తుతం బయోమెట్రిక్ ఆధార డేటాబేస్ తయారీ, కేంద్రీకృత వ్యవస్థ రూపకల్పన మాత్రం నీలేకని మార్గదర్శకత్వంలోనే జరిగింది.

ఏమిటీ ప్రాజెక్టు:
విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ(ఆధార్)

ఇప్పటిదాకా ఎంత ఖర్చుచేశారు:
దాదాపు రూ.8800 కోట్లు

ఎందరికి జారీచేశారు:
ఈ ఏడాది మార్చి నాటికి 112 కోట్ల మంది(దేశ జనాభాలో 88.2 శాతం) నమోదయ్యారు.

ప్రస్తుత సీఈఓ:
అజయ్ భూషణ్ పాండే

నిర్వహిస్తున్న మంత్రిత్వశాఖ:
ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖ.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఇప్పుడేమిటి ఆధారం!

- అన్ని సంక్షేమ పథకాలకూ అనివార్యం చేసిన ప్రభుత్వాలు
- ఐచ్ఛికమేనంటున్న కొన్నిశాఖలు
- తెలంగాణలో అందరికీ కార్డులు
- ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతం జారీ

ఈనాడు – హైదరాబాద్

వ్యక్తిగత సమాచార గోప్యత పౌరుల ప్రాథమిక హక్కేనని సుప్రీం కోర్టు స్పష్టీకరించడంతో ఇప్పుడు ఆధార్ కార్డు అనుసంధానత చర్చనీయాంశమైంది. ఇప్పటికే చాలారకాల ప్రభుత్వ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్‌ను అనివార్యం చేశాయి. మరికొన్ని శాఖలు ఆధార్ ఐచ్ఛికమని చెబుతూనే వివరాలను నమోదు చేయిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 99 శాతంమంది ఆధార్ కార్డులను తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో 3.83 కోట్లమందికి ఆధార్ సంఖ్యను కేటాయించారు. అంటే రాష్ట్ర జనాభాలో నూటికి నూరుశాతం మందికి ఆధార్ కార్డులు జారీ అయినట్లే. ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతం ప్రజానీకానికి కార్డులు జారీ చేసినట్లు ఆధార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.వి.ఎస్.రామిరెడ్డి గురువారం 'ఈనాడు'తో చెప్పారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 5.12 కోట్లమంది నంబర్లను కేటాయించారు. ఆధార్‌ను అనివార్యం చేసిన శాఖలు తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆధార్ కార్డుల నుంచి సంక్షేమ పథకాలకు అనుసధానంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఐచ్ఛికమే కానీ....

పాన్ కార్డు వివరాలకు ఆధార్‌తో అనుసంధానం ఐచ్ఛికమే అయినా అనుసంధానం చేస్తే ఆదాయపు పన్ను శాఖ రిటర్నుల దాఖలులో చిన్న వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్ ద్వారా రిటర్నులు దాఖలు చేస్తే ఆయా పత్రాలను బెంగళూరులోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి పంపాల్సిన అవసరం లేదు. ఆటోమేటిక్‌గా ఈ-వెరిఫికేషన్ జరుగుతుంది. ఆధార్ నమోదు చేయకపోతే ఆయా పత్రాలను బెంగళూరు పంపాల్సి ఉంటుందని ఆదాయపుపన్ను నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అన్నిరకాల భద్రతా చర్యలు చేపట్టాం

ఆధార్ సమాచారానికి భద్రత కల్పించేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాం. సంబంధిత వ్యక్తుల ఆమోదం లేకుండా సమాచారాన్ని ఎవరికీ ఇచ్చే ప్రసక్తి లేదు. ప్రభుత్వ శాఖలు మాత్రమే ఆధార్ సమాచారాన్ని వినియోగించుకున్నాయి. ఆధార్ వివరాలు దుర్వినియోగంఅవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు.

- ఎం.వి.ఎస్.రామిరెడ్డి, ఆధార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్

అనివార్యం చేసిన శాఖలు

- ప్రజాపంపిణీ వ్యవస్థలో ఆధార్ ఆధారంగానే బియ్యం ఇస్తున్నారు. ఆధార్ జారీ చేసిన సందర్భంలో సేకరించిన వేలిముద్రలను చౌకధరల దుకాణాల్లోని యంత్రాలకు అనుసంధానం చేశారు. ఆ వేలిముద్రలు సరిపోలితేనే బియ్యం పంపిణీ సాగుతోంది.
- వంట గ్యాస్ సబ్సిడీ, పింఛన్లు, ఉపాధి హామీ పథకం, విద్యార్థులకు ఉపకార వేతనాల జారీ.. చివరకు కళాశాలల్లో సీట్ల కేటాయింపు సమయంలో కూడా ఆధార్ అనుసంధానం అనివార్యం చేశాయి ప్రభుత్వాలు.
- రవాణాశాఖలో తాజాగా ఆధార్‌ను ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ల శాఖలోనూ తప్పనిసరి చేశారు. ఆస్తుల క్రయవిక్రయాల సందర్భాల్లో ఆధార్ లేకుంటే రిజిస్ట్రేషన్ చేయడంలేదు.
- ఆరోగ్యశ్రీ, సర్వశిక్ష అభియాన్, గ్రామీణాభివృద్ధి, జనన మరణ ధ్రువపత్రాలు జారీ తదితరాల్లో కూడా ఆధార్‌ను అమలు చేస్తున్నారు.
- స్వయం సహాయక సంఘాలు, గృహనిర్మాణ సబ్సిడీలకు ఆధార్ నంబరునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు.
- ప్రభుత్వపరంగా పొందే సబ్సిడీలకే కాకుండా బ్యాంకు ఖాతాలు తెరవాలన్నా, పాస్‌పోర్టు పొందాలన్నా, సిమ్ కార్డులకు, చివరకు కరెంటు కనెక్షన్లు, మంచినీటి కనెక్షన్లు తీసుకోవాలన్నా ఆధార్ నంబరు అడుగుతున్న విషయం తెలిసిందే.



సమాచార భద్రతా మార్గదర్శకాలకు నీతిఆయోగ్ పిలుపు

దిల్లీ: సమగ్ర సమాచార భద్రతా మార్గదర్శకాల కోసం నీతిఆయోగ్ పిలుపునిచ్చింది. త్రైవార్షిక కార్యచరణ ప్రణాళికల నివేదికను సంస్థ గురువారం విడుదలచేసింది. 'ప్రస్తుతం మన దేశంలో గోప్యత లేదా సమాచార భద్రతకు సమగ్ర చట్టం అందుబాటులో లేదు. సాంకేతిక సమాచార (ఐటీ) చట్టంలోని సెక్షన్ 43(ఏ) కేవలం మౌలిక భద్రత మాత్రమే కల్పిస్తోంది. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు దీని పరిధిలోకి రావడం లేదు'అని నివేదికలో నీతిఆయోగ్ పేర్కొంది. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీం కోర్టు స్పష్టంచేసిన నేపథ్యంలో తాజా నివేదిక విడుదలైంది. 'డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన సమాచారంపై క్రయవిక్రయాలు జరిగే అవకాశముంది. దీంతో సంభవించే పరిణామాలు మనం అసలు ఊహించలేం. డిజిటల్ లావాదేవీల సంఖ్య పెరుగుతోందంటే.. సమాచార నిల్వ కూడా పెరుగుతున్నట్లే. మరోవైపు ఈ సమాచారం మెరుగైన పాలన, పన్నుల ఎగవేతను అడ్డుకోవడంలోనూ ఉపయోగపడే వీలుంది. ప్రస్తుతం సమాచార యాజమాన్యంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో లేకపోవడంతో.. సమాచారం దుర్వినియోగానికి గురయ్యే ముప్పుంది. వీలైనంత త్వరగా ఈ విషయంలో కేంద్రం చర్యలు తీసుకోవాలి'అని నివేదికలో నీతిఆయోగ్ పేర్కొంది.

ఆధార్‌పై ప్రభావం లేదు

అది కొనసాగుతుంది: యూఐడీఏఐ

దిల్లీ: వ్యక్తిగత గోప్యతపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలోనూ ఆధార్‌ను 'పాన్'తో సంధానించే ప్రక్రియ కొనసాగుతుందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సీఈవో అజయ్ భూషణ్ పాండే పేర్కొన్నారు. అలాగే వివిధ రకాల ప్రభుత్వ రాయతీలను పొందడానికి ఆధార్ సంఖ్యను పేర్కొనడం కూడా తప్పనిసరని వివరించారు. ఆదాయ పన్ను రిటర్నుల దాఖలుకు, వివిధ పథకాలు పొందడానికి ఆధార్‌ను పేర్కొనరాదని సుప్రీం కోర్టు తన తీర్పులో ఎక్కడా స్పష్టంచేయలేదన్నారు. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగానే పరిగణిస్తూనే ఆధార్ చట్టాన్ని రూపొందించారని చెప్పారు. అందువల్ల ఈ పరీక్షను తట్టుకొని ఈ చట్టం నిలబడుతుందన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు. తాజా తీర్పు నేపథ్యంలో.. ఎవరైనా తమ వివరాలను తెలియజేయడానికి నిరాకరించవచ్చా అన్న ప్రశ్నకు. "అలా కుదరదు. ఆధార్ చట్టం నేటికీ చెల్లుబాటు అవుతుంది. ప్రస్తుత తీర్పుతో దానికి సంబంధం లేదు" అని జవాబిచ్చారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ కూడా నిరాటంకంగా కొనసాగుతుందన్నారు.

'అసమ్మతి తీర్పు'లే మార్గదర్శకాలు

- భిన్నమైన తీర్పులతో వ్యక్తిగత స్వేచ్ఛకు పట్టం
- అప్పటి న్యాయమూర్తుల దూరదృష్టిని కొనియాడిన ధర్మాసనం
- స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు విస్తృత అర్థం

దిల్లీ

గోప్యత హక్కుపై తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు అప్పటి ముగ్గురు న్యాయమూర్తుల 'దూరదృష్టి'ని కొనియాడింది. అప్పట్లో 'అసమ్మతి తీర్పు'లుగా గుర్తింపు పొందిన వ్యాఖ్యానాలే ఇప్పుడు గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించడానికి మార్గదర్శకాలయ్యాయి. వ్యక్తిగత స్వేచ్ఛ ప్రధానమైనదని, ప్రాథమిక హక్కులు ఒకదానికి మరొకటి ముడిపడి ఉన్నాయని, వీటికి అనువుగానే చట్టాలు ఉండాలంటూ మెజారిటీ న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులకు భిన్నంగా పేర్కొన్నారు. వాటి ఆధారంగానే గోప్యత హక్కుపై ధర్మాసనం భాష్యం చెప్పింది. నాడు జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా, జస్టిస్ సయ్యద్ ఫజల్ అలీ, జస్టిస్ కోకా సుబ్బారావులు ఇచ్చిన 'అసమ్మతి' తీర్పులను ప్రస్తావించింది.

తండ్రి తీర్పును కొట్టివేసిన తనయుడు

- దేశ న్యాయ చరిత్రలో అసాధారణ దృశ్యం ఆవిష్కృతమయింది. తండ్రి ఇచ్చిన తీర్పును తయనయుడు తిరిస్కరించిన సందర్భమిది. 1976లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.వి. చంద్రచూడ్..వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదని తీర్పు ఇవ్వగా.. ప్రస్తుతం ఆయన తనయుడు డి.వై. చంద్రచూడ్ అది ప్రాథమిక హక్కేనని పేర్కొన్నారు.
- అదనపు జిల్లా మేజిస్ట్రేట్, జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసుగా చరిత్రలో నిలిచిన ఈ వ్యవహారం అత్యయిక పరిస్థితి కాలం నాటిది. ఇందిరా గాంధీ అత్యయిక పరిస్థితి విధించిన సమయంలో కారణం చూపకుండానే అరెస్టులు, దానిపై న్యాయస్థానాల్లో సవాలు చేసే పరిస్థితులు ఉండేవి. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంలో దాఖలయిన వ్యాజ్యంపై అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎన్.రే, జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా, జస్టిస్ హెచ్.ఎం.బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎన్.భగవతిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఒక్క హెచ్.ఆర్.ఖన్నా మినహా మిగిలిన నలుగురు న్యాయమూర్తులు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ వై.వి.చంద్రచూడ్ వ్యాఖ్యానిస్తూ "వ్యక్తిగత స్వేచ్ఛ అంటే కచ్చితమైన నిర్వచనం లేదు. అందువల్ల ఈ స్వేచ్ఛను రాజ్యాంగం ప్రసాదించిందా? రాజ్యాంగం అమలు కావడానికి ముందు నుంచే ఉందా? అని చెప్పడం కష్టం" అని పేర్కొన్నారు.
- ప్రస్తుతం జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెలుబుచ్చిన అభిప్రాయం అందుకు భిన్నంగా ఉంది. "వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కులు మానవ మనుగడతో విడదీయరానివి. ఇవి అనంతకాలం నుంచి వస్తున్నవి. వీటిని సహజ న్యాయాల కింద గుర్తించాలి. వ్యక్తి జీవితం జీవన విలువలపైనే ఆధారపడి ఉంది. గౌరవప్రద జీవనం స్వేచ్ఛ, స్వతంత్రలతో సమ్మిళతమైనది. నాగరిక ప్రభుత్వం ఏదీ తగిన చట్టం లేకుండా వాటిని హరించలేదు. ఈ హక్కులు ప్రభుత్వమో, రాజ్యాంగమో ఇచ్చినవి కావు" అని పేర్కొన్నారు.
- ఈ సందర్భంగా జస్టిస్ ఖన్నా తన అసమ్మతి తీర్పులో "అత్యయిక పరిస్థితి విధించినప్పటికీ 21వ అధికరణంపై ప్రభావం చూపదు. మౌలికమైన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులు అమలవుతాయి" అని పేర్కొన్నారు. దీనిపై ప్రస్తుతం జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానిస్తూ "జస్టిస్ ఖన్నా అభిప్రాయాలను ఆమోదించాల్సి ఉంది. ఆలోచనల్లో బలం, నిబద్ధతలో ధైర్యం దృష్ట్యా వాటిని ఆమోదించాల"ని పేర్కొన్నారు.
- అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం), జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసులో తీర్పును ప్రస్తావిస్తూ "జీవించే హక్కు రాజ్యాంగం అమలు కావడానికి ముందు నుంచే ఉంది. దీన్ని రాజ్యాంగం గుర్తిస్తోంది. అయితే దాన్ని పరిరక్షించేది రాజ్యాంగం ఒక్కటే కాదు" అని వివరించారు. "రాజ్యాంగంలో పొందుపరిచినంత మాత్రాన దేశ ప్రజలు తమ జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులను రాజ్యానికి స్వాధీనం చేసినట్టు కాదు. స్వేచ్ఛ, స్వతంత్రం, జీవితం.. రాజ్యం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి లేవు" అని పేర్కొన్నారు. అందువల్ల ఏడీఎం జబల్‌పూర్, అనంతరం ఇదే తీరులో వచ్చిన యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ భానుదాస్ కృష్ణ గవాడే కేసుల్లో తీర్పులను కొట్టివేస్తున్నామని పేర్కొన్నారు.



ఒకదానితో మరొకటి ముడిపడి...

జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్ తన 122 పేజీల తీర్పులో జస్టిస్ ఖన్నాతో పాటు, జస్టిస్ సయ్యద్ ఫజల్ అలీ, జస్టిస్ కోకా సుబ్బారావుల అసమ్మతి తీర్పులను ప్రస్తావించారు. కమ్యూనిస్టు నాయకుడు ఎ.కె.గోపాలన్‌ను ప్రివెంటెవ్ డిటెన్షన్ చట్టం కింద అరెస్టు చేయడంపై దాఖలైన వ్యాజ్యానికి సంబంధించి జస్టిస్ ఫజల్ అలీ తీర్పు వెలువరిస్తూ ప్రాథమిక హక్కులు విడివిడిగా ఉండవని, అవి వ్యక్తుల స్వేచ్ఛ, స్వాంతత్ర్యాలను కాపాడేవని చెప్పారు. దీనిని గుర్తుచేసిన జస్టిస్ నారిమన్ ఈ వ్యాఖ్యలు ఎంత సమంజసమైనవో అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయన్న ఆయన అభిప్రాయం ఎంతో విలువైనదని చెప్పారు.

ఖరక్‌సింగ్ వర్సెస్ ఉత్తర్‌ప్రదేశ్ కేసు (1962)లో జస్టిస్ కోకా సుబ్బారావు చేసిన వ్యాఖ్యలను కూడా జస్టిస్ నారిమన్ ప్రస్తావించారు. ఖరక్‌సింగ్‌పై దోపిడీ కేసు నమోదు కాగా, ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు దానిని కొట్టివేసింది. అయితే పోలీసులు ఆయనపై రౌడీషీటు తెరచి, నిఘా ఉంచారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టుకు ఆశ్రయించగా వ్యక్తిగత గోప్యత హక్కును రాజ్యాంగం గుర్తించలేదంటూ తీర్పు ఇచ్చింది. అయితే జస్టిస్ సుబ్బారావు మాత్రం స్వేచ్ఛగా సంచరించే హక్కును ఇది హరిస్తోందని పేర్కొన్నారు. ఇలా చేయాలంటే సహేతుకమైన కారణాలు ఉండాలని చెబుతూ ప్రాథమిక హక్కులు ఒకదానికి మరొకటి అనుసంధానమై ఉన్నాయని తెలిపారు.

గతంలోని తీర్పులు

వ్యక్తిగత గోప్యత హక్కుపై గతంలో సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీర్పులుఇవ్వడంతో పాటు వ్యాఖ్యలు చేసింది.


- **ఎం.పి.శర్మ వర్సెస్ దిల్లీ మెజిస్ట్రేట్ (1954):** దాల్మియా జైన్ ఎయిర్‌వేస్‌లో అక్రమాలు జరిగాయంటూ అధికారులు దాడులు చేశారు. తమ ప్రయివేటు రికార్డులను తీసుకెళ్లారంటూ యాజమాన్య ప్రతినిధులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు ఇస్తూ "అమెరికా రాజ్యాంగం నాలుగో సవరణ మాదిరిగా ఇక్కడా గోప్యత హక్కు ఉందని చెప్పడం తగదు. దానిని దిగుమతి చేసుకోలేం". అని పేర్కొంది.
- **గోవింద్ వర్సెస్ మధ్యప్రదేశ్ (1975):** 'రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులన్నీ వ్యక్తిగత గోప్యత హక్కుకు సహకరించేవని చెప్పవచ్చు. అయితే ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తగిన ఆంక్షలు ఉండాలి' అని పేర్కొంది. ఈ వ్యాఖ్య అనంతరమే 21వ అధికరణకు విస్తృత అర్థంలో వ్యాఖ్యానం చేయడం మొదలయింది.
- **మేనకా గాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1978):** వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతలో జోక్యం చేసుకునే ఏ చట్టమైనా, విధానమైనా న్యాయం, ధర్మం, సముచితమైనదిగా ఉండాలి. ఏకపక్షం, నిరంకుశం, ఇష్టారాజ్యంగా ఉండకూడదు.
- **ఆర్.రాజగోపాల్ వర్సెస్ తమిళనాడు (1994):** రాజ్యాంగంలోని 21వ అధికరణం పేర్కొంటున్న జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుల్లో అంతర్భాగంగానే గోప్యత హక్కు ఉంది. ప్రతివారికీ తన వ్యక్తిగత జీవితం, కుటుంబం, వివాహం, దాంపత్య జీవితం, మాతృత్వం, పిల్లల పెంపకం, విద్య, తదితర వ్యవహారాల్లో గోప్యతను రక్షించుకొనే హక్కు ఉంది.

'మంచి కొవ్వు' మించితే చేటే




లండన్: మంచి కొవ్వు (హెచ్‌డీఎల్) ఆరోగ్యదాయకమని తెలిసిందే. కానీ, దానికీ ఓ పరిమితి ఉందంటున్నారు... డెన్మార్క్‌లోని కోపెన్‌హేగన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. సాధారణ స్థాయికి మించి శరీరంలో నిల్వ ఉండే మంచి కొవ్వు కారణంగా మరణ ముప్పు అధికంగా ఉంటుందని గుర్తించారు. బొగె నోడెస్‌గాడ్ నేతృత్వంలోని బృందం ఆరేళ్లపాటు 1,16,000 మంది ఆరోగ్య పరిస్థితిని పరిశీలించింది. వీరిలో 10,500 మంది కాలం చేశారు. ఇందుకుగల కారణాలను విశ్లేషించగా- అధిక స్థాయిలో మంచి కొవ్వు నిల్వలున్న పురుషులకు 106%, మహిళలకు 68% మరణ ముప్పు ఎక్కువని తేలింది. చెడు కొవ్వులే కాదు, హెచ్చుస్థాయి హెచ్‌డీఎల్ ఉండకుండా జాగ్రత్తపడటం కూడా ముఖ్యమన్నది పరిశోధకుల సలహా!

ఈ చిట్కాతో నిశ్చింత!



న్యూయార్క్: మనిషన్నాక, మనసున్నాక... కష్టాలు, బాధలు తప్పవు. అలాంటి సమయాల్లో 'జరిగేవన్నీ మంచివని అనుకోవడమే మనిషి పని' అంటున్నారు పరిశోధకులు కూడా! నార్వేజియన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రవర్తనౌషధ పరిశోధకుడు హన్స్ నొడల్... మానసికంగా తీవ్రంగా కుంగిపోయేవారికి ఉపశమనం కలిగించే అద్భుతమైన చిట్కా చెప్పారు. 'చేతితో నీళ్ల గ్లాసును పట్టుకోవడం పెద్ద విషయమేం కాదు. కానీ, గంటల తరబడి అలా పట్టుకుని ఉంటే నొప్పేంటో తెలుస్తుంది. మనసులో బాధ కూడా అంతే. సమస్య చిన్నదే కావొచ్చు. కానీ, దీర్ఘకాలం దాని గురించే ఆలోచిస్తే కుంగుబాటు తప్పదు' అని ఆయన విశ్లేషించారు. వ్యాకులత నుంచి విముక్తికి మూడు దశల చిట్కా చెప్పారు.

1) 'సమస్య గురించి అదేపనిగా ఆలోచించడం శుద్ధ దండగ. దీని వల్ల సమయం వృథా కావడం తప్ప మరే ప్రయోజనం లేదు' అని గుర్తించాలి.
2) బాధకు కారణమైన అంశాన్ని వాస్తవిక దృక్పథంతో పరిశీలించాలి. 'నన్ను బాధిస్తున్న సమస్యకు ఇప్పుడు నేనేం చేయాలి? ' అని ఆలోచించి, పరిష్కారాలను వెతకాలి. వాటిలో మేలైన దానిని వెంటనే అమలుచేయాలి. తద్వారా సమస్యలు దూదిపింజల్లా తేలిపోతాయి. అయితే...
3) మెదడును తొలుస్తున్న సమస్య నుంచి తాత్కాలికంగా ఉపశమనం పొందడానికి టీవీ చూడ్డం, కంప్యూటర్‌లో గేమ్స్ ఆడ్డం వంటి ప్రత్యామ్నాయాలపై మాత్రం ఎక్కువ దృష్టి సారించకూడదు. వీటి వల్ల అసలు సమస్య పరిష్కారమవ్వదు.



మధుమేహ ఔషధంతో మెదడు పోటుకు చికిత్స

లండన్: మధుమేహం, స్థూలకాయం చికిత్సలో విరివిగా వాడే ఓ ఔషధం.. మెదడు పోటు (పీడనం)ను తగ్గించేందుకూ ఉపయోగపడుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. మెదడులో తీవ్రమైన పీడనం ఏర్పడటమనేది ఇడియోపాథిక్ ఇంట్రాక్రానియర్ హైపర్‌టెన్షన్ (ఐఐహెచ్) అనే నాడీసంబంధిత సమస్య ఉన్నవారిలో కనిపించే ప్రధాన లక్షణం. హైడ్రోసెఫాలస్, పక్షవాతం, మెదడుకు తీవ్రగాయాలైన పరిస్థితుల్లోనూ ఈ సమస్య తలెత్తుతుంది. ఐఐహెచ్‌కు చికిత్స పొందనివారిలో 25% మంది శాశ్వత అంధత్వానికి గురయ్యే ప్రమాదం ఉంది. అయితే మధుమేహం, స్థూలకాయం చికిత్సలో వాడే గ్లూకగాన్ లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1) అగోనిస్ట్ ఔషధాలు.. మెదడులో పీడనాన్ని తగ్గించగలవన్న అభిప్రాయంతో బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టారు. జంతువులపై ప్రయోగాలు నిర్వహించారు. జీఎల్‌పీ-1 అగోనిస్ట్ ఎక్స్టెడిన్-4 పీడనాన్ని వేగంగా తగ్గించగలుగుతున్నట్లు గుర్తించారు.



గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గవర్నర్ నరసింహన్

'గాంధీ'లో రెండో రోజు గవర్నర్‌కు వైద్యపరీక్షలు

గాంధీ ఆసుపత్రి(హైదరాబాద్), న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో గవర్నర్ నరసింహన్ వరుసగా రెండోరోజు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆయన కుడికాలి మడమపైన చిన్న ఆనె(కార్న్) వల్ల నడుస్తున్నప్పుడు నొప్పి వస్తుండటంతో బుధవారం గాంధీ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు తీసుకున్న విషయం తెలిసిందే. శస్త్రచికిత్స ద్వారా ఆనెను తొలగించాల్సి ఉండగా వైద్య పరీక్షలు చేయించుకునేందుకు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రికి వచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలోని వైద్యబృందం గవర్నర్‌ను ప్రయోగశాలకు తీసుకెళ్లింది. శస్త్రచికిత్సకు ముందు చేయాల్సి ఉన్న పరీక్షలన్నీ నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించారు. ఈసీజీ తదితర పరీక్షలను చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు గవర్నర్ తిరిగి రాజ్‌భవన్‌కు వెళ్లిపోయారు. 'నేను ఫిట్‌గా ఉన్నానని నాకు తెలుసు. ఇక్కడి పరికరాలు, యంత్రాలు ఎలా పని చేస్తున్నాయో తెలుసుకునేందుకేవచ్చానంటూ' గవర్నర్ వ్యాఖ్యానించడం గమనార్హం.

నేపాలీ మహిళను పట్టాలపైకి తోసిన నల్లజాతీయుడు

న్యూయార్క్: మరి కొద్ది క్షణాల్లో ప్లాట్‌ఫామ్ దగ్గరికి రాబోతున్న రైలు కోసం ఆ మహిళ ఎదురుచూస్తున్నారు. మరో క్షణంలో జరగబోయే పరిణామాన్ని ఆమె ఏమాత్రం ఊహించలేదు. కారణం, హఠాత్తుగా ఓ నల్లజాతి వ్యక్తి వెనుక నుంచి బలంగా పట్టాల పైకి తోసేసాడు. తేరుకునేలోపే పట్టాల మీద ఆమె అచేతనంగా పడిపోయారు. అక్కడే ఉన్న మరో ఇద్దరు క్షణాల్లో రక్షించడంతో ఆమె బతుకుజీవుడా అనుకుంటూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన అమెరికాలో జరిగింది. నేపాల్‌కు చెందిన కమలా శ్రేష్ఠ(49) న్యూయార్క్‌లోని సబ్‌వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురుచూస్తున్నారు. వెనుకనుంచి వచ్చిన ఓ నల్లజాతీయుడు ఆమెను బలంగా నెట్టడంతో పట్టాలపై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సరిగ్గా అదే సమయానికి రైలు అత్యంత సమీపానికి వచ్చింది. రైలు కోసం ఎదురుచూస్తున్న మరో ఇద్దరు ఆమెను ప్లాట్‌ఫామ్ మీదకు లాగారు.

డిజిటల్ గ్రామాలతోనే నవ్య భారత్

- అన్నదాతకు కష్టమే రానివ్వం : ప్రధాని



భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

పుణే: డిజిటల్ గ్రామాల రూపకల్పనతోనే సరికొత్త భారత్ కల సాకారమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతులు, మహిళల సాధికారిత తదితర అంశాలన్నీ ఇందులో భాగమేనని వివరించారు. ఏటా కనీసం 500 గ్రామాలను నగదు రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. పుణెకు చెందిన భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రధాని వీడియో కాన్ఫరెన్సులో గురువారం మాట్లాడారు. దేశ అభివృద్ధికి అన్నదాతలు సుసంపన్నం కావడం కీలకమని. . రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. మన గ్రామాలను చూసి గర్వపడేలా.. వలసవెళ్లిన వారితో కలిపి ఏటా పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డిజిటల్ గ్రామాల్లో భాగంగా ప్రభుత్వం పంచాయతీలను సాంకేతికంగా అనుసంధానిస్తున్నట్లు వివరించారు. హరిత, శ్వేత విప్లవాలతో పాటు.. మత్స్య (నీలి), తేనెటీగలు (మధుర), సాగునీటి (జల) విప్లవాలు కూడా రావాలన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ విధానాలను ఆదాయ కేంద్రీకృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాగు ప్రారంభం నుంచి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ వరకు ప్రభుత్వం రైతుల వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతులకు 9 కోట్ల భూసార కార్డులను పంపిణీ చేయడంతో పాటు, 500 ఈ-నామ్ మండీలతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. వ్యవసాయోత్పత్తుల నిల్వ సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజనను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, చౌక పంట రుణాలు, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన తదితర పథకాల గురించి వివరించారు. వ్యాధులు సోకడంతో రూ. 40 వేల కోట్ల పశుసంపదను కోల్పోయామని.. ఈ సమస్యను పరిష్కరించేందుకు మరిన్ని పశువైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఇందుకుగాను స్వయం సహాయక బృందాల మహిళలకు తగిన శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. మొత్తంగా 99 పెండింగు సాగునీటి ప్రాజెక్టులకు గాను 21 పూర్తి చేసినట్లు వివరించారు. 60 శాతం ఉపాధి హామీ పథకం నిధులను సాగునీటి సంరక్షణకు వినియోగిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.

వేగంగా నిర్ణయాలు తీసుకోండి

- వాటిని సదుద్దేశంతో తీసుకుంటే ప్రోత్సహిస్తాం
- ఉన్నతాధికారులతో ప్రధాని

దిల్లీ: ప్రభుత్వంలోని అన్ని విభాగాలూ సమన్వయంతో పనిచేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఉన్నతాధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సదుద్దేశంతో తీసుకునే నిజాయితీతో కూడిన నిర్ణయాలను ప్రోత్సహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని 70 మందికిపైగా అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో ఆయన మాట్లాడారు.

దేశంలో బాగా వెనుకబడిన 100 జిల్లాలపై దృష్టిసారించాలని ప్రధాని కోరారు. అభివృద్ధి సూచికల్లో ఆ జిల్లాలను కూడా జాతీయ సరాసరి స్థాయికి తీసుకురావాలన్నారు. అభివృద్ధి, సుపరిపాలనతోనే ప్రజా సంక్షేమం, సంతోషం సాధ్యమని చెప్పారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమన్వయంతో సామరస్యపూర్వకంగా పనిచేయాలని సూచించారు. అన్ని శాఖల మధ్య అంతర్గత సమాచారం మరింత సమర్థంగా సాగాలన్నారు. నిర్ణయాలు తీసుకునే ముందు పేదలు, సాధారణ పౌరులను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. జాతి ప్రయోజనాల కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని, అందుకు ఇది అద్భుత అవకాశమని పేర్కొన్నారు. సానుకూల అంచనాలతో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందన్నారు. ప్రపంచ సమతౌల్యం కోసం భారత అభివృద్ధి చాలా కీలకమని భావిస్తోందని చెప్పారు. దేశ యువతలో అద్భుత నైపుణ్యాలు ఉన్నాయని, సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన యువత.. పరిమిత వనరులతోనే పోటీ పరీక్షలు, క్రీడల్లో చక్కగా రాణిస్తున్నారని తెలిపారు. ఈ నైపుణ్యాలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా అధికారులు డిజిటల్, స్మార్ట్ పాలన, పరిపాలనాపరమైన విధానాలు, జవాబుదారీతనం, పారదర్శకత, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, నైపుణ్యాభివృద్ధి, స్వచ్ఛభారత్, వినియోగదారుల హక్కులు, పర్యావరణ పరిరక్షణ, 2022 నాటికి నవ భారత్‌ను ఆవిష్కరించడం వంటి అంశాల్లో తమ అనుభవాలను పంచుకున్నారు.

నిఖా కాదు.. తనఖా

- పెళ్లి పేరిట రూ.40 వేలకే యువతి విక్రయం
- హైదరాబాద్‌లో మరో బాగోతం వెలుగులోకి
- దుబాయ్ సోదరులు సహా నలుగురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో అరబ్ షేక్‌ల దాష్టీకాలకు అమ్మాయిలు బలవుతూనే ఉన్నారు. పాతబస్తీలోని ఓ బాలికను పెళ్లి చేసుకుని ఒమన్ తీసుకెళ్లి చిత్రహింసలు పెడుతున్న అరబ్ షేక్ దుశ్చర్యను మరవకముందే మరో దురాగతం వెలుగుచూసింది. ఇక్కడి అమ్మాయిల్ని నిఖా (పెళ్లి) పేరుతో వంచించడానికి వచ్చిన ఇద్దరు దుబాయ్ సోదరులతోపాటు ఇద్దరు స్థానిక వ్యక్తుల్ని సైబరాబాద్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. శంషాబాద్ డీసీపీ పద్మజ, మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ ఈ సంఘటన గురించి విలేకరులకు వివరించారు. దుబాయ్‌కు చెందిన సలీం ఒబేద్ (52) పాతకార్ల వ్యాపారి. ఈనెల 10న హైదరాబాద్‌కు వచ్చిన ఇతడు పెళ్లిళ్ల బ్రోకర్ షఫీని సంప్రదించాడు. అందమైన అమ్మాయితో నిఖా జరిపిస్తే రూ. 70 వేలు ఇస్తానన్నాడు. దీంతో అతడు మైలార్‌దేవుపల్లికి చెందిన ఓ అమ్మాయితో నిఖాకు ఒప్పించాడు. షేక్ ఇచ్చిన సొమ్ములో రూ. 40 వేలు వారికిచ్చి రూ. 30 వేలు తాను తీసుకున్నాడు. నిఖాను స్థానిక హాజీతోనే జరిపించాల్సి ఉన్నా.. అతడిని కాదని తనకు నమ్మకస్థుడైన మరొకరిని పిలిపించి ఆరు రోజుల క్రితం నిఖా జరిపించాడు. కోరిక తీర్చుకుని దుబాయ్‌కు పారిపోయే ఉద్దేశంతోనే సలీం ఒబేద్ ఇలా చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిఖా ధ్రువీకరణ పత్రాన్ని ఆమోదం కోసం ముంబయి పంపించినట్లు బాధిత కుటుంబాన్ని నమ్మించారు. ఈ ఆరురోజులు బాధితురాలితో గడిపిన షేక్ దుబాయ్ పారిపోయేందుకు సన్నాహాలు చేసుకున్నాడు.

నాకు బాలికలే కావాలి..

అన్న పథకం విజయవంతం కావడంతో అతడి తమ్ముడు ఇబ్రహీం ఒబేద్ (48) కూడా హైదరాబాద్ బాట పట్టి బ్రోకర్ షఫీని ఫోన్‌లో సంప్రదించాడు. తనకు బాలికల్ని మాత్రమే చూపించాలని కోరాడు. గత మంగళవారం ఇబ్రహీం రాజేంద్రనగర్‌కు వచ్చాడు. షఫీ తన వద్ద ఉన్న బాలికల చిత్రాల్ని చూపించడంతో ఓ బాలికను ఎంచుకున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నలుగురు నిందితుల్ని అరెస్ట్ చేశారు.

పదుల సంఖ్యలో ఫొటోలు

పోలీసులు షఫీ వద్ద పదుల సంఖ్యలో యువతులు, బాలికల చిత్రాల్ని గుర్తించారు. అతడు ఇప్పటికే ఇద్దరిని నిఖా చేసి విదేశాలకు పంపినట్లు దర్యాప్తులో తేలింది. అక్కడ తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తిరిగి హైదరాబాద్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేయాలంటూ బాధితురాళ్లు అతడికి ఫోన్‌లో వేడుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు.


అరబ్ షేక్‌ల ఆగడాలకు అడ్డుకట్ట!

- త్వరలో ఆర్డినెన్సు జారీకి అవకాశం

ఈనాడు, హైదరాబాద్: పర్యాటక వీసాలపై వచ్చి, కల్లబొల్లి మాటలతో తెలంగాణ ముస్లిం బాలికలను మోసం చేస్తున్న అరబ్‌షేక్‌ల ఆగడాలకు రాష్ట్రప్రభుత్వం అడ్డుకట్ట వేయనుంది. అరేబియన్, ఇస్లామిక్ దేశాలకు చెందిన విదేశీయులు ఇక్కడి ముస్లిం అమ్మాయిలను వివాహం చేసుకునేందుకు న్యాయ, చట్టపరంగా అర్హతలు పొందాలి. మాయమాటలు, డబ్బు ఆశ చూపించి ఖాజీలను మచ్చిక చేసుకుని జరిపించుకునే వివాహాలను అడ్డుకునేందుకు, అమాయక బాలికలు మోసపోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు ప్రత్యేక బిల్లు తీసుకురానుంది.

సీఎం ఆదేశాలతో బిల్లు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో బిల్లులో కఠినమైన నిబంధనలు చేర్చారు. ప్రస్తుతం బిల్లు న్యాయ శాఖ పరిశీలనలో ఉంది. మంత్రిమండలి సమావేశంలో ఆర్డినెన్సు తీసుకురానున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా అరబ్ దేశాలకు చెందిన వృద్ధులు పాతబస్తీతో పాటు తెలంగాణలోని కొన్ని కుటుంబాల్లోని పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వివాహాల పేరిట ఆడపిల్లల్ని మోసం చేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిన పెళ్లిళ్లు చేసుకుని వదిలిపెట్టి వెళ్లడం, అక్కడకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వృద్ధషేక్‌లు తమకు మనవరాలి వయసున్న బాలికలను పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఇవన్నీ గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. ఇటీవల బార్కాస్ సంఘటనతో మరోసారి అరబ్‌షేక్‌ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం కఠినచర్యలు తీసుకోవాలని, చట్టం చేయాలని సూచించారు. హైదరాబాద్ వచ్చిన అరబ్‌షేక్ ప్రతిఒక్కరూ తాము వివాహం చేసుకునేందుకు వచ్చినట్లు చట్టపరమైన వీసా ఉండాలని బిల్లులో పేర్కొన్నారు. పర్యాటక వీసాపై వచ్చిన వారు ఇక్కడి అమ్మాయిలను వివాహం చేసుకోవాలంటే ముందుగానే విదేశీ మంత్రిత్వ కార్యాలయం, రాయబార కార్యాలయంలో వివరాలిచ్చి, అనుమతి పొందాలి. వధూవరుల వయసులో పదేళ్ల కన్నా ఎక్కువ తేడా ఉండకూడదు. అరబ్ సంప్రదాయం ప్రకారం పెళ్లికూతురికి రూ.10 లక్షల నగదు కానుకగా ఇవ్వాలి. వివాహాలు చేసుకుని ఆయా దేశాలకు వెళ్లిన అమ్మాయిలు మూడునెలలకోసారి అక్కడి భారతీయ రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి సాధకబాధకాలు చెప్పుకునే నిబంధన చేర్చారు.



సూది రంధ్రంలో.. సూక్ష్మ గణపతి

వరంగల్‌లోని గిర్మాజీపేటకు చెందిన స్వర్ణకారుడు, సూక్ష్మ కళాఖండాలు రూపొందించే మట్టెవాడ అజయ్‌కుమార్ అతి చిన్న గణపతిని తయారు చేశారు. 1.2 మిల్లీమీటర్ల ఎత్తయిన సూక్ష్మ వినాయక విగ్రహాన్ని రూపొందించారు. సాధారణంగా సూదిలో దారం ఎక్కించడమే కష్టమవుతుంది. అలాంటిది సూది రంధ్రంలో ఇమిడిపోయేంత సూక్ష్మ వినాయక విగ్రహాన్ని తయారు చేసి తన ప్రతిభను చాటారు. దీని తయారీకి 12 గంటలు పట్టినట్లు అజయ్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

– న్యూస్‌టుడే, గిర్మాజీపేట(వరంగల్)

ఎంపీ,ఎమ్మెల్యేలతో 26న సీఎం కేసీఆర్ భేటీ

- సమగ్ర భూసర్వేపై దిశానిర్దేశం
- పార్టీ బలోపేతంపైనా చర్చ



ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ సదానందరెడ్డి నేతృత్వంలోని సైక్లిస్టుల బృందం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెల 15 నుంచి జరగనున్న సమగ్ర భూసర్వే, రైతు సంఘాల ఏర్పాటుపై తెరాస ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు తెలంగాణభవన్‌లో ఆయన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ కానున్నారు. సమావేశానికి హాజరు కావాలని అధిష్ఠానం గురువారం వారిని ఆదేశించింది. 81 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భూరికార్డుల ప్రక్షాళన చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలని భావిస్తున్నారు. ప్రతి ఒక్కరికి మూడేసి గ్రామాల బాధ్యతలు అప్పగించనున్నారు. దీంతోపాటు గ్రామ, మండల స్థాయి రైతు సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. వీటన్నింటిపై సమగ్రంగా చర్చించి, విజయవంతం చేయాల్సిన అవసరాన్ని సీఎం ప్రజాప్రతినిధులకు వెల్లడించనున్నారు. ఇంకా ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపైనా సీఎం చర్చించనున్నారు. ఇటీవల జరిగిన పార్టీ, టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ఇందులో పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల భాగస్వామ్యం, నియమిత పదవులు, పార్టీ రాష్ట్ర, నియోజకవర్గ కమిటీల నియామకం తదితర అంశాలపైనా మాట్లాడతారు. కాళేశ్వరం ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించడంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం.

సైక్లింగు బృందానికి సీఎం అభినందనలు

లండన్‌లో ఇటీవల జరిగిన 1,436 కిలోమీటర్ల సైక్లింగు రైడ్‌ను విజయవంతంగా పూర్తి చేసి వెండి పతకాలు సాధించిన తెలంగాణ బృందాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రగతిభవన్‌లో అభినందించారు. గత నెల 30 నుంచి ఈ నెల 4 వరకు ఈ పోటీ జరిగింది. తెలంగాణ నుంచి ఇంటెలిజెన్స్ డీఎస్పీ సదానందరెడ్డి నేతృత్వంలోని సదానందరెడ్డితో పాటు కృష్ణమనేని రాజేశ్, పెన్మెత్స ప్రద్యుమ్న, నార్నె గౌతం, సాయిరామకృష్ణ, కూనం కృష్ణ, డి.జితేందర్ పాల్గొని పతకం సాధించారు.

పక్షవాతంపై ముప్పుపై కచ్చితమైన అంచనాకు కొత్త ఎమ్ఆర్ఐ విధానం

లండన్: పక్షవాత ముప్పును కచ్చితంగా అంచనా వేయగల కొత్త ఎమ్ఆర్ఐ స్కానింగ్ విధానాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాల్లో ఏర్పడే గార వల్ల పక్షవాతం వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుత విధానంలో గార పరిమాణాన్ని బట్టి పక్షవాత ముప్పును అంచనా వేస్తున్నారు. పెద్ద పరిమాణంలో ఉంటే.. శస్త్రచికిత్సల ద్వారా తొలగిస్తున్నారు. అయితే అధిక కొలెస్ట్రాల్ కలిగిన చిన్న పరిమాణాల్లోని గార వల్ల కూడా నాళాల్లో అడ్డంకులు ఏర్పడేందుకు అవకాశముంది. ఆకారంలో పెద్దగా కనిపించనప్పటికీ.. ఇవి చాలా ప్రమాదకరమైనవి. ఇలాంటి గారల్లోని కొలెస్ట్రాల్ పరిమాణాన్ని కచ్చితంగా కొలిచి.. దాని ఆధారంగా ముప్పును అంచనా వేసే కొత్త ఎమ్ఆర్ఐ పద్ధతిని బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనుగొన్నారు. పక్షవాత చికిత్సకు సంబంధించి మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు వైద్యులకు ఇది బాగా ఉపకరిస్తుందని వారు తెలిపారు.

కులాంతర వివాహం నేపథ్యంలో అదృశ్యమైన తన కుమారుడు సాగర్‌ను కోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లికి చెందిన అయిల్ల బానేష్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. వ్యాజ్యంలో పలు పేర్లను ప్రస్తావిస్తూ వారే తన కుమారుణ్ని అపహరించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు.

'పురపాలక కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పురపాలక కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పురపాలకశాఖ కార్యదర్శి నవీన్‌మిత్తల్ తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గురువారం వివిధ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ నేతలు నవీన్‌మిత్తల్‌తో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ నెల 28వ తేదీన మరోమారు సమావేశమై పురపాలక కార్మికుల వేతనాల పెంపు సహా వివిధ సమస్యల పరిష్కారంపై చర్చించనున్నారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ సంస్థల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.

ఓబీసీల వర్గీకరణ నిర్ణయం చరిత్రాత్మకం: ఆర్.కృష్ణయ్య

నల్లకుంట: ఓబీసీ రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించాలని మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోదీ నిర్ణయించడం చరిత్రాత్మక విజయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న ఉద్యమాల ఫలితం ఇప్పుడు సాకారమైందంటూ హర్షం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని తీసుకున్న నిర్ణయంతో ఓబీసీ జాబితాలో ఉన్న 2,600 కులాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కులాల వారీగా లెక్కలు ప్రకటిస్తేనే వర్గీకరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా జరుగుతుందన్నారు. మొత్తం ఏడు వర్గాల్లో బీసీలకే క్రీమీలేయరు విధించడం అన్యాయమన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హోదా కల్పించడం, ఓబీసీ రిజర్వేషన్లను వర్గీకరించినందుకు అక్టోబరులో ప్రధానిని ఘనంగా సన్మానించనున్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

'ఓబీసీ వర్గీకరణ' ఎస్సీలకూ వర్తింపచేయాలి: మంద కృష్ణ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: వర్గీకరణ విషయంలో కేంద్రం బీసీలకు వర్తింపజేసే సూత్రాన్ని ఎస్సీలకు ఎందుకు వర్తింపజేయడం లేదని ఎంఆర్‌పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. ఎస్సీలలో వర్గీకరణ అవసరమని నాడు లోకూర్ కమిషన్ సిఫారసులు చేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. సికింద్రాబాద్ పార్శీగుట్టలోని ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓబీసీల్లో వర్గీకరణ చేస్తామని కేంద్రం ప్రకటించడంపట్ల ఎంఆర్‌పీఎస్ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. యూపీఏ హయాంలో ఉషా మెహ్రా కమిషన్ నివేదికను అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. భాజపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి అధ్యక్షుడు గడ్కరీ.. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నాటి ప్రధాని మన్మోహన్‌కు లేఖ రాశారన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలో వచ్చి మూడేళ్లవుతున్నా వర్గీకరణ దిశగా చర్యలు తీసుకోవటం లేదన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వర్గీకరణను కోరుకుంటున్న 10 రాష్ట్రాల్లో ఉద్యమం వచ్చి అది పక్కదారి పడితే దానికి తమను నిందిస్తే లాభం లేదన్నారు.

'రాంకీ'తో ప్రభుత్వానికి చుట్టరికమేంటి: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: రాంకీ సంస్థ భూఅక్రమాలపై మూడు నెలలుగా ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గత ప్రభుత్వాల మాదిరే రాంకీ సంస్థతో దగ్గరి చుట్టంలా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లో సీపీఎం తెలంగాణ కార్యదర్శివర్గ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నల్గొండ జిల్లా వెలిమినేడులో రాంకీ సంస్థ డంపింగ్ యార్డుకు ఎకరా రూ.మూడు లక్షల చొప్పున భూములు కొని రిజిస్ట్రేషన్‌లో రూ.తొమ్మిది లక్షలుగా చూపించడంతో ఐటీ శాఖ రైతులకు నోటీసులిచ్చిందన్నారు. అమ్మేందుకు నిరాకరించిన రైతుల భూముల్ని వారికి తెలియకుండా రాంకీ రిజిస్ట్రేషన్ చేయించుకుందని, వీటిపై మూడు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేదన్నారు. రాంకీపై భూ కబ్జా కేసు పెట్టాలని, భూములు అమ్మిన రైతులకు ఎకరాకు మరో రూ.6 లక్షల చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా నీటిని కర్ణాటక అక్రమంగా వాడుకుంటుండటంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని సీపీఎం కార్యదర్శివర్గ సమావేశం అభిప్రాయపడింది. నాగార్జునసాగర్‌కు చుక్కనీరు రాకపోవడంతో నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలు బీళ్లుగా మారే ప్రమాదమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంది. కృష్ణా జలాల వాడకంపై రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకతో చర్చించాలని, దామాషా పద్ధతిలో నీటిని వాడుకునేలా కేంద్రాన్ని కోరాలని డిమాండ్ చేసింది. సమగ్ర భూసర్వేపై అఖిలపక్షం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకోవాలని, కాళేశ్వరం భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, హైదరాబాద్‌లోని విక్టోరియా హోం భూముల్ని విద్యార్థుల అవసరాలకే వినియోగించాలని డిమాండ్ చేసింది.

మరో 3 రోజులు వానలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మరో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడుతాయని తెలిపింది. శని, ఆదివారాల్లో రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. గురువారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వానలు పడ్డాయి. గురువారం పాల్వంచలో అత్యధికంగా 63.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సత్తుపల్లిలో 46 మిల్లీమీటర్లు, బూర్గంపాడులో 44.6 మిల్లీమీటర్లు, కొత్తగూడెంలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి



నాగేశ్వరరావు

కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా గురువారం పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడింది. పిడుగుపాటుకు జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలో నాగేశ్వరరావు(51), జూలూరుపాడు మండలం కాకర్లకు చెందిన రజనీ(28) అనే మహిళ పిడుగుపాటుకు గురై చనిపోయారు. చర్ల మండలంలో తాలిపేరు ఆరు గేట్లు ఎత్తి దిగువకు 8,300 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు.

మహారాష్ట్రలో మినీ బస్సు బోల్తా

నలుగురు మృతి; 11 మందికి గాయాలు



మినీ బస్సు బోల్తా పడిన ప్రాంతంలో మృతదేహాలు

మద్నూర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్‌కు సమీపంలో వన్నాలిపాట టోల్‌నాక వద్ద గురువారం సాయంత్రం మినీ బస్సు బోల్తాపడి నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సరిహద్దులో ఉండే దెగ్లూర్ నుంచి నాందేడ్‌కు వెళ్తుండగా వాహనం కింద పట్టీలు విరిగిపోయి బస్సు ఒకవైపు ఒరిగి బోల్తాపడింది. ప్రమాదంలో నాయగావ్ తాలుకా బర్‌బడ్‌కు చెందిన క్లీనర్ మారుతి(38), గంగాధర్(55) హిప్పర్గా సునీత(26) ఆమె కుమార్తె శీతల్(12)లు మృతిచెందారు. వీరందరు అక్కడికక్కడే మృతి చెందినట్లు దెగ్లూర్ పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను దెగ్లూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతుల విషయంలో రాజకీయాలొద్దు: దత్తాత్రేయ

ఈనాడు, హైదరాబాద్: రైతుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వెళితేనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర మంత్రి దత్తాత్రేయ అన్నారు. ఫసల్ బీమా యోజనపై వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లు, బీమా కంపెనీలతో గురువారం సమీక్ష నిర్వహించారు. విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులు ఉంటే కేవలం ఆరు లక్షల మందే పథకంలో ఉన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి రూ.72 కోట్ల ప్రీమియం వాటాను తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తే రైతులకు రూ.200 కోట్ల వరకు లబ్ధి జరుగుతుంది. రైతుల వాటా ప్రీమియం చెల్లింపునకు చివరి తేదీపై కేంద్రం నుంచి వెసులుబాటు కల్పించేందుకు ప్రయత్నిస్తా. ప్రధాని పేరుతో ఉన్న పథకంలో ఆయన ఫొటో లేకుండా సీఎం, మంత్రుల చిత్రాలతోనే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

ఛాంపియన్స్


భువనేశ్వర్ (53 నాటౌట్)

నిర్లక్ష్య ప్రదర్శనతో భారత్ వరుస విజయాలు సాధిస్తున్నా.. మజా ఏదీ అంటూ మదనపడ్డ అభిమానులకు కావాల్సినంత మజా. చప్పగా సాగిపోతున్న సిరీస్‌లో హైడ్రామా. ఓ అద్భుతంతో ఓటమి కోరల్లో చిక్కుకున్న భారత్.. మరో అద్భుతంతో అపురూప విజయం సాధించింది. సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

శ్రీలంక స్పిన్నర్ అఖిల ధనంజయ పల్లెకెలలో పెను సంచలనమే సృష్టించాడు. ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టి ఒంటి చేత్తో భారత్‌ను ఓడించినంత పనిచేశాడు. నిజానికి భారత్ ఓడిపోయినట్లేనని అనుకున్నారంతా. ఎందుకంటే 231 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 131కే ఏడు వికెట్లు కోల్పోయింది. కానీ 'మిస్టర్ ప్రశాంత' ధోని, భువనేశ్వర్ జోడీ అద్వితీయ పోరాటపటిమను ప్రదర్శించింది. అభేద్య శతక భాగస్వామ్యంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం అందించింది.

ధోని 99 నాటౌట్

వికెట్ల వెనక పాదరసంలా కదిలే మహేంద్ర సింగ్ ధోని స్టంపుల్లో ప్రపంచ రికార్డును సమం చేశాడు. 15వ ఓవర్లో చాహల్ బౌలింగ్‌లో గుణతిలకను స్టంప్ చేయడం ద్వారా అతడు సంగక్కర రికార్డు (99 స్టంపులు) సరసన నిలిచాడు. సంగక్కర 404 మ్యాచ్‌లు ఆడగా.. ధోనీకి ఇది 298వ మ్యాచ్.

మహి తోడుగా.. భువి ఆడగా..


ధోని (45 నాటౌట్)

● టీమ్ ఇండియా అద్భుత విజయం
● లంకను గెలిపించ లేకపోయిన ధనంజయ మాయ

పల్లెకెల

ఏమాత్రం పోటీ ఇవ్వట్లేదని భావించిన శ్రీలంక.. టీమ్ ఇండియాకు చెమటలు పట్టించింది. కానీ ధోని, భువనేశ్వర్ అద్భుతంగా పోరాడిన వేళ.. ఆఖరికి విజయం భారత్‌దే. గురువారం రసవత్తరంగా సాగిన రెండో వన్డేలో భారత్ 3 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. బుమ్రా (4/43) విజృంభించడంతో భారత్ మొదట శ్రీలంకను 236/8కి పరిమితం చేసింది. ధోని (45 నాటౌట్; 68 బంతుల్లో 1×4), భువనేశ్వర్ (53 నాటౌట్; 80 బంతుల్లో 4×4, 1×6)ల అద్వితీయ పోరాటంతో 231 పరుగుల లక్ష్యాన్ని భారత్ 44.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అఖిల ధనంజయ (6/54) సంచలన బౌలింగ్‌లో ఓ దశలో 131కే ఏడు వికెట్లు చేజార్చుకున్న భారత్‌ను ధోని, భువి జంట అభేద్య శతక భాగస్వామ్యంతో ఆదుకుంది. రోహిత్ (54; 45 బంతుల్లో 5×4, 3×6),


'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ధనంజయ (6/54)

ధావన్ (49) రాణించారు. వర్షం వల్ల భారత్ లక్ష్యాన్ని 47 ఓవర్లలో 231 పరుగులకు సవరించారు.

ఆపద్బాంధవులు: ధనంజయ దెబ్బకు 131/7. టీమ్‌ఇండియాకు ఏమాత్రం ఆశలు లేని స్థితి. మిగిలిన స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ ధోని మాత్రమే. అతడికి తోడు భువనేశ్వర్. వికెట్లు పడ్డ వేగం చూస్తే మ్యాచ్ ఇంకెంతో సేపు సాగదనిపించింది. కానీ ఎన్నో ఒత్తిడి మ్యాచ్‌ల్లో భారత్‌కు అపురూప విజయాలను అందించిన మిస్టర్ కూల్ ధోని.. ఒకప్పటిలా తన పాత్రలో, తనదైన శైలిలో ఒదిగిపోయాడు. అటు తన బ్యాటింగ్ నైపుణ్యానికి పరీక్ష పెట్టుకుంటూ భువి మొండిగా పాతుకుపోయాడు. ముందు ధనంజయ ముప్పును సమర్థంగా ఎదుర్కొన్న ఈ జోడీ.. ఒక్కో పరుగు తీస్తూ సాగిపోయింది. బంతులు చాలానే ఉండడంతో భారీ షాట్లు ఆడేందుకు తొందర పడలేదు. 30వ ఓవర్లో స్కోరు 160 దాటగా.. అప్పటికీ వీళ్లిద్దరు ఒక్క ఫోర్ కూడా కొట్టలేదంటే ఎంత జాగ్రత్తగా ఆడారో అర్థం చేసుకోవచ్చు. ఎక్కువగా ధోనీనే సింగిల్స్ తీయగా.. భువనేశ్వర్ నిలబడడానికి ప్రయత్నించాడు. ఎదుర్కొన్న తొలి 43 బంతుల్లో ధోని 29 పరుగులు చేయగా.. భువనేశ్వర్ 12 పరుగులు సాధించాడు. 37 ఓవర్లు పూర్తయినా ఇద్దరి భాగస్వామ్యంలో ఒక్క బౌండరీ కూడా లేదు. ఐతే క్రమం తప్పకుండా సింగిల్స్ తీయడంతో జట్టు లక్ష్యానికి చేరువవుతూ వచ్చింది. ఐతే 38వ ఓవర్లో సిరివర్ధన బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన భువి.. అదే జోరును కొనసాగించి స్కోరు వేగాన్ని పెంచాడు. ధనంజయ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. చమీర ఓవర్లోనూ రెండు బంతులను బౌండరీ దాటించాడు. 42 ఓవర్లకు స్కోరు 217/7. ఆ తర్వాత ఎలాంటి శ్రమ లేకుండా ధోని-భువి జోడీ పని పూర్తి చేసింది.

ధనంజయ ఒక్కడు..: అది 16వ ఓవర్. ఛేదనలో భారత్ 109/0. భారత్ విజయం ఖాయమని మ్యాచ్ చూసేవారంతా తీర్మానించేశారు. ఆఖరికి శ్రీలంక జట్టు కూడా ఆశలతో ఉండి ఉండదు. కానీ అర్ధశతకం పూర్తి చేసిన రోహిత్.. ధనంజయ లెగ్ బ్రేక్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. తర్వాతి ఓవర్లో ధావన్ కూడా ఔటయ్యాడు. అయినా భారత్ కాస్త శ్రమించాల్సి వస్తుందేమో అనిపించింది కానీ.. అప్పటికీ విజయంపై అనుమానాల్లేవు. కానీ ధనంజయ కళ్లు చెదిరే బౌలింగ్‌తో దిమ్మతిరిగే షాకిచ్చాడు. ఒక్క ఓవర్‌తో మ్యాచ్ గమనాన్నే మార్చేశాడు. అతడు 18వ ఓవర్లో ఏకంగా మూడు వికెట్లు పడగొట్టి భారత్ నడ్డివిరిచాడు. కళ్లు చెదిరే గూగ్లీలతో జాదవ్, కోహ్లి, రాహుల్‌లను వెనక్కి పంపాడు. ముగ్గురూ బౌల్డే. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లి కన్నా ముందొచ్చిన జాదవ్, రాహుల్‌లు కనీసం ఖాతా అయినా తెరవలేదు. తొలి బంతికి జాదవ్, మూడో బంతికి కోహ్లి, ఐదో బంతికి రాహుల్ వెనుదిరిగారు. ధనంజయ అంతటితో ఆగలేదు. తర్వాతి ఓవర్లో మరో గూగ్లీతో పాండ్యను బోల్తా కొట్టించాడు. ముందు కొచ్చి ఆడబోయిన పాండ్య గురి తప్పి స్టంపౌటయ్యాడు. తన మాయను మరో ఓవర్‌కు కొనసాగించిన ధనంజయ్ అక్షర్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో భారత్ 131/7తో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది.

బూమ్‌బూమ్ బుమ్రా: అంతకుముందు టాస్ గెలిచి లంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన కోహ్లిని బౌలర్లు నిరాశపరచలేదు. ముఖ్యంగా బుమ్రా విజృంభించాడు. ఐతే ఆరంభ స్పెల్‌లో బుమ్రా కొన్ని ఎక్కువ పరుగులే ఇచ్చాడు. అతడి బౌలింగ్‌లో ఓపెనర్ డిక్వెలా రెండు సిక్సర్లు కొట్టాడు. 9వ ఓవర్లో లంక స్కోరు 50 దాటింది. కానీ అంతకుముందే డిక్వెలాను ఔట్ చేయడం ద్వారా బుమ్రా ప్రతీకారం తీర్చుకున్నాడు. 14 ఓవర్లలో 70/1తో నిలిచిన లంక వేగంగా నాలుగు వికెట్లు కోల్పోయింది. మెండిస్ (19)తో రెండో వికెట్‌కు 29 పరుగులు జోడించిన మరో ఓపెనర్ గుణతిలక చాహల్ బౌలింగ్‌లో స్టంపౌటయ్యాడు. హార్దిక్ ఔట్ స్వింగర్‌కు తరంగ (9) స్లిప్‌లో క్యాచ్ ఔట్ కాగా.. 24వ ఓవర్లో చాహల్ బంతిని స్వీప్ చేయబోయి మెండిస్ వికెట్ల ముందు దొరికిపోయాడు. కాసేపటి తర్వాత అక్షర్ బౌలింగ్‌లో మాథ్యూస్ కూడా వెనుదిరగడంతో 29వ ఓవర్లో 121/5తో నిలిచిన శ్రీలంక కుప్పకూలేలా కనిపించింది. కానీ కష్టాల్లో ఉన్న శ్రీలంకను సిరివర్ధన (58; 58 బంతుల్లో 2×4, 1×6), కపుగెదెర (40; 61 బంతుల్లో 2×4) ఆదుకున్నారు. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ 91 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 200 దాటించారు.

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెలా (సి) ధావన్ (బి) బుమ్రా 31; గుణతిలక (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 19; మెండిస్ ఎల్బీ (బి) చాహల్ 19; తరంగ (సి) కోహ్లి (బి) పాండ్య 9; మాథ్యూస్ ఎల్బీ (బి) అక్షర్ 20; సిరివర్ధన (సి) రోహిత్ (బి) బుమ్రా 58; కపుగెదెర (బి) బుమ్రా 40; అఖిల ధనంజయ (సి) అక్షర్ (బి) బుమ్రా 9; చమీర నాటౌట్ 6; ఫెర్నాండో నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 22 **మొత్తం:** (50 ఓవర్లలో 8 వికెట్లకు) **236; వికెట్ల పతనం:** 1-41, 2-70, 3-81, 4-99, 5-121, 6-212, 7-221, 8-230
బౌలింగ్: భువనేశ్వర్ 10-0-53-0; బుమ్రా 10-2-43-4; చాహల్ 10-1-43-2; హార్దిక్ పాండ్య 5.2-0-24-1; అక్షర్ పటేల్ 10-0-30-1; కేదార్ జాదవ్ 4.4-0-32-0
భారత్ ఇన్నింగ్స్: రోహిత్‌శర్మ ఎల్బీ (బి) ధనంజయ 54; ధావన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49; రాహుల్ (బి) ధనంజయ 4; జాదవ్ (బి) ధనంజయ 1; కోహ్లి (బి) ధనంజయ 4; ధోని నాటౌట్ 45; పాండ్య (స్టంప్డ్) డిక్వెలా (బి) ధనంజయ 0; అక్షర్ పటేల్ ఎల్బీ (బి) ధనంజయ 6; భువనేశ్వర్ నాటౌట్ 53; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం:** (44.2 ఓవర్లలో 7 వికెట్లకు) **231; వికెట్ల పతనం:** 1-109, 2-113, 3-114, 4-118, 5-119, 6-121, 7-131; **బౌలింగ్:** మలింగ 8-0-49-0; విశ్వ ఫెర్నాండో 6.2-0-32-0; మాథ్యూస్ 3-0-11-0; చమీర 7-0-45-0; అఖిల ధనంజయ 10-0-54-6; సిరివర్ధన 10-0-39-1



క్వార్టర్స్‌లో ఎవరితో ఎవరు?

సింధు × సన్ యు (చైనా)
శ్రీకాంత్ × సన్ వాన్ (కొరియా)
స్టార్‌స్పోర్ట్స్-1లో మధ్యాహ్నం 2:30 నుంచి

4 ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో సింధు ప్రస్తుత స్థానం. ఆమె ఒక ర్యాంక్ మెరుగైంది. సైనా 16 వ స్థానంలో ఉంది.

ఓటమి అంచుల దాకా వెళ్లొచ్చింది సింధు! ఒక పాయింట్ తేడా అయినా ఆమె ఇంటిముఖం పట్టాల్సి వచ్చేదే. తొలి గేమ్‌ను 19-21తో కోల్పోయి.. రెండో గేమ్‌లో ఒక దశలో 19-20తో వెనుకబడి... ఓటమి మెట్టుపై నిలిచిన తెలుగమ్మాయి గొప్పగా పుంజుకుని పోటీలో నిలబడింది. ఆ తర్వాత మూడో గేమ్‌లోనూ ఉత్కంఠభరిత క్షణాలను అధిగమించి విజయం సొంతం చేసుకుంది. మరోవైపు ప్రపంచ నంబర్-3కు షాకిస్తూ సైనా నెహ్వాల్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. కిదాంబి శ్రీకాంత్ కూడా తుది ఎనిమిదిమంది జాబితాలో చోటు సంపాదించాడు. సాయిప్రణీత్, అజయ్ జయరాం పోరాటం ముగిసింది.

ఓటమి కోరల్లోంచి

● క్వార్టర్స్‌కు సింధు
● సైనా, శ్రీకాంత్ ముందంజ
● సాయిప్రణీత్ ఔట్



సైనా

గ్లాస్గో

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు కాంస్య పతక విజేత పి.వి.సింధు కొద్దిలో ఓటమి తప్పించుకుంది. స్వర్ణ వేటలో ఉన్న ఆమె అతికష్టం మీద ప్రిక్వార్టర్స్ దాటింది. గురువారం నువ్వానేనా అన్నట్లు సాగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 19-21, 23-21, 21-17తో చెంగ్ నాన్ యి (హాంకాంగ్)పై నెగ్గింది. తొలి గేమ్‌లో విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో ఉన్న ఆమె.. ఆ తర్వాత జోరు కొనసాగించలేకపోయింది. ఒక దశలో గేమ్ 19-19తో సమానంగా ఉన్నా.. వరుసగా రెండు పాయింట్లు సాధించిన చెంగ్.. తొలి గేమ్‌ను 21-19తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ మొదట 4-0తో సింధుదే ముందంజ. కానీ ఆమె ఆ తర్వాత 13-16తో వెనకబడింది. ఈ స్థితిలో వరుస పాయింట్లు గెలిచిన సింధు.. 20-17తో గేమ్ పాయింట్ మీద నిలిచింది. ఐతే చెంగ్ 21-21తో స్కోరు సమం చేసినా.. వెనక్కి తగ్గని సింధు.. 23-21తో గేమ్ నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. మూడో గేమ్‌లో సింధుదే హవా. ఒక దశలో ఆమె 11-4తో నిలిచి సునాయాసంగా గెలిచేలా కనిపించింది. అయితే ఏడు పాయింట్లు సాధించిన చెంగ్. సింధును సమీపించడమే కాక.. ఆ తర్వాత 12-12తో స్కోరు సమం చేసింది. ఈ దశలో సింధు విజృంభించింది. వరుస పాయింట్లతో 19-15తో ఆధిక్యంలో నిలిచిన ఆమె.. ఆపై మరో రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుని 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్ గెలిచి.. ఊపిరి పీల్చుకుంది. మరో ప్రిక్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్ సంచలన విజయం సాధించింది. ప్రపంచ నంబర్-3 సంగ్ జి హ్యూన్ (కొరియా)ను 21-19, 21-15తో వరుస గేముల్లో ఓడించిన హైదరాబాదీ షట్లర్ కష్టపడకుండానే క్వార్టర్స్ చేరింది.

శ్రీకాంత్ అలవోకగా..: పతకం దిశగా శ్రీకాంత్ మరో అడుగు వేశాడు. అతను అలవోకగా క్వార్టర్స్ చేరాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో అతను 21-14, 21-18తో అన్‌టాన్‌సన్ (డెన్మార్క్)పై సులభంగా గెలిచాడు. అతను క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ వన్ సన్ వాన్ హో (కొరియా)తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరోవైపు యువ షట్లర్లు సాయిప్రణీత్, అజయ్ జయరాం ఓడిపోయారు. ఉత్కంఠభరితంగా సాగిన ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 21-19, 10-21, 12-21తో ఆరో సీడ్ చో తిన్ చెన్ (కొరియా) చేతిలో ఓడాడు. ఏకపక్షంగా సాగిన మరో పోరులో అజయ్ 11-21, 10-21తో ఐదో సీడ్ చెన్‌లాంగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి 20-22, 21-18, 21-18తో ప్రవీణ్ జోర్డాన్-సుశాంటో (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడారు.

టైటాన్స్ మళ్లీ ఓడింది




లఖ్‌నవూ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ మళ్లీ పరాజయ బాట పట్టింది. గురువారం హోరాహోరీ మ్యాచ్‌లో టైటాన్స్ 25-22 తేడాతో యూపీ యోధ చేతిలో పరాజయం పాలైంది. చివరి నిమిషం ఆట మిగిలి ఉండగా 22-21తో టైటాన్స్ ఆధిక్యంలో నిలిచినా... నితిన్ తోమర్ (6) వరుస రైడ్ పాయింట్లు తేవడంతో యూపీ యోధ గెలిచింది. మ్యాచ్ ఆరంభం నుంచి రెండు జట్లు రక్షణాత్మకంగా వ్యవహరించాయి. డిఫెండర్స్ రాణించడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి 12-10తో టైటాన్స్ ఆధిక్యంలో నిలిచింది. ఐతే విరామం తర్వాత యూపీ ఆటగాళ్లు చెలరేగారు. నాలుగు నిమిషాల్లోనే ఐదు పాయింట్లు సాధించిన యూపీ 15-13తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి మ్యాచ్ మరింత పోటాపోటీగా సాగింది. 35వ నిమిషంలో రాహుల్ పాయింట్ తేవడంతో స్కోరు 20-20తో సమమైంది. చివర్లో నితిన్ విజృంభణతో మ్యాచ్ యూపీ సొంతమైంది. యూపీ డిఫెండర్ నితేష్‌కుమార్ ఐదు పాయింట్లతో రాణించాడు. రాహుల్ చౌదరీ కేవలం నాలుగు పాయింట్లే సాధించగలిగాడు. టోర్నీలో టైటాన్స్‌కు ఇది ఎనిమిదో ఓటమి. ఒక మ్యాచ్‌ను టైగా ముగించిన ఆ జట్టు ఇప్పటివరకు రెండే విజయాలు సాధించింది. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబతో జైపూర్.., బెంగాల్‌తో పట్నా తలపడతాయి.


మేవెదర్ × మెక్‌గ్రెగర్

రూ.1700 కోట్ల పోరు

లాస్ వెగాస్: ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఆదాయ పరంగా మరో పెద్ద పోరాటానికి రంగం సిద్ధమైంది. ఓటమెరుగని దిగ్గజం ఫ్లాయిడ్ మేవెదర్ కెరీర్‌లో చివరిపోరుకు సిద్ధమయ్యాడు. రెండేళ్ల క్రితం పకియావ్‌తో మ్యాచ్ అనంతరం బాక్సింగ్‌కు వీడ్కోలు పలికి.. తర్వాత మనసు మార్చుకున్న 40 ఏళ్ల మేవెదర్ (అమెరికా) మరో చరిత్ర సృష్టించేందుకు బరిలో దిగనున్నాడు. శనివారం కానర్ మెక్‌గ్రెగర్ (ఐర్లాండ్)ను ఢీకొననున్నాడు. లాస్ వెగాస్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో గెలిస్తే అజేయంగా 50 మ్యాచ్‌లు పూర్తిచేసుకున్న తొలి బాక్సర్‌గా అతడు రికార్డు సాధిస్తాడు. బాక్సర్లకు దాదాపుగా రూ. 1700 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. మేవెదర్ 200 మిలియన్ డాలర్లు (రూ.1280 కోట్లు) సొంతం చేసుకోనున్నాడు. రెండేళ్ల క్రితం పకియావ్ (ఫిలిప్పీన్స్)తో పోరుతో అతడికి 220 మిలియన్ డాలర్లు దక్కాయి. మెక్‌గ్రెగర్‌కు దాదాపుగా రూ. 400 కోట్లు దక్కే అవకాశముంది. ఐతే ఈ మ్యాచ్‌లో మేవెదర్ గెలుపు లాంఛనమే అనేది విశ్లేషకుల మాట. ఎందుకంటే అతడి ప్రత్యర్థి బాక్సింగ్‌లో అనామకుడు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో మంచి రికార్డున్న కానర్‌కు ఇదే తొలిపోరు.

● ప్చ్.. సాక్షి కూడా!



పారిస్: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. 24 మందితో టోర్నీ బరిలోకి దిగిన భారత్ ఇంకా ఖాతా తెరవలేదు. ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం 60 కిలోల విభాగం ప్రిక్వార్టర్స్‌లో సాక్షి 1-3తో లూసియా నిమెస్చ్(జర్మనీ) చేతిలో ఓడింది. పతకం తెస్తుందనుకున్న మరో రెజ్లర్ వినేశ్ ఫోగట్‌దీ అదే పరిస్థితి. క్వాలిఫికేషన్‌లో నెగ్గిన ఫోగట్ (48 కిలోలు) ప్రిక్వార్టర్స్‌లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్ విక్టోరియా ఆంథోని (అమెరికా) చేతిలో చిత్తైంది.

● డుప్లెసిస్ సారథ్యంలో పాకిస్థాన్‌కు

లాహోర్: వచ్చే నెలలో పాకిస్థాన్‌లో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న ప్రపంచ ఎలెవన్ జట్టుకు దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు కెప్టెన్ డుప్లెసిస్ నాయకత్వం వహించనున్నాడు. ఈ జట్టులో దక్షిణాఫ్రికా నుంచి డుప్లెసిస్‌తో పాటు ఆమ్లా, మోర్కెల్, మిల్లర్, తాహిర్, ఆస్ట్రేలియా నుంచి బెయిలీ, బెన్ కట్టింగ్, టిమ్ పేన్, విండీస్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు ఆడనున్నారు. ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, శ్రీలంక నుంచి ఒక్కో ఆటగాడు పాల్గొననున్నారు.

భారత్ వ్యతిరేక కార్యకలాపాలను అనుమతించం

- స్పష్టం చేసిన నేపాల్
- ఇరుదేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలు



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును దిల్లీలో గౌరవ పూర్వకంగా కలసిన నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా

దిల్లీ: తమ గడ్డపై భారత్ వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని నేపాల్ స్పష్టం చేసింది. మాదకద్రవ్యాల రవాణాకు కళ్లెం వేయడం, భూకంపానంతర పునర్నిర్మాణ చర్యలతోపాటు వివిధ అంశాల్లో పరస్పర సహకారానికి సంబంధించి.. భారత్‌తో ఎనిమిది ఒప్పందాలు కుదుర్చుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా ఈమేరకు గురువారం ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య కంచెల్లేని సరిహద్దు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు.. రక్షణ, భద్రత బలగాల మధ్య సన్నిహిత సంబంధాల అవసరముందని నొక్కివక్కాణించారు. "రక్షణ బంధాలు, భద్రతరపరమైన సహకారం మన భాగస్వామ్యంలో ముఖ్యమైన అంశాలు. మన రక్షణ ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇటు భారత్ తమకు పొరుగు దేశంతోపాటు మిత్ర దేశమని.. తమ వైపు నుంచి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని దేవుబా పేర్కొన్నారు. భారత సంతతి మధేశీ ప్రజల డిమాండ్లకు అనుగుణంగా తలపెట్టిన నేపాల్ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందని నేపథ్యంలో.. ఇరు దేశాల ప్రధానుల మధ్య ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. అన్ని వర్గాల ప్రజలను సంతృప్తిపరిచే రాజ్యాంగం వాస్తవరూపం దాలుస్తుందని దేవుబా విశ్వాసం వ్యక్తం చేశారు. రామాయణ, బౌద్ధ సర్క్యూట్‌ల పర్యటకాభివృద్ధి.. వరద నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలపై మోదీ, దేవుబా చర్చించారు. నేపాల్‌లో మౌలిక వసతుల కల్పన, సామాజిక సంస్థల నెలకొల్పనలో భారత్ భాగస్వామి అవుతుందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తనను కలిసేందుకు వచ్చిన దేవుబాతో ఆయన సంభాషించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు ఆర్థికవృద్ధికి ఊతం ఇస్తాయని.. జలవిద్యుత్ రంగంలోనూ పరస్పర సహకారానికి ఎంతో ఆస్కారముందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. నేపాల్‌లో ఎన్నికల నిర్వహణకు తోడ్పాటు అందించేందుకు భారత్ ముందుంటుందని చెప్పారు.

జైట్లీ, జావడేకర్‌లకు గుజరాత్, కర్ణాటక బాధ్యతలు

దిల్లీ: కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, ప్రకాశ్ జావడేకర్, థావర్‌చంద్ గెహ్లోట్‌లను వరుసగా గుజరాత్, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ ఇన్‌ఛార్జులుగా భాజపా అధ్యక్షుడు అమిత్ షా గురువారం నియమించారు. మరికొందరు మంత్రులు సహ ఇన్‌ఛార్జులుగా నియమితులైనట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. జైట్లీతో పాటు నరేంద్ర సింగ్ తోమర్, నిర్మాలా సీతారామన్, జితేంద్ర సింగ్, పీపీ చౌధరీలు గుజరాత్‌కు సహ ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తారు. అలాగే పీయూష్ గోయల్ కర్ణాటకకు సహ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. జైట్లీ, జావడేకర్, గెహ్లోట్‌లు గతంలోనూ పలు రాష్ట్రాల ఎన్నికల ఇన్‌ఛార్జులుగా వ్యవహరించారు. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లకు ఈ ఏడాది ఆఖర్లో, కర్ణాటకకు వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. **సెప్టెంబరులో జాతీయ కార్యవర్గ సమావేశాలు:** వచ్చే నెలలో జాతీయ కార్యవర్గ సమావేశాలను నిర్వహించేందుకు భాజపా సమాయత్తమవుతోంది. దేశ రాజధానిలో సెప్టెంబరు 23- 25 తేదీల మధ్య ఈ సమావేశాలను నిర్వహించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

19 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

స్పీకర్‌ను కోరిన చీఫ్ విప్ రాజేంద్రన్ • తమిళనాట రసవత్తరంగా రాజకీయం

చెన్నై: తమిళనాట ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, టీటీవీ దినకరన్‌ల రాజకీయ పోరు రసవత్తరంగా మారింది. ముఖ్యమంత్రిని మార్చాలని దినకరన్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంటే.. పుదుచ్చేరిలోని రిసార్ట్‌లో ఉన్న 19 మంది ఎమ్మెల్యేలను తనవైపునకు తెచ్చుకునేందుకు ముఖ్యమంత్రి రంగంలోకి దిగారు. ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరిస్తున్నామని గవర్నర్‌కు లేఖ సమర్పించిన 19 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని సభాపతిని ప్రభుత్వ విప్ కోరారు. దినకరన్ మద్దతు ఎమ్మెల్యేల ఎత్తుగడల నేపథ్యంలో గురువారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, మంత్రులు సమావేశం అయ్యారు. తర్వాత సభాపతి ధనపాల్, మంత్రులు, ప్రభుత్వ విప్ రాజేంద్రన్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ నిర్వహించారు.

న్యాయస్థానంలో పిటిషన్: మరోవైపు పళనిస్వామి శాసనసభలో తన బలాన్ని నిరుపించుకోవాలని గవర్నర్ కోరేలా ఆదేశాలు ఇవ్వాలని మద్రాసు హైకోర్టులో గురువారం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నగరానికి చెందిన న్యాయవాది పుగళేంది దీన్ని దాఖలు చేశారు. అందులో ప్రభుత్వం మైనారిటీలో పడిందని, వెంటనే గవర్నర్‌కు ఈ ఆదేశాలు పంపాలని కోరారు.

లద్దాఖ్‌లో రోడ్డు ఎలా నిర్మిస్తారు?

భారత్‌ను ప్రశ్నించిన చైనా

దిల్లీ: లద్దాఖ్ సెక్టార్‌లోని ప్యాంగ్యాంగ్ సరస్సు సమీపంలో భారత్ నూతన రహదారిని నిర్మించ తలపెట్టడాన్ని చైనా ప్రశ్నించింది. ఇంకా సరిహద్దులు నిర్ణయించాల్సి ఉన్న ఆ ప్రాంతంలో రోడ్డు ప్రాజెక్టును అనుమతించడమంటే భారత్ తన చెంప తాను కొట్టుకున్నట్లేనని ఘాటు విమర్శలు చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఆ ప్రాంతంలో భారత ప్రభుత్వం రహదారి నిర్మాణాన్ని చేపట్టాలనుకోవడం వల్ల సరిహద్దు ప్రాంతంలో శాంతి నెలకొల్పడానికి, ప్రస్తుత పరిస్థితులకు ఎలాంటి మేలు జరగదని చైనా విదేశాంగ శాఖ అభిప్రాయపడింది.



సప్తగిరులు.. పాలనురగలు

ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. శేషాచలం కొండల నడుమ పాలనురగలతో జాలువారుతున్న జలపాతాలు సప్తగిరులకు శోభ తెచ్చాయి. తిరుమల ఘాట్ రహదారిలోని మాల్వాడిగుండం జలపాతం ప్రస్తుతం సందర్శకులను ఆకట్టుకుంటోంది.

భారత్‌లో ప్రమాదాలు, విపత్తులు ఎక్కువ!

తమ పౌరులకు భద్రతా సూచనలు జారీ చేసిన చైనా

బీజింగ్: భారత్‌ను సందర్శించాలనుకుంటున్న తమ దేశపౌరులకు చైనా భద్రతా సూచనలు జారీ చేసింది. భారత్‌లో రైలు ప్రమాదాలు, విపత్తులు, అంటువ్యాధుల ముప్పు ఎక్కువ అని వారిని అప్రమత్తం చేసింది. చైనా ఇలా భద్రతా సూచనలు జారీ చేయడం రెండు నెలల కాలంలో ఇది రెండోసారి. మొదటి సారి జులై 7న నెలరోజుల వరకు వర్తించేలా పలుసూచనలు జారీ చేయగా, గురువారం ప్రకటించిన భద్రతా సూచనలు ఈ సంవత్సరం చివరి వరకు వర్తిస్తాయని పేర్కొంది. ఇరుదేశాల మధ్య డోక్లామ్ విషయంలో రెండు నెలలుగా ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో చైనా ఇలా సూచనలు జారీ చేయడం గమనార్హం. వ్యక్తిగత భద్రత, స్థానిక పరిస్థితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, దేశంలో అనవసర ప్రయాణాలు మానుకోవాలని తమ పౌరులకు సూచించింది. భారత్‌లో పర్యటించాలనుకునేవారు తమతో వ్యక్తిగత గుర్తింపు వివరాలు తీసుకెళ్లాలంది.

వచ్చే ఆగస్టు నాటికి ఉద్యోగుల భవిష్యనిధి సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే

దిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి చెల్లింపుల సంస్థ(ఈపీఎఫ్ఓ) వచ్చే ఏడాది ఆగస్టు నాటికి కాగితరహిత సేవలను అందించనుంది. డిజిటల్ ఇండియాలో భాగంగా సంస్థ పరిధిలోని ఐదు కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులకు ఉత్తమ సేవలు అందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈపీఎఫ్ ఉపసంహరణ వంటి సేవలను ఇప్పటికే ఆన్‌లైన్ చేశారు. వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఈపీఎఫ్‌వో సేవలన్నింటినీ కాగితరహితం చేసి, ఆన్‌లైన్, ఫోన్ ఆధారిత సేవలను అందిస్తామని తిరంగాయాత్రలో పాల్గొన్న కేంద్ర భవిష్యనిధి కమిషనర్ వీపీ.జాయ్ పేర్కొన్నారు. దీంతో తమపని అయ్యిందా లేదాఅని ఇక ప్రజలు కార్యాలయాలకు రావాల్సిన అవసరం ఉండదని తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2015-17, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.